ఆదివారం
గత వారంరోజులపై విహంగ వీక్షణం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం

: fb.com/vaartha Digital

Published from Srikakulam ,Visakhapatnam,Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem

25-5-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 113 పేజీలు: 16 వెల: 8.00

సింధుజలాల ఒప్పందంపై పాక్ విషప్రచారం

బాలీవుడ్ నటుడు ముకుల్‌దేవ్ కన్నుమూత

5లో

## టెక్నాలజీ అభివృద్ధికి ఎపి మార్గం

### పి-4 ద్వారా పేదరిక నిర్మూలనే లక్ష్యం

### డిజిటల్ మౌలిక సదుపాయాలకు ఆదర్శంగా ఎపి

### 2047కు 3వ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్

### ప్రతి కుటుంబానికి డిజిటల్ పాస్‌బుక్ విధానం

### పురోగతి కొలతకు 523 సూచికలు

### నీతిఆయోగ్ సమావేశంలో సిఎం చంద్రబాబు



శనివారం న్యూఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధాని మోదీతో సీఎం చంద్రబాబు కరచాలనం. చిత్రంలో తమిళనాడు సీఎం స్టాలిన్ ఉన్నారు.

# వికసిత్ భారత్‌తో స్వర్ణాంధ్ర

**విజయవాడ,మే24,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో 2029నాటికి పేదరిక నిర్మూలన లక్ష్యంగా పని చేస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు. నీతి ఆయోగ్ భేటీలో వికసిత్ భారత్2047, స్వర్ణాంధ్రపై సీఎం చంద్రబాబు నివేదిక ఇచ్చారు. పహల్గాండాడిని ఖండిస్తూ, ఆపరేషన్ సిందూర్‌ను ప్రశంసిస్తూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన సీఎం, ఎన్డీఏ ప్రభుత్వంలో సాధించిన ప్రగతిని వివరించారు. దేశ, రాష్ట్రాభివృద్ధికి దోహదపడే వివిధ అంశాలను తన ప్రజెంటేషన్‌లో సీఎం చంద్రబాబు ప్రస్తావించారు.స్వర్ణాంధ్ర విజన్ 2047 ద్వారా 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయడమే లక్ష్యంగా ఉన్నామని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. పీ 4 ద్వారా ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు బలంగా సంకల్పించామని అన్నారు. వికసిత్ భారత్ 2047 సాకారంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందుందని పేర్కొన్నారు. చంద్రబాబు చెప్పిన పలు అంశాలు వికసిత్ భారత్‌కు ఉపయోగపడేలా ఉన్నాయని ప్రధాని మోదీ కొనియాడారు. ఇతర రాష్ట్రాలు కూడా ఏపీ ప్రతిపాదనలను పరిశీలించాలని ప్రధాని సూచించారు. చంద్రబాబు ప్రజెంటేషన్‌కు సమావేశంలో పెద్ద ఎత్తున ప్రశంసలు వెల్లువెత్తాయి. ఏపీలోని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సీఎం చంద్రబాబు ప్రజెంటేషన్‌లో ప్రస్తావించారు. 2.4ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, వికసిత్ భారత్ కల సాకారంతో స్వర్ణాంధ్రను సాధించేలా అడుగులు వేస్తున్నామని >>2

### రాష్ట్రాభివృద్ధికి కేంద్రం

## సంపూర్ణ సహకారం

### కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో సిఎం చంద్రబాబు భేటీ

### రాజధానిగా అమరావతిని నోటిఫై చేయాలని వినతి

### విభజన చట్టం సవరణకు అమిత్‌షా హామీ

**విజయవాడ,మే24,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీని నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించేందుకు సుముఖతను వ్యక్తం చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు.సీఎం చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటన శనివారం ముగిసింది.ఆయన తిరిగి నేరుగా తన సొంత నియోజకవర్గం కుప్పం వెళ్ళేందుకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో మీడియాతో మాట్లాడుతూ తన రెండు రోజుల పర్యటన విజయవంతమైందన్నారు.ఈ పర్యటనల్లో భాగంగా నిన్ననే ఏడుగురు మంత్రులను కలిసానన్నారు.అందుల్లో కీలకంగా పలు అంశాలను వారి దృష్టికి తీసుకుని వెళ్ళానన్నారు.ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని నోటిఫై చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కోరినట్లు వచ్చే పార్లమెంటు సమావేశాల్లోనే ఈ మేరకు విభజన చట్టాన్ని సవరించాలని కోరినట్లు చెప్పారు. తమ విజ్ఞప్తికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఇక్కడి హోంమంత్రిత్వ శాఖ కార్యాల యంలో అమిత్‌షా అధ్వర్యంలో రాష్ట్రం లోని శాంతిభద్రతలు,కొత్త నేర,న్యాయ చట్టాల అమలుపై జరిగిన సమీక్షలో పాల్గొన్న అనంతరం చంద్రబాబు విలేకర్లతో మాట్లాడారు. అమరావతి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక వనరులేమీ సమకూర్చడం లేదని,కానీ కొందరు మూర్ఖులు మాత్రం రాష్ట్రంలో ఏ చిన్న పని జరగకపోయినా అంతా అమరావతిలో ఖర్చు పెడుతున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. >>2



కేంద్రహోంమంత్రి అమిత్‌షాకు జ్ఞాపిక అందచేస్తున్న సిఎం చంద్రబాబు



## కారు-లారీ ఢీ నలుగురు మృతి

### కడప జిల్లాలో ఘోర ప్రమాదం

### పలువురికి తీవ్రగాయాలు

**కడప ,మే 24, ప్రభాతవార్త బ్యూరో :** కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం, గువ్వల చెరువు ఘాట్ వద్ద శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకోవడంతో నలుగురు అక్కడికక్కడే చనిపోగా, మిగిలిన వారు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. బెంగళూరు నుంచి స్వంత గ్రామమైన బద్వేలు ప్రాంతానికి వస్తుండగా గువ్వల చెరువు ఘాట్ వద్ద వేగంగా వచ్చిన లారీ కారును ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీకాంత్ రెడ్డి(32)బసినేని శిరీష (30), రిషి కేశవరెడ్డి (9), సాయి హర్షిణి (11) అనే నలుగురు మృతిచెందగా స్వర్ణ, శశి, త్రిషిక ప్రాణాపాయం >>2



## వల్లభనేని మళ్లీ జైలుకు

### రెండు రోజుల పోలీసు కస్టడీ పూర్తి

**విజయవాడ,మే24,ప్రభాతవార్తప్రతినిధి:** వల్లభనేని వంశీ రెండు రోజుల కస్టడీ నేటితో పూర్తయ్యింది. నకిలీ పట్టాల పంపిణీ వ్యవహారంలో పోలీసులు వంశీని విచారించారు. అనంతరం వంశీని కంకిపాడు పోలీసులు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల తర్వాత వల్లభనేని వంశీని విజయవాడ సబ్ >>2

## కరెంట్ షాక్‌తో ముగ్గురు మృతి

### విజయవాడలో విషాదం

**విజయవాడ, మే 24 ప్రభాతవార్త:** విజయవాడలోని బెంజ్ సర్కిల్ సమీపంలో శనివారం ఉదయం విషాదం జరిగింది. చంద్రబాబు కాలనీలోని ఓ భవనంలో కరెంట్ షాక్ తగిలి ముగ్గురు మృతి చెందారు. మృతుల్లో దంపతులతోపాటు ఇంటికొచ్చిన బంధువు కూడా ఉన్నారు. స్థానిక వివరాల మేరకు నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో దంపతులు నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం 8 గంటల 20 నిమిషాలకు భార్య ముత్యాలమ్మకు కరెంటు షాక్ తగిలి కుప్పకూలిపోయింది. ఆ సమయంలో అక్కడే ఉన్న భర్త ఆమెను కాపాడే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో అతనూ ప్రమాదానికి గురయ్యాడు. వీరిద్దరిని చూసిన వారి బంధువు వారిని కాపాడే ప్రయత్నం >>2

# ఇదేనా మర్యాద! లేదా కృతజ్ఞత?



### చలనచిత్రపరిశ్రమపై డి.సిఎం పవన్ అసంతృప్తి

### యేడాదైనా పరిశ్రమవర్గాలు సిఎంను కలిసాయా?

### టిక్కెట్ ధరలు పెంచడానికైతే వస్తారా?

### ఇక సంఘటితంగా వస్తేనే సానుకూల చర్యలు

**విజయవాడ,మే24,ప్రభాతవార్తప్రతినిధి:**తెలుగు సినీ రంగంలో ఉన్నవారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్ల కనీస మర్యాద, కృతజ్ఞత కనిపించడం లేదని ఏపీ ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ అసహనం వ్యక్తం చేసారు.ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుసినిమా రంగానికి పరిశ్రమ హోదా కల్పించి,అభివృద్ధి చేయాలని, ఈ రంగంలో ఉన్నవారి గౌరవమర్యాదలకు భంగం వాటిల్లకుండా చూస్తుంటే మీరు ఏలా వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు, ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం శనివారం ఆమేరకు ప్రకటన విడుదల చేసింది.ఎన్.డి.ఏ. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగు సినిమా సంఘాలు కనీసం ఒకసారి కూడా మర్యాద పూర్వకంగా కలవలేదు. కేవలం తమ చిత్రాల విడుదల సందర్భంలో ప్రభుత్వం ముందుకు రావడం మినహా, చిత్రరంగం అభివృద్ధి కోసం సంఘటితంగా రాలేదు. అందరూ కలసి రావాలి అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించినా సానుకూలంగా స్పందించలేదు. గత ప్రభుత్వ ఛీత్కారాలు తెలుగు సినిమా రంగంలోని అగ్రనటులను, సాంకేతిక నిపుణులను గత ప్రభుత్వం ఏ విధంగా ఛీత్కరించుకొని ఇక్కట్ల పాల్జేసిందో తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి, నిర్మాతల మండలి, మూవీ ఆరిస్ట్స్ అసోసియేషన్ లాంటి సంఘాలు మరచిపోయినట్లున్నాయి. రూ.కోట్ల రూపాయల పెట్టుబడులతో రూపొందే చిత్రాలకు అన్ని విధాలా ప్రోత్సాహం ఇవ్వడం తోపాటు, సృజనాత్మకత ముడిపడిన ఈ వ్యాపారంలో ఉన్నవారి గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లకూడదు అని కూటమి పార్టీలు ఎన్నికలకు ముందు కూడా స్పష్టంగా చెప్పాయి. గత ప్రభుత్వం వ్యక్తులను చూసి పనులు చేసేది. కక్షసాధింపులకు దిగేది. తమకు నచ్చనివారి సినిమాల విడుదల సమయంలో >>2

# చివరాకు దాకా కొంటాం

**మార్టూరు, మే24, ప్రభాతవార్త:** రైతులెవరు అధైర్య పడవద్దని అండగా మేము ఉంటామని చివరి ఆకు వరకు కొనుగోలు చేసే బాధ్యత తీసుకుంటామని నల్లబర్లీ పొగాకు రైతులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, విద్యుత్ శాఖ మంత్రిగొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హామీ ఇచ్చారు. శనివారం బాపట్ల జిల్లా మార్టూరుమండలం ఇసుక దర్శిలోని టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయంలో పొగాకు రైతులు, ఐటీసీ కంపెనీల ప్రతినిధులు, రైతు సంఘాల నేతలతో మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్ ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, విజయ్ కుమార్, దర్శి టీడీపీ ఇన్‌ఛార్జీ గొట్టిపాటి లక్ష్మీ, రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ కమీషనర్ ఢిల్లీ రావు, మార్కెటింగ్ కమీషనర్ సునీత, టొబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్, టొబాకో బోర్డు ఈడీ విశ్వశ్రీ, మార్క్‌ఫెడ్ రిక్రూట్‌మెంట్ స్పెషల్ ఆఫీసర్ కిషోర్, ముఖాముఖి నిర్వహించారు. తొలుత సురవరవల్లి సమీపంలోని నేషనల్ హైవే వద్ద పంట పొలాల్లోనే బల్లి మండెలను మంత్రులు కింజారపు అచ్చెన్నాయుడు గొట్టిపాటి రవికుమార్ ఎమ్మెల్యే ఏలూరి పరిశీలించారు. అనంతరం మార్టూరు పట్టణంలోని నాగరాజుపల్లి రోడ్డులో గల ఎంఎల్‌ఏపీ మద్ది లక్ష్మయ్య ఆగ్రో ప్రొడక్ట్స్ ఇండస్ట్రీని సందర్శించారు. మాకు గ్రేడింగ్, ప్యాకింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో జరిగిన ముఖాముఖిలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కంపెనీలు, ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. కంపెనీలు రైతుల శ్రేయస్సు కోసం పని చేయాల్సిన స్పష్టం చేశారు. నల్లబర్లీ పొగాకు మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతాంగానికి అండగానిలవాల్సిన బాధ్యత కంపెనీలదేనని పేర్కొన్నారు. రైతులు సంతోషంగా ఉండడం కంపెనీలు నిలబెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. గతంలో పొగాకుకు మంచి ధరలు పలకడంతో అటు రైతులను ప్రోత్సహించేందుకు కంపెనీలు ఊరూరా తిరిగి రైతులను పొగాకు సాగు చేసేలా ప్రోత్సహించాలని గుర్తు చేశారు. గతంలో వేల కోట్లు లాభాలు అర్జించిన కంపెనీలు ఇప్పుడు నష్టాల్లో ఉన్న రైతులను ఇబ్బందులు పెట్టడం కరెక్ట్ కాదన్నారు. కంపెనీలు పద్ధతి మార్చు కోవాల్సిందేనని పంట కొనుగోలు చేయకుంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. 7.5 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి >>2

### సమస్య ఎక్కడ ఉంటే అక్కడికి మంత్రులం వెళ్తున్నాం

### రైతులెవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దు

### రైతులతో ముఖాముఖిలో మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి

### పొగాకు మండెలను పరిశీలించిన మంత్రులు



శనివారం పొగాకు మండెను పరిశీలిస్తున్న మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి తదితరులు

### పోలవరం-బనకచర్లపై

# ఎపికి కేంద్రం మద్దతు!

### కేంద్రజలశక్తిమంత్రితో చర్చించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్రం నుంచి మద్దతు లభించే అవకాశాలు మెరుగుపడుతున్నాయి.ఈ దిశలో ఏపీ జలవనరుల శాఖ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కేంద్ర జలశక్తిశాఖతో సమన్వయం చేసుకుంటుందని ఇరిగేషన్ మంత్రి డాక్టర్ నిమ్మలరామానాయుడు తెలిపారు.ఇప్పటికే రాష్ట్ర జలవనరులశాఖ అధికారులు కేంద్ర జలసంఘానికి ప్రీఫీజిబిలిటీ నివేదిక సమర్పించినట్లు వివరించారు.ప్రాజెక్టు ప్రాథమిక స్వరూపం, హైడ్రాలజీ ఎంత వ్యయం అవుతుంది? కొత్త ఆయకట్టు ఎంత? స్థిరీకరణ ఎంత? పెట్టుబడి రాబడి నిష్పత్తి వంటి అంశాలను నివేదికలో పొందుపర్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీలో కేంద్ర ఆర్థిక, జల్‌శక్తి మంత్రులతో భేటీలోనూ ప్రాజెక్టుకు మద్దతు కోరారు. కేంద్ర జలసంఘం నివేదికను పరిశీలించాక రాష్ట్ర అధికారులతో చర్చించనుంది. ఆ తర్వాత కేంద్ర జలసంఘంలోని డైరెక్టర్ల సమావేశం పీఎఫ్ఆర్‌ను ఆమోదించనుంది. అనంతరం పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. జలవనరులశాఖ జూన్ నెలాఖరుకు లేదా జులై ప్రారంభానికి డీపీఆర్ సమర్పించాలనే లక్ష్యంతో ఆ ప్రక్రియనూ ప్రారంభించింది. పోలవరం నుంచి 23 వేల క్యూసెక్కుల నీటిని మళ్లించేలా ప్రాజెక్టును 3 సెగ్మెంట్లుగా పీఎఫ్ఆర్‌లో >>2



### రెండు రోజుల్లో రాష్ట్రానికి

# రుతుపవనాలు..

### ఇప్పటికే కేరళను తాకిన 'నైరుతి'

### కోస్తాంధ్ర, సీమకు భారీ వర్షసూచన

**విజయవాడ,మే24,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతి రుతుపవనాలు శనివారం కేరళను తాకాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. అదేసమయంలో లక్షద్వీప్, తమిళనాడు, కర్నాటక, ఈశాన్య రాష్ట్రాల్లోకి రుతపవనాలు ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపింది. అక్కడి నుంచి రెండు, మూడు రోజుల్లో ఎపిలోకి విస్తరించే అవకాశముంది. వీటి ప్రభావంతో జూన్ రెండో వారం నుంచిరాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

**తీవ్ర అల్పపీడనం:** అరేబియా సముద్రంలో దక్షిణ కొంకణ్‌గోవా తీరానికి సమీపంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది ఉత్తర దిశగా కదులుతూ నేటికి వాయుగుండంగా బలపడనుంది. ఇది మరింత బలపడేందుకు సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, గాలులు, ఇతర పరిస్థితులు అనుకూలిస్తుండటంతో పశ్చిమతీరంలో గుజరాత్, గోవా రాష్ట్రాల్లో ఆదివారం వరకు కర్నాటకలో ఈనెల 27 వరకు, మహారాష్ట్రలో ఈనెల 25న, తమిళనాడులో 25, 26 తేదీల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని అంచనా. జూన్ 5వరకు కోస్తాంధ్రతోపాటు రాయల సీమలోనూ విస్తారంగా వర్షాలు కురిసే అవకాశ ముంది.నేడు పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకి >>2

# బెజవాడలో బాంబు బెదిరింపులు

### బీసెంట్‌రోడ్, రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు

**విజయవాడ, మే 24, ప్రభాతవార్త:** నగరంలో బాంబు కలకలం రేగింది. బీసెంట్ రోడ్‌కు బాంబ్ బెదిరింపు కాల్ వచ్చింది. కంట్రోల్ రూంకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి బాంబ్ ఉన్నట్లు బెదిరించాడు. దీంతో వెంటనే పోలీసులు అప్రమత్త మయ్యారు. పోలీసులు, బాంబు స్క్వాడ్ బీసెంట్ రోడ్‌లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. బీసెంట్ రోడ్‌లోని షాపులు, తోపుడు బండ్లను బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు చేసింది. అయితే ఎక్కడా బాంబ్ ఉన్న ఆనవాళ్లు లేక పోవడంతో ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఎలాంటి బాంబు లేకపోవడంతో శనివారం మధ్యాహ్నం నుంచి యధావిధిగా బీసెంట్‌రోడ్‌లో వ్యాపారాలకు అనుమతి ఇచ్చారు పోలీసులు. అలాగే కంట్రోల్ రూమ్‌కు వచ్చిన ఫోన్‌కాల్‌పై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఫోన్ ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు చేశారు అనేదానిపై పోలీసులు ఆరా >>2



శనివారం న్యూఢిల్లీలో జరిగిన నీతిఆయోగ్ సమావేశంలో పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు తదితరులు

# వికసిత్ భారత్‌తో స్వర్ణాంధ్ర

>> వివరించారు. అదేవిధంగా రాష్ట్ర వనరుల సద్వినియోగంపైనా సీఎం చంద్రబాబు ప్రజెంటేషన్‌లో తెలిపారు.అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఒప్పందం.. కర్నూలులో డ్రోన్ సిటీ ప్లాన్లను ప్రజెంటేషన్‌లో ప్రత్యేకంగా వివరించారు. డిజిటల్ గవర్నెన్స్‌లో భాగంగా గూగుల్ ఏఐ వంటి టెక్నాలజీలను వినియోగిస్తున్నట్లు చెప్పారు. ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్‌బుక్ విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నట్లు స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో ఇద్దరు బిడ్డల నిబంధన రద్దు చేసినట్లు ప్రజెంటేషన్‌లో సీఎం వివరించారు. మాతృత్వ సెలవులను 180 రోజులకు పెంచినట్టు సీఎం వెల్లడించారు. ప్రతి జిల్లా, నియోజకవర్గంలో విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు, రాష్ట్ర పురోగతిని కొలిచేందుకు 523 కీలక సూచికలు సిద్ధం చేశామన్నారు. ప్రతి కుటుంబానికి ఓ పారిశ్రామికవేత్త వచ్చేలా ప్రభుత్వ విధానాలు రూపొందిస్తున్నామని తెలిపారు. 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఈ పార్కులు, వన్ డిస్ట్రిక్ట్ వన్ పార్క్‌ల ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో విశాఖను తీర్చిదిద్దనున్నట్లు సీఎం వెల్లడించారు. విశాఖకు జోన్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించిన సీఎం, విశాఖ మోడల్ విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. అమరావతి, తిరుపతి, గోదావరి, కర్నూలుకు విశాఖ మోడల్ విస్తరిస్తామన్న సీఎం, క్వాంటమ్ వ్యాలీ, డ్రోన్ సిటీ ప్లాన్లను ప్రజెంటేషన్‌లో ప్రత్యేకంగా వివరించారు. కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్‌బుక్ విధానం తెస్తామని, మాతృత్వ సెలవులను 180 రోజులకు పెంచినట్లు సీఎం తన ప్రజెంటేషన్‌లో వెల్లడించారు. కుటుంబానికి ఓ పారిశ్రామికవేత్త వచ్చేలా విధానాలు రూపొందిస్తున్నామని వివరించారు. 2029 నాటికి పేదరిక నిర్మూలన లక్ష్యంగా పని చేస్తున్నామని, పీ4 మోడల్ ద్వారా బంగారు కుటుంబాలకు మార్గదర్శుల ద్వారా సహాయం చేస్తున్నామని తెలిపారు. డిజిటల్ గవర్నెన్స్‌లో భాగంగా గూగుల్ ఏఐ వంటి టెక్నాలజీలను వినియోగిస్తున్నట్లు చెప్పారు. వికసిత్ భారత్2047 దిశగా పురోగతిని వేగవంతానికి 3 కమిటీలు ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరారు. పీపీపీ ప్రాజెక్టుల కోసం సెంట్రల్ వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌పై కమిటీ ప్రతిపాదించారు. అదేవిధంగా వృద్ధాప్యం, తక్కువ సంతానోత్పత్తి వంటి సవాళ్లపైనా అధ్యయనానికి, సాంకేతికతతో నడిచే పాలనపై దృష్టి పెట్టడానికి ఒక కమిటీ వేయాలని సూచించారు. ఏపీ గ్రోత్ బ్లూ ప్రింట్‌పై నీతిఆయోగ్ వేదికగా ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలపై ప్రశంసల వర్షం కురిపించిన ప్రధాని, ఏపీ సంస్కరణలను అన్ని రాష్ట్రాలు పరిశీలించి, అధ్యయనం చేయాలన్నారు.

**3వ స్థానానికి భారత ఆర్థిక వ్యవస్థ:** భారతదేశం ఆర్థిక వ్యవస్థ గత పదేళ్లలో 10వ స్థానం నుంచి 4వ స్థానానికి చేరుకుందని, త్వరలోనే 3వ స్థానానికి వెళ్తుందని సీఎం చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. డిజిటల్ ఇండియా, జీఎస్టీ, స్టార్టప్ ఇండియా, పీఎం గతిశక్తి, జల జీవన మిషన్ వంటి జాతీయ సంస్కరణలు అభివృద్ధికి దోహదం చేశాయని వివరించారు. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా ప్రతి కుటుంబానికి అందుతున్న లబ్దిని ఏపీ ప్రభుత్వం డిజిటల్‌గా ట్రాక్ చేస్తోందన్నార. వన్ ఫ్యామిలీ- వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమం ద్వారా నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల పెంపునకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి పారిశ్రామికవేత్త వచ్చేలా పాలసీలు తీసుకొచ్చామని, రాష్ట్రంలో టెక్నాలజీ అభివృద్ధి వేపదుతున్న కార్యక్రమాలను కూడా సీఎం చంద్రబాబు సమావేశంలో లేవనెత్తారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, అమరావతి రాజధానిలో క్వాంటమ్ వ్యాలీ, విశాఖపట్నంలో బయోమెడికల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ ద్వారా టెక్నాలజీ ఆధారిత అభివృద్ధికి ఏపీ మార్గం వేస్తోందన్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా విశాఖపట్నంను అభివృద్ధి చేస్తున్నామని, విశాఖ మోడల్‌ను అమరావతి, తిరుపతి, కర్నూలుకు విస్తరించేలా కేంద్రం సహకరించాలని కోరారు. ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్ బుక్ క్రియేట్ చేస్తున్నామని వివరించారు. టాటా ఇన్నోవేషన్ హబ్, ఏఐ ఆధారిత పాలన ద్వారా రాష్ట్రం స్టార్టప్‌లకు, ఉద్యోగ సృష్టికి మార్గదర్శకంగా మారిందని అభిప్రాయ పడ్డారు. సర్క్యులర్ ఎకానమీ, అభివృద్ధి వికేంద్రీకరణ, మిషన్ కర్మయోగి వంటి కార్యక్రమాల ద్వారా సమగ్రాభివృద్ధిని ఆంధ్రప్రదేశ్ సాధిస్తోందని అన్నారు.

జీఎస్పీ, పాపులేషన్ మేనేజ్మెంట్, టెక్నాలజీ రాష్ట్రాభివృద్ధికి ఉపకరించే మూడు కీలక అంశాలను గురించి సీఎం చంద్రబాబు సమావేశంలో ప్రస్తావించారు. పెట్టుబడులు, తయారీ, ఎగుమతులు, ఉద్యోగ సృష్టి వంటి అంశాలపై దృష్టి పెట్టి, పీపీపీ ప్రాజెక్టులకు కేంద్రం వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌కు మద్దతుగా ఉండటం ద్వారా జీడీపీ వృద్ధికి దోహదపడుతుందని అన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ప్రపంచంలో అనేక దేశాలు జనాభా లేమి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాయని, తద్వారా అభివృద్ధిపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. భారతదేశానికి ఉన్న జనాభా కలిసొచ్చే అంశమని అన్నారు. పాపులేషన్ మేనేజ్మెంట్ ద్వారా దేశంలో వృద్ధుల శాతాన్ని తగ్గించుకునే అవకాశం ఉందన్నారు. ఈ ఉద్దేశంతోనే స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన రద్దు చేశాం. మాతృత్వ సెలవులను పెంపునకు ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. అదే విధంగా కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, డ్రోన్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల వినియోగంతో పాలనలో వేగం పెంచడమే కాకుండా, పౌర సేవలను విరివిగా అందించవచ్చని అన్నారు.

**డిజిటల్ మౌలిక సదుపాయాలకు ఏపీ ఆదర్శం**

స్వర్ణ ఆంధ్ర విజన్ 2047 ద్వారా ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలతో జాతీయ అభివృద్ధికి దోహద పడేలా ఆదర్శంగా నిలుస్తుందని సమావేశంలో సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 100 ఏళ్లు పూర్తి చేసుకునే నాటికి దేశ లక్ష్యాలకు అనుగుణంగా...మార్గదర్శకత్వం వహించేలా ఏపీ ముందంజ నడవడానికి సిద్ధంగా ఉందని పునరుద్ఘాటించారు.సంక్షోభ సమయంలో ధైర్యంగా నిలిచారుఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన అమాయకులకు సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళులు అర్పించారు. సాయుధ బలగాలు చేపట్టిన "ఆపరేషన్ సిందూర్" విజయవంతమైందని కొనియాడారు. యుద్ధ వాతావరణం నెలకొన్న సంక్షోభ సమయంలో ప్రధాని మోదీ ధైర్యంగా.. నాయకత్వం వహించారని సీఎం ప్రశంసించారు.

**సీఎం చంద్రబాబు బ్లూ ప్రింట్‌పై పీఎం ప్రశంసలు**

నీతి ఆయోగ్ సమావేశంలో ఏపీ అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ బ్లూ ప్రింట్ ద్వారా సీఎం చంద్రబాబు వివరించారు. దీనిపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. ఇతర రాష్ట్రాలు కూడా ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న సంస్కరణలను అధ్యయనం చేయాలని, సీఎం చంద్రబాబు రూపొందించిన ప్రణాళిక ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉంటుందని ప్రధాని మోదీ అన్నారు.



శనివారం విశాఖ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

# విశాఖ ఎల్టిటి ఎక్స్‌ప్రెస్‌కు బాంబు బెదిరింపు

### డాగ్,బాంబు స్క్వాడ్, సివిల్, జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీస్ బృందాల తనిఖీలు

**విశాఖ క్రైమ్, ప్రభాతవార్త:** విశాఖ ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ లో బాంబు పెట్టినట్లుగా కాల్ రావడం తీవ్ర కలకలం నెలకొంది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, బాంబ్ స్క్వాడ్ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. చివరకు ఎలాంటి బాంబు ఆనవాళ్లు లేకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ముంబై నుంచి విశాఖ వచ్చే ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్‌లో బాంబు ఉన్నట్లు ఆగంతకుడి నుంచి ఫోన్ కాల్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎల్టీటీ చివరి స్టాప్ విశాఖ రైల్వేస్టేషన్ కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. రైలు మొత్తాన్ని కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్2 బోగీలో అనుమానిత బ్యాగ్‌ను గుర్తించారు. ఆ బ్యాగ్‌ను కూడా సెర్చ్ చేయగా బట్టలు మాత్రమే కనిపించాయి. దీంతో ఎలాంటి బాంబు లేదని అధికారులు నిర్ధారించారు. ఈ ఆపరేషన్‌లో డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్, సివిల్ పోలీసులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ బృందాలు కలిసి ట్రైన్‌ను మొత్తాన్ని పరిశీలించారు. ప్రయాణికుల బ్యాగులను కూడా తనిఖీ చేశారు. చివరకు బాంబు లేదని నిర్ధారణకు వచ్చారు. చాలా రష్‌గా ఉన్న ట్రెయిన్‌లో ఇలాంటి కాల్ రావడంతో భయాందోళనకు గురయ్యారు. అయితే బ్యాగును మరిచిపోయిన వ్యక్తి యూపీకి చెందిన శ్రీరామ్‌గా గుర్తించారు.అలాగే ఫోన్ కాల్ ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై పోలీసులు దృష్టిసారించారు.

# వల్లభనేని మళ్లీ జైలుకు

>>జైలుకు తరలించారు.నాకు తెలీదు, సంబంధం లేదు కస్టడీలో పోలీసులు ఏ ప్రశ్న అడిగినా వంశీ నుంచి వచ్చిన సమాధానాలు ఇవేనని తెలిసింది. ఇళ్ల పట్టాలు ఎక్కడ తయారుచేశారు? వాటిని ఎక్కడ ముద్రించారు? రెవెన్యూ అధికారి సంతకంతో కూడిన స్టాంపును ఎలా తయారుచేశారు? మీ పర్యవేక్షణలోనే ఇవన్నీ జరిగాయా? ఎవరెవరికి పట్టాలు ఇవ్వాలనేది మీరే సూచించారా? ఇలా పోలీసులు పలు రకాలుగా ప్రశ్నలు సంధించినా, ఇంతకుమించి పెద్దగా బదులు రాలేదని సమాచారం.

**నాలుగున్నరగంటలు, 20 ప్రశ్నలు :** కృష్ణా జిల్లా బాపులపాడు మండలంలో 2019 ఎన్నికల సమయంలో వివిధ గ్రామాల్లో నకిలీ ఇళ్ల పట్టాలు పంచారని నమోదైన కేసులో పోలీసులు వంశీని రెండు రోజుల కస్టడీకి తీసుకున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం విజయవాడలోని జిల్లా జైలు నుంచి హనుమాన్ జంక్షన్ పోలీసులు తీసుకుని కంకిపాడు తీసుకొచ్చారు. వైద్యపరీక్షలు నిర్వహించి కంకిపాడు స్టేషన్‌కు తరలించారు. అక్కడ గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాస్ పర్యవేక్షణలో హనుమాన్ జంక్షన్ సీఐ సత్యనారాయణలు విచారించారు. దాదాపు నాలుగున్నర గంటల పాటు 20 ప్రశ్నలు వేశారు. న్యాయవాదులు దేవిసత్యశ్రీ, తానికొండ చిరంజీవి సమక్షంలో ప్రశ్నించారు. శనివారం కూడా విచారణ నిర్వహించాల్సి ఉండటంతో వంశీని కంకిపాడు స్టేషన్‌లోనే ఉంచారు. శ్వాససంబంధ సమస్య ఉండడంతో సీపాప్ పరికరాన్ని వినియోగించేందుకు వంశీకి నూజివీడు కోర్టు అనుమతినిచ్చింది.

# పోలవరం-బనకచర్లపై ఎపికి కేంద్రం మద్దతు!

>> పేర్కొన్నారు. పోలవరం జలాశయం నుంచి ప్రకాశం బ్యారేజీకి నీటిని తరలించడం అక్కడి నుంచి బొల్లాపల్లి జలాశయానికి చేర్చడం, ఆ తర్వాత బనకచర్ల కాంప్లెక్సుకు నీటిని మళ్లించడం ఇందులో ప్రధాన భాగాలు. సెగ్మెంట్ 1 పోలవరం -ప్రకాశం బ్యారేజి, ప్రస్తుత అంచనా వ్యయం రూ.13800 కోట్లు, సేకరించాల్సిన భూమి 1401 ఎకరాలు, పోలవరం జలాశయం నుంచి 23 వేల క్యూసెక్కుల నీళ్లు తరలిస్తారు. కుడికాలువ ద్వారా 5000 క్యూసెక్కులు, వరద కాలువ నుంచి 18 వేల క్యూసెక్కులు తరలిస్తారు. ఈ దశలో లిఫ్టులు అవసరంలేదు. తాడిపూడి ఎత్తిపోతల కాలువను విస్తరించి వరద కాలువగా మారుస్తారు. మొత్తం 175.40కి.మీ మేర ఉండే కాలువలు ప్రస్తుత పవిత్ర సంగత ప్రాంతానికి 4 కి.మీ దిగువ ప్రకాశం బ్యారేజీవద్ద కలుస్తాయి. సెగ్మెంట్-3 ప్రకాశం బ్యారేజి-బొల్లాపల్లి జలాశయం, అంచనావ్యయం రూ.35750 కోట్లు, భూమి 13700 ఎకరాల అటవీ, 29500 ఎకరాల ఇతర భూమి అవసరం. ప్రకాశం బ్యారేజీ వద్ద వైకుంఠపురం నుంచి నీటిని రెండో దశలో ఎత్తిపోస్తారు. 6దశల్లో నీటిని ఎత్తిపోయాల్సి ఉంటుంది. మొత్తం 84.17కి.మీ కాలువ ప్రవహిస్తుంది. 11.575 కి.మీ పైపులైనుఉంటుంది. బొల్లాపల్లి వద్ద జలాశయం తవ్వి అక్కడ 173 టీఎంసీల నీటిని నిల్వ చేస్తారు. డెడ్‌స్టోరేజి 21టీఎంసీలుగా ఉంటుంది. ఈ భాగంలో 18 ఆవాసాలు ముంపులో చిక్కుకుంటాయి. 4800 కుటుంబాలను తరలించాల్సి ఉంటుంది. సెగ్మెంట్ 3 బొల్లాపల్లి జలాశయం నుంచి బనకచర్ల కాంప్లెక్సు, అంచనా వ్యయం రూ.32350 కోట్లు ఈ దశలో బొల్లాపల్లి జలాశయం నుంచి బనకచర్ల కాంప్లెక్సుకు నీళ్లు తీసుకెళ్తారు. 113.33 కి.మీ కాలువ మొత్తం 26.10 కి.మీ పొడవున సొరంగాలు తవ్వాల్సి ఉంది. నల్లమలలో ఈ సొరంగాలు తవ్వుతున్నా ప్రధాన టన్నెల్ ప్రారంభం చివరి ప్రాంతాలు అటవీ ప్రాంతంలోకి రావు. పులుల అభయారణ్యానికి బయటే ఉంటాయి.

# సంపూర్ణ సహకారం

>> కొందరు కనీస ఇంగితజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారు. అమరావతివల్ల జగన్‌కు వచ్చిన నష్టమేంటి?రాజధాని కోసం రైతులు భూమి ఇస్తే ఆయనకెందుకు అసూయ?హైదరాబాద్ వంటి రాజధాని ఆంధ్రప్రదేశ్‌కు అవసరం లేదా? తెలంగాణ ఆదాయంలో 75% హైదరాబాద్ నుంచే వస్తోంది. ఇవన్నీ మరిచిపోయి మూర ్ఖంగా మాట్లాడే వ్యక్తులకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. రాజధానికి భూములు త్యాగం చేసేవారు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టపోరని భరోసా ఇచ్చాం. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో శాంతిభద్రతలు,నేర నివారణలో టెక్నాలజీ వినియోగం,కొత్త నేర న్యాయ చట్టాలపై సమీక్ష జరిగిందని చంద్రబాబు వివరించారు. ఇప్పటి వరకు 24 రాష్ట్రాలపై ఆయన సమీక్షించారని,అందులో భాగంగానే ఏపీలోని పరిస్థితులపై చర్చించారని తెలిపారు. రాయలసీమ లోని ప్రముఖ సేవా సంస్థ ఆర్‌డీటీకి విదేశీ నిధులు ఆగిపోయిన విషయం గురించి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పేదలకు విశేష సేవలందిస్తున్న ఆ సంస్థ ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ లేఖ అందించానని, దాన్ని పరిశీలిస్తానని ఆయన హామీ ఇచ్చారన్నారు.నీతి ఆయోగ్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రణాళిక వివరించామన్నారు.ఇందుకు ప్రధాని మోడీ అభినందనలు తెలిపారన్నారు.రాష్ట్రాభివృద్ధి సహకరిస్తామని వాగ్దానం చేసారన్నారు.

# రెండు రోజుల్లో రాష్ట్రానికి రుతుపవనాలు..

>> నాడ, డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు, అలాగే అనకాపల్లి, ఎన్టీఆర్, పశ్చిమగోదావరి, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉద్యాన పంటల రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ సూచించారు. శుక్రవారం శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, తిరుపతి, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. పశ్చిమ మధ్య, దానికి ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతంలో ఈ నెల 27 నాటికి అల్పపీడనం ఏర్పడనుంది. తర్వాత రెండు రోజుల్లో ఇది మరింత బలపడే అవకాశముందని ఐఎండి తెలిపింది. బంగాళాఖాతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 30 నుంచి 32 డిగ్రీల మధ్యలో నమోదవుతుండటంతో వాయుగుండంగా బలపడవచ్చని అమెరికాకు చెందిన నేషనల్ సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ప్రిడిక్షన్‌కు చెందిన మోడల్ సూచిస్తోంది. ఈ ప్రభావంతో ఈ నెల 27న పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురవొచ్చని ఐఎండి పేర్కొంది. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో .. ఈనెల 27 వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకూడదని వాతావరణశాఖ హెచ్చరించింది.

**కోస్తాంధ్రలో, రాయలసీమలో వర్షాలు..** జూన్ 5 వరకు కోస్తాంధ్రతోపాటు రాయలసీమలోనూ విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముంది. శనివారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ, డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు, అలాగే అనకాపల్లి, ఎన్టీఆర్, పశ్చిమ గోదావరి, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చునని వాతావరణశాఖ ముందుగానే వెల్లడించింది.వర్షాలు బాగానే కురిసాయి.వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉద్యాన పంటల రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ సూచించారు.

# చివరాకు దాకా కొంటాం

>> అయిందని, ప్రతి చివరి ఆకు వరకు కొనుగోలు చేయాల్సిన స్పష్టం చేశారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, యువ నాయకుడు లోకేష్ ఎప్పుడు లేని విధంగా దీనిపై ఎక్కువగా దృష్టి పెట్టారన్నారు. అవసరమైతే ప్రభుత్వమే డబ్బులు వెచ్చించి రైతులను ఆదుకోవాలనే భావనలో ముఖ్యమంత్రి ఉన్నారని చెప్పారు. అందుకే రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ఇటు ప్రభుత్వం రైతులు అటు వ్యాపారులు అందరం కూర్చుని ముఖాముఖిగా చర్చిస్తే సమస్యను పరిష్కరించవచ్చనే భావనలో తమ ప్రభుత్వం ఉందని అందుకే ఈ సమావేశం నిర్వహించినట్లు వెల్లడించారు. పంటల మార్పిడికి రైతులు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ప్రస్తుతం జరిగిన మీటింగ్ చాలా ప్రాధాన్యత కలదన్నారు. కాబట్టి దీనిపై వ్యాపారస్తులు సీరియస్‌గా దృష్టి పెట్టి రేపటి నుండి కొనుగోలు మొదలు పెట్టాలన్నారు. లేదంటే సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో మీటింగ్ ఉంటుందని అదే జరిగితే చాలా సీరియస్‌గా ఉంటుందని మంత్రి అచ్చెన్న వివరించారు. కాబట్టి కంపెనీలు పరిస్థితి అంత వరకు తెచ్చు కోకుండా కంపెనీలు కొనుగోలు చేసేలా వ్యవహారించాలని కోరుతున్నానని చెప్పారు. నేను రైతులకు మాట ఇస్తున్న మొదటి గ్రేడ్‌కు క్వింటాకు రూ.12వేలు గిట్టుబాటు ధరలు లభించేలా ప్రతి రైతు పండించిన చివరి ఆకు వరకు కొనుగోలు చేపిస్తామని హామీ ఇస్తున్నామన్నారు. రైతులు ఎవ్వరు కూడా ఆవేదనలో ఆత్మహత్యలు చేసుకోవద్దన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం రైతన్నల ప్రభుత్వం అన్నారు. మీరు రైతులను ఆదుకుంటే ప్రభుత్వం నుండి మీకు ఏ విధంగా సహాయం అందించాలో అందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. అవసరమైతే ప్రభుత్వం నుంచి కొంత ఆర్థిక సహాయం చేసేందుకు సిద్దంగా ఉన్నామన్నారు. అందరూ సమన్వయంతో పని చేసి రైతులను పరిశ్రమలు ఆదుకుంటామన్నారు. రైతుల వద్ద నిల్వ ఉంటే దెబ్బతినే అవకాశం ఉందని మీరే కొనుగోలు చేసి ప్రాసెసింగ్ చేయాలన్నారు. లోగ్రేడ్ పొగాకు కొనుగోలు చేయకుండా గతంలో ఇచ్చిన ధరలు కల్పించకుండా బయర్స్ కంపెనీలు మమ్మల్ని దారుణంగా నష్టం వచ్చేలా చేసి మోసం చేశారంటూమంత్రుల వద్దముఖాముఖిలో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఒక్క పర్చూరు నియోజకవర్గంలోనే వెయ్యికోట్ల రూపాయల విలువ చేసే పొగాకు నిల్వలు ఉండిపోయాయంటూ మంత్రులు దృష్టికి తీసుకువచ్చారు. రెండురూపాయలు వడ్డీ లెక్కన అప్పులు తెచ్చి 36 లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి పొగాకు పంటను సాగు చేశామన్నారు. కాని నేడు అసలు వచ్చే పరిస్థితి లేదన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం చొరవ చూపి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. మీరు పండించిన వైట్ బ్లాక్ బర్లీ పొంగాకునంత మేమే కొంటామని ఇతర కంపెనీలకు ఇవ్వవద్దంటూ తమతో ఒప్పందం కుదుర్చుకున్న ఐటీసీ కంపెనీలు ఇప్పుడు గిట్టుబాటు ధరలు కల్పించకుండా చేతులెత్తేసి తమని నిట్టనిలువునా ముంచారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒక్క సారి తమను ప్రభుత్వం ఆదుకుంటే ఇక రాబోయే కాలంలో తాము పొగాకు పంటలు వేయమని ఈ మాయదారి కంపెనీలను తాము నమ్మమంటూ మంత్రుల ఎదుట రైతులు వాపోయారు.

# ఇదేనా మర్యాద! లేదా కృతజ్ఞత?

>> తహసీల్దార్లను థియేటర్ల దగ్గర నియమించి ఎన్ని ఇబ్బందులు పెట్టిందో నిర్మాతలు మరచిపోతే ఎలా? ఎన్నిక లకు ముందు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ చెప్పిన విధంగానే కూటమి ప్రభుత్వం వ్యక్తులను చూడలేదు. అక్కినేని నాగార్జున కుటుంబానికి చెందినవారి చిత్రం విడుదలైనప్పుడు సైతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సహించింది. వ్యవస్థ బాగుండాలి, దానిపై ఆధారపడ్డవారు ఇబ్బందిపడకూడదు అనేదే కూటమి ప్రభుత్వ విధానం. తెలుగు సినిమా రంగంవారు తమ సినిమా విడుదల సమయంలో వ్యక్తిగతంగా వచ్చి అర్జీలు ఇచ్చి, టిక్కెట్ ధరపెంచమని కోరడం ఎందుకు? అం దరూ కలసివచ్చి ప్రభుత్వంతో స్పష్టంగా చర్చించమని పవన్ కల్యాణ్ సూచించారు. దిల్ రాజు, అల్లు అరవింద్, డి.సురేశ్ బాబు, వై.సుప్రియ, చినబాబు, సి.అశ్వనీదత్, నవీన్ ఎర్నేని తదితర నిర్మాతలు కలిసినప్పుడు అందరూ సంఘటితంగా ఉంటే పరిశ్రమగా అభివృద్ధి చేయవచ్చు అని కూడా తెలిపారు. అధునాతన సాంకేతికత వినియోగంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని పవన్ కల్యాణ్ యోచిస్తున్నారు. పరిశ్రమ హోదా కల్పించడంతోనే సరిపుచ్చకుండా యువతలోను, ఇప్పటికే చిత్ర రంగంలో ఉన్నవారికీ ఎప్పటికప్పుడు నైపుణ్యాల అభివృద్ధి కోసం అవసరమైన శిబిరాలు, సెమినార్లు, సింపోజియమ్స్ లాంటివి ఆంధ్ర ప్రదేశ్ లో విరివిగా నిర్వహిస్తారు. సినిమా రంగంలో స్టూడియో నుంచి సినిమా హాల్ వరకూ ఉండే విభాగాలలో గుత్తాధిపత్యం కంటే ఎక్కువ మందికి అవకాశాలు కల్పిస్తేనే పెట్టుబడులు పెరిగి పరిశ్రమగా వృద్ధి చెందుతుంది. ఈ దిశగానే పవన్ కల్యాణ్ ఆలోచన చేశారు. కాంప్రహెన్సివ్ ఫిల్మ్ డెవలప్మెంట్ పాలసీ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సినిమా రంగం అభివృద్ధికి బాటలు వేస్తున్నారని డీ.సీఎంవో విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

# కరెంట్ షాక్‌తో ముగ్గురు మృతి

>> చేయగా అతడికి కరెంటంట్ షాక్ కొట్టింది. దీంతో ముగ్గురు అక్కడిక్కడే మృతి చెందారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతుల్లో ఒకరు ముత్యాలమ్మగా గుర్తించారు. మరో ఇద్దరి వివరాలను సేకరిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బెజవాడలో బాంబు బెదిరింపులు

>> తీస్తున్నారు. విజయవాడ బీసెంట్ రోడ్డులో బాంబులు పెట్టామని, మరికాసేపట్లో అవి పేలే అవకాశం ఉందని చెప్పి ఫోన్ కట్ చేశాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వెంటనే బాంబ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. మొత్తం నాలుగు బృందాలుగా ఏర్పడి బందర్ రోడ్డు నుంచి ఏలూరు రోడ్డు వరకు కూడా క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. బీసెంట్ రోడ్డులు షాపులతో పాటు, తోపుడ బండ్లు కూడా ఎక్కువగా ఉంటాయి. దీంతో ప్రతీ బండిని బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేసింది. అయితే బాంబు ఉన్నట్టు ఎటువంటి ఆనవాళ్లు కనిపించడం లేదని పోలీసులు చెబుతున్నారు. బీసెంట్ రోడ్డులో బాంబు లేదని ఊరిపీల్చుకున్న పోలీసులకు మరో బాంబు బెదిరింపు కాల్ ఉలిక్కిపడేలా చేసింది. విజయవాడ రైల్వే స్టేషన్‌లో బాంబు పెట్టామంటూ ఓ ఆగంతకుడు కంట్రోల్ రూమ్‌కు కాల్ చేశాడు. హిందీలో మాట్లాడటంతో అప్రమత్తమైన జీఆర్‌పీ, సీఎస్‌డబ్ల్యూ, బాంబు స్క్వాడ్ బృందాలు రైల్వే స్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్ర లాతూర్ నుంచి కాల్ వచ్చినట్లు పోలీసులు నిర్ధారించారు. బాంబు పెట్టినట్లు చెప్పిన సదరు ఆగంతకుడు ఆ తరువాత ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బాంబు బెదిరింపు కాల్ నేపథ్యంలో స్టేషన్‌లో ప్రయాణికులను, ప్లాట్ ఫామ్‌లను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు.

## కారు-లారీ ఢీ: నలుగురు మృతి

>> నుంచి బయటపడ్డారు.బద్వేలులో జరుగుతున్న జాతర కార్యక్రమానిని బంధువులంతా శనివారం ఉదయం బెంగుళూరు నుంచి బద్వేలుకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. అయితే గువ్వలచెరువు మూడవ మలుపు వద్దకు రాగానే అధిక లోడుతో ఉన్న లారీ వేగంగా వచ్చి కారును ఢీకొన్న వెంటనే లారీ కారుపై వాలిపోయింది. కారునుజ్జునుజ్జు కావడంతో అందులో ఉన్న ఏడుగురు తీవ్రంగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చేసరికి నలుగురు వ్యక్తులు చనిపోయినట్లు నిర్ధారణ కాగా మిగిలిన వారిని బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించారు. దాదాపు రెండు గంటల పాటు శ్రమించి కారులో ఉన్న మృతదేహాలను తీయగా కొంతమంది కొన ఊపిరితో ఉండడంతో వారిని రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న వెంటనే మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డిలు సంఘటన జరిగిన తీరును తెలుసుకున్నారు. అనంతరం రిమ్స్‌కు చేరుకుని మృతుల బంధువులను పరామర్శించి ధైర్యం చెప్పారు. జరిగిన సంఘటన విషాదకరమని, విచారణ చేయిస్తామని మంత్రులు అన్నారు.

# థియేటర్ల బంద్ లేదు..

## ప్రచారాన్ని ప్రేక్షకులు నమ్మొద్దు

**విజయవాడ,మే24,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ,టీజీ రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి థియేటర్లు బంద్ కానున్నాయన్న ప్రచారాన్ని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఖండించింది.ప్రస్తుతానికి అటువంటి ఉద్దేశమేది లేదని తెల్చిచెప్పింది థియేటర్ల బంద్ ఏమీ ఉండదని, యథావిధిగానే షోలు కొనసాగుతాయని తాజాగా స్పష్టం చేసింది. థియేటర్లకు కూడా పర్సెంటేజీ విధానం అమలు చేయాలని డిమాండ్ నేపథ్యంలో ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లతో నిర్మాతలు శనివారం ఉదయం ఫిల్మ్ ఛాంబర్ లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అగ్ర నిర్మాతలు దిల్ రాజు, నాగవంశీ, మైత్రి రవి, సుధాకర్ రెడ్డి, సురేశ్ బాబు, బెల్లంకొండ సురేష్, ఏఎం రత్నం, రాధా మోహన్, స్రవంతి రవికిషోర్, బాపినీడు తదితరులు హాజరయ్యారు.

### గువ్వలచెరువు ఘాట్‌రోడ్డు

# ప్రమాదం విచారకరం: సిఎం చంద్రబాబు

**విజయవాడ, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** కడప జిల్లా గువ్వలచెరువు ఘాట్‌రోడ్డులో జరిగిన ప్రమాదం విచారకరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. కారును లారీ ఢీకొన్న ఘటనలో బద్వేలు మండలం, చింతపూతాయపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్, శిరీష, హర్షిణి, హృతికేష్ రెడ్డి మృత్యువాత పడటం అత్యంత బాధాకరమన్నారు. ప్రమాదంలో 8,10 ఏళ్ల చిన్నారులు ప్రాణాలు కోల్పోవడంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలిపిన సీఎం బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ఢిల్లీలో ఉన్న సీఎం ప్రమాద ఘటన వివరాలను కార్యాలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

### పిఎస్ఆర్ ఆంజనేయులు

# ఫామ్‌హౌస్‌లో సిఐడి సోదాలు

**విజయవాడ, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ముంబయికి చెందిన సినీనటి కాదంబరి జెత్వానీ కేసులో అరెస్టయిన నిఘా విభాగం మాజీ అధిపతి సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయుడు నివాసంలో సీఐడీ అధికారులు శుక్రవారం సుదీర్ఘంగా సోదాలు నిర్వహించారు. హైదరాబాద్ శివారుల్లోని మొయినాబాద్ మండలం అమ్డాపూర్‌లోని పీఎస్ఆర్ ఫామ్‌హౌస్‌లో తనిఖీలు చేశారు. ఉదయం 10 నుంచి రాత్రి వరకూ సోదాలు కొనసాగించారు. ఈ కేసులో కీలక ఆధారాలైన పలు ఎల్రక్టానిక్ ఉపకరణాలను పీఎస్ఆర్ మాయం చేశారని అనుమానిస్తున్న సీఐడీ అధికారులు వాటి కోసంఈ సోదాలు చేపట్టారు. ఈ తనిఖీల్లో కొన్ని పత్రాలు లభ్యమైనట్లు సమాచారం. ఆంజనేయులును ఈ ఫామ్‌హౌస్‌లోనే గతనెల 22న సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. అప్పట్లో కొన్ని ఎల్రక్టానిక్ ఉపకరణాలను స్వాధీనం చేసుకోలేదు. విచారణలో భాగంగా వాటి గురించి ప్రశ్నించినా పీఎస్ఆర్ సరైన సమాధానలు చెప్పలేదు. ఈ నేపథ్యంలోనే తనిఖీలు జరిగాయి.

## వారం - వర్జ్యం

తేది : 25-05-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
త్రయోదశి మ.3.49
అశ్వని ఉ.11.11
వర్జ్యం రా.7.40-9.05
దు.సా.4.47-5.39
శుభసమయం :ఉ.8.15-8.50
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**వృషభం:** నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. ఇంటా బయటా ప్రోత్సహం. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**మిథునం:** చేపట్టిన కార్యక్రమాలలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**కర్కాటకం :** కుటుంబంలో ఏర్పడిన సమస్యలు కొంతవరకు తీరుతాయి. ఉద్యోగాలలో స్థానమార్పులు వుంటాయి. ధనవ్యయం.

**సింహం:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే.

**కన్య :** నూతన కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. చర్చల్లో పురోగతి సాధిస్తారు. శ్రమ పెరుగుతుంది.

**తుల :** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. పాత మిత్రుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**వృశ్చికం:** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. గృహయోగం. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**ధనుస్సు:** ఆర్థిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడతాయి. భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. ఖర్చులు.

**మకరం:** ఋణదాతల ఒత్తిడులు ఎదురై చికాకులు పెడతాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం. ప్రయాణాలు.

**కుంభం:** ఇంటా బయటా సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి. వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు.

**మీనం:** ఆదాయం తగ్గుతుంది. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది. సోదరుల నుండి సాయం అందుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

25-5Pg3exHMNWJQE.qxd:25-5Pg3exHMNWJQE.qxd 1/1/02 5:57 AM Page 1



# టిటిడిలో వాట్సాప్ గవర్నెన్స్!

## - మరింత పారదర్శకంగా సాంకేతిక సేవలు

## కృతిమ మేధ విధానాన్ని త్వరితగతిన అందించేందుకు చర్యలు

## - టిటిడి ఇఒ శ్యామలరావు



**తిరుమల,మే 24ప్రభాతవార్తప్రతినిధి:** సాంకేతిక పరిజ్ఞానంతో శ్రీవారి దర్శనానికి తిరుమలకు వస్తున్న భక్తులకు మరింత పారదర్శకంగా, సులభతరంగా సేవలందిచేందుకు కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలి జెన్స్)విధానాన్ని త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని టిటిడి ఇఒ జె.శ్యామలరావు తెలిపారు. ఎఫ్ఎంఎస్ మానిటరింగ్, టిటిడిలో 14సేవలను వాట్సాప్‌గవర్నెన్స్.గూగుల్‌తో ఒప్పందం,ఆధార్‌నమోదు,కియోస్క్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. కియోస్క్‌లద్వారా 4కోట్ల రూపాయలు అదనంగా విరాళాలు వచ్చాయన్నారు. భక్తుల నుండి ఎప్పటికప్పుడు అభిప్రాయాలను సేకరించి మరింత మెరుగైన సేవలు అందించేందుకు వాట్సాప్‌ఫీడ్‌బ్యాక్ విధానం అందుబాటులోకి తెచ్చామన్నారు. దీనిద్వారా పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించే అవకాశం ఏర్పడిందని ఇఒ వెల్లడించారు. శనివారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో "డయల్ యువర్ ఇఒ"కార్యక్రమం అనంతరం అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సిఇ సత్యనారాయణ, విఎస్ఒలు వింగ్ ఎస్వీవిరామ్‌కుమార్, సురేంద్ర, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలసి మీడియాప్రతినిధులకు పలు అభివృద్ధి కార్యక్రమాలు ఇఒ శ్యామలరావు వివరించారు. వివిధ రంగాల నిపుణులతో శ్రీవారిసేవకు వినియోగించుకునేందుకు వీలుగా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఎన్ఆర్ఐలు కూడా శ్రీవారిసేవచేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. గోమాతలకు సేవచేసేందుకు "గోసేవ"ను అమలుచేస్తామన్నారు. గ్రూప్‌లీడర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి 50శాతంమంది పాత సేవకులు, 50శాతంమంది కొత్తసేవకులు శ్రీవారిసేవలో పాల్గొనే అవకాశం కల్పించడంతోబాటు వారికి దశలవారీగా శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటుచేసేలా ప్రణాళికలు రూపొందించనున్నామన్నారు. తిరుమలను ప్రణాళికా బద్ధంగా అభివృద్ధిచేయడానికి టిటిడి పట్టణప్రణాళిక విభాగాన్ని ఏర్పాటుచేసుకున్నామన్నారు. 10కొత్త పోస్టుల భర్తీకి ప్రభుత్వం కూడా ఆమోదిం తెలిపిందని, దేశవ్యాప్తంగా ఉన్న ఆర్కిటెక్చర్ కన్సల్టెన్సీల ద్వారా టిటిడిలో అన్ని ఆలయాల అభివృద్ధికి ప్రణాళికలురూపొందిస్తున్నామన్నారు. పలు ఆలయాల అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ తయారుచేశామన్నారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు వివిధ రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలను నిర్మించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆదాయంతో సంబంధం లేకుండా నిర్వాహకుల సామర్థ్యాన్ని బట్టి పేరొందిన సంస్థలకు హోటళ్ళు కేటాయించడానికి త్వరలోనే టెండర్లను పిలుస్తామన్నారు.

# మహానాడుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

## పోలీస్ అధికారులకు డిజిపి దిశానిర్దేశం

**కడప ,మే 24, ప్రభాతవార్త బ్యూరో :** ఈ నెల 27, 28, 29 తేదీలలో జరగనున్న మహానాడు సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర డీ.జీ.పీ హరీష్ కుమార్ గుప్తా పోలీస్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర డీ.జీ.పీ హరీష్ కుమార్ గుప్తా పలు అంశాలపై పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. మహానాడుకు పలువురు వి.వి.ఐ.పి లు, వి.ఐ.పి లు, పెద్ద ఎత్తున ప్రజలు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ పరంగా ఎటువంటి అవాంతరాలు లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, పార్కింగ్ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. సామాన్య ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ ను ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లేలా మళ్లించాలని ఆదేశించారు. పకడ్బందీగా రూట్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీస్ అధికారులకు కేటాయించిన విధులను అప్రమత్తంగా ఉంటూ నిర్వర్తించాలన్నారు. సమావేశంలో అడిషనల్ డి.జి (లా అండ్ ఆర్డర్)ఎన్.మధుసూదన్ రెడ్డి, కర్నూలు రేంజ్ డి.ఐ.జి డా.కోయ ప్రవీణ్, అనంతపురము రేంజ్ డి.ఐ.జి డా.షెముషి బాజ్ పేయి, కడప జిల్లా ఎస్.పి ఇ.జి అశోక్ కుమార్ , కర్నూలు జిల్లా ఎస్.పి విక్రాంత్ పాటిల్, అన్నమయ్య జిల్లా ఎస్.పివి.విద్యాసాగర్ నాయుడు, నంద్యాల జిల్లా ఎస్.పిఅధిరాజ్ సింగ్ రా ణా, అనంతపురం జిల్లా ఎస్.పి పి.జగదీశ్, గుంతకల్ రైల్వే ఎస్.పిరాహుల్ మీనా, అదనపు ఎస్.పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, జిల్లా, ఇతర జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని పథకానికి - రూ.10లక్షలు విరాళం



**తిరుమల,మే 24ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని పథకానికి ఓ దాత 10లక్షలు రూపాయలు విరాళమిచ్చారు. బెంగుళూరుకు చెందిన అలెన్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ ఉపాధ్యక్షుడు మహేశ్‌యాదవ్ ఈ విరాళాన్ని శనివారం ఉదయం అన్నమయ్య భవనంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. ఈ సందర్భంగా దాతను ఆయన అభినందించారు.

## 'ఆధార్'తోనే శ్రీవారి సేవలు !

### -మధ్యవర్తులు, దళారుల నియంత్రణకు చర్యలు

**తిరుమల,మే 24ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేసే భక్తులకు టిటిడి కల్పిస్తున్న దర్శనం, వసతి తదితర సేవలు దళారుల ప్రమేయం లేకుండా మరింత పారదర్శకంగా నేరుగా అందించేందుకు టిటిడి కార్యచరణ రూపొందించింది. ఇందులో భాగంగా భక్తులకు ఆఫ్‌లైన్(కౌంటర్‌సేవలు), ఆన్‌లైన్ (వెబ్‌పోర్టల్)రెండింటిల అందించే సేవలు అనేకమంది వ్యక్తులు భక్తులను మోసంచేసి భారీ మొత్తంలో డబ్బులు వసూలుచేస్తున్నారు. భక్తులకు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా టిటిడి అందిస్తున్న సేవలలో పారదర్శకతను పెంచేందుకు అధికారులు ఆధార్ ఆధారంగా సేవలందించేందుకు చూడాల్సి ఉంది. ఆఫ్‌లైన్‌లో, ఆన్‌లైన్‌లో టిక్కెట్లు పొందే దళారులు, మధ్యవర్తులపై టిటిడి చర్యలు చేపట్టింది. బల్క్ బుకింగ్‌లకు ఉపయోగించే మొబైల్‌నంబర్లు, మెయిల్ ఐడి ప్రూఫ్‌లు రద్దుచేశారు. ఫేక్ మొబైల్ నంబర్లు, మెయిల్ ఐడిలు ,ఐడి ప్రూఫ్‌లు ఉపయోగించి ఇప్పటికే బుక్‌చేసిన సేవలను ఉపయోగించడానికి అనుమతింపబడవని తెలిపారు. నిజమైన భక్తులు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ ఉపయోగించి మధ్యవర్తి లేకుండా సేవను నేరుగా పొందేలా టిటిడి కార్యాచరణ రూపొందించింది, సరైన ధృవీకరణ కోసం ఆదార్‌సేవలను ఉపయోగించేలా టిటిడి చర్యలు తీసుకుంటోంది.

## భక్తజనసంద్రంగా తిరుమల సర్వదర్శనానికి 25గంటలుపైనే



**తిరుమల,మే 24 ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిసెలవులు ముగింపుకు వస్తుండటం... వారాంతం, వరుస సెలవులతో ఏడుకొండలు భక్తజనసంద్రంగా మారాయి. శనివారం ఉదయానికే తిరుమలలో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయి ఆలయం వెలుపల మూడుకిలోమీటర్లు భక్తుల క్యూలైన్లు శిలాతోరణం వరకు చేరాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు భారీగా చేరుకుంటున్నారు. టోకెన్‌లేని భక్తులకు వెంకన్న దర్శనానికి 25గంటలపైగానే భక్తులు నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంది. ఈ రద్దీ ఇలాగే జులై 15వరకు కొనసాగుతుందని టిటిడి వర్గాల అంచనా. శనివారం సాయంత్రానికి 52వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా మరో 20వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. శుక్రవారం రాత్రివరకు 74,374మంది భక్తులకు మహాలఘులో దర్శనం చేయించారు. సాధారణంగా శని,ఆదివారాలు భక్తులు భారీగా తిరుమలకు వస్తారు. తిరుమలేశునికి ఎంతో ముఖ్యమైన శనివారంరోజు స్వామివారిని దర్శించుకుంటే రెట్టింపు ఆశీస్సులు లభిస్తాయనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం.క్యూలైన్లలో సకల సదుపాయాలు భక్తులకు అందిస్తున్నారు.

# గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ రైలు మార్గం పనులు

## నల్లమల అడవుల్లో ప్రారంభం - విదేశీ పరిజ్ఞానంతో రెండు సొరంగాల నిర్మాణం

## - దిగువమెట్ట-దొరబావి వంతెన మధ్య రెండు సొరంగ మార్గాలు - భూ సామర్థ్యం, పటిష్టతల నిర్ధారణకై ప్రత్యేక నిపుణుల బృందం పర్యవేక్షణ



అడవుల్లో జరుగుతున్న గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ రైలు మార్గం సొరంగాల పనులు

**గుంతకల్లు రైల్వే,మే 24,ప్రభాతవార్త** రాష్ట్రంలోని దక్షిణ మధ్య రైల్వేలో గుంటూరు-గుంతకల్లు రైలు మార్గంలో జరుగుతున్న డబ్లింగ్ రైలు మార్గం పనులు తది దశకు చేరుకున్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం నాటి ఆంగ్లేయులు తమ వాణిజ్య వర్తక,వ్యాపారాల నిమిత్తం బందరు-బెడవాడ- గుంటూరు-గుంతకల్లు-హుబ్లీ-మార్మగోవా మధ్య మీటర్ గేజ్ రైలు మారా ్గన్ని ప్రారంభించారు. స్వాతంత్ర్యం అనంతరం దక్షిణాది నుంచి తొలిసారిగా 1991లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పాములపర్తి వెంకట నరసింహారావు రైల్వేలో దేశమంతటా ఒకే గేజ్ విధానం ఉండాలనే ఉద్దేశ్యంతో 1992 ఏప్రిల్ 2న గౌహతిలో యూనిగేజ్ ప్రాజెక్టును ప్రారంభించారు. నాటి నుండి బ్రాడ్ గేజ్ రైలు మార్గం దేశవ్యాప్తంగా ప్రారంభం అయ్యింది. ఇందులో భాగంగా గుంటూరు- గుంతకల్లు మధ్య 1997జూలై 5న శనివారం నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు నాయుడు అప్పటి రైల్వే శాఖ మంత్రి రాంవిలాస్ పాశ్వాన్‌లు నంద్యాలలో జరిగిన కార్యక్ర మంలో ఈ ప్రాజెక్టును ప్రారం భించారు. :- దాదాపుగా మూడు దశాబ్దాలుగా గుంటూరు-గుంతకల్లు మధ్య సింగల్ లైన్‌లో రైళ్ల రాకపోకలు సాగుతున్నాయి. అయితే రానున్న భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నల్లపాడు- గుంటూరు- గుంత కల్లు(గుత్తి-పెండేకల్లు సహా)426కి.మీల డబ్లింగ్, విద్యుత్ రైళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రైల్వే శాఖ ఈ మార్గాన్ని 2016-17ఆర్థిక సంవత్సరంలోరూ. 3,631కోట్ల అంచనా వ్యయంతో డబ్లింగ్(ఇంజ నీరింగ్) రైలు మార్గాన్ని, 2018-19ఆర్థిక సంవత్సరంలో రూ.207,48,41 కోట్ల అంచనా వ్యయంతో విద్యుదీకరించేందుకు రైల్వే బోర్డు ఈ ప్రాజెక్టులను మంజూరు చేసింది. దీంతో ఈమార్గంలో ప్రాజెక్టు పనుల సౌలభ్యం కోసం నాలుగు రీచ్‌లుగా విభజించి ఈ మార్గంలో 2018 జనవరిలో డబ్లింగ్ రైలు మార్గం పనులను దక్షిణ మధ్య రైల్వే చేపట్టింది. గుంటూరు,గుంతకల్లు రైల్వే డివిజన్‌లలో ఇప్పటివరకు 347కి.మీల మేర పనులు పూర్తి చేసినట్లు సంబంధిత ఉన్నతాధికారులు తెలిపారు. దిగువమెట్ట-గాజులపల్లి మధ్య 27కి.మీలు,గాజులపల్లి-నంద్యాల మధ్య 16కి.మీలు, నంద్యాల-పాణ్యంల మధ్య 14కి.మీల పనులు దాదాపుగా ముగింపు దశలో ఉన్నాయి. గాజులపల్లి-నంద్యాల మధ్య జరుగుతున్న 16కి.మీల పనులను రైల్వే నెట్‌వర్ క్‌తో అనుసంధానం చేసి మిగిలిన పనులను ఆగస్టులో పూర్తి చేసి సెప్టెంబరులో ప్రారంభించనున్నట్లు సంబంధిత ఉన్నతాధికారులు తెలిపారు. నల్లమల అడవులు..టైగర్ ఫారెస్ట్‌లలో :- ఈ ప్రాజెక్టులోనే అత్యంత కీలకమైంది నల్లమల అటవీ ప్రాంతం. ఈ ప్రాంతంలో జరుగుతున్న రెండో రైలు మార్గం ప్రాజెక్టు పనులు, రైలు మార్గం నల్లమల అటవీ ప్రాంతంలో 28కి.మీల మేర కలిగి ఉంటుంది. దిగువమెట్ట-గాజులపల్లి మధ్య రెండు సొరంగ రైలు మార్గాలు నిర్మించాల్సి ఉంటుంది. ఇందులో చలమ వద్ద 0.34కి.మీల సొరంగం ఒకటి కాగా, మరొకటి బొగడ సమీపంలో దొరబావి వంతెన వరకు 1.6కి.మీల సొరంగం మరొకటి. వీటి నిర్మాణం కోసం ఇప్పటికే అటవీ శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. దిగువమెట్ట-నంద్యాల మధ్య జరుగుతున్న డబ్లింగ్ రైలు మార్గంలో 142వంతెనలు నిర్మిస్తున్నారు.

# బాలుడి మృతిపై రైల్వేలో కొనసాగుతున్న విచారణ

**గుంతకల్లు రైల్వే,మే 24,ప్రభాతవార్త** గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో శుక్రవారం కర్నూలుకు చెందిన మణికంఠ అనే బాలుడు మృతిచెందిన సంఘటనకు సంబంధించి నిజనిర్ధారణ కమిటీ విచారణ కొనసాగుతుంది. కర్నూలుకు చెందిన వెంకటేశ్వర్లు,శ్రావణి దంపతులు,కుటుంబ సభ్యులు తీర్థయాత్రలో భాగంగా రామేశ్వరంకు వెళ్లే నిమిత్తం శుక్రవారం ఉదయం గుంతకల్లు నుంచి(అహ్మదాబాద్ నుంచి తిరుచిరాపల్లి వెళ్లే నెంబర్ 09419ఎక్స్‌ప్రెస్‌లో) గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం నెంబర్6-7మధ్య ఉన్న వెయిటింగ్ హాల్‌లో విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో శుక్రవారం తెల్లవారుజామున 4-30గంటల ప్రాంతంలో స్టేషన్ పైకప్పు పెచ్చులు మణికంఠపై విరిగిపడడంతో తలకు బలంగా, తీవ్రమైన గాయాలయ్యాయి. బాలుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, అదనపు డిఆర్ఎం సుధాకర్‌లు డివిజన్‌కు చెందిన సంబంధిత ఉన్నతాధికారులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని గమనించి కీలక విభాగాలకు చెందిన నలుగురు ఉన్నతాధికారులతో నిజనిర్ధారణ కమిటీని నియమించిన విషయం వార్త పాఠకులకు విధితమే.



# అనారోగ్యంతో ఉన్న వంశీకి సరైన వైద్యం అందించండి

## - మాజీ మంత్రి పేర్నినాని

**విజయవాడ, మే 24, ప్రభాతవార్తప్రతినిధి:** అనారోగ్యంతో ఉన్న ఓ మాజీ ప్రజా పతినిధి వంశీకి కి సరైన వైద్యం అందించరా అని వైకాంగ్రెస్ పార్టీనేత,మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) ప్రశ్నించారు. దొంగకేసులు పెట్టి మా పార్టీ నాయకుల ప్రాణాలతో చెలగాటమాడతారన్నారు.మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ని వైకాంగ్రెస్ ఎమ్మెల్సీ అరుణ్ కుమార్, మాజీ మంత్రి పేర్ని నాని విజయవాడలోని ప్రభుత్వాస్పత్రిలో శనివారం పరామర్శించారు. శ్వాసకోశ సంబంధ ఇబ్బందులతో బాధపడుతున్న వంశీని కోర్టు ఆదేశాల మేరకు విజయవాడ ప్రభుత్వాస్పత్రికి వైద్యపరీక్షలకు పోలీసులు ఈ సందర్భంగా మాజీ మంత్రి పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. వంశీ ఆరోగ్య పరిస్థితిపై కూటమి ప్రభుత్వానికి కనీసం మానవత్వం లేదని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వంశీని విచారణ పేరుతో ఆస్పత్రి నుంచి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం సరికాదని మాజీ మంత్రి పేర్ని నాని చెప్పారు.ప్రభుత్వాస్పత్రిలో కనీస సదుపాయాలు అందుబాటులో లేకుండా చేశారని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శలు చేశారు. అచ్చెన్నాయుడును గతంలో అరెస్టు చేసిన సమయంలో తనకు పైల్స్ అంటూ డ్రామాలు ఆడారని అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో అచ్చెన్నాయుడు చేరి ప్రాణాలు కాపాడుకున్నారని తెలిపారు. ఊపిరితిత్తుల్లో వంశీకి ఇబ్బందులు ఉన్నాయని.. అయినా ఎందుకు చికిత్స అందించడం లేదని నిలదీశారు. కూటమి ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న ఉద్యోగులందరినీ చట్టం ముందు నిలబెడతామని చెప్పుకొచ్చారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సీఐ భాస్కర్‌రావు, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌ని వదిలిపెట్టమని మాజీ మంత్రి పేర్ని నాని పేర్కొన్నారు. రాజ్యహింసకు, పోలీస్ వేధింపులకు కేంద్రంగా ఏపీ నిలబడుతోంది.

# వరుస వివాదాల్లో తిరుమల కొండ!

## - ఆ ముగ్గురు ఎపిఎస్‌పి పోలీసులు సస్పెన్షన్ - - నమాజ్‌చేసిన వ్యక్తికోసం సెర్చింగ్

**తిరుమల,మే 24ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రపుణ్యక్షేత్రం తిరుమలకొండ గత కొంతకాలంగా వరుసవివాదాలకు కేంద్రంగా మారింది. పవిత్రతను కాపాడాలని, ఇందుకు కఠిన చర్యలు తీసుకోవాలని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు ఆదేశాలిచ్చినా ఆచరణ అంతంతమాత్రంగానే మారింది. ఇందుకు ఇటీవల చోటుచేసుకున్న అనేక పరిణామాలు తార్కాణంగా నిలిచాయి. తిరుమల పుణ్యక్షేత్ర పవిత్రతను, ఆలయ భద్రత, హిందువుల ఆరాధ్యదైవం వేంకటేశ్వరస్వామి ప్రాశస్త్యాన్ని కాపాడటంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సిఎం సూచన. అయితే కొండపై అందుకు భిన్నంగా కార్యకలాపాలు జరుగుతుండటంతో నిఘాభద్రత వ్యవస్థతోబాటు తిరుమల పోలీసుల పనితీరు విమర్శలకు తావిస్తోంది. శుక్రవారం రోజు తిరుమల ఆలయ భద్రతకు డిప్యూటేషన్‌పై వచ్చిన కర్నూలు ఏపిఎస్‌పి బెటాలియన్ పోలీసులు ముగ్గురు బి.రాజశేఖర్, కె.ఓంకార్‌నాయక్, ,షేక్ సిరాజుద్దీన్ పోలీసు వాహనంలో తిరుపతికి దిగడం, పీకలదాకా మద్యం సేవించి అలిపిరి తనిఖీకేంద్రం దాటుకుని తిరుమలకు రావడం జరిగింది. అప్పటికే బెటాలియన్ పోలీసులు ముగ్గురూ మద్యంమత్తులోఉండటంతో తిరుమలలో ఆలయానికి ఎదురుగా ఉన్న డిటైప్ క్వార్టర్స్ ప్రాంతంలో సచివాలయం భవనాన్ని వాహనంతో ఢీకొన్నారు.ఈ ప్రమాదంతో ముగ్గురు కానిస్టేబుళ్ళు క్రిందపడ్డారు. అంతేగాక మత్తులో ఓ కానిస్టేబుల్ వీరంగం చేయగా మరొకరు రోడ్డుపై పడి దొర్లుకుంటూ రావడం అక్కడి భక్తులను , ట్రాఫిక్ పోలీసులను విస్మయానికి గురిచేసింది. ముగ్గురు ఏపిఎస్‌పి పోలీసుల్లో ఒకరు పరారవగా మిగిలిన ఇద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకుని పరీక్షలకోసం ఆస్పత్రికి తరలించారు. మద్యంసేవించి 300 పాయింట్లుగా తేలింది. ఆలయ భద్రతలో పవిత్రంగా వ్యవహరించాల్సిన బెటాలియన్ పోలీసులు ఇలా చేయడం వెనుక భద్రత డొల్లతనం మరోసారి ప్రస్ఫుటమైంది. ఇక రెండురోజుల క్రిందట తమిళనాడుకు చెందిన భక్తులను దర్శనానికి తీసుకువచ్చిన తమిళనాడు కారు డ్రైవర్ ముస్లిం వ్యక్తి కావడంతో గురువారం మధ్యాహ్నం కల్యాణవేదిక వద్ద ఏకంగా నమాజ్ చేయడంతో పెద్ద దుమారం రేపింది. డ్రైవర్ నమాజ్‌ను కొందరు భక్తులు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టుచేయడంతోసంచలనం కలిగించింది. గురువారం ఉదయం తమిళనాడుకు చెందిన కొందరు భక్తులు హనుమజ్జయంతిన శ్రీవారి దర్శనం కోసం ఓ కారును అద్దెకు తీసుకున్నారు. ఆ కారుడ్రైవర్ ముస్లిం కావడంతో మధ్యాహ్నం కల్యాణవేదిక పార్కింగ్‌లోనే నమాజ్ చేశారు. ఇదీ టిటిడి నిబంధనలకు విరుద్ధం.అంతేగాక ఈ రెండు ఘటనలుతిరుమలలో భద్రతను వెక్కిరించేలా తయారయ్యాయి. టిటిడి అధికారులు మాత్రం పోలీసులు కేసునమోదు చేసి విచారణ చేస్తున్నారని చెబుతున్నారు. కాగా గతంలో ఏకంగా ఓవ్యక్తి మద్యంబాటిళ్ళను తిరుమలకు తీసుకువచ్చి బాలాజీనగర్‌లో మినీమద్యం బెల్టుషాపును నడిపించడం జరిగింది.

# శ్రీవారి సేవను విశ్వవ్యాప్తం చేస్తాం :టిటిడి ఇఒ శ్యామల రావు

**తిరుమల,మే 24ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఇతోదిక సేవలందించేందుకు ప్రపంచంలోని నిపుణులు,ఎన్ఆర్ఐలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని టిటిడి ఇఒ జె.శ్యామలరావు తెలిపారు. ధార్మిక సంస్థ టిటిడిలోని వివిధ విభాగాలలో దేశవ్యాప్తంగా శ్రీవారిసేవకులు సేవలందిస్తున్నారని, వారి సేవలను విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలకనుగుణంగా టిటిడిలో శ్రీవారి సేవను విశ్వవ్యాప్తం చేసే కార్యాచరణ సిద్ధం చేయాలని ఇఒ శ్యామల రావు అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం టిటిడి పరిపాలనా భవనం నుండి 14 దేశాలకు చెందిన వివిధ రంగాల ఎన్ఆర్ఐల నిపుణులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఇఒ మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి భక్తులకు స్వచ్ఛందంగ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పలు రాష్ట్రాల నుంచి శ్రీవారి సేవకులు తిరుమలకు వచ్చి చక్కటి సేవలు అందిస్తున్నారని, త్వరలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ రంగాలలో నిపుణులైన ఎన్ఆర్ఐలు స్వచ్ఛందంగా సేవలు అందించేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు.టిటిడిలో వివిధ విభాగాలలో దేశవ్యాప్తంగా శ్రీవారి సేవకులు అందిస్తున్నారని వారి సేవలను విస్తరించేందుకు ప్రణాళికలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే అమెరికా తదితర దేశాలలో శ్రీనివాస కల్యాణాలు విరివిగా నిర్వహించేందుకు sవారు సహకరిస్తున్నారని తాజాగా శ్రీవారి సేవలో తీసుకువసునతన్న సంస్కరణల మూలంగా వైద్యం,ఐటీ,ఇంజనీరింగ్, ప్లానింగ్, వాటర్ మేనేజ్‌మెంట్,ఫుడ్ టెక్నాలజీ ,ఆర్కిటెక్చర్, టౌన్‌ప్లానింగ్ తదితర విభాగాలలో సేవలందించేందుకు ఎన్ఆర్ఐలు ముందు కొస్తున్నారని చెప్పారు. నైపుణ్యం ఆధారంగా వారి సేవలను టిటిడిలో అమలు చేసేందుకు ప్రణాళికలు తయారుచేయాలని ఆయన అధికారులను ముందుకు వచ్చారని ఈవో తెలిపార. ఈ సమావేశంలో పాల్గొన్న ఎన్ఆర్ఐలు టిటిడి శ్రీవారి సేలకుల సేవలను విశ్వవ్యాప్తం చేసేందుకు ముందుకు రావడంపై ఈ అవకాశం తమకు స్వామి వారు కల్పించిన మహద్భాగ్యం హర్షం వ్యక్తం చేశారు. ఈ వర్చువల్ సమావేశంలో సూర్యప్రకాశ్, శివశంకర్-జర్మనీ, సంతోష్‌పల్లె, రమేశ్ గుమ్మడవల్లి- ఐర్లాండ్, లోకనాదం, విజయకుమార్, అరుణ్ ముమ్మలనేని, శివరామ్‌రెడ్డి, విజయకుమార్, డాక్టర్ అనిల్‌కుమార్, రీతు, యూకె, శివరామ్-నెదర్లాండ్, కన్నెవిరని-ఫ్రాన్స్, పోలెండ్,ఐర్లాండ్ నుండి సంతోష్ ఉన్నారు.

# నేత్రదానట్రస్ట్ ఏర్పాటుకు త్వరలో విధివిధానాలు

## - సీనియర్ సిటిజన్లకు ఆలయానికి దగ్గరగా వసతి గదులు కేటాయించాలి:డయల్ యువర్ కార్యక్రమంలో భక్తులు

**తిరుమల,మే 24ప్రభాతవార్తప్రతినిధి:** సీనియర్ సిటిజన్లకు వయోభారంతో తిరుమలకు వచ్చినపుడు ఆలయానికి దగ్గరగా వసతి గదులు కేటాయించాలని, అన్నప్రసాద కేంద్రంలో ప్రత్యేక ఏర్పాట్లుచేస్తే బావుంటుందని విజయవాడకు చెందిన గిరిధర్ సూచించారు. దీనిపై టిటిడి ఇఒ శ్యామలరావు స్పందిస్తూ గదుల కేటాయింపు విషయంలో సూచనను పరిశీలిస్తామని, అన్నప్రసాదభవనంలోని హాల్ 1లో ఇప్పటికే సీనియర్ సిటిజన్లకోసం ప్రత్యేక ఏర్పాట్లుచేశామన్నారు. ఒంగోలునుండి నారాయణ, ఖమ్మంనుండి గోపి మాట్లాడుతూ దేశ రక్షణకు ఒక సంవత్సరం హుండీ ఆదాయం విరాళంగా ఇవ్వండని, క్యూలైన్లలో 5-10ఏళ్లలోపు పిల్లలకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటుచేయాలన్నారు. ఇందుకు ఇఒ సమాధానంగా పిల్లలకు ఇబ్బంది లేకుండా దర్శన ఏర్పాట్లుచేస్తున్నామన్నారు. కావలినుండి రవికుమార్ మాట్లాడుతూ టిటిడి నేత్రదానట్రస్ట్ ఏర్పాటుచేస్తే మరింతమంది భక్తులకు మేలు జరుగుతుందన్నారు. ఈ ప్రశ్నకు ఇఒ సమాధానంగా ఇప్పటికే దీనిపై అరవింద్ కంటి ఆస్పత్రిలో చర్చలు జరుపుతున్నామన్నారు. త్వరలో విధివిధానాలు ప్రకటిస్తామన్నారు. శనివారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో "డయల్ యువర్ ఇఒ"కార్యక్రమం జరిగింది. దేశంలోని పలుప్రాంతాలనుండి భక్తులు తమతమ సూచనలు,సలహాలు దాదాపు 35మంది తెలియజేశారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సిఇసత్యనారాయణ, డిప్యూటీ ఒలు లోకనాథం(ఆలయం), భాస్కర్(వసతికల్పన), రాజేంద్రకుమార్(అన్నదానం), వెంకటయ్య(కల్యాణకట్ట), రవాణ జిఎం శేషారెడ్డి, ఉద్యానవనవిభాగం డిడి శ్రీనివాసులు, విఎస్ఒలు ఎస్వీవిరామ్‌కుమార్, సురేంద్ర, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, పిఆర్ఒ నీలిమ, ఆరోగ్యఅధికారి డాక్టర్ మధుసూదన్ డయల్ యువర్ ఇఒ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీనివాసమంగాపురంలోవేదాశీర్వచనం ఏకబ్రాహ్మణుడే ఇస్తున్నాడని హైదరాబాద్‌నుండి లక్ష్మీనారాయణ్ తెలిపారు. దీనిపై ఇఒ శ్యామలరావు సమాధానంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. శ్రీవారిసేవను ఆఫ్‌లైన్‌లో ఇవ్వాలని కాకినాడనుండి నామాలస్వామి, కామారెడ్డినుండి శ్యామలకుమార్ కోరారు. దీనిపై స్పందించిన ఇఒ ఆఫ్‌లైన్‌లో ఇవ్వడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని. ఫిర్యాదులు రావడంతో ఆన్‌లైన్‌లో ఇ స ్త న్నా వ ు న్నా ్న ర ు .



శ్రీవారిమెట్టుదారిలో నడకదారిలో వచ్చేభక్తులందరికీ టోకెన్లు ఇవ్వాలని అనంతపురంనుండి నర్సానాయుడు సూచించారు. ఇందుకు ఇఒ స్పందనగా ప్రస్తుతం రోజుకు 4వేల వరకు టోకెన్లు జారీచేస్తున్నామని, ఆ సంఖ్య పెంచితే సర్వదర్శనం భక్తులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. నర్సారావుపేటనుండి మహేశ్వరరావు మాట్లాడుతూ ఆఫ్‌లైన్‌లో తిరుపతిలో ఎస్ఎస్‌డి టైమ్‌స్లాట్ టోకెన్లు రాత్రిపూట జారీచేయడం వద్ద ఇబ్బందులు పడుతున్నామన్నారు.

25-5Pg6exHMNWJQE.qxd:25-5Pg6exHMNWJQE.qxd 1/1/02 7:09 AM Page 1



# వైఎస్సార్సీపీ పాలన కుట్రలు, కుతంత్రాలమయం

### - అక్కడి విధ్వంసం తట్టుకోలేక పార్టీ వీడాను -మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి



**పలమనేరు,మే 24,ప్రభాతవార్త:** వైకాపా పాలన కుట్రలు,కుతంత్రాలమయమని వాటిని చూసి తట్టుకోలేక ఆ పార్టీ వీడడం జరిగిందని మాదిగ కార్పొరేషన్ చైర్మన్,మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి పేర్కొన్నారు. పలమనేరు టిడిపి కార్యాలయంలో నాయకులు,కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ..గత 5 సంవత్సరాల వైకాపా పాలన అనేక కుట్రలు,కుతంత్రాలతో సాగిందని విమర్శించారు. రాష్ట్రంలో వైకాపా చేయని కుంబకోణాలు,విధ్వంసాలు లేవని వాటిని చూసి తట్టుకోలేక ఆ పార్టీని వీడడం జరిగిందని తెలిపారు. కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మిచిన ప్రజావేదికను అధికారంలోకి వచ్చిన వెంటనే కూల్చడం చూసి నాకు అత్యంత సన్నిహితులు ఆయన చర్యలు సరికాదని తెలిపారన్నారు. విశ్వాసం,విలువలు లేని జగన్ ఆయన ప్రతి మాట విశ్వాసం,విలువలు అంటారు అయితే ఆయన రాష్ట్ర ప్రజలతో నిజమైన విశ్వాసం,విలువలతో లేరని ఆయన వారి పార్టీ మంత్రులు,ఎమ్మెల్యేలు రాష్ట్రాన్ని దోచుకోవడానికి సహకరించి వారికి విశ్వాసంగా ఉన్నారని విమర్శించారు. మద్యం కుంబకోణాలలో లక్షల కోట్లు ఆర్జించిన వారు ఎవ్వరన్నది ప్రతి ఒక్కరికి తెలుసన్నారు. ప్రజల సమస్యలను తనతో ఎవరైన చర్చిస్తే ఆసమయంలో ఆయన ఆలోచన అక్కడ ఉండదని రాష్ట్రంలో ఏలాంటి కుంబకోణాలు చేయాలి అందులో తమకు ఎంత వస్తుందని ఆలోచనలో ఉంటారని ఆరోపించారు. జగన్ మోహన్ రెడ్డికి రాష్ట్ర అభివృద్ధిపై అవగాహన శూన్యమని తెలిపారు. జగన్ చుట్టు ఉన్న ఆ నలుగు రాసిన రాతలను ఆయన మాట్లాడడానికి పరిమితం కావడం జరిగిందన్నారు. వైకాపాలో ఆ నాయకులు చేసిన కర్మ ఫలితమే వారు నేడు అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధిలో కీలక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. 1995లో విజన్ 2020 అన్న నారా చంద్రబాబు నాయుడు ఆ విజన్‌ను ప్రజల ముందు ఆవిష్కరించారని నేడు విజన్ 2047ను ఆయన పూర్తి చేసి చూపుతారన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి,ఆ ప్రాంతం అభివృద్ధి జరుగుతుందని పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈనెల 27,28,29న కడపలో జరగనున్న మహానాడును టిడిపి నాయకులు,కార్యకర్తలు జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. టిడిపి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. మహానాడు టిడిపి నాయకులు,కార్యకర్తలకు ఓ పండుగని ఆ పండుగకు ప్రతి ఒక్క టిడిపి నాయకులు,కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషోర్ గౌడ్, కుట్టి, నాగరాజురెడ్డి, ఆనంద్, సోమశేఖర్ గౌడ్, ఆర్వీ బాలాజీ ,రామచంద్ర నాయుడు, ఖాజా, గిరి తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు



మహానాడులో కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి సవిత

**- ప్రాజెక్టులు పూర్తయితే రాయలసీమ సస్యశామలం**
**- బిసి సంక్షేమ మంత్రి సవిత**

**శ్రీసత్యసాయి జిల్లా, మే 24, ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగుదేశం పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన ప్రతి కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో మహానాడు సభ వేలాది కార్యకర్తల నడుమ అట్టహాసంగా జరిగింది. తొలుత మినీ మహానాడు ప్రారంభం సందర్భంగా దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి సవిత సహా ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించి., టీడీపీ జెండాను ఆవిష్కరించారు. మహానాడు ఉద్దేశించి మంత్రి సవిత మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం కల్పించిన ఘనత ఎన్టిఆర్‌దేనని, సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ సారథ్యంలో టీడీపీ మరింత బలోపేతమైందన్నారు. ప్రతకార్యకర్తలను కన్నబిడ్డల చంద్రబాబు, లోకేష్‌లు చూసుకుంటున్నారని, సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల ప్రమాద బీమా, పేద కార్యకర్తల పిల్లల చదువులకు పార్టీ అధిష్టానం అండగా నిలుస్తోందన్నారు. చంద్రన్న నేతృత్వంలో ఇప్పటికే అమరావతి, పోలవరం ప్రాజెక్టు శరవేగంగా జరుగుతున్నాయని, అవి పూర్తయితే రాయలసీమ సస్యశామల మౌతుందన్నారు. మరో కొద్ది నెలల్లో పోలవరం ప్రాజెక్టు పూర్తి కానుందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే, రాయలసీమలో ప్రాజెక్టులన్నీ నీటితో నింపుకోవొచ్చునన్నారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి సీఎం చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారని, ఈ ప్రాజెక్టు కూడా పూర్తయితే రాయలసీమలో ప్రతి ఎకరాకూ నీరందిస్తామన్నారు. గత ప్రభుత్వ అసమర్థత కారణంగా రాయలసీమ తీవ్ర నిర్లక్ష్యానికి గురైందన్నారు. సీఎం చంద్రబాబు రాకతో, రాయలసీమలో పలు పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయన్నారు. రాయలసీమను పారిశ్రామిక హబ్ గా, హార్టీకల్చర్ హబ్ గా అభివృద్ధి చేయానికి సీఎం చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. గడిచిన ఎన్నికల్లో కూటమి విజయంలో కార్యకర్తల కృషి మరువలేనిదని మంత్రి సవిత కొనియాడారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఇస్తామన్నారు. త్వరలోనే నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని, ఇప్పటికే ఈ దిశగా మంత్రి నారా లోకేష్ చర్యలు ప్రారంభించారని వెల్లడించారు. గత ప్రభుత్వంలో టీడీపీ నాయకులపైనా బనాయించిన అక్రమ కేసుల మాఫీపైనా నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో నిర్వహించి మహానాడు విజయవంతానికి జిల్లా టీడీపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

# కడపలో పుంగనూరు చేరికను వ్యతిరేకించిన ప్రజలు

### - జిల్లా కేంద్రానికి 148 కిలోమీటర్లు దూరం

**పుంగనూరు, మే 24 ప్రభాతవార్త** చిత్తూరు జిల్లాలోని పుంగనూరును కడప జిల్లాలో చేరుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైంది. చిత్తూరు జిల్లా ఏర్పడినప్పటి నుంచి జిల్లాలో భాగమై ఉన్న పుంగనూరు నియోజకవర్గం పలుసార్లు రూపురేఖలు కోల్పోయి ఇప్పుడు పుంగనూరు చౌడేపల్లి, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచర్ల మండలాలతో ఉంది. ఈ క్రమంలో మదనపల్లెను జిల్లా కేంద్రం చేస్తామని గత ప్రభుత్వం హామీలు ఇచ్చి వాటిని బుట్ట దాఖలు చేసింది. ఒకవేళ మదనపల్లె జిల్లా కేంద్రం అయి ఉంటే పుంగనూరు మదనపల్లి జిల్లాలో కలిసే దానికి సుముఖత వ్యక్తం చేసేది. జిల్లాల విభజన జరిగే చాలా ఏళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ పుంగనూరును కడప జిల్లాలో చేరుస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం అత్యంత దారుణమైన చేయమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పుంగనూరు నుంచి కడప 148 కిలోమీటర్ల దూరం ఉండగా దాదాపు మూడున్నర గంటలసేపు ప్రయాణం.

ఇప్పటికే మదనపల్లె ను కడప జిల్లాలో చేర్చడం వల్ల మదనపల్లె ప్రజలు లబోదిబోమంటున్నారు. మదనపల్లి నుంచి కడపకు వెళ్లి రావడానికి ఒక రోజు ప్రయాణం అవుతుందని మదనపల్లె ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమను చిత్తూరులో కలపాలని వారు కోరుతున్నారు కూడా.

# అభివృద్ధి బాటపై మహానాడులో చర్చ

## మినీమహానాడులోని తీర్మానాలతో తుది నివేదిక

**విజయవాడ.మే24,ప్రభాతవార్తప్రతినిధి:** గత ఐదేళ్ళలో అన్ని రంగాల్లోనూ వెనుకబడిన రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపించడంపై కడపలో జరుగునున్న మహానాడు వేదికపై సమగ్రంగా చర్చించాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. అలాగే రాయలసీమ అభివృద్ధే లక్ష్యంగా గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో తీసుకున్న చర్యలు,ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్ణయాలపైనా నేతలు ప్రత్యేకంగా చర్చించనున్నారు. కడప మహానాడులో చేయనున్న తీర్మానాలపై మంగళగిరి లోని తెదేపా కేంద్ర కార్యాలయంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడి అధ్యక్షతన తీర్మానాల కమిటీ శుక్రవారం సమావేశమైంది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మినీ మహానాడుల్లో చేసిన తీర్మానాల్ని కమిటీ చర్చించింది. వాటి ఆధారంగా తుది నివేదిక సిద్ధం చేయనున్నట్లు ఎంఎల్ఏ నక్కా ఆనందబాబు తెలిపారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై రూపొందించిన 14 ముసాయిదా తీర్మానాలు నాలుగు ఉమ్మడి తీర్మానాలన్ని చర్చించి ఆమోదించనున్నారు. మొదటి రోజు ప్రతినిథుల సభ జరుగుతుంది. ఇందులో పార్టీ సంస్థాగత నిర్మాణం,సిద్దాంతాలు, భవిష్యత్తు కార్యాచరణపై నేతలు దిశా నిర్దేశం చేయనున్నారు. రెండో రోజు కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు,సాధించిన విజయాలు, మ్యానిఫెస్టో అమలు,గత వైకాపా ప్రభుత్వంలో జరిగిన విధ్వంసం నుండి రాష్ట్రాన్ని బయట పడేసేందుకు తీసుకుంటున్న చర్యలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఫించన్ల పెంపు,దీపం-2,అన్న క్యాంటీన్లు,చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్‌తో రాష్ట్రానికి వస్తున్న పరిశ్రమలు,తద్వారా యువతకు లభిస్తున్న ఉద్యోగ,ఉపాధి అవకాశాలు,మెగా డిఎస్సీ తదితర అంశాలప కూలంకుషంగా చర్చిస్తారు. ఇందుకు గాను కొన్ని ముసాయిదా తీర్మానాలు చేసింది. వీటిలో కూటమి ప్రభుత్వం..తొలి ఏడాదిలో సాధించిన విజయాలు ప్రస్తావించింది. నదుల అనుసంధానం,బనకచర్లకు గోదావరి జలాల మళ్లింపు సహా వేగంగా సాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం .ఒకే రాజధాని అమరావతి-అభివృద్ధి వికేంద్రీకరణ(పొరుగు రాష్ట్రాలకు ధీటుగా ప్రజా రాజధాని నిర్మాణం,పట్టణ-గ్రామీణాభివృద్ధితో వికేంద్రీకరణ,పెట్టుబడుల వికేంద్రీకరణ,175 నియోజక వర్గాల్లో పారిశ్రామిక పార్కులు,జగన పాలనలో దోపిడీకి గురైన ఉత్తరాంధ్ర రాయలసీమల అభివృద్ధి.

# ఆంధ్రప్రదేశ్ 10వ తరగతి ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** 2024-25 విద్యా సంవత్సరానికి ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 10వ తరగతి పరీక్షా రీవాల్యుయేషన్, రీవెరిఫికేషన్ ఫలితాల్లో ఇద్దరు విద్యార్థులు అత్యధిక మార్కులు 599 సాధించి విజయకేతనం ఎగురవేశామని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. అదేవిధంగా 598 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు ఏడుగురు, 597 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు 42 మంది, 596 ఆ పైన మార్కులు మార్కులు సాధించిన విద్యార్థులు 109 మంది, 595 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు 201 మంది, 590 ఆ పైన మార్కులు 1184 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. అదేవిధంగా మొత్తం 24261 మంది విద్యార్థులకుగాను శ్రీచైతన్య స్కూల్ సగటు మార్కు 600కు గాను 528. ఓవరాల్ పాస్ పర్సంటేజ్ 99.2 శాతం. సుమారు 80 శాతం బ్రాంచ్లు నూటికి నూరుశాతం ఫలితాలు సాధించాయని ఆమె తెలిపారు. ప్రస్తుతానికి రీవెరిఫికేషన్ ఆధారంగా పైన తెలిపిన సంఖ్యలు ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం తెలియజేయడం జరిగిందన్నారు. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 1వ ర్యాంకుతోపాటు 100 లోపు ర్యాంకులు 19 మంది శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు సాధించారని ఆమె తెలిపారు. శ్రీచైతన్య సాధించిన ఇంతటి ఘనవిజయాలకు దరిదాపుల్లో దేశంలోగాని, రాష్ట్రంలోగాని మరే ఇతర విద్యాసంస్థ లేదని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, రీసెర్చ్ ఓరియెంటెడ్ టీచింగ్ మెథడాలజీ, సిఓ ఐపియల్, సిఐపియల్, యమ్.పి. యల్., ఐకాన్, సిబ్యాచ్, యస్‌బ్యాచ్, టెక్నో వంటి పటిష్టమైన అకడమిక్ ప్రోగ్రామ్స్, మైక్రో లెవల్ టీచింగ్ సిస్టమ్, అంకిత భావంతో పనిచేసే అధ్యాపకులు వలన మాత్రమే ఇలాంటి అద్భుత ఫలితాలు సాధ్యమవుతున్నాయని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. ఇంతటి అనితర సాధ్యమైన విజయానికి కారణమైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి శ్రీచైతన్య విద్యాసంస్థల మరొక డైరెక్టర్ నాగేంద్ర అభినందనలు తెలియజేశారు.

# తెలుగు వీరుడికి గౌరవం- మేజర్ మల్ల రామ్ గోపాల్ నాయుడుకు కీర్తిచక్ర పురస్కారం



**విశాఖపట్నం, మే 24, ప్రభాతవార్త** భారతదేశంలో అరుదైన కీర్తి చక్ర పురస్కారం మేజర్ మళ్ల రామ్ గోపాల్ నాయుడుకు శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఢిల్లీలో ప్రధానం చేసారు. రాష్ట్రానికి జాతీయ గుర్తింపు తెచ్చినందుకు మళ్ల రామ్ గోపాల్ నాయుడును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు అభినందించారు. రామ్ గోపాల్ నాయుడు సాధించిన విజయానికి వీరు గర్వం వ్యక్తం . యువతకు మద్దతు ఇవ్వడంలో ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించారు. అటువంటి వ్యక్తులకు తాను అన్ని విధాలుగా అండగా నిలుస్తానని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్ మోహన్ నాయుడు కూడా అదే జిల్లాకు చెందిన తోటి స్థానికుడైన రామ్ గోపాల్ నాయుడును వ్యక్తిగతంగా అభినందించారు. జిల్లాలోనే కాకుండా దేశవ్యాప్తంగా యువతకు ఆదర్శంగా నిలిచిన రామ్ గోపాల్ నాయుడు ప్రశంసలు అందుకున్నారు. అనేక మంది ఎంపీలు మరియు కీలక రాష్ట్ర నాయకులు కూడా తమ అభినందనలు తెలిపారు. రాష్ట్రపతి చేతుల మీదుగా కీర్తి చక్ర ప్రధానం శ్రీకాకుళం జిల్లాలోని సంతబొమ్మాళి మండలం నాగిరిపెంట గ్రామానికి చెందిన మేజర్ మల్లా రామ్ గోపాల్ నాయుడుకు దేశ రాజధానిలో జరిగిన ఒక ఉత్సవ కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రతిష్టాత్మక కీర్తి చక్రను ప్రదానం చేశారు. 2023 అక్టోబర్ 26న జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన తిరుగుబాటు నిరోధక ఆపరేషన్‌లో అసాధారణ ధైర్యం మరియు నాయకత్వం వహించినందుకు భారతదేశపు రెండవ అత్యున్నత శాంతి సమయ శౌర్య పురస్కారమైన ఈ అరుదైన గౌరవాన్ని మేజర్ నాయుడుకు ప్రదానం చేశారు. ఆ దురదృష్టకర ఉదయం, ఐదుగురు భారీగా ఆయుధాలు కలిగిన ఉగ్రవాదులు భారత భూభాగంలోకి చొరబడ్డారని నిఘా వర్గాలు తెలిపాయి. సరిగ్గా ఉదయం 10:10 గంటలకు, యూనిట్‌లోని ఒక సైనికుడికి సమాచారం అందింది.

# చరిత్రలో నిలిచిపోయేలా మహానాడు నిర్వహణ

## సమీక్షించిన మంత్రులు, ముఖ్య నేతలు

**కడప, మే 24, ప్రభాతవార్త బ్యూరో :** ఈ నెల 27,28,29 తేదీల్లో కడపలో జరిగే మహానాడు కార్యక్రమాన్ని కడప చరిత్రలో నిలిచిపోయే విధంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు శరవేగంగా జరుగు తున్నాయి. మహానాడు నిర్వహణను పార్టీ ప్రతిష్టాత్మంగా తీసుకుంది. ఇప్పటికీ రాష్ట్రంలోని పలువురు మంత్రులు ముఖ్య నేతలు కడపలో మకాం వేసి మహానాడు ఏర్పాటలు పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగానే సత్యప్రసాద్, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు,పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు శనివారం కీలక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పొలిట్ బ్యూరో సభ్యులు,కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి , అన్నమయ్య జిల్లా పార్టీ చమతి జగన్మోహన్ రాజు,రాష్ట్ర ప్రభుత్వ విప్ కడప ఎమ్మెల్యే మాధవి రాష్ట్ర నేతలు సంధ్యా రాణి , బీద రవిచంద్ర , బీటీ నాయుడు , అమర్నాథ్ రెడ్డి , ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ , కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి , కమలాపురం, ప్రొద్దుటూరు శాసనసభ్యులు కొత్త కృష్ణ చైతన్య రెడ్డి, నంద్యాల వరదరాజు రెడ్డి, ఎమ్మెల్సీ బీటెక్ రవి, తానా మాజీ అధ్యక్షుడు వేమన ఇతరులు పాల్గొన్నారు.

అంతకుముందు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిలు గువ్వల చెరువు వద్ద లక్ష మందికి భోజన ఏర్పాట్లపై పరిశీలించారు .

మొదటి రెండు రోజులు రాష్ట్రస్థాయిలో టిటిడి ప్రజాప్రతినిధులు 25 వేల మంది చొప్పున పాల్గొంటారు.

# దసరా ఉత్సవాలకు ఇప్పటి నుండే సన్నద్ధం

### - ప్రతిరోజూ విలువైనదే - ఇఒ వికె శీనా నాయక్

**ఇంద్రకీలాద్రి, మే 24, ప్రభాతవార్త** అమ్మలగన్నమ్మ బెజవాడ కనకదుర్గమ్మవారి ఆలయంలో ఏటా జరిగే దసరా శరన్నవరాత్రోత ్సవాలకు ఇప్పటినుండే సన్నద్దమవుతున్నట్లు ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలు సెప్టెంబర్ నెలలోనే వస్తున్నందున ఇప్పటినుండే ఉత్సవ ఏర్పాట్లపై పలు చర్యలు తీసుకుంటునా ్నమన్నారు. శనివారం ఆయన ఆలయ ఇఇ కోటేశ్వరరావు, వన్‌టౌన్ సిఐ గురుప్రకాష్ లతో కలిసి కొండచరియలు విరిగిపడే ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం దుర్గాఘాట్ ను పరిశీలించి ఘాట్‌ను విస్తరించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. అక్రమ ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఇఇ కి ఆదేశించారు. ఈ సందర్భంగా ఈఒ మాట్లాడుతూ ఆషాడమాసం లో దుర్గమ్మవారికి సారె సమర్పణ, దసరా ఉత్సవాలు త్వరలో జరగనున్నందున ఈ ఏర్పాట్లు త్వరితగతిన చేస్తామన్నారు. సమయం తక్కువగా వున్నందున ప్రతి రోజు విలువైనదే అన్నారు. దుర్గమ్మవారిని దర్శించుకునే విఐపిలకు దర్శన సమయాల్లో సవరణ చేసినట్లు ఇఒ వికె శీనా నాయక్ వివరించారు. ఉదయం 11.30 గంటల నుండి 1.30 వరకు విఐపిల దర్శనం నిలిపివేస్తున్నామన్నారు. ఉదయం 11.30 గంటలకు దుర్గమ్మవారికి నైవేద్య విరామ సమయం, అనంతరం ఆలయ శుద్ధి జరుగుతాయన్నారు. అలాగే ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు దృష్ట్యా పార్కింగ్ సమస్య తలెత్తుతుండడం కూడా కారణమన్నారు. పసిపిల్లలను, వృద్దులను తీసుకొని వచ్చే వారు నైవేద్య విరామసమయంలో ఎక్కువ సేపు నిలబడి వుండవలసి వస్తున్నందున ఉదయం 11.30 కు ముందుగాని, మధ్యాహ్నం 1.30 గంటల తరువాత గాని విఐపిలు దుర్గమ్మను దర్శించుకోటానికి ఏర్పాట్లు చేశామని ఈ మేరకు విఐపిలు షెడ్యూల్స్ నిర్ణయించుకోవాలన్నారు. సామాన్య భక్తులకు త్వరితగతిన దర్శనం అయ్యేలా అందరూ సహకరించాలన్నారు.



దుర్గాఘాట్ పరిసరాలు పరిశీలిస్తున్న ఇఓ

# వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ. 52లక్షలు

**ఆత్రేయపురం, మే 24 (ప్రభాత వార్త ) ప్రముఖ** పుణ్యక్షేత్రం కలియుగ ప్రత్యక్ష దైవం వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చారు. భారీ వర్షాన్ని కూడ లెక్కచేయకుండా మాడ వీదులలో తడుస్తూ ప్రదిక్షణాలు చేసి స్వామి వార్ని దర్శించుకున్నారు. శనివారం కావడంతో ఆలయానికి డబ్బయ్ వేల పైబడి భక్తులు రావడంతో సుమారు రూ 52 లక్షలు పైబడి ఆదాయం సమాకూరినట్లు దేవస్థానం డిప్యూటీ కమీషనర్, ఈఓ నల్లం సూర్య చక్రదరరావు తెలిపారు. తెల్లవారుజామునుండి ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజామున 3 గంటలకు సుప్రభాత సేవ, తొలి హారతి తో ప్రారంభమైన స్వామివారి సేవలు రాత్రి 9 గంటల వరకు కొనసాగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, బెంగళూరు,తదితర రాష్ట్రాల నుంచి భక్తులు వేంకటేశ్వరస్వామి వారి దర్శనం కోసం తరలివచ్చారు. దాదాపు 70, వేలమంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, 30 వేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఈఓ తెలిపారు. వచ్చిన భక్తులకు త్రాగునీరు, మజ్జిగ, చంటిపిల్లలకు పాలు, బిస్కెట్లు, ఉచిత పులిహోర, అన్నప్రసాదం ఏర్పాటు చేసారు.

# అంతర్జాతీయ యోగా దినోత్సవాల సన్నాహకంలో భాగంగా యోగాంధ్ర కార్యక్రమం

**- ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి, హోంమంత్రి వంగల పూడి అనిత, ప్రభుత్వ విప్ పి వి ఆర్ గణబాబు, వేపాడ చిరంజీవి**



**విశాఖపట్నం, మే 24, ప్రభాతవార్త** యోగా అంటేనే భారతీయ వ్యవస్థలో సాంప్రదాయంగా వస్తున్న ఒక వ్యవస్థ అని, యోగా అంటే ఆసనాలు చేయడం కాకుండా,యోగా మన దైనందిన జీవిత కార్యక్రమంలో ఒక భాగం అవ్వాలని జిల్లా ఇంచార్జి మంత్రి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. శనివారం ఉదయం స్థానిక ఆర్కే బీచ్ వద్ద నిర్వహించిన యోగ డే వేడుకలలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా ఇంచార్జి మంత్రి , సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి, హోంమంత్రి వంగల పూడి అనిత, ప్రభుత్వ విప్ పి వి ఆర్ గణబాబు, వేపాడ చిరంజీవి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ, ఆరోగ్యమే మహా భాగ్యమని, మన ఆరోగ్యం మనకు గొప్ప ఆస్తి అన్నారు. మన ఆహారపు అలవాట్లు మారుతున్నాయి, పాత తరం ఆహారం వైపు అడుగులు వేస్తున్నామని, అందరి లో ఆరోగ్య భద్రత పెరిగిందని, యోగాంధ్ర లో యోగాసనాలు కార్యక్రమం అందరికీ ఆరోగ్యాన్ని ఇస్తుందని తెలిపారు. ప్రపంచ యోగా దినోత్సవం విశాఖ లో నిర్వహించడం, ప్రధాని మోదీ పాల్గొంటున్న ఈ కార్యక్రమం లో ప్రజలందరూ భాగస్వామి అవ్వాలని కోరారు. రాష్ట్ర హోం శాఖామాత్యులు వంగలపూడి అనిత మాట్లాడుతూ 11 వ యోగ వేడుకలు మన విశాఖలో నిర్వహించడం మన అదృష్టమని, యోగా అంటేనే భారతీయ వ్యవస్థలో సాంప్రదాయంగా వస్తున్న ఒక వ్యవస్థ అన్నారు. యోగా అంటే ఆసనాలు చేయడం కాకుండా,యోగా మన రోజువారి కార్యక్రమంలో ఒక భాగం అవ్వాలిని కోరారు. నరేంద్ర మోదీ, చంద్రబాబు. అంత ఎనర్జిటిక్ గా పని చేస్తున్నారు అంటే యోగానే కారణమని, రోజుకి ఒక గంట సమయం కేటాయిస్తే, రోజంతా ఎనర్జిటిక్ గా ఉంటామని, రాబోవు జనరేషన్ కి యోగాను అందించడంలో మనం కీలక పాత్ర పోషించాలన్నారు.

# నంబాల కేశవరావు, సజ్జ నాగేశ్వరావు మృతదేహాలను అప్పగించండి - హైకోర్టు

**విజయవాడ,మే24,ప్రభాతవార్తప్రతినిధి:** ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు, సజ్జ నాగేశ్వరావు మృతదేహాలను అప్పగించాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. నంబాల, నాగేశ్వరరావు తరపు బంధువులు ఏపీ హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ధర్మాసనం శనివారం విచారణ జరిపింది. మృతదేహాలకు పోస్టుమార్టం జరిగిందని ఛత్తీస్‌గఢ్ అడ్వకేట్ జనరల్ చెప్పారు. ఇప్పటికే 21 మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేశామని న్యాయస్థానానికి అడ్వకేట్ జనరల్ తెలిపారు ఎన్‌కౌంటర్ జరిగింది ఛత్తీస్‌గఢ్‌లో అని అక్కడే పిటిషన్ వేయాలని ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ కోరారు. పోస్టుమార్టం పూర్తి అవ్వడంతో మృతదేహాలను ఇస్తామని చెబుతున్నారని...

అందువలన పిటిషనర్లు ఛత్తీస్‌గఢ్ అధికారులను సంప్రదించవచ్చని హైకోర్టు ధర్మాసనం పేర్కొంది. ఈ మేరకు పిటిషనర్‌లకు న్యాయస్థానం వెసులుబాటు కల్పించింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబళ్ళ కేశవరావు, సజ్జా నాగేశ్వరావుల మృతదేహాలను తమకు అప్పగించాలని ఆయన బంధువులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాల పై ఈ రోజు ఉదయం 11 గంటలకు ఆన్ లైన్ లో విచారణ జరిగింది. పిటిషనర్ల తరఫున సీనియర్ కౌన్సిల్ సత్యప్రసాద్ ప్రధానంగా వాదించారు.

# అకుంఠిత దీక్షకు ప్రతిఫలం డిఫెన్స్ క్లష్టర్:ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్.

**జగ్గయ్యపేట, మే 24, ప్రభాతవార్త :** ఎంతో కాలంగా పడిన కష్టానికి, అకుంఠిత దీక్షకు తగిన ప్రతిఫలం లభించిందని, ఎన్టిఆర్ జిల్లా జగ్గయ్యపేట, నందిగామ ప్రాంతాల్లోని భూముల్లో డిఫెన్స్ క్లష్టర్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలుపటం చారిత్రాత్మకమని తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) హర్షం వ్యక్తంచేశారు. శనివారం తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడి, రక్షణశాఖ మంత్రి రాజనాధసింగ్, రాష్ట్ర సిఎం చంద్రబాబునాయుడు, యువమంత్రి నారా లోకేష్, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఈప్రాంతంలో డిఫెన్స్ క్లష్టర్ ఏర్పాటు ద్వారా యువతకు గణనీయమైన ఉపాధులు వస్తాయని సంతోషం వ్యక్తంచేశారు. 2015 నుండే జగ్గయ్యపేట ప్రాంత ప్రభుత్వభూములపై సర్వే ప్రారంభమైందన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో కూడా తాను ఈ అంశాన్ని ప్రస్తావించటం జరిగిందని గుర్తుచేశారు. అయితే ఏపిఐఐసి నందుగల ఈ ల్యాండ్‌పై కోర్టు కేసు నడుస్తుందని తెలుపగా ఎంపి కేశినేని చిన్ని చొరవ తీసుకుని సమస్యను పరిష్కరింపజేశారని తెలిపారు. కాగా పెనుగంచిప్రోలులో దాదాపు కోటి రూపాయలతో నిర్మించిన కల్వర్టును శనివారం ఎమ్మెల్యే రాజగోపాల్ ప్రారంభించారు. తన నివాసంలో నియోజకవర్గ దివ్యాంగుల అధ్యక్షులు వడ్డెపూడి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో అలింకో, స్వయంశక్తి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘ సౌజన్యంతో ఐదుగురు దివ్యాంగులకు ఎమ్మెల్యే వినికిడి యంత్రాలను అందజేశారు. జగ్గయ్యపేట పట్టణంలోని పాలేటి ఒడ్డున పునర్నిర్మాణమవుతున్న ప్రాచీన శివపంచాయత క్షేత్రం (మఠం శివాలయం) నిర్మాణ పనుల్లో భాగస్వాములవుతూ పలువురు భక్తులు భారీ విరాళాలు అందిస్తున్నారు. స్థానిక శ్రీగాయత్రి ఆశ్రమ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మికవేత్త చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రి లక్షావెయ్యినూట పదహార్లు, అలాగే చేదే నాగేశ్వరరావు, చేదే జనార్ధనరావు, చేదే వెంకటేశ్వరరావు రూ.1,16,000లు, కొంకిమళ్ళ వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం వారి సతీమణి రమావేవి, కుమారుడు యోగానందసాయి-నవ్యశ్రీ దంపతులు (యుఎస్ఏ) వారి తల్లి శకుంతల, కొంకిమళ్ళ మల్లు-రంగనాయకమ్మ దంపతులు శనివారం రూ.1,16,000లు వితరణగా ఆలయ నిర్మాణకమిటీ సభ్యులకు అందజేశారు.

# సింధుజలాల ఒప్పందంపై పాక్ విషప్రచారం

## ఐక్యరాజ్యసమితిలో దాయాది తీరును ఎండగట్టిన భారత్ ప్రతినిధి



**న్యూయార్క్, మే 24:** సింధు నదీజలాల ఒప్పందంపై పాకిస్తాన్ తప్పుడు ప్రచారం చేస్తోందని శనివారం ఐక్యరాజ్యసమితిలో భారత్ ధ్వజమెత్తింది. జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంవ్‌లో ఉగ్రదాడి తర్వాత సింధుజలాల ఒప్పందంనుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించిన భారత్ నదీజలాలను నిలిపివేసింది. సమితిలో భారత శాశ్వత రాయబారి పర్వతనేని హరీష్ మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని వీడేంతవరకూ ఈ నదీ జలాలు రద్దు ఒప్పందం అలాగే కొనసాగుతుందని తెలిపారు. పాకిస్తాన్‌ప్రతినిధి నదీజలాల ఒప్పందంపై భారత్‌ను విమర్శించడంతో వెంటనే స్పందించిన హరీష్ పాక్ వైఖరిని ఎండగట్టారు. పాకిస్తాన్ ప్రోత్సహిస్తున్న ఉగ్రవాదం వల్ల భారత్‌లో ఇప్పటివరకూ 20 వేల మంది అమాయకపౌరులు చనిపోయారన్నారు. గతనెలలోనే 26 మంది అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకున్నారని వీరంతా పాకిస్తాన్ ప్రాయోజిత తీవ్రవాదులేనని ఆయన ఆరోపించారు. 65 ఏళ్లక్రితం మంచి నమ్మకంతో నదీజలాల ఒప్పందంలోకి వచ్చిందని, స్నేహపూర్వక వాతావరణంలోనే జరుగుతుందని ఆనాడుభావించామన్నారు. 65 ఏళ్లుగా పాకిస్థాన్ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, మూడు యుద్ధాలుచేసి ఓడినా, వేలాదిగా ఉగ్రదాడులు భారత్‌పై జరుపుతూనే ఉందని ఆరోపించారు. గడచిన నాలుగు దశాబ్దాల్లో ఉగ్రదాడుల వల్ల 20 వేలమంది ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. భారత్‌ఎంతో ఓర్పు సంయమనంతో వ్యవహరించిందని, పాకిస్థాన్ ప్రాయోజిత సరిహద్దు ఉగ్రవాదం భారత్‌లో అమాయక పౌరులను బలితీసుకుంటున్నదని, మతసామరస్యాన్ని దెబ్బతీస్తోందని, ఆర్థిక అభ్యున్నతికి గండంగా మారిందని అన్నారు. దీనివల్ల స్వచ్ఛ ఇంధన ఉత్పత్తి, వాతావరణంలో మార్పులు, భౌగోళిక మార్పులు అనేకం సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసారు. పాతబడిన డ్యామ్‌లకు తక్షణ మరమ్మతులు అవసరమని, కొన్నింటినీ భద్రత రీత్యా పునర్నిర్మించాల్సిన అవసరంఎంతో ఉందని అయినా కూడా పాకిస్తాన్ ఈమార్పులను అడ్డుకుంటూ వస్తోందని ఆరోపించారు. మౌలికవనరుల కల్పనలోనూ పాకిస్తాన్ భారత్‌కు వ్యతిరేకంగానే స్పందించిందన్నారు. 2012లో ఉగ్రవాదులు తుల్బుల్ నేవిగేషన్ ప్రాజెక్టుపై దాడి చేసారన్నారు. ఇలాంటి ఈర్ష్యపూరిత దాడులు పౌరులు, విలువైన ప్రాజెక్టుల భద్రతకు ముప్పు తెస్తాయన్నారు. గతరెండేళ్లుగా కొన్ని మార్పులు అవసరమని పాకిస్తాన్‌తో సంప్రదిస్తూనే ఉన్నామని పాకిస్తాన్ వ్యతిరేకిస్తూ వచ్చిందని, నిరంతరం అడ్డుకునే వైఖరితోనే ఉన్న పాకిస్తాన్‌కు సింధుజలాలను వినియోగించుకునే హక్కు ఉండదని ఆయన వాదించారు. దీనికితోడు ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్తాన్ ఉగ్రనిర్మూలన పూర్తిగా చేసినపుడే సింధుజలాల ఒప్పంద అమలుకు తెస్తామని అప్పటివరకూ పెండింగ్‌లోనే ఉంటుందని అన్నారు. సరిహద్దు ఉగ్రవాదానికి పెట్టింది పేరుగా పాకిస్తాన్ నిలుస్తోందని హరీష్ ఆరోపించారు.

## ఎయిర్‌ఫోర్స్,బిఎస్‌ఎఫ్ సమాచారం పాక్‌కు చేరవేస్తున్న యువకుడి అరెస్టు



**అహ్మదాబాద్, మే 24:** భారత వాయుసేన, సరిహద్దుభద్రతా దళాలకు సంబంధించిన కీలకసమాచారం పాకిస్తాన్ నిఘా సంస్థలకు చేరవేస్తున్నాడన్న అభియోగాలతో గుజరాత్‌కు చెందిన సహదేవ్‌సింగ్ గోహిల్‌ను పోలీసులు అరెస్టుచేసారు. గుజరాత్ యాంటి టెర్రరిజమ్ స్క్వాడ్ అధికారి కె సిద్ధార్థ్ మాట్లాడుతూ భారత్ భద్రతా బలగాలకు సంబంధించిన సున్నిత రహస్య సమాచారాన్ని పాక్ వేగులకు చేరవేస్తున్నట్లు గుర్తించామన్నారు. 28 ఏళ్ల గోహిల్‌ను ఒక ఏజెండ్ సంప్రదించిందని, అదితి భరద్వాజ్ అనే ఆమె 2023లో వాట్సాప్‌ద్వారా పరిచయం అయిందన్నారు. ఐఎఎఫ్; బిఎస్‌ఎఫ్ సైట్లకు సంబంధించిన కొన్ని ఫోటోలను విడియోలను ఆమెకు పంపించాడు. కొన్ని నిర్మాణం పూర్తి అయినవి, నిర్మాణంలో ఉనన కట్టడాలను కూడా ఫోటోలు విడియోలు పంపించినట్లు నిందితుడు అంగీకరించాడు. పాకిస్తానీ ఏజెంట్‌తో కీలకమైన సమాచారాన్ని పంచుకుంటున్నట్లు తెలిపారు. ఈనెల ఒకటవ తేదీ ప్రాథమిక దర్యాప్తుకోసం పిలిపించారు. ఎస్‌టిఎఫ్ పాకిస్థానీ ఏజెంట్ ఆతడిని ఐఎఎఫ్, బిఎస్‌ఎఫ్ నిరానమణాల ఫోటోలు విడియోలు కోరినట్లు అంగీకరించాడు. 2025 ప్రారంభంలోనే ఆధార్‌కార్డుసాయంతో సిమ్‌కార్డు కొనుగోలుచేసి వాట్సాప్ యాక్టివేట్ చేసాడని అదితి భరద్వాజ్‌కోసం ఒటిపి సాయంతో చేసినట్లు తేలింది. ఆ తర్వాత అన్ని ఫోటోలు, విడియోలు పంపించడం ప్రారంభించినట్లు ఎటిఎఫ్ అధికారి సిద్ధార్థ్ తెలిపారు. గోహిల్ తరచూ చేసిన నంబర్లు పాకిస్తాన్ కేంద్రంగా ఉన్నట్లు గుర్తించామని, అంతేకాకుండా గోహిల్‌కు 40 వేల నగదును గుర్తుతెలియని వ్యక్తినుంచి అందాయని తెలిపారు. పహల్గాంవ్ లో దాడి జరిగిన తర్వాతనుంచే ఈ సంప్రదింపులు, సంభాషణలు పెరిగాయని అధికారులు గుర్తించారు. ఇప్పటివరకూ ఇదే తరహాలో పాక్‌కు సమాచారం చేరవేసిన పదిమందిలో గోహిల్ కూడా ఒకడు.



## బాలికపై లైంగికదాడి చేసిన సాధువు అరెస్టు

**బెలగావి, మే 24:** కర్ణాటకలోని బెలగావి జిల్లాలో ఉన్న రామ్‌మందిర సాధువును పోలీసులు అరెస్టుచేసారు. 17 ఏళ్ల బాలికను ప్రలోభపెట్టి తన కారులో ఇంటివద్ద వదిలిపెడతానని నమ్మించి ఆపై ప్రైవేటు లాడ్జికి తీసుకెళ్లి బలవంతంగా లైంగిక దాడిచేసినట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలు మొత్తం వివరాలను తల్లితండ్రులకు చెప్పడంతో ఈసాధువుపై పోలీసులకు ఫిర్యాదుచేసారు. నిందితుడు లోకేశ్వర మహరాజ్‌గా గుర్తించారు. మేఖాలి గ్రామంలోని రామ్‌మందిరంలో ఉంటున్నట్లు తెలిపారు. బెంగళూరుకు 500 కిలోమీటర్ల దూరంలో ఈ మందిరం ఉంది. బాలికను ప్రలోభపెట్టి బాగల్‌కోట్‌లోని ఒక లాడ్జికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడినట్లు తేలింది. ఆ తర్వాత ఆమెను రాయ్‌చూపర్‌కు తీసుకెళ్లి మళ్లీ లైంగిక దాడిచేసినట్లు పోలీసులు తెలిపారు. తర్వాత ఆమెను బాగల్‌కోట్‌జిల్లాలోని మహలింగపూర్ బస్టాండ్‌లో దించివెళ్లిపోయాడని బెలగావి ఎస్పీ డా.భీమశంకర్ ఎస్ గులేద్ తెలిపారు. పోక్సో చట్టం కింద నవానగర్ పోలీస స్టేషన్‌లో కేసు నమోదుచేసారు. బాధితురాలు జరిగినఘోరాన్ని తల్లితండ్రులకు వివరించింది. దీనితో వెంటనే బాగల్‌కోట్ పోలీసులకు ఫిర్యాదుచేసారు. అయితే ఈప్రాంతం తమ పరిధిలో లేకపోవడంతో కేసును బెలగావికి బదలాయించి నిందితుడిని అరెస్టు చేసారు. చివరకు ఈకేసును మూదలాగి పోలీస్‌స్టేషన్‌కు బదిలీచేసినట్లు ఎస్పీతెలిపారు. నిందితుడిని అరెస్టుచేసిన ప్రాంతం అయినందున ఆస్టేషన్ లోనే కేసును రిజిస్టరు చేసామన్నారు.

## ఆర్మీచీఫ్‌కు వ్యతిరేకంగా యూనస్ మద్దతుదారుల ర్యాలీలు

### ఇస్లామిస్టు, విద్యార్థినేతల మద్దతు కూడగట్టే పనిలో యూనస్




**ఢాకా, మే 23:** బంగ్లాదేశ్‌లో మళ్లీ రాజకీయ సంక్షోభం రాజుకుంటున్నది. తన పదవికి రాజీనామా చేస్తానని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మొహమ్మద్ యూనస్ హెచ్చరించినట్లు వినవస్తున్న నేపథ్యంలో దీనికి నిరసనగా రాజధాని ఢాకాలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన మద్దతుదారులు ప్రకటించారు. యూనస్‌ను ఐదేళ్లపాటు పదవిలో ఉంచాలి, ముందు సంస్కరణలుతర్వాతే ఎన్నికలు అంటూ నిరసనకారులు తమ పోస్టర్లలో డిమాండు చేశారు. ఈ ఏడాది డిసెంబర్‌లోగా దేశంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ వకార్‌ఉజ్ జమాన్ పిలుపునిస్తూ దేశ భవిష్యత్తును నిర్ణయించే అధికారం ప్రజా ప్రభుత్వానికి మాత్రమే ఉంటుందని పునరుద్ఘాటించిన నేపథ్యంలో తన పదవికి రాజీనామా చేస్తానని యూనస్ హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా బంగ్లాదేశ్ అనధికార ప్రధానమంత్రిగా కొనసాగుతున్న యూనస్ పదవీకాలం ముగిసిపోతుంది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో శనివారం యూనస్ మద్దతుదారులు ఆర్మీ కంటోన్మెంట్ వరకు నిర్వహించే ర్యాలీ ఎటువంటి హింసాత్మక ఘటనలకు దారితీస్తుందోనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతున్నది. విద్యార్థుల ఉద్యమం హింసాత్మకంగా మారిన దరిమిలా సైన్యం నుంచి వచ్చిన ఒత్తిళ్లకు తలొగ్గి రాజీనామా చేసిన ప్రధాని షేక్ హసీనా గత ఏడాది ఆగస్టు 5న దేశం విడిచి భారత్‌కి పారిపోయారు. ఆర్మీ చీఫ్‌కి వ్యతిరేకంగా మరో ఉద్యమాన్ని నిర్వహించాలన్న ఆలోచనతోనే యూనస్ రాజీనామా బెదిరింపులు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ప్రస్తుత రాజకీయ వాతావరణం, నిరసనల మధ్య తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేకపోతున్న కారణంగానే రాజీనామా చేయాలని యూనస్ యోచిస్తున్నట్లు విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్‌సీపీ) కన్వీనర్, విద్యార్థి ఉద్యమ నాయకులలో ఒకరైన నహీద్ ఇస్లామ్ తెలిపారు. ఎన్‌సీపీకి సారథ్యం వహించేందుకు నహీద్ ఫిబ్రవరిలో యూనస్ క్యాబినెట్‌కి రాజీనామా చేశారు. గురువారం సాయంత్రం ప్రభుత్వ అతిథి గృహం జమునలో యూనస్‌తో సమావేశమైన నహీద్ పదవిలో కొనసాగవలసిందిగా అభ్యర్థించారని సమావేశానికి హాజరైన మరో ఎన్‌సీపీ నాయకుడు అరీఫుల్ ఇస్లాం అదీబ్ తెలిపారు. తాను పదవిలో కొనసాగలేనని, మరో ఆపద్ధర్మ ప్రభుత్వాన్ని విద్యార్థి నాయకులే ఏర్పాటు చేసుకోవాలని యూనస్ కోరినట్లు తెలుస్తోంది. విద్యార్థులు, ఇస్లామిస్టు మూకలను తన సొంత సైన్యంగా వాడుకుంటున్న యూనస్ ఎన్నికలు నిర్వహించకుండా అధికారంలో కొనసాగాలని ప్రయత్నిస్తున్నట్లు జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. 2026 జూన్‌లోగా ఎన్నికలు జరుగుతాయని యూనస్ చెబుతున్నప్పటికీ బీఎన్‌పీతోసహా వివిధ రాజకీయ పార్టీలు సత్వర ఎన్నికలను కోరుతున్నాయి.

## ‘సిందూర్’ దాడిలో 200 మంది మృతి

### పాక్‌లో మరణించిన వారి వివరాలు తెలిపిన భారత్ రక్షణ అధికారులు




**న్యూఢిల్లీ, మే 24:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో గతనెల 22న పర్యటకులపై జరిగిన ఉగ్రదాడికి, ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైంది. అయితే దీనికి సంబంధించి రక్షణ శాఖ ఉన్నత వర్గాలు తాజా వివరాలను వెల్లడించాయి. భారత్ పాకిస్థాన్ పై మే7న జరిపిన దాడిలో 200 మందికి పైగా మరణించారని, పాక్‌లోని కీలక ఉగ్రస్థావరాలు, బహవల్‌పుర్ ధ్వంసమైందని పేర్కొన్నాయి. ఈ దాడిలో 170 మందికి పైగా ఉగ్రవాదులు మరణించారు. ఈ దాడిలో ఏడుగురు భారత సైనికులు ప్రాణాలు కోల్పోగా, 42 మంది పాక్ సైనికులు మరణించారు. భారత్ చేసిన వైమానిక దాడికి ప్రతిచర్యగా పాక్ డ్రోన్లు, క్షిపణులతో దాడి చేయగా, ఇరుదేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్‌లో భారత్ గొప్ప విజయాన్ని సాధించిందని రక్షణ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. పాక్ వైమానిక స్థావరాలపై విరుచుకుపడి దాయాది దేశ ఉగ్రస్థావరాలను మట్టికురిపించాయి. జైషే మహ్మద్ ఉగ్రముఠా ప్రధాన కేంద్రం ధ్వంసమైంది. ఈ దాడిలో భారత మహిళా పైలెట్లు కీలక పాత్ర పోషించారు. అయితే ఈ వైమానిక దాడిలో భారత బ్రహ్మోస్ క్షిపణులు ప్రధాన పాత్ర పోషించాయని రక్షణ వర్గాలు తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని తాత్కాలికంగా నిలిపివేశామని సదరు వర్గాలు తెలిపాయి. అయితే, ఆపరేషన్ సిందూర్ విజయం పాక్‌ను తీవ్రంగా భంగపాటుకు గురిచేసిందని, దీనికి ప్రతికారంగా భారత్‌పై ఎప్పుడైనా దాడులు జరపవచ్చునని పేర్కొన్నాయి. అందుకని ముందస్తు చర్యగా భారత రక్షణ దళాలు హైఅలర్ట్‌లో ఉన్నాయని వెల్లడించాయి. భారత్, చైనా సరిహద్దు వివాదానికి సంబంధించి 2017లో డోక్లామ్‌లో తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలే, సిందూర్ విజయానికి కారణం అని సదరు వర్గాలు తెలిపాయి. అయితే ఈ ఉగ్ర దాడిలో పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్‌కు ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి కల్పించాలని పాకిస్థాన్ నిర్ణయించింది. ఇది తనకు జరిగిన అవమానాన్ని కప్పిబుచ్చుకునే పాక్ చేసే ప్రయత్నంగా అభివర్ణించాయి.



## బాలీవుడ్ నటుడు ముకుల్‌దేవ్ కన్నుమూత

**ముంబయి, మే 24:** ప్రముఖ సినీ, టీవీ నటుడు ముకుల్ దేవ్ కన్నుమూశారు. అనారోగ్యంతో ఆయన తుది శ్వాస విడిచినట్లు సన్నిహితులు, కుటుంబ సభ్యులు శనివారం తెలిపారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధడుతున్నట్లు సన్ ఆఫ్ సర్దార్2 చిత్రంలో ముకుల్ దేవ్‌తో కలిసి పనిచేసిన నటుడు విందు దారా సింగ్ పేర్కొన్నారు. ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి పరిస్థితి విషమించి చనిపోయిటన్లు వైద్యులు ధృవీకరించారు. ముకుల్ దేవ్ హిందీ, తెలుగు, కన్నడ, పంజాబీ సహా పలుభారతీయ భాషల్లో నటించారు. తెలుగులో ఆయన ఎక్కువగా విలన్ పాత్రలు పోషించారు. కృష్ణ, ఏక్ నిరంజన్, భాయ్, మనీ మనీ మోర్ మనీ, సిద్ధం, కేడీ, అదుర్స్ లాంటి చిత్రాల్లో ఆయన కీలక పాత్రల్లో నటించారు. అలాగే, ఆయన తన కెరీర్‌ను టెలివిజన్ ద్వారా ప్రారంభించారు. ఆయన టెలివిజన్ రంగంలోనూ చాలా పాపులర్. ముకుల్ దేవ్ మరణంతో సినీ, టీవీ వర్గాల్లో విషాదం నెలకొంది. ముకుల్ దేవ్ మరణంపై విందు దారా సింగ్ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల మరణంతర్వాత ఆయన డిప్రెషన్‌లోకి వెళ్లాడని, ఇంటి నుంచి బయటకు రాలేదని, ఎవరినీ కలవలేదని చెప్పారు. గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నట్లు వివరించారు.

## హార్వర్డ్‌పై ట్రంప్ నిర్ణయంతో బెల్జియం యూత్ క్వీన్‌కు కష్టాలు



**బ్రసెల్స్, మే 24:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హార్వర్డ్ యూనివర్సిటీలో చదువుతున్న విదేశీ విద్యార్థులపై ఫోకస్ పెట్టిన విషయం తెలిసిందే. ఫస్ట్ ఇయర్ పరీక్షలు పూర్తి చేసుకుని ప్రస్తుతం సమ్మర్ సెలవుల్లో ఉన్న ఆ వర్సిటీ విదేశీ విద్యార్థులకు ఇప్పుడు టెన్షన్ పట్టుకున్నది. విదేశీ విద్యార్థులకు హార్వర్డ్‌లో ఎంట్రీపై నిషేధం విధిస్తూ ట్రంప్ ఇచ్చిన ఆదేశాలు బెల్జియం యువరాణి ఎలిజబెత్‌కు కూడా కష్టాలు తెచ్చిపెట్టాయి. రెండో సారి దేశాధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత హార్వర్డ్ వర్సిటీలో జరుగుతున్న ఆందోళనలపై ట్రంప్ ఆగ్ర హంగా ఉన్నా రు. విద్యార్థుల్ని అదుపులో పెట్టలేకపోతున్న వర్సిటీకి ఫెడరల్ ఫండ్ లో కోతలు కూడా విధించారు. ట్రంప్ సర్కా రుకు, హార్వర్డ్ వర్సిటీకి సంబంధాలు సరిగా లేకుండా పోయాయి. తాజాగా విదేశీ విద్యార్థుల నమోదు అంశంలో ట్రంప్ ఇచ్చిన కొత్త ఆదేశాలు మరింత సమస్యాత్మకంగా మారాయి. ఆ వర్సి టీలో చదువుతున్న విదేశీయుల్లో భారతీయులు, చైనీయులు,ఇతర సంపన్నుల పిల్లలు కూడా ఉన్నారు. వర్సిటీ డేటా ప్రకారం సుమారు 6800 మంది విదేశీస్టూడెంట్స్ చదువుతున్నట్లు హార్వర్డ్ పేర్కొన్నది. దీంట్లో అయిదో వంత విద్యార్థులు చైనీయులు ఉన్నట్లు తెలుస్తోంది. ఆ ప్రతిష్ఠాత్మక వర్సిటీలో విద్యను అభ్యసిస్తున్న వారిలో బెల్జియం యువరాణి కూడా ఉన్నారు. 23 ఏళ్ల ప్రిన్సెస్ ఎలిసబెత్ ఇప్పుడు ఆ వర్సిటీలో ఫస్ట్ ఇయర్ పూర్తి చేసింది. ఇతర కాలేజీలకు తమ స్టేటస్‌ను మార్చుకోవాలని ట్రంప్ సర్కారు హార్వర్డ్ విద్యార్థులపై వత్తిడి తెస్తున్న నేపథ్యంలో యువరాణి భవిష్యత్తు కూడా గందరగోళంగా మారింది.అయితే అమెరికా ప్రభుత్వ నిర్ణయంపై త్వరలో తమ వివరణ ప్రకటించనున్నట్లు బెల్జియం రాయల్ ప్యాలెస్ ప్రతినిధి లోర్ వాండోర్న్ తెలిపారు. ప్రిన్సెస్ ఎలిసబెత్ హార్వర్డ్ వర్సిటీలో పబ్లిక్ పాలసీ చదువుతున్నారు. అది రెండేళ్ల మాస్టర్స్ డిగ్రీకోర్సు. పబ్లిక్ సర్వీస్‌లో విజయవంతమైన కెరీర్‌ను కొనసాగించేందుకు ఆ సబ్జెక్టును నేర్పుతారు. ఆ కోర్సు వల్ల విద్యార్థుల ఆలోచన సరళిని, నైపుణ్యాన్ని పెంచనున్నారు. బెల్జియం చక్రవర్తి ఫిలిప్, రాణి మాథిల్డే పెద్ద కుమార్తె ప్రిన్సెస్‌ఎలిసబెత్. అయితే హార్వర్డ్‌లో చేరడానికి ముందు ఆమె బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో హిస్టరీ,పాలిటిక్స్‌లో డిగ్రీచదివారు. విదేశీ విద్యార్థులఎన్‌రోల్మెంట్‌పై ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని హార్వర్డ్ వర్సిటీ వ్యతిరేకిస్తున్నది. ఆ అక్రమ నిర్ణయం వల్ల వేల మంది విద్యార్థుల భవిష్యత్తు ఇబ్బందుల్లో పడినట్లు వర్సిటీ పేర్కొన్నది.



### సరిహద్దుల్లోని పూంచ్ జిల్లాలో

## పర్యటించిన రాహుల్‌గాంధీ

**పూంచ్, మే 24:** పాకిస్తాన్ రేంజర్లు, ఉగ్రదాడులకు పూర్తిస్థాయిలో ధ్వంసం అయిన సరిహద్దు గ్రామాల్లో ఎఐసిసి నాయకుడు రాయ్‌బరేలీ ఎంపి రాహుల్‌గాంధీ పర్యటించారు. ఇదొక పెద్ద విషాదమని సరిహద్దు గ్రామాలప్రజల దీనగాథలను దేశవ్యాప్తంగా ప్రజలకు తెలియజెప్పాల్సిన అసరం ఉందన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ పూంచ్ పట్టణంలో పర్యటించి ఒక గంటసేపు అక్కడిప్రజలతో ముచ్చటించారు. ఈనెల ఏడునుంచి పదితేదీల మధ్యలో బాంబులు, తుపాకి బుల్లెట్లకు దెబ్బతిన్న ఇళ్ల యజమానులతోనే ఆయన ఎక్కువసేపు గడిపారు. ఎంతోమంది ప్రజలు తమ ప్రాణాలు కోల్పోయారు. పాకిస్తాన్ ఆర్మీ పౌర నివాసాలనే ఎక్కువ టార్గెట్‌చేసుకుందని ఆయన విమర్శించారు. జాతీయ స్థాయిలో అంటే పార్లమెంటులో కూడా తమకు జరిగిన నష్టం, సమస్యలను ప్రస్తావించాలని తనను కోరినట్లు రాహుల్ చెప్పారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబసభ్యులు, దెబ్బతిన్న ఇళ్లు, చెల్లాచెదురయిన విలువైనవస్తువుల దృశ్యాలు తనను కలిచివేసాయన్నారు. నాలుగురోజుల యుద్ధం తరహా దాడిలో ఎంతో ధైర్యసాహసాలు చూపించిన ఈగ్రామాల ప్రజలకు ఆయనసెల్యూట్‌చేస్తున్నానన్నారు. బాధిత కుటుంబాలతరపున నిలబడతామని, వారి పునరుజ్జీవనానికి పూర్తి అండగా నిలుస్తామని అన్నారు. జమ్మూకాశ్మీర్‌యూనిట్ అధ్యక్షుడు తరిఖ్ హమీద్ కర్రా, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జిఎ మీర్‌ఇతర సీనియర్లు వెంటరాగా ఆయన పూంచ్‌గ్రామాలనుపరనయటించారు. గతనెల 25వ తేదీ కూడా గాంధీ శ్రీనగర్‌లో పర్యటించారు. జమ్మూకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్‌సిన్హాను కూడా కలిసి చర్చలుజరిపారు. అలాగే ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా ఇతర కీలక ప్రభుత్వ మంత్రులను కూడా కలిసి చర్చలుజరిపారు. జమ్మూఎయిర్‌పోర్టునుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో సరిహద్దుగ్రామం అయిన పూంచ్‌ప్రాంతానికి వెళ్లారు. ఆపరేషన్ సింధూర్ దాడులతో పాకిస్తాన్ సరిహద్దు గ్రామాల ప్రజల ఇళ్లు, ప్రార్థనా మందిరాలే లక్ష్యంగా దాడులు జరిపిన సంగతి తెలిసిందే. పాకిస్తాన్ జరిపిన కాల్పులవల్ల సరిహద్దుల్లో 28 మంది చనిపోయారు. ఒక్క పూంచ్ జిల్లాలోనే 13 మంది చనిపోయారని, 70 మందికిపైగా తీవ్రగాయాల పాలయ్యారని రాహుల్ చెప్పారు. వాస్తవాధీన రేఖ, సరిహద్దుగ్రామాలవెంబడి ఉన్న అనేక కుటుంబాలు ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. మూడురోజుల దాడుల తర్వాత పాకిస్తాన్ కాల్పుల విరమణకు ముందుకురావడంతో ప్రస్తుతం వాతావరణం స్తబ్ధుగా ఉంది. పిసిసి చీఫ్ కర్రా మాట్లాడుతూ గురుద్వారా, దేవాలయం, మదర్సా, క్రైస్తవ మిషనరీ స్కూలును కూడా రాహుల్ సందర్శించారని బాధిత కుటుంబాలు, ఇతర పౌర సంఘాలప్రతినిధులతో మాట్లాడినట్లు తెలిపారు. దెబ్బతిన్న సరిహద్దుగ్రామాల్లో ఆపరేషన్ సింధూర్ తర్వాత పర్యటించిన మొదటి జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ. గతనెలలో పర్యటనలోనే రాహుల్ మాట్లాడుతూ ఉగ్రదాడులతో దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారని, ఇలాంటి విపత్కర తరుణంలోనే దేశం మొత్తం సమైక్యంగా నిలిచి ఉగ్రవాద నిర్మూలనకు అండగా నిలుస్తుదని ప్రకటించిన సంగతి తెలిసిందే.

## రాహుల్‌పై జార్ఖండ్ కోర్టు నాన్‌బెయిలబుల్ వారంట్ జారీ

**రాంచి, మే 24:** లోక్‌సభలో ప్రతిపక్షనేత రాయ్‌బరేలి ఎంపి రాహుల్‌గాంధీకి జార్ఖండ్‌లోని చాయ్‌బాసా ఎంపి ఎమ్మెల్యే కోర్టు నాన్‌బెయిలబుల్ వారంట్ జారీచేసింది. 2018లో నమోదయిన పరువునష్టం కేసుకు సంబంధించి ఈ వారంట్లు జారీచేసింది. వచ్చేనెల 26వ తేదీ జరిగే వాయిదాకు విధిగా రాహుల్ హాజరుకావాలని ఆదేశించింది. రాహుల్‌గాంధీ లీగల్‌టీమ్ దాఖలుచేసిన హాజరు మినహాయింపు పిటిషన్‌ను జడ్జి తిరస్కరించారు. 2018 కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాల్లో రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై ఈ పిటిషన్ దాఖలయింది. బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాగురించి మాట్లాడుతూ హత్యచేసిన అభియోగాలు ఎదుర్కొంటున్న అందరూ కూడా బిజెపి అధ్యక్షుడు అవుతున్నారని తీవ్రస్థాయిలో చేసారు. దీనితో బిజెపి నాయకుడు ప్రతాప్ కటియార్ పరువునష్టం పిటిషన్‌ను దాఖలుచేసారు. 2018 జులై 9న చాయ్‌బాసా చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో దాఖలయింది. ఆ తర్వాత జార్ఖండ్‌హైకోర్టు ఈ కేసును ఎంపిఎమ్మెల్యే కోర్టుకు బదలాయించింది. ఆటుపిమ్మట అక్కడి నుంచి చాయ్‌బాసా ఎంపి ఎమ్మెల్యే కోర్టుకు బదిలీచేసారు. కేసు విచారణకు అంగీకరించిన తర్వాత మేజిస్ట్రేట్ రాహుల్ గాంధీకి సమన్లు జారీచేసారు. అనేకసార్లు సమన్లు జారీ అయినా రాహుల్ కోర్టుకు రాలేదు. దీనితో నాన్‌బెయిలబుల్ వారంట్ జారీచేసారు. జార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించిన రాహుల్ లీగల్ టీమ్ వారంట్‌పై స్టే కోరింది. అయితే గత ఏడాది మార్చిలోనే 20వ తేదీ హైకోర్టు పిటిషన్ డిస్మిస్‌చేసింది. అలాగే చాయ్‌బాసాకోర్టుకూడా తీవ్రంగా వ్యతిరేకించింది. ఇపుడు ఎంపి ఎమ్మెల్యేలకేసుల విచారణ ప్రత్యేక కోర్టుకూడా కఠిన వైఖరిని అవలంభించి రాహుల్ జూన్ 26వ తేదీ విచారణకు హాజరుకావాలని నాన్‌బెయిలబుల్ వారంట్లు జారీచేసింది.




### జర్మనీలో రైల్వే ప్లాట్‌ఫామ్‌పై నిలుచున్న

## 12 మందికి కత్తిపోట్లు: ముగ్గురి పరిస్థితి విషమం

**హామ్‌బర్గ్, మే 24:** జర్మనీలోని హామ్‌బర్గ్ సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో దారుణం చోటుచేసుకుంది. ప్లాట్‌పాంపై నిలుచున్న వారిపై ఓ దుండగుడు విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో 12 మందికి గాయాలయ్యాయి. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మరికొంత మందికి స్వల్పంగా గాయాలైనట్లు స్థానిక మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఇది పెద్ద ఘటన అని జర్మనీ పోలీసులు ప్రకటించారు. అక్కడి స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. తొలుత ఎనిమిది మందికి గాయాలైనట్లు వార్తలు వచ్చాయి. తర్వాత ఆ సంఖ్య 12కు పెరిగినట్లు స్థానిక మీడియా వర్గాలు తెలిపాయి. పోలీసులు నిందితుడిని అరెస్టుచేశారు. దాడికి గల కారణాలు తెలియరాలేదు. దాడి ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు హామ్‌బర్గ్ పోలీసులు ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ఒక్కరే ఈ దాడిలో పాల్గొన్నట్లు సమాచారం.



### మయన్మార్ తీరంలో మునిగిన రెండు నౌకలు..

## 427 మంది రోహింగ్యాలు మృతి?

**నేపయిడా, మే 24:** మయన్మార్ తీరంలో రెండు ఓడలు మునిగిపోవడంతో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. 427 మంది రోహింగ్యాలు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. మే 9, 10వ తేదీల్లో ఈ ఘోర ప్రమాదాలు జరిగినట్లు ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. ఈ విషయం నిర్ధారణ అయితే ‘సముద్రంలో చోటుచేసుకున్న అత్యంత విషాదకర ఘటన’గా ఇది మిగిలిపోతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఓడల ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తున్నట్లు ఐరాస అనుబంధ శరణార్థి విభాగం అంచనా వేస్తోంది. తొలి ప్రమాదం మే 9న చోటుచేసుకోగా 267 మందిలో 66 మంది బతికి బయటపడినట్లు ప్రాథమికంగా వెల్లడించింది. మే 10న రెండో నౌక ప్రమాదానికి గురికాగా 21 మంది బతికి బయటపడినట్లు సమాచారం. వాస్తవానికి రోహింగ్యాలు.. మయన్మార్‌లో నివసిస్తుంటారు. కానీ, సైన్యం మారణహోమం నుంచి తప్పించుకునేందుకుగానూ లక్షలాది రోహింగ్యాలు 2017లో బంగ్లాదేశ్‌కు తరలిపోయారు. మయన్మార్‌లో గతేడాది సైనిక తిరుగుబాటు తర్వాత వారి వలసలు మరింత పెరిగాయి. దీంతో దక్షిణ బంగ్లాదేశ్‌లోని శరణార్థి శిబిరాలు కిక్కిరిసిపోయాయి. అక్కడి పరిస్థితులూ క్షీణించడంతో వారంతా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు వలసబాట పడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదకర సముద్ర ప్రయాణాలను ఎంచుకుంటున్నారు.

## మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాతృమూర్తి కీ.శే.కొట్టగుల్లి

# గంగాభవానీకి పలువురు ఘన నివాళులు



**పాడేరు,మే24, ప్రభాతవార్త:**

పాడేరు మాజీ ఎమ్మెల్యే కీ .శే.కొట్టగుల్లి చిట్టినాయుడు సతీమణి,పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాతృమూర్తి కీ.శే.కొట్టగుల్లి గంగాభవాని ఇటీవల స్వర్గస్తులయ్యారు.ఈ సందర్భంగా శనివారం పాడేరు కాఫీ హౌస్ లో కీ.శే.కొట్టగుల్లి గంగాభవాని కుమార్తె మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి,భర్త డా.తమర్భ నరసింగరావు,సోదరుడు ఈశ్వరప్రసాద్ కుటుంబ సభ్యులు ఆద్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు.ఈ సంస్మరణ సభకు ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర,ఎమ్మెల్సీ డా.కుంభ రవిబాబు,అరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి,మాజీ ఎమ్మెల్యేలు నాగులపల్లి ధనలక్ష్మి,శోభా హైమావతి,మాజీ మంత్రి మణికుమారి,మాజీ చైర్పర్సన్ కాంతమ్మ,మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, ఏపి టూరిజం శాఖ డైరెక్టర్ కిల్లు రమేష్ నాయుడు, పోలుపర్తి గోవిందరావు, ప్రిన్సిపాల్ కొట్టగుల్లి సింహాచలం నాయుడు, వైసిపి నాయకులు చెట్టి వినయ్, పాడేరు నియోజకవర్గంలో ఉన్న వైసిపి జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్లు, టిడిపి నాయకులు పసర్ల గోపీ,బాకురు వెంకట రమణరాజు, ఎంపీటీసీలు, టిడిపి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వివిధ పార్టీల శ్రేణులు హాజరై కీ.శేషులు కొట్టగుల్లి గంగాభవాని చిత్రపటం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి,డా.నరసింగరావు,కుమారుడు ఈశ్వర ప్రసాద్ కుటుంబసభ్యులను ప్రగాఢ సంతాప సానుభూతి తెలియజేశారు.

# ఊపిరి కోసం ఓ శిశువు సమరం

**పుట్టుకతోనే ఊపిరితిత్తుల్లో తీవ్ర సమస్య**

**9 రోజులు హై ఫ్రీక్వెన్సీ వెంటిలేషన్**

**8 రోజులు నైట్రిక్ ఆక్సైడ్ చికిత్స**

**అసాధారణ పోరాటానికి వేదికగా కిమ్స్ కడల్స్ ఆస్పత్రి**

**ఇన్ని రోజులు శిశువులకు చికిత్స చేయడం అరుదు**

**విశాఖపట్నం, మే 24, 2025: ప్రభాతవార్త**



ఊపిరితిత్తుల్లో ఒత్తిడి పెరిగిపోయి.. వాటి నుంచి రక్తంలోకి ఆక్సిజన్ సరఫరా కాక తీవ్ర ప్రాణాపాయం ఎదుర్కొంటున్న శిశువు.. 18 రోజుల పాటు విశాఖపట్నంలోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రిలో అత్యాధునిక చికిత్స పొంది విజయవంతంగా డిశ్చార్జి అయ్యాడు. రక్తంలోకి ఆక్సిజన్ సరఫరా కానప్పుడు శరీరంలోని కీలకమైన అవయవాలకు రక్తసరఫరా సరిగా లేక అవన్నీ విఫలమవుతాయి. సాధారణంగా ఇలాంటి పరిస్థితులు ఏర్పడిన శిశువులు మూడు నాలుగు రోజుల్లో కోలుకుంటారు, లేదా పరిస్థితి నయం కాక మరణిస్తారు. కానీ, ఈ శిశువు మాత్రం అసాధారణ రీతిలో ఊపిరి కోసం ఒక రకంగా చెప్పాలంటే పెద్ద యుద్ధమే చేశాడు. ఇందుకు సంబంధించిన వివరాలను విశాఖపట్నం కిమ్స్ కడల్స్ ఆస్పత్రికి చెందిన చీఫ్ నియోనాటాలజిస్ట్, నియోనాటాలజీ విభాగాధిపతి డాక్టర్ నిఖిల్ తెన్నేటి తెలిపారు. "అనకాపల్లి ప్రాంతానికి చెందిన 28 ఏళ్ల మహిళ తొలిసారి గర్భం దాల్చారు. గర్భవతిగా ఉన్నప్పుడే ఆమెకు మధుమేహం (జెస్టేషనల్ డయాబెటిస్), అధిక రక్తపోటు లాంటి సమస్యలు వచ్చాయి. అయినా ఆమె ధైర్యంగా వాటిని ఎదుర్కొన్నారు. సాధారణంగా 40 వారాల తర్వాత పుట్టాల్సిన శిశువు, 36 వారాలకే పుట్టాడు. అయితే, పుట్టుకతోనే అతడికి తీవ్రంగా శ్వాస సమస్య మొదలైంది. ఊపిరి అందక ఇబ్బంది పడుతుండడంతో పుట్టిన 12 గంటల తర్వాత కిమ్స్ కడల్స్ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ అసలు సమరం మొదలైంది. బాబుకు ఊపిరితిత్తుల్లో ఒత్తిడి పెరిగిపోయిందని, అందువల్ల సమస్య ఏర్పడిందని గుర్తించారు. మామూలు వెంటిలేటర్ ద్వారా అయితే నిమిషానికి 40-60 సార్లు ఆక్సిజన్ అందిస్తారు. కానీ, అది సరిపోకపోవడంతో ఈ శిశువుకు హై ఫ్రీక్వెన్సీ ఆసిలేటరీ వెంటిలేషన్ (హెచ్ఎఫ్ఓవీ) ఇచ్చారు. అంటే అది నిమిషానికి దాదాపు 300-900 సార్లు ఆక్సిజన్ పంపుతుంది. దాంతోపాటు.. ఊపిరితిత్తుల్లో ఒత్తిడి తగ్గించడానికి నైట్రిక్ ఆక్సైడ్ కూడా ఇవ్వాల్సి వచ్చింది. సాధారణంగా ఇలాంటి చికిత్స చేసినప్పుడు శిశువులు మహా అయితే మూడు లేదా నాలుగు రోజులకు తట్టుకుంటారు. ఆ లోపు కోలుకుంటారు, లేదా సమస్య తీవ్రంగా ఉంటే మరణిస్తారు. కానీ ఈ శిశువు మాత్రం 9 రోజులు హెచ్ఎఫ్ఓవీని భరించాడు. ఇంతకాలం పాటు చికిత్స చేయడం, ఆ చికిత్సను అప్పుడే పుట్టిన శిశువులు తట్టుకోవడం అనేది చాలా అరుదు. మొత్తం 18 రోజుల పాటు ఆస్పత్రిలో పలురకాల చికిత్సలు చేశారు. మూత్రం తయారుకావడానికి, గుండె పనితీరు మెరుగుపడేందుకు.. ఇలా అన్ని అవయవాలు బాగా పనిచేయడానికి అవసరమైన మందులన్నీ ఇచ్చారు. ఈ చికిత్సలో ఆస్పత్రి క్లినికల్ డైరెక్టర్, పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ సంతోష్ కుమార్ కూడా కీలకంగా వ్యవహరించారు. నిజమైన బలం అంటే ఏంటో ఈ శిశువును చూసిన తర్వాత తెలిసింది. ఎందుకంటే, అతడు ఊపిరి తీసుకోవడానికి దాదాపుగా ఒక యుద్ధమే చేశాడు. ప్రతి అడుగులోనూ విజయం సాధించాడు. ఇలాంటి విజయగాధలు చూసినప్పుడే ఇంకా ఏం చేయగలమన్నది తెలుస్తుంది. 18 రోజుల తర్వాత బోసినవ్వులు నవ్వుతూ హాయిగా తన తల్లి ఒడిలోకి చేరిన బాబును డిశ్చార్జి చేశాం" అని డాక్టర్ నిఖిల్ తెన్నేటి వివరించారు.

# యోగాతో ఆరోగ్యం

(7వ పేజీ నుంచి తరువాయి)

వేస్తున్నామని, అందరి లో ఆరోగ్య భద్రత పెరిగిందని, యోగాంధ్ర లో యోగాసనాలు కార్యక్రమం అందరికి ఆరోగ్యాన్ని ఇస్తుందని తెలిపారు. ప్రపంచ యోగా దినోత్సవం విశాఖ లో నిర్వహించడం, ప్రధాని మోదీ పాల్గొంటున్న ఈ కార్యక్రమం లో ప్రజలందరూ భాగస్వామి అవ్వాలని కోరారు. రాష్ట్ర హోం శాఖామాత్యులు వంగలపూడి అనిత మాట్లాడుతూ 11 వ యోగ వేడుకలు మన విశాఖలో నిర్వహించడం మన అదృష్టమని, యోగా అంటేనే భారతీయ వ్యవస్థలో సాంప్రదాయంగా వస్తున్న ఒక వ్యవస్థ అన్నారు. యోగా అంటే ఆసనాలు చేయడం కాకుండా,యోగా మన రోజువారి కార్యక్రమంలో ఒక భాగం అవ్వాలని కోరారు. నరేంద్ర మోదీ, చంద్రబాబు. అంత ఎనర్జిటిక్ గా పని చేస్తున్నారు అంటే యోగానే కారణమని, రోజుకి ఒక గంట సమయం కేటాయిస్తే, రోజంతా ఎనర్జిటిక్ గా ఉంటామని, రాబోవు జనరేషన్ కి యోగాను అందించడంలో మనం కీలక పాత్ర పోషించాలన్నారు. జూన్ నెల 21 న జరగబోయే యోగాడేకు ప్రధాన మంత్రి మోదీ హాజరు కాబోతున్నారు తెలిపారు.

**అందరినీ భాగస్వామ్యం చేస్తూ నెల రోజుల పాటు యోగా వేడుకలు :జిల్లా కలెక్టర్**

వేడుకను రికార్డు స్థాయిలో నిర్వహించేందుకు అందరినీ సిద్ధం చేస్తున్నామని, దీనిలో భాగంగా టీఓటీలకు, వారి ద్వారా మిగిలిన వారికి యోగా శిక్షణలు అందించేందుకు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా ద్వారా సర్టిఫికేట్లు అందజేసేందుకు, తదుపరి ప్రక్రియలు నిర్వహించేందుకు ప్రణాళికలు తయారు చేశామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ప్రజలంతా ఈ నెల రోజులు జరిగే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని, అంతర్జాతీయ యోగా వేడుకలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అందరూ యోగా ఆవశ్యకతను తెలుసుకోవాలన్నారు. ప్రజలు, వివిధ సంస్థలు, మీడియా సహకారంతో రికార్డును సొంతం చేసుకోగలమని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనల మేరకు యోగా మంత్ లో భాగంగా శిక్షణలు, ప్రత్యేక యోగాలు, జల యోగా, అంధులకు నిర్వహించే యోగా వంటి ప్రక్రియలు నిర్వహిస్తామని, స్వర్ణాంధ్ర లక్ష్యాల్లో భాగంగా హెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధనకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

**చివరిగా బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు యోగాలో పాల్గొన్న సభ్యులతో ధ్యానం చేయించారు.**

యోగాంధ్రా వేడుకల కార్యక్రమంలో ఆయిల్ సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, విశాఖ డి ఐ జీ గోపీనాథ్ జెట్టి, డీసీపీలు అజిత్ వేజెండ్ల, మేరీ ప్రశాంతి. నేవీ ఉన్నతాధికారులు, పోలీస్ శాఖ అధికారులు, ఇతర జిల్లా అధికారులు యోగ టీచర్లు, విద్యార్థులు , నగర ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వామ్యమయ్యారు.

# మాస్టర్ మైండ్ సైబర్ నేరస్థులు.. దొరికారు

(7వ పేజీ నుంచి తరువాయి)

మరణించాడు . తదుపరి బాధితుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహారాణి పేట పోలీసులు కేసు రిజిస్టర్ చేసి దర్యాప్తును ప్రారంభించారు. తదుపరి లోన్ యాప్ వేధింపుల వల్ల చనిపోయారని గ్రహించి సీపీ శంఖబ్రత ఇన్వెస్టిగేషన్ బాధ్యతల్ని సైబర్ క్రైమ్ పోలీసులకు అపగించారు.. ఈ మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు చనిపోయిన మొబైల్ సేకరించి, అందులో వివిధ రకాల వర్చుయల్ నెంబర్స్ నుంచి వాట్సాప్ ద్వారా బెదిరింపు మెసేజ్లు చనిపోయిన వ్యక్తికి వచ్చేయని గమనించారు. అలాగే అతను వివిధ రకాల అనుమతి లేని లోన్ ఆప్స్ నుంచి లోన్ తీసుకోవడం కూడా జరిగిందని, ఆ లోన్ యాప్ "క్యాష్ మాక్స్" అని గుర్తించారు..ఆ యాప్ కోసం ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ సోషల్ మీడియా లా ఎన్ఫోర్స్మెంట్ ద్వారా ఐ పి లను కనుగొనగ అవి బీహార్, రాజస్థాన్, ఢిల్లీ, కేరళ రాష్ట్రాలు వచ్చినట్టుగా గుర్తించారు.. వాట్సప్ బెదిరింపు మెసేజ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలుసుకోగ అవి పాకిస్తాన్ నుంచి ఆపరేట్ అవుతున్నట్టు తేల్చారు... తదుపరి చనిపోయిన వ్యక్తి బ్యాంక్ స్టేట్మెంట్ ఆధారంగా, చనిపోయిన వ్యక్తి లోన్ తీసుకున్న డబ్బులు అస్సాం ,గుజరాత్ బ్యాంకు అకౌంట్స్ నుంచి పడ్డాయి అని గుర్తించారు., అలానే బాధితుని భార్య వేసిన డబ్బులు అస్సాం కు చెందిన బ్యాంక్ అకౌంట్ కు చేరాయి అని గుర్తించారు. వాటి బ్యాంక్ స్టేట్మెంట్లు తీసుకొని అనాలసిస్ చెయ్యగా ఆ ఎకౌంట్లో ద్వారా ఇండియాలోని మొత్తం అని రాష్ట్రాలలో సుమారు తొమ్మిది వేలమంది బాధితుల వరకు డబ్బులు వెళ్లినట్టు గుర్తించారు.తదుపరి దర్యాప్తులో భాగంగా ఆ యొక్క అకౌంట్లకు డబ్బులు లేదా ఫండింగ్ ఎక్కడి నుంచి వస్తున్నాయి అని బ్యాంక్ స్టేట్మెంట్లను విశ్లేషించగా ఒక 61 అకౌంట్ల నుంచి ఆ ఎకౌంట్లో డబ్బులు డిపాజిట్ అవుతున్నాయని గమనించి . ఈ కేసు దర్యాప్తు లో బాగముగా ఈ మ్యూల్ బ్యాంక్ అకౌంట్ హోల్డర్స్ , అకౌంట్ సప్లయర్స్, ఆపరేట్ చేస్తూ చైనీస్ ఫ్రాస్టర్స్ తో టెలిగ్రామ్ ద్వారా చాట్ చేస్తూ ఈ ఇన్స్టంట్ లోన్ ఆప్ ఫ్రాడ్ చేయడానికి సహకరిస్తున్న మొత్తం 16 మంది ముద్దాయిలను ఇదివరకే అరెస్ట్ చేశారు.తదుపరి దర్యాప్తు లో భాగముగా ఈ కేసు లో అరెస్ట్ అయి జుడిసియల్ కస్టడీ లో ఉన్న మాకన భారత్ ఇచ్చిన సమాచారం మేరకు సోషల్ మీడియా వెబ్సైట్స్ , ఐపిడిఆర్, సిడిఆర్ మొదలగు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మరో కీలకమైన ముద్దాయి మోహిత్ విశాల్ , అతని కి అకౌంట్స్ సప్లై చేస్తున్న తేజ శంకర్ ని అరెస్ట్ చేశారు..

# ఉలిక్కిపడ్డ విశాఖి

**విశాఖ ఎల్టిటి ఎక్స్ప్రెస్ కు బాంబు బెదిరింపు**

**డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్, సివిల్,జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీస్ బృందాల తనిఖీలు**

**ఎలాంటి బాంబు ఆనవాళ్లు లేనట్టు గుర్తింపు**

**ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు**

(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)



విశాఖ ఎల్టీటీ ఎక్స్ప్రెస్ లో బాంబు పెట్టినట్లుగా కాల్ రావడం తీవ్ర కలకలం నెలకొంది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, బాంబ్ స్క్వాడ్ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. చివరకు ఎలాంటి బాంబు ఆనవాళ్లు లేకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ముంబై నుంచి విశాఖ వచ్చే ఎల్టీటీ ఎక్స్ప్రెస్లో బాంబు ఉన్నట్లు ఆగంతకుడి నుంచి ఫోన్ కాల్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎల్టీటీ చివరి స్టాప్ విశాఖ రైల్వే స్టేషన్ కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. రైలు మొత్తాన్ని కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్ 2 బోగీలో అనుమానిత బ్యాగ్ను గుర్తించారు. ఆ బ్యాగ్ను కూడా సెర్చ్ చేయగా బట్టలు మాత్రమే కనిపించాయి. దీంతో ఎలాంటి బాంబు లేదని అధికారులు నిర్ధారించారు. ఈ ఆపరేషన్లో డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్, సివిల్ పోలీసులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ బృందాలు కలిసి ట్రైన్ను మొత్తాన్ని పరిశీలించారు. ప్రయాణికుల బ్యాగులను కూడా తనిఖీ చేశారు. చివరకు బాంబు లేదని నిర్ధారణకు వచ్చారు. చాలా రష్గా ఉన్న ట్రెయిన్లో ఇలాంటి కాల్ రావడంతో భయాందోళనకు గురయ్యారు. అయితే బ్యాగును మరిచిపోయిన వ్యక్తి యూపీకి చెందిన శ్రీరామ్గా గుర్తించారు. అలాగే ఫోన్ కాల్ ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై పోలీసులు దృష్టిసారించారు.

## జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన స్పీకర్ అయ్యన్న

**అనకాపల్లి, మే 24, ప్రభాత వార్త :**

అనకాపల్లి కలెక్టరేట్ లో "కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలు" అంశాలపై స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ 20 సూత్రాల అమలు కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన పెంచేలా చర్యలు తీసుకోవాలని, సమీక్షల్లో తక్కువ అంశాలపైనా క్షుణ్ణంగా చర్చ జరగాలని అన్నారు. ప్రజలు పథకాలను సద్వినియోగం చేసుకున్నప్పుడే అవి విజయవంతమవుతాయని వివరించారు. ఉపాధి హామీ పథకంలో ఇప్పటికే చేసిన పనులను పునరావృతం చేయకుండా కొత్త పనులు చేపట్టాలని సూచించారు. చెరువులు తవ్వడమే కాక, తూముల నుండి నీరు బయటకు పోకుండా కాలువలలోనూ పనులు చేయాలని తెలిపారు. కాలువలను లైనింగ్ చేయడం ద్వారా నీటి వృథా నివారించవచ్చునన్నారు. గ్రామాలలో 80 శాతం సిమెంట్ రోడ్లు పూర్తయినట్టు, మిగిలిన 20 శాతం రోడ్లు పూర్తయ్యాక సాగునీటి కాలువల లైనింగ్ పనులు చేపట్టాలని సూచించారు. జల జీవన్ మిషన్ పనుల నిమిత్తం తవ్విన రోడ్లను పునరుద్ధరించాలని, జాతీయ రహదారులు మరియు రైల్వే ట్రాక్ల క్రింద నీటి పైపుల కొరకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఇరవై సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంకల్పించిన "వికసిత భారత్ 2047", ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యంగా పెట్టుకున్న "స్వర్ణాంధ్ర 2047"ను సాధించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న సవాళ్లను అధిగమించి "వికసిత అనకాపల్లి జిల్లా"గా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. ఉపాధి హామీ పథకంలో పనిదినాల కల్పన, మెటీరియల్ కాంపోనెంట్లో లక్ష్యాన్ని మించి చేసిన పనులకు అధికార యంత్రాంగాన్ని అభినందించారు. ఈ సమావేశంలో అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, కొప్పులవెలమ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్, ఏపీ గవర సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, కొప్పులవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ ఈర్లె శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఇండోర్ గేమ్స్ సురక్షితం



**గాజువాక,మే 24,ప్రభాతవార్త:**

ఎండ,వాన మొదలైన వాతావరణ సమస్యల నుంచి, దెబ్బలు, గాయాలు మొదలైన ప్రమాదాల నుంచి బాలలను రక్షించాలంటే ఇండోర్ గేమ్స్ ఎంతో ఉపయోగపడతాయని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న బాలల వేసవి శిక్షణా శిబిరంలో శనివారం ఇండోర్ గేమ్స్ పై ఆమె ప్రసంగిస్తూ- ఇండోర్ గేమ్స్ వల్ల ఉల్లాసం, ఉత్సాహం వస్తాయని, బాలల మధ్య ఆత్మీయ బంధాలు బలపడతాయని, సహనం, సర్దుబాటు, క్రమశిక్షణ మొదలైన విలువలు పెరుగుతాయని అన్నారు. అనంతరం పలు ఆటలను నిర్వహించారు. అనంతరం పర్సులు, కాగితపు పువ్వుల తయారీలో జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయా దేవి పర్యవేక్షణలో చిన్నారులకు శిక్షణ కొనసాగింది. అంతకుముందు గ్రంథాలయాధికారి వి. అజయ్ కుమార్ బాలలచే కథల పుస్తకాలు చదివించారు. మొత్తం కార్యక్రమాలను గ్రంథాలయాధికారి, జాతీయ సేవా పథకం వాలంటీర్లు సునీత, జ్యోతిర్మయి సమన్వయం చేశారు.

## విశాఖ లో సేంద్రియ మామిడి పండ్ల మేళా ప్రారంభం

### అరుదైన మామిడి పండ్లతో అలరించిన మేళా

(7వ పేజీ నుంచి తరువాయి)

హైదర్ సాయిబు, జహంగీర్, పెద్ద రసాలు, చిన్న రసాలు, బంగినపల్లి, సువర్ణ రేఖ కొబ్బరి అంటు, ముంత మామిడి ,సన్నాకులు, దొండకాయ , ఇమామ్ పసంద్, మియావాకీ తదితర రకాలు అమ్మకానికి అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ మేళా కు వచ్చే వారు గుడ్డ సంచులు, గోగు నార సంచులు తీసుకుని రావాల్సిందిగా కోరుతున్నామన్నారు . రైతు శాస్త్రవేత్త కొంగర రమేష్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని మామిడి రకాల అన్నింటిని ఒకే దగ్గర అందుబాటులో ఉంచటం ఆనందదాయకమని అన్నారు. ప్రాచీన కాలానికి చెందిన పలు రకాలను కాపాడుకోవడానికి ఇటువంటి మేళాలు ఉపయోగపడతాయని సంఘం నేత పీ ఎల్ ఎన్ రాజు అన్నారు. సమావేశంలో సంఘం నేతలు అశోక్, రుషి, నరేంద్ర, అశోక్ కుమార్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు మేళా కొనసాగుతుంది.

## అదృశ్యమైన చిన్నారులను తల్లిదండ్రులకు అప్పజెప్పిన పోలీసులు..

**నిరంతరం పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ, హెూంమంత్రి "అనిత"... ఒక్క రోజులోనే ఆచూకీ తెలుసుకున్న ఎస్ .రాయవరం పోలీసులు అభినందనలు.!**

( నక్కపల్లి, ప్రభాతవార్త)



చిన్న వయస్సు లోనే ఆడంబరాలకు తల్లిదండ్రులు కళ్ళు కప్పి సరదాల కోసం వెళ్లిపోయిన ముగ్గురు చిన్నారులను తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టి వారిని పట్టుకొని తల్లిదండ్రులకు అప్పచెప్పిన సంఘటన మండలంలోని ఎస్. రాయవరం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ ఎల్. రామకృష్ణ సంఘటన వివరాలను స్థానిక విలేకరులకు శనివారం సాయంత్రం తెలియజేశారు. ఎస్. రాయవరం మండలం దార్లపూడి గ్రామానికి చెందిన గని ఘన వెంకట నితిన్ ఏడో తరగతి చదువుతున్నాడని, మే 20న తన పుట్టినరోజు సందర్భంగా అదే గ్రామంలో ఉన్న చంద్రశేఖర్ అనే స్నేహితుడితో కలసి పుట్టినరోజు జరుపుకునేందుకు మండలంలోని చిన్నగుమ్ములూరు చేరుకున్నాడు. అక్కడ మరో ఎనిమిదో తరగతి చదువుతున్న స్నేహితుడైన గుడాల పండు తో కలిసి తల్లిదండ్రులకు తెలియకుండా వారి వద్ద ఉన్న డబ్బులతో నర్సీపట్నం రోడ్ నుంచి రైల్లో విశాఖపట్నం చేరుకున్నారు. అక్కడి నుంచి ఆర్కే బీచ్ కి వెళ్లి కేక్ కట్ చేసి సాయంత్రం వరకు గడిపి అక్కడ నుంచి విశాఖ ఎక్స్ ప్రెస్ లో సికింద్రాబాద్ చేరుకున్నారు. మరుసటి రోజు ఆ ప్రాంతంలో చార్మినార్ మిగతా ప్రాంతాలు వారి వద్ద ఉన్న సెల్ ఫోన్ విక్రయించి సరదాగా గడిపారు. ఎప్పటికీ రాకపోయేసరికి నితిన్ తండ్రి నాగేశ్వరరావు ఎస్. రాయవరం పోలీసులను ఆశ్రయించాడు. హుటాహుటిన సిఐ ఎల్ రామకృష్ణ తన సిబ్బంది కలసి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు నర్సీపట్నం డిఎస్పి పోతిరెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత సూచనల మేరకు వీరి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆ చేపట్టే సమయంలో రైల్వే జి ఆర్ పి సిబ్బందితోపాటు మిగతా క్రైమ్ సిబ్బందిని అనుసంధానం చేసుకొని 24 గంటల్లో వీరిని పట్టుకున్నారు. పట్టుకున్న నితిన్, చంద్రశేఖర్, గుడాల పండులను సొంత గ్రామమైన దార్లపూడి తీసుకొచ్చారు. పూర్తిస్థాయిలో విచారించి మైనర్లు కావడంతో తల్లిదండ్రులకు శనివారం అప్పచెప్పారు. వీరిని పట్టుకున్న విషయంలో శ్రమించిన జి ఆర్ పి పోలీసులను, ఎస్ .రాయవరం సిఐ ఎల్ రామకృష్ణ, ఎస్సై విభీషణరావు, ఏఎస్ఐ లతోపాటు ఇతర సిబ్బందిని జిల్లా ఎస్పీ, హెూం మంత్రి అభినందించారు.

# తెలుగు వీరుడికి గౌరవం

**మేజర్ మల్ల రామ్ గోపాల్ నాయుడుకు కీర్తి చక్ర పురస్కారం దేశవ్యాప్తంగా ప్రశంసలు**

**విశాఖపట్నం , మే 24, ప్రభాత వార్త :**

భారతదేశంలో అరుదైన కీర్తి చక్ర పురస్కారం మేజర్ మల్ల రామ్ గోపాల్ నాయుడుకు శనివారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఢిల్లీలో ప్రధానం చేసారు. రాష్ట్రానికి జాతీయ గుర్తింపు తెచ్చినందుకు మల్ల రామ్ గోపాల్ నాయుడును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు అభినందించారు. రామ్ గోపాల్ నాయుడు సాధించిన విజయానికి వీరు గర్వం వ్యక్తం చేశారు. దేశ సేవకు అంకితమైన యువతకు మద్దతు ఇవ్వడంలో ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించారు. అటువంటి వ్యక్తులకు తాను అన్ని విధాలుగా అండగా నిలుస్తానని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్ మోహన్ నాయుడు కూడా అదే జిల్లాకు చెందిన తోటి స్థానికుడైన రామ్ గోపాల్ నాయుడును వ్యక్తిగతంగా అభినందించారు. జిల్లాలోనే కాకుండా దేశవ్యాప్తంగా యువతకు ఆదర్శంగా నిలిచిన రామ్ గోపాల్ నాయుడు ప్రశంసలు అందుకున్నారు. అనేక మంది ఎంపీలు మరియు కీలక రాష్ట్ర నాయకులు కూడా తమ అభినందనలు తెలిపారు.

**రాష్ట్రపతి చేతుల మీదుగా కీర్తి చక్ర ప్రధానం**

శ్రీకాకుళం జిల్లాలోని సంతబొమ్మాళి మండలం నాగిరిపెంట గ్రామానికి చెందిన మేజర్ మల్లా రామ్ గోపాల్ నాయుడుకు దేశ రాజధానిలో జరిగిన ఒక ఉత్సవ కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రతిష్టాత్మక కీర్తి చక్రను ప్రదానం చేశారు. 2023 అక్టోబర్ 26న జమ్మూ %ు% కాశ్మీర్లో జరిగిన తిరుగుబాటు నిరోధక ఆపరేషన్లో అసాధారణ ధైర్యం మరియు నాయకత్వం వహించినందుకు భారతదేశపు రెండవ అత్యున్నత శాంతి సమయ శౌర్య పురస్కారమైన ఈ అరుదైన గౌరవాన్ని మేజర్ నాయుడుకు ప్రదానం చేశారు. ఆ దురదృష్టకర ఉదయం, ఐదుగురు భారీగా ఆయుధాలు కలిగిన ఉగ్రవాదులు భారత భూభాగంలోకి చొరబడ్డారని నిఘా వర్గాలు తెలిపాయి. సరిగ్గా ఉదయం 10:10 గంటలకు, యూనిట్లోని ఒక సైనికుడికి సమాచారం అందింది. 15 నిమిషాల్లో, మేజర్ నాయుడు తన బృందాన్ని తీసుకుని బయలుదేరారు. తన దళాలను సమన్వయం చేసుకుంటూ వ్యూహాత్మకంగా లక్ష్యాలను చేరుకున్నాడు. క్లోజ్-క్వార్టర్ పోరాటంలో మేజర్ నాయుడు వ్యక్తిగతంగా పాయింట్-బ్లాంక్ రేంజ్లో ఒక ఉగ్రవాదిని నిర్మూలించి, మరొకరిని గాయపరిచాడు. భారీ కాల్పులు జరిగినప్పటికీ, అతను తన సైనికులను సమీకరించి తీవ్రంగా పోరాడాడు, చివరికి తన బృందంతో పాటు ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చాడు. ఆపరేషన్ చివరి క్షణాల్లో ఒక ఉగ్రవాది గ్రెనేడ్ విసిరి గుహ లోపల దాగి ఉన్న ప్రదేశం నుండి విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ప్రమాదం నుండి ధైర్యంగా బయటపడిన మేజర్ నాయుడు వేగంగా వ్యూహాత్మకంగా కదిలి ఉగ్రవాదిని మట్టుబెట్టాడు. తద్వారా తన బృందాన్ని ప్రాణనష్టాల నుండి రక్షించాడు. అతని నిస్వార్థ చర్యలు మరియు నిర్భయ నాయకత్వం అనేక మంది ప్రాణాలను కాపాడింది. అలాగే పెద్ద ఎత్తున ఉగ్రవాద సంఘటనను నిరోధించింది, ఈ ఘనత ఇప్పుడు జాతీయంగా గుర్తింపు పొందింది.

**సాధారణ కుటుంబంలో జన్మించిన నాయుడు**

ఒక సాధారణ కుటుంబంలో జన్మించిన మేజర్ నాయుడు స్థానిక రైతులైన మల్ల అప్పలనాయుడు మరియు హేమమాలిని దంపతుల కుమారుడు. ప్రతిష్టాత్మక కోరుకొండ సైనిక్ స్కూల్ విద్యార్థి అయిన ఆయన 2012లో యు.పీ.ఎస్.సీ.నిర్వహించిన సర్వీసెస్ సెలక్షన్ బోర్డ్ పరీక్షలో ఉత్తీర్ణుడై పూణేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీలో చేరారు. మూడు సంవత్సరాల కఠినమైన శిక్షణ తర్వాత ఆయన డెహ్రాడూన్లోని ఇండియన్ మిలిటరీ అకాడమీకి వెళ్లారు, అక్కడ 900 మంది క్యాడెట్లలో బంగారు పతక విజేతగా నిలిచారు, భారత సైన్యంలో లెఫ్టినెంట్గా హెూదా సంపాదించారు. రెండేళ్లలోపు, 2018లో ఆయన కెప్టెన్ హెూదాకు పదోన్నతి పొందారు. 2022 నాటికి ఆయన మేజర్ అయ్యారు, అంకితభావం మరియు నైపుణ్యం ద్వారా నడిచే ఆదర్శవంతమైన కెరీర్ పురోగతిని ప్రదర్శించారు. 2024లో కీర్తి చక్ర అవార్డు పొందిన ఏకైక జీవించి ఉన్న సైనికుడు మేజర్ రామ్ గోపాల్ నాయుడు. ఇది అతని గుర్తింపును మరింత అసాధారణంగా చేసింది. శ్రీకాకుళం ప్రజలే కాదు ఆంధ్రప్రదేశ్ అంతా ఆయన విజయాన్ని ఎంతో గర్వంగా జరుపుకుంటున్నారు.

**ఈ అవార్డు దేశానికి అంకితం**

"ఈ అవార్డు నా ఒక్కడిది కాదు, ఇది నా గ్రామానికి, నా ఉపాధ్యాయులకు, నా తల్లిదండ్రులకు, నా దేశానికి చెందుతుంది" అని అవార్డు అందుకున్న తర్వాత మేజర్ నాయుడు తన వినయపూర్వకమైన ప్రసంగంలో అన్నారు. దేశానికి సేవ చేయాలని మరియు గొప్ప మంచి కోసం తమను తాము అంకితం చేసుకోవాలని ఆయన యువతకు సందేశం ఇచ్చారు. ఆంధ్ర ప్రదేశ్లోని ఒక గ్రామీణ రైతు కొడుకు భారతదేశంలో అత్యంత కీర్తి ప్రతిష్టలు పొందిన పురస్కారం అందుకోవడం తెలుగు ప్రజలకు గర్వ కారణంగా చెప్పవచ్చు.






## తెలుగు వీరుడికి గౌరవం

6 లో

మేజర్ మల్ల రామ్ గోపాల్ నాయుడుకు
కీర్తి చక్ర పురస్కారం దేశవ్యాప్తంగా ప్రశంసలు

# యోగాతో ఆరోగ్యం



**యోగా అంటేనే భారతీయ వ్యవస్థలో సాంప్రదాయం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల సన్నాహకంలో భాగంగా యోగాంధ్ర కార్యక్రమం. ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా ఇంచార్జి మంత్రి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి, హెూంమంత్రి వంగల పూడి అనిత, ప్రభుత్వ విప్ పి వి ఆర్ గణబాబు, వేపాడ చిరంజీవి,**

విశాఖపట్నం, మే 24 ప్రభాతవార్త

యోగా అంటేనే భారతీయ వ్యవస్థలో సాంప్రదాయంగా వస్తున్న ఒక వ్యవస్థ అని, యోగా అంటే ఆసనాలు చేయడం కాకుండా,యోగా మన దైనందిన జీవిత కార్యక్రమంలో ఒక భాగం అవ్వాలని జిల్లా ఇంచార్జి మంత్రి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. శనివారం ఉదయం స్థానిక ఆర్కే బీచ్ వద్ద నిర్వహించిన యోగ డే వేడుకలలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా ఇంచార్జి మంత్రి , సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయ స్వామి, హెూంమంత్రి వంగల పూడి అనిత, ప్రభుత్వ విప్ పి వి ఆర్ గణబాబు, వేపాడ చిరంజీవి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ, ఆరోగ్యమే మహా భాగ్యమని, మన ఆరోగ్యం మనకు గొప్ప ఆస్తి అన్నారు.మన ఆహారపు అలవాట్లు మారుతున్నాయి, పాత తరం ఆహారం వైపు అడుగులు

తరువాయి 6లో..











## మాస్టర్ మైండ్ సైబర్ నేరస్థులు..

# దొరికారు..

### ఇన్స్టెంట్ లోన్ యాప్స్ ఫ్రాడ్ కేసు లో మరో ఇద్దరు నిందితుల అరెస్టు



(విశాఖ క్రైమ్ - ప్రభాత వార్త)

ఇన్స్టెంట్ లోన్ యాప్స్ ఫ్రాడ్ కేసు లో మ్యూల్ బ్యాంక్ అకౌంట్స్ ను సేకరిస్తూ వాటిని పేమెంట్ గేట్ వే లకు లింక్ చేసి, ఫ్రాడ్ చేసిన అమౌంట్ ను సులువుగా చైనీస్ ఫ్రాడ్ స్టర్స్ చేరవేస్తున్న మరో మాస్టర్ మైండ్ నేరస్థుడు, అతనికి సహకరిస్తున్న మరొక నిందితుడిని విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించారు. మహారాణి పేటకు చెందిన ఒక వ్యక్తి సుమారు రూ.2 వేలు అనధికార లోన్ ఇన్స్టెంట్ యాప్ నుంచి లోన్ తీసుకొని తిరిగి డబ్బులు కట్టడం జరిగింది. అయినా సరే వారు ఇంకా అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాలని లేదా చెల్లించిన డబ్బులు ఇంకా మాకు రాలేదని సైబర్ నేరగాళ్ళు పలువిదాలుగా అతన్ని మానసిక ఒత్తిడి కి గురి చేసి , ఆతను, అతని భార్య ఫొటోస్ ని నగ్నంగా మార్ఫింగ్ భాదితుని ఫ్రెండ్స్ కి, రిలేటివ్స్, తన భార్య కు కూడా పంపించారు. బాధితుని భార్యా భయపడి రూ.2 వేలు మోసగాడు ఇచ్చిన అకౌంట్ కి పంపించారు . ఆ మనోవేదని తట్టుకోలేక సదరు వ్యక్తి సూసైడ్ చేసుకుని

తరువాయి 6లో..

## మెగా క్లీనింగ్ డ్రైవ్‌లో పాల్గొన్న

# జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

## ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్..

ఎలమంచిలి మే 24 ప్రభాతవార్త:

మెగా క్లీనింగ్ డ్రైవ్ లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే సుందర విజయకుమార్ పిలుపునిచ్చారు. శనివారం అచ్చుతాపురం లోని సెజ్ లోని ఏపీఐఐసీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, డిపిఓ శిరీష రాణి ఇతర శాఖలకు చెందిన అధికారులతో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. అచ్యుతాపురం లోని డ్రైనేజీ వ్యర్థాలు, చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ పరిశుభ్రత పాటిస్తే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు తాగిన మంచినీళ్ల బాటిల్లను ఎక్కడపడితే అక్కడ పడవేయరాదని , చెత్తను కూడా సంబంధిత పారిశుధ్య కార్మికులకు అందజేయాలని ప్రతి ఒక్కరూ ఈ విషయంలో ఎవరికి వారే ముందుకు రావాలని కోరారు. స్వచ్ఛ ఆంధ్ర సంకల్పం మహా గొప్పదని కొనియాడారు. నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. 300 మంది వాలంటీర్లు లారస్ కంపెనీ యాజమాన్యంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి మోటూరు శ్రీ వేణి, నాయకులు బైలపూడి రాందాసు, కొరుప్రోలు చిన్నారావు, ద్వారపు రెడ్డి బాబ్జి, కరెడ్ల ప్రకాష్, జూనియర్ నాగేశ్వరరావు, పాల్గొన్నారు



# ఉలిక్కిపడ్డ విశాఖ

విశాఖ ఎల్టిటి ఎక్స్‌ప్రెస్ కు బాంబు బెదిరింపు

డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్, సివిల్,జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీస్ బృందాల తనిఖీలు

ఎలాంటి బాంబు ఆనవాళ్లు లేనట్టు గుర్తింపు

ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు



- 6వ పేజీలో

## విశాఖ లో సేంద్రియ మామిడి పండ్ల మేళా ప్రారంభం

### అరుదైన మామిడి పండ్లతో అలరించిన మేళా

విశాఖపట్నం, మే 24, ప్రభాత వార్త :

సేంద్రియ మామిడి పండ్ల మేళ విశాఖ వాసులకు వినూత్న అనుభూతిని కలిగిస్తుందని గో ఆదారిత ప్రకృతి ఆధారిత రైతుల సంఘం నేత, వారాహి రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ పేరి రామకృష్ణమూర్తి చెప్పారు. విశాఖ విశాలాక్షి నగర్ బి వీ కే కళాశాలలో శనివారం ఉదయం రైతు శాస్త్రవేత్త కొంగర రమేష్, సంఘం విశాఖ అధ్యక్షులు పి ఎల్ ఎన్ రాజుల తో కలసి మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అరుదైన మామిడి రకాలు ఈ మేళాలో అందుబాటులో ఉన్నాయని ఇవన్నీ రసాయనాలు లేకుండా సేంద్రియంగా పండించినవని చెప్పారు. ఈ మేళాలో పంచదార కలిశాలు, పందూరి మామిడి, కొత్తపల్లి కొబ్బరి, స్వాగతం, అమృతం, పాపారాజు గోవా, నాగులపల్లి ఇరసాలు,

తరువాయి 6లో..




# జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన స్పీకర్ అయ్యన్న




- వార్త 6లో..

# పోలీసుల శ్రేయస్సు కోసం ఆరోగ్య కార్యక్రమాలు అత్యంత అవసరం

## విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి

## 45 ఏళ్లు దాటిన పోలీస్ సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు





( విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

పోలీసుల శ్రేయస్సు కోసం ఆరోగ్య కార్యక్రమాలు అత్యంత అవసరం అని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు.. వెంకోజి పాలెం లో ఉన్న మెడికవర్ హాస్పిటల్ లో 45 ఏళ్లు దాటిన పోలీస్ సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షలను నిర్వహించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు..అనకాపల్లి ఎస్పీ ని, బుషిల్ డెకర్ లిమిటెడ్ ప్రతినిధులను, మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యాన్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను" అని పేర్కొన్నారు.పోలీసు సిబ్బంది ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా, పోషకాహారం, మితాహారం, వ్యాయామం, సానుకూల దృక్పథంతో జీవించాలని డీఐజీ సూచించారు. కుటుంబాలకు మీరు ఆశ్రయంగా ఉన్నందున, మీ ఆరోగ్యం మీద మీరు జాగ్రత్త వహించాల్సిన బాధ్యత ఉందన్నారు.పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ ఆదేశాల మేరకు 45 సంవత్సరాల పైబడి ఉన్న సుమారు 750 మంది పోలీసు సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా పోలీసు శాఖ ప్రకటించింది.పని ఒత్తిడితో పాటు శారీరక మానసిక ప్రయాసలకు లోనవుతున్న సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ ఆసుపత్రిలో 13 రకాల పరీక్షలు గుండె, కిడ్నీ, మహిళలకు మామోగ్రఫీ తదితర ఖరీదైన పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నారు. విశాఖపట్నం,వేంకోజిపాలెంలో ఉన్న మెడికవర్ హాస్పిటల్ , అచ్యుతాపురం చెందిన బుషిల్ డెకర్స్ లిమిటెడ్ వారి సహకారంతో ఈ ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు..ఈ పరీక్షలు మే 24, 2025 నుండి ప్రారంభమవుతాయన్నారు. ప్రతి రోజు 50 మంది చొప్పున పరీక్షలు నిర్వహించబడతాయన్నారు.. .ఈ కార్యక్రమంలో బుషిల్ డెకర్ లిమిటెడ్ ప్రతినిధి, మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యం, అనకాపల్లి జిల్లా సివిల్ , ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ప్రారంభ రోజు 50 మంది సిబ్బందికి విజయవంతంగా పరీక్షలు నిర్వహించబడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం రేంజ్ డి.ఐ.జి, జిల్లా ఎస్పీ తో పాటు మెడికవర్ సెంట్రల్ హెడ్ డాక్టర్ సిహెచ్.అరుణ్ కుమార్, బుషిల్ డెకర్ లిమిటెడ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఏ.కె.రాయ్, అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, డి.టి.సీ డీఎస్పీ బి.మోహనరావు, ఇన్స్పెక్టర్లు చంద్రశేఖర్, బాల సూర్యారావు, అప్పలనాయుడు, నరసింగరావు, రామకృష్ణ, మన్మథరావు, ఎస్సైలు ఆదినారాయణ, విశ్వనాథం , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 10వ వార్డ్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఆరిలోవ , మే 24 , ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గం స్థానిక 10వ వార్డు ఆదర్శనగర్ కొండవల ప్రాంతంలో శనివారం వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మీ రాజశేఖర్ ఆధ్వర్యంలో రక్షణ గోడ నిర్మాణం కొరకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. వార్డులో సుమారు 40 లక్షల జీవీఎంసీ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసినట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈకార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గాడు అప్పలనాయుడు, జనసేన అధ్యక్షులు బండి రాజా రమేష్, క్లస్టర్ ఇంచార్జి మద్దిల రాజేష్, యూనిట్ ఇంచార్జి %జష్ట్ర% శ్రీనివాస్, బూత్ కన్వీనర్స్ సంతోష్ కుమార్, బుగత తాత రావు, కాళ్ళ అప్పారావు తో పాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# నేడు కళాభారతిలో కర్ణాటిక్ గాత్ర కచేరీ

విశాఖపట్నం మే 24 ప్రభాతవార్త



విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ మద్దిలపాలెం కళాభారతి విశాఖపట్నం ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ సాయంత్రం 7గంటలకు కర్ణాటిక్ గాత్ర కచేరీలు నిర్వహించనున్నట్టు కళాభారతి కార్యదర్శి డా. రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా విద్వాన్ డా. ద్వారం త్యాగరాజ్ కర్ణాటిక్ గాత్ర కచేరీ చేస్తారన్నారు. విద్వాన్ ఎమ్ ఎస్. నీలాద్రి రావు వయోలిన్, విద్వాన్ ఎమ్. ఏడు కొండలు మృదంగం, విద్వాన్ జి. వెంకటేష్ ఈళ తో వాద్య సహకారం అందిస్తారన్నారు. ఈ సందర్భంగా గ్రేడెడ్ ఆర్టిస్టులకు సన్మానం కార్యక్రమం ఉంటుంది అన్నారు. ఈ కార్యక్రమానికి సంగీత ప్రియులంతా హాజరైయి విజయవంతం చేయాలని డా. రాంబాబు కోరారు.

# బుద్ధిని బోధనలు ఈ తరానికి ఆదర్శనీయం

విశాఖపట్నం మే 24 ప్రభాతవార్త



శనివారం ఉదయం బుద్ధిని 2569 వ జయంతిని పురస్కరించుకొని ప్రపంచ శాంతి, బుద్ధిని బోధనలు అంశం పై ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజిస్ ఫ్రీడమ్ సంస్థ ఆధ్వర్యంలో బుల్లయ్య కాలేజీ ఆవరణలో గాంధీ సెంటర్ సెమినార్ హాల్ ప్రాంగణంలో చైర్మన్ నరవ ప్రకాశం రావు అధ్యక్షతన సదస్సు జరిగింది. తొలుత సర్వమత ప్రార్దన నిర్వహించి బుద్ధుని చిత్ర పటానికి నివాళులు అర్పించారు .వక్తలు ఆచార్య వి.బలమోహన్ దాస్, డాక్టర్ మాటూరి శ్రీనివాస్, ఆచార్య పెద్దయ్య మాట్లాడుతూ విలాసాల వైపు కాకుండా గౌతమ బుద్ధిని బోధనల వైపు దృష్టి మరల్చాలని అన్నారు. సంఘానికి హాని చేయకుండా ప్రజలు జీవించాలని అన్నారు.ప్రపంచ శాంతిని కాపాడడానికి బుద్ధిని బోధనలు నేటి తరానికి ఆదర్శం అన్నారు సమావేశంలో డాక్టర్ కే.వి.ఎస్.మూర్తి, ప్రభు డాక్టర్ పి కే.జోష్, ప్రజ్ఞానంద, ఎస్ ర్ ఎల్ నరసింహ రావు, చాట్ల బాబురావు రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## కొయ్యపేట గ్రామానికి విద్యుత్ అంతరాయంపై ఫిర్యాదు చేసిన గ్రామస్తులు.



పద్మనాభం, మే 24,ప్రభాతవార్త :

మండలంలో కొయ్యపేట గ్రామానికి గత వారం రోజుల నుండి విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని శనివారం గ్రామస్థులు పద్మనాభం విద్యుత్ సబస్టేషను ఏ.ఈ. జగన్మోహన్ కి ఫిర్యాదు చేశారు. గత వారం రోజుల నుండి గ్రామంలో ఉన్న విద్యుత్ ట్రాన్సుఫార్మరు పనిచేయక విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, వేసవికాలం కావడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు చెప్పారు. అంతేకాకుండా గ్రామంలో మంచినీటి సరఫరా కూడా నిలిచిపోయిందని వారు అన్నారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొక్కుబడిగా మరమ్మత్తులకు గురైన ట్రాన్సుఫార్మరును వేసి అధికారులు చేతులు దులిపేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన ట్రాన్సుఫార్మరు వేసి పూర్తిస్థాయిలో కరెంటు ఇవ్వకపోతే గ్రామ ప్రజలు అందరూ సబస్టేషకునకి రావాల్సి వస్తుందని వారు హెచ్చిరించారు.

# ప్రత్యేక లింకు ద్వారా యోగా శిక్షకులుగా చేరేందుకు అవకాశం

## ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీ భాయి

విశాఖపట్నం, మే 24 :- ప్రభాతవార్త

అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనే ప్రజలకు తర్ఫీదు ఇచ్చేందుకు గాను ఔత్సాహికులైన శిక్షకులు ప్రత్యేక లింకు ద్వారా రిజిస్ట్రేషన్ కావొచ్చని ఆయుష్ విభాగం రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఝాన్సీ లక్ష్మీ భాయి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. Https://yogandhra.ap.gov.in/#/home/index అనే లింకు ద్వారా నమోదు కావొచ్చని సూచించారు. రిజిస్టర్ అయ్యి పౌరులకు శిక్షణ అందజేసిన వారికి మొరార్జీ దేశాయ్ నేషనల్ యోగా ఇన్స్టిట్యూట్ ద్వారా సర్టిఫికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకొని కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని ఆమె సూచించారు.

# రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ సులభతరం దిశగా సాఫ్ట్వేర్ అభివృద్ధి

## ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని.



విశాఖపట్నం ,మే 24 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగబోయే ఎన్నికల ప్రక్రియను సులభతరం చేసేందుకు గాను ఎన్నికల నియమ నిబంధనలను ప్రకారం సాఫ్ట్వేర్ ను అభివృద్ధిచేసే దిశగా ప్రణాళికలు చేపడుతున్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని పేర్కొన్నారు. శనివారం ఆమె జీవీఎంసీ అధికారులతో కలిసి జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో గల సమావేశ మందిరంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగబోయే ఎన్నికలలో , ఓటర్ల నమోదు,ఓటర్ల లిస్ట్ తయారీ, సంబంధిత పోలింగ్ స్టేషన్లు, పోటీ చేయు అభ్యర్థుల వివరాలు,నామినేషన్ల జాబితా, ఎన్నికలకు సంబంధించిన తదితర ప్రక్రియలను సులభతరం చేసేందుకు గాను ఆన్లైన్ సాఫ్ట్వేర్ అభివృద్ధి చేయడం జరుగుచున్నదని, అందుకు సంబంధించిన వివరాలతో కూడిన సాఫ్ట్వేర్ అప్లికేషను ను వివరించి వాటిపై మరిన్ని అవగాహనపరమైన సలహాలను, సూచనలను తీసుకునేందుకు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పంచాయతీల ఎన్నికల నిర్వహణ నుండి తీసుకునేందుకుగాను ఈ సమావేశం ముందుగా జీవీఎంసీ లో ఏర్పాటు చేయడమైనదని అన్నారు. అందుకు సంబంధించిన సాఫ్ట్వేర్ ఆన్లైన్ అప్లికేషన్ లో ఎన్నికలు నిర్వహించు ఎలక్షన్ కమిషనర్, సిడిఎంఎ, కమిషనర్లు,అధికారులు , సిబ్బంది , ఓటర్ పోర్టల్ , పోటీచేయు అభ్యర్థుల పోర్టల్, యొక్క లాగిన్ , వినియోగించు ప్రక్రియ వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరంగా తెలియజేశారు.ఈ సాఫ్ట్వేర్ నందు 1200 మందికి ఒక పోలింగ్ స్టేషన్ తయారీ , వివరాలు, రూట్ మ్యాప్ కేటాయింపు, ఓటర్ లిస్ట్ తయారీ, ఓటరు , పోటీచేయు అభ్యర్థులు స్వయంగా తన పేరును తెలుసుకోవచ్చని, ఓటర్ డోర్ నెంబర్ సవరణ, ఓటర్ వేకెన్సీ, చనిపోయిన,డిస్ క్వాలిఫై వివరాలు, ఎన్నికల ప్రక్రియకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలు , పోలింగ్ స్టేషన్ల వివరాలు, పోటీ చేయు అభ్యర్థులు పేర్లు, రిజర్వేషన్లు, ఎన్నికల గుర్తులు కేటాయింపు తదితర ఎన్నికలకు సంబంధించిన నిర్వహణ వివరాలు చాలా సులభతరం చేసేందుకు గానూ ,ఈ సాఫ్ట్వేర్ అభివృద్ధి వలన ఎన్నికల నిర్వహించు అధికారులకు, సిబ్బందికి ఎన్నికల ప్రక్రియకు సంబంధించి సమయం వృధా కాకుండా అన్ని వివరాలను వెంటనే సులభంగా లభించే విధంగా ఈ వెబ్సైటు సాఫ్ట్వేర్ అభివృద్ధి చేయడం జరుచున్నదన్నారు. ఇందుకు సంబంధించి సలహాలను, సూచనలను అధికారులను అడిగి తెలుసుకుని , సాఫ్ట్వేర్ అభివృద్ధి జరిగి ప్రవేశపెట్టిన తర్వాత ఎన్నికల నిర్వహణను సంబంధిత కార్పొరేషన్లు,మున్సిపాలిటీలు, పంచాయతీలు సులభంగా జరుపుకోవచ్చునని ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తెలియజేశారు. అనంతరం సాఫ్ట్వేర్ డెవలప్మెంట్ కు సంబంధించిన అప్లికేషన్ పూర్తి వివరాలను స్టేట్ ఎలక్షన్ కమిషన్ సెక్షన్ ఆఫీసర్ కే.ఎన్. కుమార్ పిపిటి ద్వారా అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్లు డి.వి. రమణమూర్తి, ఎస్.ఎస్. వర్మ, అందరు జోనల్ కమిషనర్లు, డిసిఆర్ ఎస్.శ్రీనివాస్, పర్యవేక్షక ఇంజనీర్ కృష్ణారావు, సిటీ ప్లానర్ ధనుంజయ రెడ్డి, డిసిపి రామ్మోహన్రావు, అందరు ఏసీపీలు , తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

## మృతురాలు దివీస్ ఉద్యోగిని





(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త):

నగరంలోని భీమిలి, సంగివలస ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువతి మృతి చెందింది.. మూడు అమ్మవార్ల గుడి వద్ద శనివారం జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన యువతి దివీస్ ఉద్యోగినిగా గుర్తించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, కృష్ణ జిల్లా ఎర్రవానిగూడం ప్రాంతానికి చెందిన ఉప్పలపాటి. తిరుమల దేవి (24) చిప్పాడ దివిస్ కంపెనీలో పిడిఎస్సీ విభాగంలో రెండు సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తుంది. ఈ నేపథ్యంలో ఆమె సంగివలస ప్రాంతంలో ఓ మహిళా వసతి గృహంలో ఉంటూ విధులకు హాజరయ్యేది. విధుల్లో భాగంగా శనివారం మధ్యాహ్నం సంగివలస జాతీయ రహదారి వద్దకు చేరుకుంది. అప్పటికే వాళ్ల కోసం ఉన్న వాహనం వెళ్లిపోవడంతో హైవే రోడ్డు దాటి విజయనగరం రోడ్డుకు వెళ్తున్న క్రమంలో వైజాగ్ నుండి వస్తున్న ఫార్చునర్ కారు బలంగా ఆమెను ఢీకొంది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలై సంఘటన స్థలం వద్ద మృతి చెందారు. సంఘటనా స్థలానికి చేరుకున్న భీమిలి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐ తిరుమలరావు నేతృత్వంలో భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# మృతిని కుటుంబానికి ఆర్థిక చేయూత

గాజువాక,మే 24,ప్రభాతవార్త:



గాజువాక నియోజకవర్గం 88వ వార్డు దువ్వాడ సెక్టార్ 1 కాలనీ నివాసి అయిన నాలి అప్పారావు (62) అకాల మరణం చెందారు. మధ్య తరగతి కుటుంబికుడైన అప్పారావుకి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతిని నివాసం వద్ద శనివారం జరిగిన శ్రద్ధాంజలి కార్యక్రమానికి పద్మశాలి సంఘం నాయకులు పప్పు రాజారావు, రాపర్తి సుబ్బారావు, కొలిపాక అప్పారావు, నీలి రాంబాబు, తెడ్లపూ సతీష్, వానపల్లి జగ్గారావు,డాక్టర్ దుభ రాజు, గెడ్డం గోవర్ధన్, సెసెట్టి అప్పారావు ఇతర సంఘ నాయకులు హాజరై పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మృతిని బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన సినీ సంగీత విభావరి



విశాఖపట్నం మే 24 ప్రభాతవార్త

ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాల్లో శనివారం ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో మెలోడీ క్రియేటర్స్ , శృతిలయ , రసరాగా మాధురి , కళాంజలి సరిగమప సాంస్కృతిక సంస్థల అధినేతల ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విశాఖ సాంస్కృతిక సంఘాల అధ్యక్షులు భయ్యా శ్రీనివాస్, ఎం వి రాజశేఖర్ , మస్తాన్ రెడ్డి , అరుణకాంత్ , డాక్టర్ చీరాల ఉషా , ఎం.వి.ఆర్ నాగేశ్వరరావు , సన్ మూర్తి జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు . అటు సినీ రంగానికి ఇటు రాజకీయ రంగానికి ముఖ్యంగా తెలుగు భాష ఔనత్యానికి ఎన్టీఆర్ చేసిన సేవలను వక్తలు కొనియాడారు . సిహెచ్ వి సత్యనారాయణ , కే వీరాస్వామి , వి ప్రభాకర్ , ఎం పుండరీ కుమార్ నగరానికి చెందిన గాయణి మణులు సత్యవతి , శ్రీదేవి , రంజిత , సుజాతలతో కలిసి ఎన్టీఆర్ నటించిన వివిధ తెలుగు చలనచిత్రాల్లోని గీతాలను మధురంగా ఆలపించి శ్రోతల హర్షద్వానాలను అందుకున్నారు. లక్ష్మీ స్వరూప వ్యాఖ్యాతగా వ్యవహరించారు . సోమేశ్ బృందం సంగీత వాద్యసకారం అందజేశారు .

# జాతీయ స్థాయిలో సత్తా చాటిన కుడో క్రీడాకారులకు అభినందనలు

గాజువాక,మే 24,ప్రభాతవార్త:



మే 16 నుంచి 20 వరకు మహారాష్ట్ర పూణే(హవేలీ)లో జరిగిన మాడవ జాతీయ స్థాయి కుడో మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ లో ఆంధ్ర క్రీడాకారులు సత్తా చాటారు. ఏపీ నుంచి వెళ్లిన 21 మందిలో 11 మంది మెడల్స్ సాధించగా అందులో 9 మంది విశాఖకు చెందిన వారు కావడం విశేషం. కాగా క్రీడలో సత్తా చాటిన వారికి గాజువాకలో కుడో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కరణంరెడ్డి నరసింగరావు చేతుల మీదుగా మెడల్స్ అందజేసి వారిని సత్కరించారు. విద్యార్థులు టి.షన్ముఖ్,ఎస్.తేజ,కె.సిరి షణ్ముఖ,కె.లాస్య రామ,కేడీ తేజ్ లు గోల్డ్ మెడల్స్ సాధించగా ఆర్.దుర్గా ప్రశాంత్,కె.శ్రీకృష్ణ,పి.సాయి హనీష్,ఎస్.రోహిణి,ఎం. పూర్వజాశ్రీ బ్రాంజ్ మెడల్స్,ఆర్ఎస్డి హర్షవర్ధన్ సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ చిన్న వయసులోనే క్రీడలపై మక్కువ చూపుతూ జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించడం అభినందనీయం అన్నారు. వీరంతా వచ్చే అక్టోబర్ నెలలో సూరత్ లో జరగనున్న అంతర్జాతీయ కుడో ఛాంపియన్ షిప్ కు ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆలూరి శశిధర్,సెక్రటరీ బి.రవిబాబు,కోశాధికారి ఎ.అనూరాధ,సెలెక్షన్ కమిటీ ఇంచార్జ్ పి.రమణ(ఎక్స్ ఆర్మీ),కోచ్ లు యశ్వంత్,రామకోటి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# స్వర్గీయ గోందేశీ వెంకటరమణ రెడ్డికు ఘన నివాళులు



గాజువాక,మే 24,ప్రభాతవార్త:

స్టీల్ వై ఎస్ ఆర్ టీ యూ సి ఆధ్వర్యంలో స్టీల్ వై ఎస్ ఆర్ టీ యూ సి అధ్యక్షులు సీనియర్ నాయకులు స్వర్గీయ గోందేశీ వెంకటరమణ రెడ్డి పెద్దకర్మ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ రమణారెడ్డి కార్మికుల హక్కులకోసం అలుపెరుగనిపోరాటం చేసారని నిస్వార్థం లేకుండా అందరిని కలుపుకొని,కలసి మలసి ఉన్న నాయకుడని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమం లో మార్దుపూడి పరదేశి,నక్క వెంకటరమణ,అండిబోయన అప్పారావు,పిట్టా రెడ్డి,గోందేశీ అప్పలరెడ్డి,గోందేశీ రాము,చేట్ల వెంకటరమణ రెడ్డి,బోరా శశిభూషన్ రావు,పిట్టా చంద్రయ్య,తిప్పల గురునాద్ రెడ్డి పాల్గొన్నారు.

## పద్మనాభం మండలంలో ముందుస్తుగా

# రైతుసేవా కేంద్రాలకి చేరిన వరి విత్తనాలు




పద్మనాభం, మే 24, ప్రభాతవార్త :

ఖరీఫ్ సీజనుకి సంబందించిన వరి విత్తనాలు మండలంలో పులు గ్రామాలలో ఉన్న రైతుసేవా కేంద్రాలకి ముందుస్తుగా చేరాయి. సోనామసూరు, సాంబామసూరు, శ్రీకాకుళం సన్నాలు తదితర రకాలకి సంబందించి సుమారు నూట లబై టన్నుల వరి విత్తనాలకి గతంలో ప్రతిపాదనలు పంపించినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.రైతలకి అవసరమైన విత్తనాలను రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేయడానికి సిద్దంగా ఉందని అధికారులు తెలిపారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జూన్‌లో రైతులకు విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా పదహారు గ్రామ రైతుసేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు.

# స్టీల్ ప్లాంట్ వద్ద కొనసాగుతున్న ఆందోళన



గాజువాక,మే 24,ప్రభాతవార్త:

ఉక్కు లో తొలగించిన కాంట్రాక్టు కార్మికులని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ స్టీల్ ప్లాంట్ ఆర్చ్ వద్ద కాంట్రాక్ట్ కార్మికుల చేపట్టిన నిరవధిక సమ్మె 5వ రోజుకు చేరుకుంది. శనివారం ఉదయం అఖిలపక్ష నాయకులు, కార్మికులు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. తొలగించిన కాంటాక్ట్ కార్మికులని విధుల్లోకి తీసుకునేంత వరకు పోరాటం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఆదివారం పాత గాజువాక నుంచి ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. బహిరంగ సభలో కార్మికుల కుటుంబ సభ్యులు అధిక సంఖ్య లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## పవిత్ర మూర్తి అహల్యాబాయి హొల్కర్

# జీవితం ఆదర్శనీయం



గాజువాక,మే 24,ప్రభాతవార్త:

జీవీఎంసీ 71వ వార్డు విశ్వేశ్వరయ్య నగర్ ఆలయ ప్రాంగణంలో బిజేపి ఉత్తరాంధ్ర ఇంచార్జ్ కట్టా పద్మ ఆధ్వర్యంలో పవిత్ర మూర్తి అహల్యాబాయి హొల్కర్ 300వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 17వ శతాబ్దంలో అహల్యాబాయి ముప్పై ఏళ్ల పాటు మరాఠా సామ్రాజ్యాన్ని పరిపాలించారని అన్నారు. ఆమె ధర్మ రక్షణ కోసం ఎన్నో ఆలయాలను నిర్మించారని అన్నారు. ఆమె చిన్న వయసులోనే ఆమె భర్తని కోల్పోయిన తన మావయ్య సూచనలతో రాజ్యాన్ని పరిపాలించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# జూద ప్రాంతంపై పోలీసులు దాడులు

**- 19 మోటార్ బైక్‌లు, రూ. 1.95 లక్షలు నగదు స్వాధీనం - 14 మంది అరెస్ట్.. డిఎస్పీ జి. సాయిప్రశాంత్ వెల్లడి**







**రాజవొమ్మంగి, మే 24, ప్రభాతవార్త**

రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ పరిధిలో జూదప్రాంతంపై పోలీసులు దాడులు చేసి 14 మంది, రూ. 1.95 లక్షలు, 19 మోటార్ బైక్ లు స్వాధీనం చేసుకున్నట్లు రాత్రి పాత్రికేయులు సమావేశంలో రంపచోడవరం డిఎస్పీ జి. సాయి ప్రశాంత్ వెల్లడించారు. జూదాలు వల్ల నిర్వాహకులు, నగదు ప్రోత్సాహకులు ఆర్థికంగా బాగుపడుతున్నారని డిఎస్పీ అన్నారు. గిరిజన కుటుంబాలు నష్టపోతున్నాయని, జూదం సమాచారం ఉంటే నేరుగా తనకు తెలుపాలన్నారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. డిఎస్పీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కిమ్మలగడ్డ అటవీ ప్రాంతంలో జూద ప్రాంతంపై శనివారం ఇద్దరు సి. ఐ. లు, ముగ్గురు ఎస్. ఐ లు సిబ్బందితో కలిసి సాయంత్రం నాలుగు గంటలు ప్రాంతంలో దాడులను నిర్వహించారు. అక్కడ చిత్తులాట ఆడుతుండగా 14 మందిని పట్టుకొని వారి వద్ద గల రూ. 1.95 లక్షలు నగదు, 19 మోటార్ బైక్ లను స్వాధీనం చేసుకొన్నారన్నారు. ఇంకా కొంత మంది పారిపోయారన్నారు. వారు ఆటకు వినియోగించిన రెండు ఐదు రూపాయలు నాణెం లను కూడా స్వాధీనం చేసుకోవడం జరిగిందని వివరించారు. జూదరులు, నగదు, మోటార్ బైక్ లను రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ లో భద్రపర్చారు. ఈకార్యక్రమంలో డిఎస్పీ సాయి ప్రశాంత్, రాజవొమ్మంగి సి. ఐ. సన్యాసినాయుడు, అడ్డతీగల సి.ఐ నరసింహామూర్తి, జడ్డంగి ఎస్. ఐ చిన్నబాబు, అడ్డతీగల ఎస్.ఐ వినోద్, గంగవరం ఎస్. ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు గ్రాడ్యుటీ అమలు చేయాలి :సిఐటియు

**వి.ఆర్.పురం,మే 24, ప్రభాతవార్త**



అంగన్వాడీలకు గ్రాడ్యుటి అమలు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు పులి. సంతోష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం చిన్నమట్టపల్లి గ్రామంలో ఆ సంఘం నాయకురాలు కనకమహాలక్ష్మి అధ్యక్షతన మండల స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో సంతోష్ కుమార్ పాల్గొని మాట్లాడారు. 2022 లో సుప్రీం కోర్టు అంగన్వాడీలకు గ్రాడ్యుటి అమలు చేయాలని తీర్పు ఇచ్చిందని, అది ఈనాటికి అమలు కాలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం గ్రాడ్యుటిని తక్షణమే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం నాయకులు సోయం.చినబాబు,అంగన్వాడి జిల్లా అధ్యక్షురాలు ముసురు.రాజేశ్వరి,గౌరవ అధ్యక్షురాలు సున్నం.రంగమ్మ, సవలం.సునీత, కట్టం.సుజాత, ఎం.అన్నపూర్ణ, యస్.లలిత,రాములమ్మ,సునీత, దూలమ్మ, లక్ష్మీ కుమారి,రమాదేవి,రమణమ్మ, విజయలక్ష్మి,ముత్తేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## యోగాడేను విజయవంతం చేయండి

**- ఆక్రమిత ప్రభుత్వ భూములను గుర్తించండి: ఎంపీడీవో ప్రసాదరావు**

**కొయ్యూరు, మే 24, ప్రభాతవార్త**



మండలంలో జూన్ నెలలో నిర్వహించే యోగాడే ను మండల పరిదిలో విజయవంతం చేయడానికి మండల స్థాయి అధికార్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీ డీవో ప్రసాదరావు అన్నారు. యోగా ఆంధ్రా నిర్వహణలో భాగంగా మండలంలో అన్ని సచివాలయాల పరిదిలో నిర్వహించే యోగా దినోత్సవాన్ని ప్రజలతో విజయవంతం చేయుటకు మండల స్థాయి అధికార్లు,సచివాలయం కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో ప్రసాదరావు పిలుపు నిచ్చారు. దీనిపై శనివారం మండల స్థాయి అధికార్లు,సచివాలయం సచివాలయం సిబ్బంది తో సమీక్షా సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా ఒక సెక్టార్ లో 7 గురుని ఎంపిక చేసి ట్రెనింగ్ అందిఇస్తారని ఎంపీడీవో తెలిపారు.వీరు తిరిగి మరో 50 మంది కి ఒక్కొక్కరు యోగా పై శిక్షణ అందించి ఎక్కువ మందితో. ఈ యోగా కార్యక్రమం నిర్వహించాలని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయం సిబ్బంది ఆయా గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమితమైతే వాటిని గుర్తించి తగిన నివేదిక సంబధిత రెవెన్యూ తహసీల్దార్ కు అందజేయాలని ఎంపీడీవో కార్యదర్శులకు తెలిపారు.ఈ సమావేశంలో మండల స్థాయి అధికార్లు ఎంఈ ఓ రాంబాబు, అర్ ఐ రాజన్నదొర,ఏ పి ఓ అప్పలరాజు, హౌసింగ్ ఏ ఈ గోవింద్,కార్యదర్శులు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు బదిలీలు దరఖాస్తుల స్వీకరణ

**నక్కపల్లి ప్రభాతవార్త**



ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఎంఆర్ సి నందు ఎంఈఓ ఎన్. నరేష్ కు మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు బదిలీలకు చేసుకున్న దరఖాస్తు లను అందజేశారు . వివిధ ప్రాంతాలకు చెందిన ఉపాధ్యాయుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఆయనతోపాటు అదనపు ఎంఈఓ ఉన్నారు.

## గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయులకు బదిలీల చట్టాన్ని వర్తింప చేయాలి

**పాడేరు,మే24,ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉపాధ్యాయుల బదిలీల కొరకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీల చట్టాన్ని తీసుకువచ్చింది దీనిని గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు వర్తింపజేయకపోవడం అన్యాయం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి. మహేశ్వరరావు పేర్కొన్నారు. ఉద్యోగస్తులకు బదిలీల నిమిత్తం విడుదల చేసినటువంటి జీవోను ఉపాధ్యాయులకు వర్తింపజేయడం తగదు. గిరిజన సంక్షేమ పాఠశాల విద్య శాఖలో ఉపాధ్యాయులకు నియామకాలు, జీతభత్యాలు, ప్రమోషన్లు, సెలవులు వంటి అనేక అంశాలు పాఠశాల విద్యాశాఖ నిబంధనలు పాటిస్తూ ఉపాధ్యాయుల బదిలీలకు మాత్రం ఉపాధ్యాయ బదిలీల చట్టానికి భిన్నంగా బదిలీల షెడ్యూల్ విడుదల చేయడం సహేతుకంగా లేదు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి గిరిజన సంక్షేమ పాఠశాల విద్య శాఖలో ఉపాధ్యాయులకు బదిలీల చట్టాన్ని వర్తింప చేస్తు రీ షెడ్యూల్ విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి. మహేశ్వరరావు డిమాండ్ చేశారు లేని పక్షంలో మంగళవారం నుండి ఆందోళనలు చేపడతామని తెలిపారు.

## ఆదివాసి సెక్యూరిటీ గార్డులకు మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలి

**- ఆదివాసీ సెక్యూరిటీ గార్డుల సంఘం**

**పాడేరు, మే 24, ప్రభాతవార్త**




అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో 20 గురుకులం ఏకలవ్య పాఠశాల మరియు కళాశాలల్లో ఎస్ఆర్ఆర్ టెండర్ సంస్థ ద్వారా పనిచేస్తున్నా ఆదివాసీ సెక్యూరిటీ గార్డులకు మూడు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని ఆదివాసీ సెక్యూరిటీ గార్డుల సంఘం డిమాండ్ చేసారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ అల్లూరి జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో 20 గురుకులం ఏకలవ్య పాఠశాలలు కళాశాల్లో పనిచేస్తున్న 100 మంది ఆదివాసీ సెక్యూరిటీ గార్డులకు గత మూడు నెలల నుండి జీతభత్యాలు అందక కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అతి తక్కువ 7500 వేతనాలతో పనిచేస్తున్నప్పటికీ సక్రమంగా వేతనాలు చెల్లించడం లేదని కలెక్టర్ గెజిట్ జీఓ వర్తింపచేసి జీత భత్యాలు చెల్లించాలని పాఠశాల మరియు కళాశాల గేటు వద్ద కనీస సౌకర్యం లేక ఎండ వాన చలికి తీవ్ర ఇబ్బందులు గురై విధులు నిర్వర్తిస్తున్నారని కొన్ని పాఠశాల మరియు కళాశాలలో సెక్యూరిటీ గార్డుల చేత అదనపు పనులు చేయించడం వల్ల పని ఒత్తిడి గురవుతున్నారని పాఠశాల మరియు కళాశాల గేటు వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని సెక్యూరిటీ గార్డులకు యూనిఫారం, బూట్లు, టోపీ, టార్చ్ లైట్, లాఠీ, రక్షణ పరికరాలు ఇవ్వాని ఎక్కువమంది మహిళలు పనిచేస్తున్న కనీసం సెక్యూరిటీ గార్డులకు వారాంతపు సెలవు కూడా ఇవ్వడం లేదని వారాంతపు సెలవులిచ్చి ప్రభుత్వ సెలవులు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆదివాసీ సెక్యూరిటీ గార్డుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంపరాయి సీతమ్మ ఎం .ప్రశాంతి జిల్లా నాయకులు బి. రాజమ్మ కె.మమతా ఎస్. కస్తూరి ,దుర్గ హేమలత ,నిర్మల, లలిత ,జ్యోతి శ్యామల, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కుట్లు అల్లికలపై శిక్షణ

**నక్కపల్లి, ప్రభాతవార్త**



మండలం లోని చిన దొడ్డిగల్లు శాఖ గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయాధికారి కే. జనార్ధన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు పురస్కరించుకొని రిసోర్స్ పర్సన్ వి. రమణమ్మ విద్యార్థులకు కుట్లు అల్లికలపై శిక్షణ ఇచ్చారు. క్లాత్ కాగితలపై ఏ విధముగా అల్లికలు చేయాలో నేర్పించారు. చుక్కల కుట్లు, స్పైడర్ కుట్లు, బ్రౌన్ కుట్లు, గొలుసు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు అల్లికలు కుట్లు నేర్చుకుని వాటిని ప్రదర్శించారు. వీరిలో విజేతలుగా జూనియర్స్ సర్వసిద్ధి సుష్మ, పి. లహరి, కే. ధనశ్రీ, సీనియర్స్ గా కట్టా హేమ, వెలగ శ్రీవిద్య గెలుపొందారు. వీరికి జూన్ 6వ తేదీన బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ అధికారి కే. జనార్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

## తిమ్మరాజుపేటలో ఎడ్యుకేషన్‌పై అవగాహన సదస్సు

**అనకాపల్లి, మే 24, ప్రభాతవార్త**



తిమ్మరాజుపేట గ్రామంలో విద్యార్థులకు విద్యార్థుల తల్లిదండ్రులకు తోస ఆధ్వర్యంలో, శ్రీ సత్య సాయి మందిరంలో, "ఎడ్యుకేషన్ రియలైజేషన్ అండ్ ఫాక్ట్స్" మీద ఒక అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమమునకు జడ్పీహెచ్ హైస్కూల్ హెడ్మాస్టర్ అప్పారావు, స్కూల్ అసిస్టెంట్ మ్యాథమెటిక్స్ టెక్స్ట్ బుక్ రచయిత లక్ష్మి నాయుడు, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ టెక్స్ట్ బుక్ మహాలక్ష్మి నాయుడు, గ్రామ సర్పంచ్, డాక్టర్ ఉమా శంకర్, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, పిల్లలు, వారి తల్లిదండ్రులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ప్రత్యేకంగా తోస కమిటీ సభ్యులు మల్ల అప్పలనాయుడు, పెంటకోట మహాలక్ష్మి నాయుడు, నరగడం వెంకటరెడ్డి నాయుడు, కొయిలాడ శివాజీ ,తదితర కమిటీ సభ్యులందరూ పాల్గొని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసారు. ప్రభుత్వ పాఠశాల గొప్పతనం ,అక్కడ పనిచేస్తున్నటువంటి ఉపాధ్యాయుల పనితీరు, భవిష్యత్తులో వారు తీసుకునేటువంటి నిర్ణయాలు, వారి కఠోర శిక్షణ, తదితర అంశాలపై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో క్వాలిటీ ఎడ్యుకేషన్ మీద జరిగిన ఈ సదస్సులో ఎంతోమంది తల్లిదండ్రులు తమ తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సంవత్సరం 10వ తరగతి పరీక్షలో 84 ఉత్తీర్ణతను, 23 500 దాటి వారి ఉత్తీర్ణతను సాధించారు. ఇది ఆ స్కూలుకి మెరుగైన ఫలితాలు ఇచ్చినటువంటి ఉపాధ్యాయ బృందాన్ని, వారి సహాయకులను, గ్రామస్తులు ఎంతో కొనియాడారు. అలాగె ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

## చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించిన ప్రత్యేక అధికారి "ప్రసాద్"

**నక్కపల్లి, ప్రభాతవార్త**




మండలంలోని కాగిత వద్ద ఉన్న చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని ఎండిఓ దెందుకూరు సీతారామరాజు ఆధ్వర్యంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా మత్స్యశాఖ అధికారి బి. ప్రసాద్ శనివారం పరిశీలించారు. సచివాలయ సిబ్బందికి నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. గ్రామంలో ఎక్కడ కూడా చెత్త కనిపించడానికి వీలులేదని, దాన్ని దృష్టిలో ఉంచుకొని



గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం సచివాలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి చర్చించిన ఆయన స్వర్ణ పంచాయతీ ఇంటి పన్నుల వసూలు విషయంలో ఆధార్ లింక్ చేయుటకు పలు సూచనలు చేశారు. ఇన్చార్జి ఈవోపీఆర్డి మజ్జి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## భాగస్వామ్యంతో యోగా శిక్షణ

**పాడేరు, మే24, ప్రభాతవార్త**





జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం పాడేరు ఆర్టీసీ డిపోనందు జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు అర్టిఎ మరియు డిపిటిఓ ఎపిఎస్ ఆర్టీసీ వారి భాగస్వామ్యంతో యోగా ట్రెనర్ మరియు మెడికల్ డిపార్ట్మెంట్ మరియు స్పోర్ట్స్ అథారిటీ డిపార్ట్మెంట్ శిక్షకులు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈకార్యక్రమంలో యోగా యొక్క విశిష్టత ఆసనాల వల్ల చేకూరే ఆరోగ్య ప్రయోజనాలు శారీరక మానసికఆరోగ్య ప్రయో జనాల గురించి ప్రయోజనాల గురించి శిక్షకులు వివరించడం జరిగింది. యోగా శిక్షకులు సూర్య నమస్కారాలును ఏ విధంగా చేయాలో తెలియజేసారు. సుమారు 70మంది ఆర్టీసీ ఉద్యోగులు, ప్రైవేటు వాహనాల డ్రైవర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని నేర్చుకున్నారు.

## న్యాయస్థానాల సముదాయం కోసం భూసేకరణ

**- చింతపల్లిలో పర్యటించిన జిల్లా జడ్జి**

**చింతపల్లి మే 24 ప్రభాతవార్త**



చింతపల్లిలో ఉమ్మడి విశాఖ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి చిన్నంశెట్టి రాజు శనివారం పర్యటించారు. చింతపల్లి కేంద్రంగా త్వరలో నిర్మించనున్న న్యాయస్థానం న్యాయమూర్తి ఇతర సిబ్బంది నివాస గృహాల సముదాయాల కోసం రెవెన్యూ అధికారులు ఇప్పటికే భూ సేకరణ జరిపారు వాటిని పరిశీలించేందుకు జిల్లా జడ్జ్ చింతపల్లి వచ్చారు. చింతపల్లి వచ్చిన న్యాయాధికారికి చింతపల్లి ప్రధమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ధరణి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. సీఐ వినోద్ బాబు ఎస్ఐ వెంకటేశ్వర్లు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న చింతపల్లి కోర్టు ప్రాంగణాన్ని జిల్లా జడ్జి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపపతహసిల్దార్ చంద్రశేఖర రావు ఆర్ అండ్ బి భరతుడు సర్వేయర్ సుధాకర్ న్యాయాధికార సంస్థ పారా లీగల్ వాలంటీర్ చిట్టిబాబు మరియు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## మాస్టర్ ట్రైనీలుగా 25 మంది రిజిస్ట్రేషన్

**- యోగా నోడల్ అధికారి లోకేశ్వరరావు**

**పాడేరు,మే24, ప్రభాతవార్త:**

స్వర్ణాంధ్ర 2025 లో భాగంగా ఈనెల 21 నుండి జూన్ 21 వరకు యోగాంధ్ర పేరుతో నెల రోజులపాటు యోగ కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో ప్రతి జిల్లా నుండి 100 మంది మాస్టర్ ట్రెనర్లుగా నమోదు చేయించాల్సి ఉండగా మన జిల్లాలో 236 మంది పిఈటిలు, పీడీలు, యోగ నైపుణ్యాలు మాస్టర్ ట్రెనర్లుగా నమోదు చేసుకున్నారని జిల్లా యోగా నోడల్ అధికారి ఎస్డిసి ఎం వి ఎస్ లోకేశ్వరరావు తెలిపారు. మాస్టర్ ట్రెనర్లు శనివారం పాడేరు, రంపచోడవరం, తాజంగి, చింతపల్లి కేంద్రాలలో యోగ సాధన చేశారు. వీరు ట్రెనర్లుగా ఎంపిక చేసిన వారికి యోగా ట్రెనింగ్ అందజేసి వారి ద్వారా గ్రామ మండల జిల్లా స్థాయిలో వివిధ కేటగిరీలకు చెందిన ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఎన్ఆర్ఈజీఎస్ వేజ్ సీకర్స్, ఎస్ హెచ్ జి సభ్యులు, పోలీస్ అటవీ శాఖల సిబ్బంది అధికారులు, పర్యాటకులు మొదలగువారితో యోగాభ్యాసం చేయిస్తారని ఆయన తెలిపారు. ట్రెనర్లగా 338 మంది ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు.

# స్పెషల్ డిఎస్సీపై సీఎం చంద్రబాబు స్పష్టమైన హామీ ప్రకటించాలి

**ముంచంగిపుట్టు, మే 24 ప్రభాతవార్త**

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంలో ఈనెల 31న సీఎం చంద్రబాబు నాయుడు పర్యటనలో ఆదివాసి ప్రత్యేక డిఎస్సీ పై స్పష్టమైన హామీ ప్రకటించాలని అల్లూరి జిల్లా ఆదివాసి స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ కన్వీనర్ జి.భాను చందర్ రావు డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా ప్రత్యేక డిఎస్సి సాధన కమిటీ ఆదేశాల మేరకు డీఎస్సీ అభ్యర్థుల కమిటీ కోకన్వీనర్స్ వెంగడ జగన్, రెయ్యల నాగభూషణంల ఆధ్వర్యంలో శనివారం స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కళ్యాణ మండపంలో వివిధ ప్రజాసంఘాల, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, నిరుద్యోగులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రత్యేక డీఎస్సీ సాధనకై తీసుకోవలసిన భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ కన్వీనర్ జి భానుచంధర్ రావు మాట్లాడుతూ మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ ఉద్యోగాలు ఇవ్వాలని, ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని పలు దఫాలుగా సాధన కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్లను విన్నవించినప్పటికీ స్పెషల్ డిఎస్సిపై రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడం ఆదివాసి నిరుద్యోగుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవు తుందన్నారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఆరు శాతం అమలైతే కేవలం 980 పోస్టులు మాత్రమే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆదివాసిలకు దక్కుతుందని, ఇందులో 5వ షెడ్యూల్డ్ ఏరియాలో ఆదివాసిలకు కేటాయించాల్సి న సుమారు 3వేల ఉపాధ్యాయ పోస్టులు స్థానిక నిరుద్యోగులు, ఉద్యోగాలు కోల్పోతారని దీంతో తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. ఇప్పటికైనా ఈ నెల 31న పాడేరు పర్యటనలో సీఎం చంద్రబాబు స్పెషల్ డిఎస్సి పై స్పష్టమైన హామీ ప్రకటించాలని ఆయన అన్నారు. స్పష్టమైన హామీ రానిపక్షంలో భవిష్యత్తులో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎం శ్రీను, కొర్ర త్రినాధ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం ఆదివాసిల గుండెకాయ లాంటి జీవో నెం.3 కు బదులుగా ప్రత్యామ్నాయ జీవో తీసుకువచ్చి మెగా డీఎస్సీలో ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయ పోస్టులను మినహాయించి ప్రత్యేక డీఎస్సీ ద్వారా నూరు శాతం ఉద్యోగాలు స్థానిక ఆదివాసిలతోనే భర్తి చేసేలా సీఎం చంద్రబాబు పర్యటనలో స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.





ఆదివాసిల హక్కులు, చట్టాల పరిరక్షణకై ఆదివాసి యువత,నిరుద్యోగులు ఉద్యమాలలో ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెదబయలు మండల కోకన్వీనర్స్ ఎన్.దిలీప్ కుమార్, ఎం.చిరంజీవి, ఎంటివి మాతృభాష ఉపాధ్యాయ రాష్ట్ర అధ్యక్షులు గణేశ్వర రావు, జిల్లా అధ్యక్షులు ఏ.కామేశ్వరరావు, సిఐటియు నాయకులు కె.శంకర్రావు, డీఎస్సీ అభ్యర్థుల కమిటీ సభ్యులు కూడ దాసు, సుఖదేవ్, గంగరాజు,జీవన్, సోనాదొర్ లతో పాటు అధిక సంఖ్యలో నిరుద్యోగులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ భూమల ఆక్రమణలు స్వాధీనంపై ప్రత్యేక దృష్టి

## - జిల్లా కలెక్టర్ ఎ.ఎస్ దినేష్ కుమార్ ఆదేశం

**పాడేరు, మే24, ప్రభాతవార్త**

ప్రభుత్వ భూముల ఆక్రమణలను స్వాదీనం పై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. ఆక్రమణల దారులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ నుండి తాహశీలద్దారులు, ఎంపిడి ఓలు, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి, మండల స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. బంజరు భూములు, ప్రభుత్వ భూములు, నీటి పారుదల భూములు, చెరువులు ఆక్రమణలను ఈనెల 31లోగా గుర్తించి రిపోర్టులు సమర్పించాలని చెప్పారు. ఆక్రమణదారులకు ఫారం 7, నోటీస్ జారీ చేయాలని సూచించారు. స్పీకింగ్ ఆర్డర్లు సిద్ధం చేయాలన్నారు. స్పీకింగ్ ఆర్డర్ జారీ చేసాక ఎన్ని రోజుల్లో తొలగిస్తారని తాహశీల్దారులను ప్రశ్నించారు. ఎల్టి ఆర్ చట్టం ప్రకారం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. పునరావాస పనులు వేగవంతం చేయండి పోలవరం ప్రాజెక్టు నిర్మాసితుల పునరావాస పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పోలవరం పునరావాస పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ వారం రోజుల్లో పునరావాస కాలనీలకు 12 గ్రామాలను తరలించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలను ఎం. బుక్ నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ, పోలవరం ప్రాజెక్టు పరిపాలనాధికారి వి. అభిషేక్, సబ్ కలెక్టర్లు శౌర్యమన్ పటేల్ కల్పశ్రీ, చింతూరు పి ఓ అపూర్వ భరత్, డి ఆర్ ఓ కె. పద్మలత, 22 మండలాల తాహశీల్దారులు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ వర్కర్ మృతి

### - నాతో కలిసి పనిచేసిన వర్కర్ మరణం బాధాకరం: ఎమ్మెల్యే

**రాజవొమ్మంగి, మే 24, ప్రభాతవార**





కింద్రా కాలనీ గ్రామంలో గల అంగన్వాడి కేంద్రంలో పనిచేస్తున్న వర్కర్ బి.రాజులమ్మ శనివారం అనారోగ్యంతో ఇంటివద్ద మరణించడం జరిగింది. బి.రాజులమ్మ పార్థీవదేహానికి ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, భర్త, నియోజక వర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్ నివాళులు అర్పించారు. కుటుంబీకులను పరామర్శించి సంతాపం తెలిపారు. నాతో పాటు కలిసి పని చేసిన వర్కర్ రాజులమ్మ మరణం చాలా బాధాకరమైన ఎమ్మెల్యే కన్నీటి పర్యంతరమయ్యారు. వర్కర్ మృతి పట్ల ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సిడిపివో ఎల్.దేవమణి, సిఐటియు నాయకులు రామరాజు, సర్పంచ్ బూసరి సత్యనారాయణ కుటుంబీకులను పరామర్శించి సంతాపం తెలిపారు. ప్రభుత్వం మట్టి ఖర్చుల నిమిత్తం రూ.15,000 లు సిడిపిఓ దేవమణి కుటుంబీకులకు అందించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, మఠం విజయ్ భాస్కర్, యం. పిపి గోము వెంకటలక్ష్మి, సర్పంచ్ బూసరి సత్యనారాయణ, రామరాజు, వర్కర్లు మంగ, సత్యవేణి, గ్రామస్తులు పాల్గొన్నారు

## సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్లను పంపిణి చేయాలి

### - సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ స్వామి నాయుడు

**అనంతగిరి, ప్రభాతవార్త**



మండలంలోని అన్ని పాఠశాలలకు ప్రణాళికబద్ధంగా సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్లను పంపిణి చేయాలనీ అల్లూరి సీతారామరాజు జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ స్వామి నాయుడు ఆదేశించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల (బాలిక) సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్ల స్టాక్ పాయింట్ ను అయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి చదువుకునే విద్యార్థుల, విద్యార్థినీ నమోదు సంఖ్య ఆధారంగా విద్యా కిట్ల ను సరఫరా చేయాలన్నారు. విద్యాబ్యాసం కోసం పాఠశాలల్లో చేరే బాల, బాలికల సంఖ్య ను పరిగణలోకి తీసుకొని ప్రధానోపాధ్యాయులుకు విద్యా కిట్లు అందజేయాలనీ మండల విద్యా శాఖధికారి కు సూచించారు. కిట్లు పంపిణిలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖధికారి కె. బాలాజీ, స్కూల్స్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్స్ గణేష్, ఆంజనేయులు, రామకృష్ణ, రవి కుమార్, సునీత, కుమారి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి పాడేరులో ట్రాఫిక్ రూల్స్ అమలు

### - పాడేరు డిఎస్పి సహబాజ్ అహ్మద్

**పాడేరు,మే24, ప్రభాతవార్త**



ఈ నెల 25 వ తేదీ నుంచి జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో ట్రాఫిక్ రూల్స్ అమలు చేస్తున్నామని పాడేరు డిఎస్పి సహబాజ్ అహ్మద్ స్పష్టం చేసారు. ట్రాఫిక్ నిబంధనలపై శనివారం ఎస్పి కార్యాలయం రోడ్డులో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన డీఎస్పి కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అయన తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే పదివేల రూపాయల జరిమానా విడింఫనున్నామని, పాడేరు డిఎస్పి సహబాజ్ అహ్మద్ తెలిపారు. వాహనాలు నడిపే వారికి .హెల్మెట్ లేకపోతే వేయి రూపాయలు జరిమానా, ఇన్సూరెన్స్ లేకపోతే వెయ్యి రూపాయలు విడించనున్నామన్నారు. ప్రమాదం జరిగితే ప్రమాద దారుడు తో పాటు వాహన యజమాని పైన కూడా కేసులు నమోదు చేస్తాం అయన హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకండి... ఏజెన్సీలో గంజాయికి యువత బానిసలు అవుతున్నారనీ గంజాయి కి దూరంగా ఉండాలని డీఎస్పీ సహబాజ్ అహ్మద్ సూచించారు.

## వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యోగ మాస్టర్స్ ఆఫ్ ట్రైనర్స్‌కు శిక్షణ

**చింతపల్లి మే 24 ప్రభాతవార్త**



యోగాంధ్ర క్యాంపైన్ ఎగ్జిక్యూటివ్ పేజ్ లో భాగంగా శనివారం జిల్లాస్థాయిలో ట్రైనర్స్ ఆఫ్ ట్రైనేర్స్ (యోగ) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో యోగా మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ యోగా శిక్షణ ఇవ్వడం జరిగిందని ఎంపీడీవో యూఎస్ వి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ చింతపల్లి జికే వీధి మండలాల నుండి వ్యాయామ ఉపాధ్యాయులు ఎంపిక చేయబడిన యోగా మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ తో లంబసింగి వెల్ఫేర్ అసిస్టెంట్ మోహన్ పర్యవేక్షణలో సర్ఫ్ ఫీజును పొందారన్నారు. అలాగే మే 27 నుండి మే 31 వరకు మండల స్థాయిలో యోగా మాస్టర్ ఆఫ్ ట్రైన్స్ ఆధ్వర్యంలో ఎంపిక చేయబడిన వారికి యోగా శిక్షణ ఇవ్వబడుతుంది అంటున్నారు. అనంతరం గ్రామస్థాయిలో యోగా ట్రైన ఆధ్వర్యంలో జూన్ 3 నుంచి 18 వరకు మూడు పేజీలలో జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో పాల్గొనే వారికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి జడ్పిటిసి పోతురాజు బాలయ్య డాక్టర్ విజయకుమార్ చింతపల్లి జికే వీధి మండలాల వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నవోదయం 2.0 కార్యక్రమానికి అందరూ సహకరించాలి

### - చింతపల్లి ఎక్సైజ్ సీఐ జే. కూర్మారావు

**చింతపల్లి మే 24 ప్రభాతవార్త**



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 2.0 కార్యక్రమానికి ప్రజలందరూ తమ వంతు సహకరించాలని చింతపల్లి ఎక్సైజ్ సీఐ జే కూర్మారావ్ అన్నారు. శనివారం గూడెం కొత్త వీధి మండలం ఆసరాడ గ్రామంలో నవోదయం కార్యక్రమం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా వల్ల కలిగే అనర్ధాలపై నాటు సారాకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాన్ని కల్పించడం జరిగిందన్నారు. నాటు సారా తయారుచేసిన అమ్మిన ఆంధ్రప్రదేశ్ ప్రొహిబిషన్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం జరిగింద న్నారు. ఆంధ్రప్రదేశ్ను నాట్ సారా రహితంగా తయారు చేసేందుకు ప్రారంభించిన నవోదయం 2.0 కార్యక్రమానికి అందరూ సహకరించాలని కోరడం జరిగిందన్నారు. నాటు సారా సేవించడం వల్ల ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, శారీరకంగా ఆరోగ్యపరంగా తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు నాటు సారాను వదిలిపెట్టాలని, తయారీకి గాని విక్రయానికి గాని పాల్పడవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాంబాబు హెడ్ కానిస్టేబుల్ రమేష్ యువత పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు

# టీడీపీ మండల పార్టీ అధ్యక్షురాలిగా కిల్లో సన్యాసమ్మ

- నియమించిన తెదేపా పార్టీ అధిష్టానం
- తెదేపా పార్టీ అధినాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు
- కార్యకర్తలు అందరి సహకారంతో మండలంలో టిడిపి బలోపేతానికి అహర్నిసలా కృషి చేస్తా
- రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తా
- తెదేపా నూతన మండల పార్టీఅధ్యక్షురాలు కిల్లో. సన్యాసమ్మ (సంధ్య)

**ముంచంగిపుట్టు, మే 24, ప్రభాతవార్త**





అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండల తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షురాలిగా కిల్లో. సన్యాసమ్మ (సంధ్య) ను తెలుగుదేశం పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా సన్యాసమ్మ శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సాధారణ కార్యకర్తగా ఉన్న తనను అధిష్టానం తాను మండలంలో పార్టీ కోసం పార్టీ బలోపేతం కోసం పడిన కష్టాన్ని గుర్తించి గతంలోతెదేపా అరకు పార్లమెంట్ మహిళ ఉపాధ్యక్షురాలుగా బాధ్యతలు అప్పగించిందని, ఇప్పుడు మరలా ముంచంగిపుట్టు మండల పార్టీ అధ్యక్షురాలిగా తనను నియమించి తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. తనకు ఇంతటి చక్కటి అవకాశం ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా,ఐ.టీశాఖ మంత్రి నారా లోకేష్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, అరకు తెదేపా ఇంచార్జ్ దొన్ను దొర, గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి. శ్రావణ్ కుమార్, ముంచంగిపుట్టు మండల దేశం పార్టీ నాయకు, పార్టీ పెద్దలకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర తెదేపా అధినాయకత్వం తనపై ఉంచిన గురుతర బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని అదేవిధంగా వర్గ విభేదాలు లేకుండా పార్టీ కార్యకర్తలు, అందరి సహకారంతో ముంచంగిపుట్టు మండలంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి తాను శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు. అందుకు మండలంలో ఉన్న దేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు అందరూ సహకరించాలని ఆమె కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముంచంగిపుట్టు మండలంలో అన్ని స్థానాల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. తెదేపా పార్టీలో కష్టపడి పనిచేసే పార్టీ బలోపేతానికి కృషి చేసే ప్రతి కార్యకర్తను పార్టీ అధిష్టానం గుర్తిస్తుందని అటువంటి వారికి పార్టీలో సముచిత స్థానం ఇస్తుందని అంతేకాకుండా కష్ట కాలంలో కార్యకర్తలకు అండగా ఉండేది తెలుగుదేశం పార్టీ తమ అధినాయకుడు నారా చంద్రబాబు నాయుడేనని ఆమె అన్నారు. పార్టీ అధిష్టానం తనకు అప్పగించిన మండల పార్టీ అధ్యక్ష బాధ్యతను చక్కగా నిర్వర్తించి మంచి పేరుతెచ్చుకుంటానన్నారు. ఈ సందర్భంగా నూతన మండల పార్టీ అధ్యక్షురాలుగా నియమింపబడిన సన్యాసమ్మను మంచం పుట్టు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముంచంగిపుట్టు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి గడ్డంగి. రామ్మూర్తి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు కిల్లో. బలరాం, టిడిపి సీనియర్ నాయకులు మాజీ మండల పార్టీ అధ్యక్షులు వంతల రామస్వామి, మండల పార్టీ ఉపాధ్యక్షులు సమాల. బాబూజీ రావు, సీనియర్ నాయకులు నాయకం శంకర్రావు, మాజీ వైస్ ఎంపీపీ రెయ్యల. కొండలరావు, ఏనుగు రా ఈ మాజీ సర్పంచ్ మజ్జి సీతారాం, తోపాటు మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సకాలంలో డిపోలకు సరుకులు చేరాలి: డి.యం పార్వతీశం

**రాజవొమ్మంగి, మే 24, ప్రభాతవార్త**



జూన్ ఒకటో తేదీ నుండి డిపోలు వద్ద ప్రారంబమయ్యే నిత్యావసర వస్తువులు పంపిణీ కార్యక్రమానికి సరుకులను సకాలంలో డిపోలకు చేర్చాలని జడ్డంగి గోడౌన్ సూపరింటెండెంట్ ఆర్. శ్రీనివాసరావు కుడి. యం పార్వతీశం సూచించారు. జడ్డంగి గోడౌన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ప్రభాతవార్తతో డియం మాట్లాడుతూ రంపచోడవరం డి. యం పరిధిలో గల కన్నాపురం, రంపచోడవరం, మారేడుమిల్లి, అడ్డతీగల, రాజవొమ్మంగి జి.సి.సి. సొసైటీలు పరిధిలో 103 డిపోలు ఉన్నాయని అన్నారు. ఒకటో తేదీ నుండి సకాలంలో ప్రతీ రోజు ఉదయం 8 గం. నుండి 12 గం., మధ్యాహ్నం నాలుగు గంటలు నుండి 8 గం. వరకూ ప్రతీ డిపో ద్వారా నిత్యావసర వస్తువులు అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. అన్ని డిపోలు. పరిధిలో. పని చేయాల్సిన సేల్స్ మెన్లు, సేల్స్ ఉమెన్లు, కాంట్రాక్ట్ సేల్స్ మెన్లు, డీలర్లు, మహిళా స్వయం సహాయక సంఘాలతో సమావేశం నిర్వహించడం జరుగుతుందని అ న్నారు. ప్రతీ డిపో సమయపాలన పాటించాలన్నారు. జి. సి. సి. లో బదిలీలు... డి యం పార్వతీశం రంపచోడవరం, చింతూరు డివిజన్ ల పరిధిలో ఇటీవల జరిగిన బదిలీలను డి. యం పార్వతీశం ప్రభాతవార్త కు తెలిపారు. రాజవొమ్మంగి అకౌంటెంట్ గౌరమ్మ అదే బ్రాంచ్‌లో మేనేజర్‌గా ప్రమోషన్ పొందారన్నారు. రాజవొమ్మంగి మేనేజర్ అడ్డతీగల మేనేజర్‌గా బదిలీ అయ్యారన్నారు. అడ్డతీగల గోడౌన్ సూపర్ డెంట్ బాబూరావు జి. మాడుగులు బ్రాంచ్ మేనేజర్ గా వెళ్లారన్నారు. చింతపల్లి డి. యం పి. దేవరాజు చింతూరు డి. యం గా బదిలీపై వచ్చారన్నారు. కన్నాపురం బ్రాంచ్ ఆఫీస్ అకౌంటెంట్ అక్కడ మేనేజర్ గా చేరారన్నారు. అడ్డతీగల బ్రాంచ్ లో పనిచేస్తున్న కె. బుచ్చిరాజు రాజమండ్రి హనీ ప్లాంట్ కు, రంపచోడవరం నుండి అకౌంటెంట్ అమ్ములు అడ్డతీగలకు, రంపచోడవరం డి. యం. కార్యాలయంలో పనిచేస్తున్న జూ నియర్ అసిస్టెంట్ సీనియర్ అసిస్టెంట్‌గా విజయవాడ ఆర్. యం. డి. ఆఫీస్ కు బదిలీ అయ్యారన్నారు.

# పెట్రోల్ బంక్ ఎంప్లాయిస్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

## - యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అమర్

**పాడేరు, మే 24, ప్రభాతవార్త**



అల్లూరి సీతారామరాజు జిల్లాలో జి సి సి మరియు ఐటిడిఎ పెట్రోల్ బంకు ల నందు పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కాన్ని కోరుతూ అల్లూరి జిల్లా పెట్రోల్ బంక్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఐటీడీఏ పాడేరు ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ ను కలిసి వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా బంక్ ఎంప్లాయిస్ సమస్యలు పీ ఓ వివరించారు. ఈ సందర్భంగ ఐటీడిఏ ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ సమస్యలపై స్పందించి పరిష్కరిస్తానని హామీ ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అమర్ మాట్లాడుతూ ఐటీడీఏ, జిసిసి పెట్రోల్ బంకుల నందు పనిచేస్తున్న ఉద్యోగులు కార్మిక చట్టాలను అమలుకు నోచుకోవడం లేదని జిల్లాలో గత పది సంవత్సరముల నుంచి జి.సి.సి. బంకుల నందు సి.ఎస్.ఎ గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు గా ఉన్నవారికి మరియు ఐటిడిఏ బంకుల నందు విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం అమలు కావడం లేదని అన్నారు. అలానే వారికి ఉద్యోగులుగా గుర్తించేటటువంటి ఉద్యోగ గుర్తింపు కార్డులని నేటికీ అందజేయలేదని అన్నారు. వారికి రావలసినటువంటి వేతనాలతో కూడిన సెలవు దినాలు, నెలకి ఇవ్వవలసిన నాలుగు రోజులు సెలవుదినాలు ఇవ్వటం లేదని మండిపడ్డారు. ఈ రెండు సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులకు నేటి వరకు పీ.ఎఫ్. ఖాతాలు తెరిపించడం లేదని, పి.ఎఫ్ డబ్బులు జమ చేయడం లేదని జీసీసీ బంక్ లలో నేటి వరకు తర్డ్ పార్టీ మ్యాన్ పవర్ ఏజెన్సీ వారు కార్మికుల శ్రమని దోచుకున్నారని దీనికి జి సి సి అధకారుల మద్దతుగా ఉన్నారని అన్నారు. ఐటీడీఏ పెట్రోలు బంక్ లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు 12 గంటలపాటు అత్యంత దారుణంగా శ్రమకు మించి విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. అలానే జిసిసి పెట్రోల్ బంకులు నందు తార్డ్ పార్టీ ఏజెన్సీ శ్రీ మొదమాంబ మ్యాన్ పవర్ ఎజెన్సీ వారికి జీసీసీ పెట్రోల్ బంక్ లో పనిచేసే వారికి ఆ మ్యాన్ పవర్ ఏజెన్సీ వారు సక్రమంగా జీతాలు చెల్లించకపోవటమే కాకుండా పి. ఎఫ్ నేటికీ చెల్లించటం లేదని అన్నారు. గత పది సంవత్సరాలు నుండి జి.సి.సి పెట్రోల్ బంక్‌లలో విధులు నిర్వహిస్తున్న వారిని జి.సి.సి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. సమావేశంలో అధ్యక్ష కార్యదర్శులు శివశంకర్, సోమేశ్ లు మాట్లాడుతూ జిసిసి పెట్రోల్ బంక్ నందు విధులు నిర్వహిస్తున్న వారిని శ్రీ మోదమాంబ మెయిన్ పవర్ ఏజెన్సీ నుండి మినహాయించి జిసిసి ఉద్యోగులుగా పరిగణలోనికి తీసుకోవాలని జిసిసి మరియు ఐటీడీఏ పెట్రోల్ బంకు నందు విధులు నిర్వహిస్తున్న వారికి తక్షణమే పి.ఎఫ్. ఖాతలను తెరిపించి నేటి వరకు బకాయి ఉన్న డబ్బులు తక్షణమే జమ చేయాలని, ఐటీడీఏ పెట్రోల్ బంకు నందు విధులు నిర్వహిస్తున్న వారికి 8 గంటల పనిసమయాన్ని అమలు చేయాలన్నారు. ఐటీడీఏ మరియు జిసిసి పెట్రోల్ బంక్ లు యొక్క సంస్థలు నండి గుర్తింపు కార్డులు వెంటనే ఇవ్వాలని, ప్రతి ఏడాది రెండు జతల యూనిఫాం మంజూరు చేయాలని, వేతనాలతో కూడినటువంటి సెలవు దినాలు, ప్రతి నెలకు నాలుగు సెలవు దినాలు మంజూరు చేయాలనీ జిసిసి మరియు ఐటీడీఏ యాజ మాన్యం అధికారులగా ఉన్నటువంటి సంబంధిత అధికారులైన సూపర్వైజర్ మరియు మేనేజర్ స్థాయి వారి సి. ఎస్.ఏలకు ఎదురవుతున్న వేధింపులు ఆపాలని, ఐటీడీఏ పెట్రోల్ బంకులలో సరిపడా సిబ్బందిని నియమించి పని ఒత్తిడి తగ్గించాలన్నారు. యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కోడా మోహన్, ఉపాధ్యక్షులు మత్స్యరాజు, సహాయ కార్యదర్శి గంగులు, నాయకులు నైకంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎండీయూ ఆపరేటర్లపై కక్ష సాధింపు సరికాదు

### - ఎంపీపీ బాకా ఈశ్వరి

**డుంబ్రిగుడ, రూరల్ మే 24, ప్రభాతవార్త**



ప్రతి గ్రామంలో ఇంటింటికి రేషన్ అందించే ఎం డీ యూ ఆపరేటర్ల పై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు సరికాదని ఎంపీపీ బాక ఈశ్వరి విమర్శించారు. ఈ సందర్భంగా శనివారం ఆమె మాట్లాడుతూ ప్రతి రేషన్ దారుడికి, అంగన్వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు బియ్యం తదితర నిత్యవసర సరుకులు అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లకు కక్షపూరితంగా తొలగించడం అన్యాయమని ఆమె డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 221 మంది జీవితాలు రోడ్డున పడ్డాయన్నారు. ఎం డీ యూ వాహనాల ద్వారా ఉత్తమ సేవలు అందిస్తున్న ఆపరేటర్ల పై 20 నెలలు గడువు ఉండగానే ఈనెల 17వ తారీఖున వారిని తొలగించే జీవో విడుదల చేయడం అన్యాయమని ఆమె తీవ్రంగా ఖండించారు. పేదల ఇళ్లకు నిత్యవసరులు సరుకులు అందించే లక్ష్యంతో వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎం డీ యూ లను నియమిస్తే ఓర్వలేని రాజకీయ కుట్ర చేస్తుందని ఆమె అన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే ఆపరేటర్లకు విధుల్లోకి తీసుకొని కొనసాగించాలని ఆమె డిమాండ్ చేశారు.

## రైలు ఢీకొని మహిళ మృతి

**డుంబ్రిగుడ రూరల్, మే 24ప్రభాతవార్త**



మండలంలోని డుంబ్రిగూడ మండలం కురిడి రైల్వే గేట్ సమీపంలో గూడ్స్ రైలు ఢీకొన డంతో గుర్తుతెలియని మహిళ శుక్రవారం రాత్రి గోరాపూర్ నుంచి అరకు వైపు వస్తున్న గూడ్స్ రైలు కురిడి రైల్వే గేట్ సమీపంలో ట్రాక్ వెంబడి నడుస్తున్న గుర్తుతెలియని మహిళ కు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మహిళ మృతి చెందింది. దీంతో సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అంగన్వాడీ వర్కర్ మరణంపై సహాయం అందజేత

**రాజవొమ్మంగి, మే 24, ప్రభాతవార్త**



కింద్ర కాలనీ గ్రామ అంగన్వాడీ వర్కర్ రాజులమ్మ శనివారం అనారోగ్యంతో మరణించడం జరిగింది. తక్షణ ప్రభుత్వ సహాయంలో భాగంగా రూ. 15వేలు మట్టి ఖర్చులు నిమిత్తం ఐసీడియస్ సి. డిపి. ఓ ఎల్ దేవ మణి భర్త మహాంకాళి, కుటుంబీకులకు అందించారు. వర్కర్ మరణం పట్ల సిడిపిఓ సంతాపం తెలిపారు. కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో సి.డి.పి.ఓఎల్ దేవమణి, సి.ఐ.టి.యు నాయకులు పుట్టా రామరాజు, వర్కర్లు మంగ, సత్యవేణి, స్థానికులు పాల్గొన్నారు.

### చిన్నారిలో మృతదేహం తరలింపులో తల్లిదండ్రులకు తీవ్ర ఇబ్బందులు

**అనంతగిరి, ప్రభాతవార్త**

మండలం పెదకోట పంచాయతీ మద్రేబు గ్రామానికి చెందిన సేదరి శైలు, అర్జున్ దంపతులు జన్మించిన రెండు నెలలు చిన్నారికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా మారడంతో కెజిహెచ్‌లో మే 8 తేదీన చేర్పించారు.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది.. అంబులెన్స్ లోని కొత్తవలస వరకు తీసుకొని వచ్చి మృతదేహం దింపి వేశారు.. అక్కడ నుంచి గిరిజనులు 6 వేలు రూపాయలు ఖర్చు పెట్టి ఆటోలో మాట్లాడుకుని సరియా వరకు చిన్నారి మృతదేహం తీసుకోవచ్చి, రాత్రి 9 గంటల సమయంలో పాప మృతదేహాన్ని భుజంపై వేసుకొని అర్ధరాత్రిలో చిమ్మచీకటిలో సుమారు 5 కిలో మీటర్లు నడుచుకుంటూ మాద్రెబ్ గ్రామానికి చేరుకున్నారు.. సరియా నుండి మద్రేబు గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు..






# స్పీకర్ అయ్యన్న చొరవతో అభివృద్ధి పథంలో ఏఎల్‌పురం

- 2 కోట్ల 71 లక్షలు నిధులు: మాజీ జెడ్పిటిసి తారక వేణుగోపాల్



**గొలుగొండ మే 24 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చొరవతో ఏ ఎల్ పురం పంచాయతీలో 2 కోట్ల 71 లక్షల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు జడ్పిటిసి మాజీ సభ్యులు చిటికెల తారక వేణుగోపాల్ తెలిపారు. బంగారం పేట సాగునీటి ఆయకట్టు గేట్లు ఛానల్ లు మరమ్మతుకు 7 లక్షల రూపాయలు మంజూరు చేశారని ఈ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన గేట్లతో 700 ఎకరాలకు సాగునీరు అందుతుందని స్పష్టం చేశారు. ఏ ఎల్ పురం, పాత కృష్ణా దేవి పేట, కొంగ సింగినాగాపురం రైతులకు ఈ ఐకట్ ప్రాణవాయువు అనిఅన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఆయాంలో నిర్లక్ష్యానికి గురైన బంగారంపేట హాయ్ కట్టు ప్రస్తుతం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిందన్నారు. వైయస్సార్ ప్రభుత్వంలో సాగునీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో రైతులకు ఎంతో నష్టం చేకూరిందని రెండు గేట్లు లేకపోవడం వల్ల వరదలు వచ్చిన సమయంలో కాలువలు పంట పొలాలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్ర నష్టం చూశారన్నారు. కోటి 72 లక్షలు తో ఏఎల్‌పురం పంచాయతీలో సిసి రోడ్లు నిర్మాణం జరిగిందని అన్నారు అలాగే ఎన్నో ఏళ్లుగా వేలాడే విద్యుత్ వైర్లతో అవస్థలు పడుతున్న పంచాయతీ ప్రజల కష్టాలకు పూర్తి పరిష్కారం దొరికిందని తెలిపారు. పంచాయతీ మొత్తం 40 విద్యుత్ స్తంభాలు వైర్లు నాలుగు ట్రాన్స్ ఫార్మర్లు మార్చేందుకు 48 లక్షలు మంజూరు చేశారని తెలియజేశారు. ఇవన్నీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదికి ఆకముందే పంచాయతీకి అధిక ప్రాధాన్యత కల్పించి సమస్యలను పరిష్కారం చేశారని అన్నారు. అలాగే అల్లూరు పార్కుకు ఇప్పటికే 20 లక్షలు ఎంపీ నిధుల నుండి కేటాయించి సుందరీకరణ పనులు జరుగుతున్నాయని మరో 80 లక్షల నిధులు సమీకరణకు కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బంగారంపేట హైకోర్ట్ చైర్మన్ మువ్వల సత్యనారాయణ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పచ్చదనం పరిశుభ్రతతో ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుంది

- రమేష్ నాయుడు, శ్రీనివాస్



**ఎలమంచిలి, మే 24, ప్రభాతవార్త**

పచ్చదనం పరిశుభ్రతతో ఆరోగ్యకరమైన వాతావరణ ఏర్పడుతుందని జనసేన నాయకులు రమేష్ నాయుడు ,శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే సుందర విజయకుమార్ ఆదేశాల మేర కు మెగా క్లీనింగ్ డ్రైవ్ అనే కార్యక్రమాన్ని మున్సిపాలిటీ పరిధిలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి గాజువాక బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద కొట్టారు శ్రీను పెట్రోల్ బంక్ నుండి కల్కి పెట్రోల్ బంకు నారాయణపురం వరకు ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు ఊటకూటి రమేష్ నాయుడు,



కొటారు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాలు మేరకు పట్టణంలోని క్లీనింగ్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడ కనపడిన తొలగించే ప్రక్రియను చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కర్రి ఝాన్సీ, కాసిం దేవుళ్ళ సతీష్, లంక రాజు, లంక ఉదయ్ కుమార్, గంధం శివ, చిట్టిబాబు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## చోడవరంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**చోడవరం, మే 24, ప్రభాతవార్త**



చోడవరం దుడ్డు వీధి శ్రీ నూకంబికా కళ్యాణ మండపంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను శనివారం చోడవరం శాసనసభ్యులు కె ఎస్ ఎన్ ఎస్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి వారిలో ఆర్థిక పరిపుష్టి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం, మహిళల్లో ఆత్మగౌరవం ఆర్థిక స్వావలంబన సాధించే లక్ష్యంతో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం కూటమి ప్రభుత్వం నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మహిళలు పాల్గొన్నారు

## వాహనాలు తనిఖీ చేపట్టిన ఎస్ఐ సన్యాసిరావు

**పాయకరావుపేట రూరల్, మే 24, ప్రభాతవార్త,**



మండలంలోని శ్రీరాంపురం సమీపంలో ఆర్ అండ్ బి రోడ్డులో శనివారం సాయంత్రం పాయకరావుపేట ఎస్ఐ ఎస్ సన్యాసిరావు తన సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ రోడ్డు మార్గంలో కార్లు, ఆటోలు, బైకులపై వెళుతోన్న వాహన చోదకులను నిలుపుదల చేసి వాహనాలు రికార్డులు, లైసెన్సులు పరిశీలించారు. గతంలో కేసులు నమోదు అయ్యి జరిమానాలు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్న వాహనదారులను గుర్తించి వారి నుంచి జరిమానా సొమ్మును రికవరీ చేశారు. వాహనాల ఇన్స్యూరెన్స్ పత్రాలను పరిశీలించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి వాహన చోదకులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇదిలా ఉండగా శ్రీరాంపురం సమీపంలో



పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తున్నారన్న సంగతి గుర్తించిన వాహన రికార్డులు సరిగాలేని పలువురు వాహన చోదకులు పోలీసుల కళ్ళుకప్పి సమీపంలోని వ్యవసాయ పొలాల్లోనుంచి తమ ద్విచక్ర వాహనాలపై తప్పించుకుపోయారు.

## గ్రంథాలయంలో కొనసాగిన సమ్మర్ ఓరియంటేషన్ కార్యక్రమం

**నర్సీపట్నం,మే 24,ప్రభాతవార్త**

నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పీ. దమయంతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ ఒరియంటేషన్ కార్యక్రమం శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి విద్యార్థుల చేత నీతి కథలు చదివించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పీ.ప్రభాకర్ విద్యార్థుల చేత ఆసనాలు వేయించారు. విద్యార్థులు వేసిన ఆసనాల వలన ఉపయోగాలు వివరించారు. ప్రతీ దీనం యోగా చేయుటవలన మనం ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు బిఎస్.ప్రసాద్ విద్యార్థులకు కొన్ని తెలుగు పదాలు ఇచ్చి వాటితో ఒక కథను రాయమన్నారు. విద్యార్థులు వారు వ్రాసిన కదలను వినిపించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రసాద్ మాస్టర్ వారిలో ఉన్న నైపుణ్యతను మెచ్చుకున్నారు. వేసవి విజ్ఞాన శిబిరం నందు చివరి వారంలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు ఉంటాయని గ్రంథాలయధికారిణి తెలిపారు. చివర్లో విద్యార్థులందరికి బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 29 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



# జనవాణిలో పవన్ కళ్యాణ్‌తో "బోడపాటి"





**నక్కపల్లి, ప్రభాతవార్త**

జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో మంగళగిరి రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ప్రతిష్టాత్మకంగా ప్రతిరోజు నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమానికి హాజరైన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివ దత్తు హాజరయ్యారు. ఆ సందర్భంలో ఒక సామాన్యురాలు తన సమస్యను తెలుసుకునే విషయంలో పవన్ కళ్యాణ్ ఆశ్చర్యానికి లోనైన సంఘటన నేరుగా చూసిన శివ దత్తు అదే స్ఫూర్తితో ప్రజల్లో వారి సమస్యల పరిష్కారానికి పని చేస్తే పూర్తిస్థాయిలో మంచి ఆదరణ ఉంటుందని అది నేరుగా అధినేత పవన్ కళ్యాణ్ లో చూసానని ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్క జనసేన కార్యకర్త పనిచేస్తే ప్రజల సమస్యలు పరిష్కారానికి ఎంతో ఉపయోగపడుతుందని, ఈ సందర్భంగా స్థానిక విలేకరులకు తెలిపారు. ప్రజల సమస్యలను అధినేత పవన్ కళ్యాణ్ తెలుసుకున్న సందర్భం వారికి ధైర్యం కల్పించిన సందర్భం చూస్తే ప్రజల కోసం కష్టపడాలనే ఆలోచన పెరిగిందని, అదే స్ఫూర్తితో భవిష్యత్తులో పనిచేస్తామని, జనవాణి లో వచ్చిన ప్రతి సమస్యను భవిష్యత్తులో పరిష్కారమయ్యే వరకు అధికారులు వెంబడి పడతామని చెప్పారు.

## ప్రభుత్వం అంటే మైనింగ్ అక్రమార్కులకు లెక్కలేని తనం

- అధికారుల నిబద్ధతపై సంశయం
- అక్రమాలు వెలుగులోకి తెచ్చి ఆగని అక్రమ మైనింగ్ మండి పడుతున్న చోడవరం జనసేన రాజు

**చోడవరం, మే 24, ప్రభాతవార్త**



చోడవరం మండలంలో పలు గ్రామాల్లో జరుగుతున్న ఇసుక, గ్రావెల్ అక్రమ మైనింగ్ పై 23న క్షేత్ర స్థాయిలో పర్యటించి అక్రమ మైనింగ్ కార్యకలాపాలు నిజమే అని పూర్తి సాక్ష్యాధారాలతో సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ఈ మైనింగ్ నిరాటంకంగా కొనసాగుతుందని చోడవరం నియోజవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి పివీఎస్ ఎన్ రాజు మండిపడ్డారు. శనివారం ఆయన మాట్లాడుతూ అక్రమ మైనింగ్లు కొనసాగుతున్నాయంటూ స్థానిక ప్రజలు,జనసేన శ్రేణులు తన దృష్టికి తీసుకు వచ్చారని దానికి సంబందించిన ఫోటోలు, వీడియోలు పంపారని తెలిపారు. దీనిని బట్టి అక్రమార్కులకు ప్రభుత్వం అంటే లెక్కలేదని, తమను ఎవరు ఏమి చెయ్యలేరని ధీమాతో చెలరేగి పోతున్నారన్నారు. ఈ విషయంలో కొంత మంది అధికారుల నిబద్ధతపై సంశయం కలుగుతుంది అన్నారు. ఈ విధ్వంసాన్ని కూటమి ప్రభుత్వం సహించదని, ఈ విషయాన్నీ జిల్లా కలెక్టర్ దృష్టికి వ్యక్తిగతంగా కలసి అన్ని విషయాలు తెలియచేసి అక్రమ మైనింగ్ కార్యకలాపాలను ఆపుతామని ఆయన అన్నారు.

## విజ్ఞానదాయకంగా చోడవరం చిల్డ్రన్స్ క్లబ్ సమ్మర్ క్యాంప్

**చోడవరం, మే 24, ప్రభాతవార్త**



పిల్లల్లో శాస్త్రీయ, విజ్ఞానదాయక విషయాల పై మరింత లోతుగా అవగాహన కల్పించేందుకు చిల్డ్రన్స్ క్లబ్ నిర్వహిస్తున్న వేసవి శిబిరాలు ఎంతో దోహదపడతాయని చిల్డ్రన్స్ క్లబ్ రాష్ట్ర అధ్యక్షురాలు కోరట్ల రమ ప్రభ అన్నారు. గతఐదు రోజులుగా చోడవరంలో అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్ సౌజన్యంతో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా ఈ సందర్భంగా మాట్లాడుతూ..శాస్త్రీయ దృక్పదాన్ని అలవర్చటంతో పాటు నేటి పిల్లలు టీవీ, మొబైల్ లాంటి సాధనాలకు బానిసలు కాకుండా ఉంచేందుకు ఈ శిబిరాలు ఎంతో ఆనందాన్నిస్తున్నాయని అన్నారు. ఆటపాటలతో నిర్వహించిన ఈ శిబిరాలలో పిల్లలు పెద్ద ఎత్తున అందుకే పాల్గొంటున్నారన్నారు. ఐదు రోజులు పాటు పిల్లలను ఎంతో అలరించే విధంగా మంచి కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులను రమాప్రభ అభినందించారు. వివిధ రకాల మైండ్ గేమ్ ల తో పాటు క్రాఫ్ట్, డ్రాయింగ్ ,హ్యాండ్ రైటింగ్, యోగ, సైన్స్ ప్రయోగాలు, కథ చెప్పుదాం, అభ్యుదయ గీతాలు ఆలాపన, మ్యాజిక్ షోలు, ఆటలు పాటలతో ఈ ఐదు రోజులు పిల్లలు పెద్ద సంఖ్యలో ఈ శిబిరంలో పాల్గొన్నారని, ఈ క్యాంపు ఎంతో విజయవంతం అయిందని నిర్వాహకులుగా వ్యవహరించిన కె.గోవింద మాస్టారు తెలియజేశారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో నిర్వహించిన కార్యకలాపాలను భవిష్యత్తులో కూడా ఒక క్లబ్ రూపంలో వీటిని కొనసాగించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. శనివారం వెంకటేష్ నాయక్ శ్రీరామ్ శాస్త్రి ల మ్యాజిక్ షోలు పిల్లలను ఎంతో అలరించాయి. ఐదు రోజులపాటు రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించిన క్రాఫ్ట్ టీచర్ జ్యోతిర్మయి, హ్యాండ్ రైటింగ్ నగేష్, మ్యాజిక్ షో మాస్టర్స్ నాయక్, శాస్త్రి, కథ చెబుదాం మాస్టర్ వాసు తదితరులను కండువాలతో సత్కరించారు. చిరస్రబ్ రాష్ట్ర కన్వీనర్ రమాప్రభను సత్కరించారు. ఐదు రోజులు పాటు పాల్గొన్న పిల్లలందరికీ బహుమతి ప్రధానం చేశారు. క్లబ్ ఆవిర్భావానికి సూచికంగా రమాప్రభ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్ జిల్లా కన్వీనర్ బి ఉమామహేశ్వరరావు, మధ్యాహ్న భోజనం కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గూడూరు వరలక్ష్మి సిఐటియు నాయకులు పివి శ్రీనివాసరావు ప్రేమ్ చంద్ర శేఖర్ రైతుసంఘం నాయకులు ఎస్‌వినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్ర విశ్వవిద్యాలయం డిగ్రీ ఫలితాలలో రెండవ ర్యాంకు సాధించిన స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థిని

**పాయకరావుపేట మే 24 ప్రభాతవార్త :**



ఆంధ్ర విశ్వవిద్యాలయం 2022 2025 డిగ్రీ విద్యార్థుల పరీక్ష ఫలితాలలో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థిని మాకిరెడ్డి జయంతి బిఎస్సి విభాగమునందు యూనివర్సిటీ రెండో ర్యాంకు జిల్లా మొదటి ర్యాంకు సాధించడం జరిగింది. బి బి ఏ విభాగమునందు నక్కా షారా జిల్లా రెండవ ర్యాంకు సాధించడం జరిగింది .సయ్యద్ గుల్ఫీ షాన్, మద్దూరి కాశీ అన్నపూర్ణ జిల్లా మూడో ర్యాంకు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ. రామకృష్ణారెడ్డి



తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సి.హెచ్.వి.కే. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు అభినందించారు.

# పచ్చదనం, పరిశుభ్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

- ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

**అనకాపల్లి, మే 24, ప్రభాతవార్త**



పచ్చదనం పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. అచ్యుతాపురం టు పరవాడ వెళ్ళు నాగవరం రహదారి వద్ద చేపట్టిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ అధికారులు సచివాలయ ఉద్యోగులు పంచాయతీ సిబ్బంది టిడిపి జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే సుందరపు, జిల్లా కలెక్టర్ తో పాటు రహదారుల పరిశుభ్రత లో పాల్గొన్నారు. పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమం లో భాగంగా అచ్చుతపురం టు పరవాడ రోడ్డుకి ఇరువైపులా ఉన్న చెత్త సేకరించి ట్రాక్టర్లకు లోడ్ చేసి డంపింగ్ యార్డ్ లకు తరలించడం జరిగింది. ఆ విధంగా ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతలో భాగంగా మెగా క్లీనింగ్ డ్రైవ్ లో పాల్గొని వారి వారి సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం, ఎండిఓ ఎమ్మార్వో ఏపీవో తదితర ప్రభుత్వ అధికారులు సిబ్బంది మరియు పెద్ద ఎత్తున మునగపాక మండల టిడిపి జనసేన బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# యోగా మన ప్రాచీన సంస్కృతి: జిల్లా ఆయుష్ శాఖ అధికారి కె లావణ్య

అనకాపల్లి, మే 24, ప్రభాతవార్త

యోగతో ప్రతీ ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని జిల్లా ఆయుష్ శాఖ అధికారి డాక్టర్ కె లావణ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని "యోగాంధ్ర 2025" కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం స్థానిక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో 25 మంది యోగ గురువులు చేత 100 మంది మాస్టర్ ట్రైనీలకు యోగా ప్రోటోకాల్ ట్రైనింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మే 21 నుంచి జూన్ 21 వరకు నెల రోజులు పాటు జిల్లా మండల గ్రామ స్థాయిలో వివిధ యోగా కార్యక్రమాలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు చెప్పారు. యోగా మన ప్రాచీన సంస్కృతి, యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి నుండి ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఇప్పుడున్న బిజీ షెడ్యూల్ లో ప్రతీ ఒక్కరు తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టడం లేదన్నారు. అందువల్ల చిన్న వయసులోనే మధుమేహం, దృష్టి లోపం వస్తున్నాయని, దీని వల్ల మన శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతోందని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ యోగా చేయడం వల్ల రోజంతా ఎంతో ఉత్సాహంగా ఉంటారని, అలసట ఉండబోదని ఉద్బోదించారు. ఈ శిక్షణ కార్యక్రమం లో జిల్లా పర్యాటక శాఖ అధికారి కె మనోరామ జిల్లా, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె వి జ్యోతి, ఆయుష్ విభాగం వైద్యాధికారులు, యోగా ఇన్స్పెక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల కోసమే ప్రజా దర్బార్

### -ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి

కురుపాం, మే 24 ప్రభాతవార్త: కురుపాం నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదేశ్వరి అన్నారు. శనివారం



గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ , కురుపాం శాసనసభ్యులు ప్రత్యేక ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో పలు గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో ఎమ్మెల్యేకు అందజేశారు. వెంటనే పరిష్కారం అయ్యేవి సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కరించారు. మిగతా కొన్ని వినతులను సంబంధిత శాఖల వారికి బదిలీ చేసి పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

## వయసు నిర్ధారణ చేసి వృద్ధులకు ఫించన్లు మంజూరు చేయాలి

### జన జాగృతి కన్వీనర్ శీరాపు

శృంగవరపుకోట, మే 25 ప్రభాతవార్త: అర్హత గల వృద్ధులకు వయసు నిర్ధారణ చేసి ఫించన్లు మంజూరు చేయాలని ఉత్తరాంధ్ర జన జాగృతి కన్వీనర్ శీరాపు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఇప్పటికే ఆయన పలువురు ప్రజా ప్రతినిధులకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు



తాజాగా శనివారం ఎస్.కోటలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజును కలిసి ఆయన ఒక వినతిపత్రం అందజేశారు. జిల్లా మొత్తం మీద దాదాపు మూడు వేలకు పైగా చాలా మంది వృద్ధులు 60ఏళ్ళ నుంచి 70ఏళ్ళు దాటారని వారికి ఆధార్ కార్డులలో గతంలో 5055 ఏళ్లుగా వయసు నమోదు జరిగిందని వారు ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ఫించన్లకు వారు దూరమవుతున్నారని ఆయన తెలిపారు. అర్హులైన వృద్ధుల వయసు నిర్ధారణ కోసం ప్రభుత్వం అన్ని కలెక్టరేట్ కార్యా సంబందిత అధికారులతో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయాలని ఆయన తెలిపారు. అలాగే సమాచార శాఖ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని మూడ నమ్మకాల నిర్మూలన చట్టాన్ని కూడా పక్కాగా అమలు చేయాలని ఈవిషయాన్ని శాసన మండలిలో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ రఘురాజుకు అందించిన వినతిపత్రంలో జన జాగృతి కన్వీనర్ శీరాపు పేర్కొన్నారు.

## శత జయంతి సందర్భంగా సొంత నిధులతో ఆసుపత్రి అభివృద్ధి



బొబ్బిలి, మే 24 ప్రభాతవార్త: బొబ్బిలి రాజావారి శతజయంతి ఉత్సవాల సందర్భంగా బొబ్బిలి ప్రభుత్వాసుపత్రి సొంత నిధులతో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ఆర్‌విఎస్‌కెకె రంగారావు ఆసుపత్రి సూపరింటెండెంట్ తెలియజేశారు. శనివారం ఆసుపత్రికి ఎమ్మెల్యే చేరుకొని ఆసుపత్రిలో ఏమేమి అవసరమై ఉందునో వాటిపై ఒక నివేదిక ఇవ్వండి. నా సొంత నిధులతో వాటిని సమకూర్చి పెడతానన్నారు. ఈ కార్యక్రమం లో ఆసుపత్రి ప్రభందికులు గేదెల శశిభూషణరావు ఇతర డాక్టర్లు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతలు ద్వారా నీటి నిల్వలకు శ్రీకారం

గరివిడి, మే,24 ప్రభాతవార్త: ఇంకుడు గుంతలు ఏర్పాటు ద్వారా నీటి నిల్వలకు గరివిడి పశువైద్య విద్యార్థులు, ఎన్.ఎస్.ఎస్ వలంటీర్లు శ్రీకారం చుట్టారు. తమ కళాశాల ప్రాంగణంలో నీటి నిల్వలు



ద్వారా భవిష్యత్ తరాలకు నీరు అందించే బృహత్తర కార్యక్రమానికి వారు నాంది పలికారు. స్వచ్ఛ ఆంధ్రాలో భాగంగా స్థానిక పశువైద్య కళాశాల ఎన్.ఎస్.ఎస్ విభాగం నేతృత్వంలో నీరు-మీరు కార్యక్రమంలో నీటి నిల్వపై కార్యక్రమం నిర్వహించారు. ఇంకుడు గుంతలు తవ్వారు. పరిసరాల పరిశుభ్రత చేపట్టారు. కాలువల్లో పూడిక తీసిన విద్యార్థులు, నీటివృధా అరికట్టే విధానంపై అవగాహన పెంచారు. నీటి వృధాతో భవిష్యత్తు తరాలకు నీటి సమస్య ఎదురవుతుందని ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మక్కేన శ్రీను విద్యార్థులకు వివరించారు. నీటి వృధాని అరికట్టాలని ఆయన పేర్కొన్నారు. నీటి అవసరాన్ని గుర్తించి వాడాలన్నారు. కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ అధికారి సి.హెచ్.జ్యోతిశ్రీ, డాక్టర్ ఎస్.గంగునాయుడు, డాక్టర్ వై.స్వాతి, డాక్టర్ కె. మనోజ్ పాల్గొన్నారు. వలంటీర్లు, విద్యార్థులు నీరు-మీరు కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు.

## 'దేశం త్యాగమూర్తుల త్యాగాలు తెలుసుకోవడం ధర్మం'



రామభద్రాపురం, మే 24 ప్రభాతవార్త: రామభద్రపురం శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవి విజ్ఞాన తరగతుల కార్యక్రమం లో భాగంగా ముందుగా విద్యార్థినీ విద్యార్థులచే మన స్వాతంత్ర్య ఉద్యమ నాయకులైన గాంధీజీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు మొదలైన దేశ నాయకుల కథలను చదివించడం జరిగింది. అనంతరం విద్యార్థుల మెదడుకు పదును పెట్టే క్యారమ్స్, లూడో, వైకుంఠపాళీ వంటి ఆటలు మరియు శారీరక దృఢత్వం కొరకు వాలీబాల్ ఆటను ఆడించడం జరిగింది. విద్యార్థుల విజ్ఞాన వికాసానికి ఈ వేసవి విజ్ఞాన తరగతులు ఎంతో దోహద పడతాయని కావున ప్రతీ విద్యార్థి గ్రంథాలయాన్ని వినియోగించుకొని విజ్ఞానవంతులు కావాలని లైబ్రేరియన్ బి.సత్యవాణి తెలియజేశారు.

## సారా రహిత గ్రామంగా రజ్జిలి గుర్తింపు: సీఐ శ్రీనివాసరావు

కురుపాం, మే 24 ప్రభాతవార్త:ప్రజలలో అవగాహన పర్చి పలు గ్రామాలలో సారా లేకుండా సారా రహిత గ్రామాలుగా గుర్తించినట్లు కురుపాం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం కురుపాం మండలంలోని ఎగులవడ పంచాయతీ రజ్జిలి అనే సి కేటగిరి




గ్రామాన్ని నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా రహిత గ్రీన్ విలేజ్‌గా ప్రకటించారు. మూడు నెలల కాలం నుంచి ఈ గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించడం, ప్రతీ రోజూ దాడులు చేయడం, తనిఖీలు నిర్వహించమన్నారు. గ్రామంలో ఉన్న పాత సారా ముద్దాయిలను బైండోవర్ చేయడం వలన మూడు నెలల కాలంలో సదరు రజ్జిలి గ్రామంలో నాటు సారా తయారు చేసినట్టుగానీ, అమ్మినట్టుగాని ఒక్క ఫిర్యాదు రాలేదు మరియు ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. కనుక ఈ గ్రామాన్నీ నాటు సారాలేని గ్రీన్ గ్రామంగా డిక్లేర్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస్‌రావు, దత్తత తీసుకున్న అధికారొ వై.కొండలరావు, గ్రామ సర్పంచ్ పత్తిక భుజంగరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ జె.రాజశేఖర్, విర్ఓ రామకృష్ణ యూత్ లీడర్లు రాజ్‌కుమార్, మణికంఠ, చిరంజీవి,పెద్దలు, యువకులు, స్వయం సహాయక గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

**అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు:** మద్యం షాపులలో ఎమ్మార్పీ ధరలు కంటే అధిక ధరలకు అమ్మకాలు చేసిన షాపులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. అలాగే రాత్రి 10 గంటలు దాటిన తర్వాత అమ్మకాలు చేసిన షాపులను సీజ్ చేస్తామని ముమ్మురంగా తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## 'జనసేన' కార్యకర్తలకు ఎమ్మెల్యే నాగమాధవి పరామర్శ

నెల్లిమర్ల, మే 24 ప్రభాతవార్త: మండలంలోని కొత్తపేట గ్రామంలో వైసీపీ, జనసేన వర్గీయులు మధ్య జరిగిన కొట్లాటలో గాయపడిన జనసేన కార్యకర్తలను ఎమ్మెల్యే లోకం నాగమాధవి నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. కొత్తపేటలో ఇరు వర్గాల మధ్య జరిగిన వివాదంలో వైసిపికి చెందిన గ్రామ



సర్పంచ్ అట్టాడ శ్రీనివాసరావుతో పాటు, జనసేన పార్టీకి చెందిన సువాని రమణ, మరో ముగ్గురు కార్యకర్తలు గాయపడిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే లోకం నాగ మాధవి శుక్రవారం రాత్రి హుటాహుటిన నెల్లిమర్ల నిమ్స్ ఆస్పత్రికి వెళ్లి జనసేన కార్యకర్తలను పరామర్శించారు. వివాదం పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనసేన కార్యకర్తలపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. అలాగే జనసేన పార్టీ నాయకులు చన్నమల్లు వెంకటరమణ, కరుమజ్జి గోవిందరావు, అంబల్ల అప్పలనాయుడు, ఎడ్ల గోవిందరావు తదితరులు కూడా క్షతగాత్రులను పరామర్శించారు. కాగా ఇదే వివాదంలో గాయపడి విజయనగరం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైసీపీకి చెందిన సర్పంచ్ అట్టాడ శ్రీనివాసరావును మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జడ్పిటిసి గదల సన్యాసినాయుడు, పార్టీ సీనియర్ నాయకుడు అంబల్ల శ్రీరాములు నాయుడు, టూరిజం కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు తదితరులు వేరువేరుగా పరామర్శ చేసి శ్రీనివాసరావు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
వార్త

## హౌస్ హోల్డింగ్ మ్యాపింగ్‌పై అవగాహన లేని సచివాలయ సిబ్బంది!

### -రేషన్ కార్డు కోసం ప్రజల పడిగాపులు !

మెరకముడిదాం, మే 24 ప్రభాతవార్త: మెరకముడిదాం మండలంలో అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు జారీ చేయాలని పలు నిబంధనలను సడలించి ప్రజలకు ఊరట కలిగించారు. దేవుడు వరమిచ్చిన పూజారి వరం ఇవ్వని విధంగా సచివాలయ సిబ్బంది తీరు ఉంది. సిబ్బంది అవగాహన లోపంతో ఇబ్బందులు ఎదుర్కోవల్సిన దుస్థితి ఏర్పడింది. ఈనెల 7 తేదీ నుంచి కొత్త కార్డులు పేర్లు జోడింపు, తొలగింపు, ఆధార్ సీడింగ్ దిద్దుబాటు, చిరునామా మార్పు, కార్డులు విభజన, సరెండర్ వంటి వాటిని దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. గతంలో ఇంటింటికి వెళ్లి వాలంటీర్లు హౌస్



హోల్డింగ్ మ్యాపింగ్ అస్తవ్యస్తంగా ఉండటంతో పెళ్లయ్యి అత్తవారింటికి వచ్చిన కోడలు రేషన్ కార్డులో ఉన్నప్పటికీ, హౌస్ హోల్డింగ్ మ్యాపింగ్ కన్నవారి ఊరిలో చూపిస్తుంది. ఈ సమస్యకు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించి మ్యారేజ్ మైగ్రేషన్ ద్వారా వెసులుబాటు కల్పించారు. ఈ విషయం తెలియకుండా కొందరు సచివాలయ సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో పాటుగా సచివాలయంలో మండలములో కంప్యూటర్ల మొరాయించడం గుదిబండగా మారింది. కావున ఇప్పటికైనా లబ్ధిదారులను గందరగోళానికి గురి చేయకుండా తగు న్యాయం చేయవలసిందిగా మండల ప్రజానీకం మొరపెట్టుకుంటున్నారు.

## యోగాంధ్రతో మన ఆరోగ్యమే మహా భాగ్యం : కమీషనర్

సాలూరు, మే 24 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం రోజు యోగా చేయాలని అలాగే మన ఆరోగ్యమే మహా భాగ్యమని మున్సిపల్ కమీషనర్ డి.టి.వి.కృష్ణారావు స్పష్టం చేశారు. అందులో



భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం శనివారం కమీషనర్ ఆధ్వర్యంలో పట్టణ శ్రీనివాస కాలనీ దగ్గర ఉన్న కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం మండపంలో నిర్వహించారు. అలాగే యోగాభ్యాసంలో యోగ గురువులు సూచనలు మేరకు కమీషనర్ కృష్ణారావు, డాక్టర్ ఎస్.శివకుమార్, మునిసిపల్ సిబ్బంది ఇంకా ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొని వివిధ ఆసనాలు వేశారు. అనంతరం కమీషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు యోగాంధ్ర మాసోత్సవాలు కార్యక్రమం మే 21 నుండి జూన్ 21 తేదీ వరకు ఉంటుందన్నారు. అలాగే జూన్ 21న జాతీయ యోగా దినోత్సవంతో ముగుస్తోందని క్లారిటీ ఇచ్చారు.

## వాడి వేడిగా ఎల్.కోట మండల సర్వసభ్య సమావేశం

లక్కవరపుకోట, మే 24 ప్రభాతవార్త: లక్కవరపుకోట మండల సర్వసభ్య సమావేశం శనివారం వాడి వేడిగా జరిగింది. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షత వహించిగా ఎంపీడీవో మండల అభివృద్ధి పనులు ఇతర సమస్యలకి సంబంధించి గత సమావేశంలో జరిగిన తీర్మానాలపై విశ్లేషించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి పాల్గొన్న సర్పంచులు ఎంపీటీసీలు ఆయా గ్రామాల సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా అధికారులు సమాధానాలు ఇచ్చారు. అధిక శాతం విద్యుత్ సమస్యలపై సభ్యులు ప్రశ్నలు సంధించారు. దీనికి విద్యుత్ శాఖ నుంచి పాల్గొన్న జేఈ వెంకట సత్యం సభ్యుల



ప్రశ్నలకు సమాధానాలు తెలియజేశారు. ముఖ్యంగా గేదెలువానిపాలెం పంచాయతీ వేచలవానిపాలెంలో నిబంధనలకు విరుద్ధంగా కేటగిరీ2 మీటర్ మంజూరు చేశారని, ఆ మీటర్ ద్వారా నిబంధనకు విరుద్ధంగా వేసిన అగ్రికల్చర్ బోర్‌ని వినియోగించి మీటర్ పొందిన వ్యక్తి తనకు గల పొలానికి నీరు పెడుతున్నాడని వైసీపీ ప్రభుత్వంలో అక్కడ 250 మీటర్లలోపు బోరు తవ్వడం కారణంగా కరెంటు కనెక్షన్ అధికారులు ఇవ్వలేదని ఇప్పుడు కనెక్షన్ ఎలా ఇచ్చారని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపీపి సూచించారు. అలాగే చందులూరులో పంచాయతీ తీర్మానం లేకుండా అనేక పనులు చేస్తున్నారని ఆర్ అండ్ బి రోడ్డుపై 60 లక్షలు ఎన్ఆర్ఈజిఎస్ నిధులతో సీసీ రోడ్డు వేశారని ఇలాగే మరి కొన్ని పనులు అనుమతి లేకుండా చేస్తున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. పిఆర్ ఎఈ, ఆర్అండ్‌బి ఏఈలు స్పందిస్తూ తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, బిల్లులు కూడా చేయలేదని సభకు తెలిపారు. అలాగే వైసీపీ పార్టీ సర్పంచ్‌లు వున్నా చోట బిల్లులు పెట్టడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని జమ్మదేవిపేట సర్పంచ్ సభలో ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా గృహాలు కావలసిన వాళ్ల స్థలాలు ఉంటే హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని హౌసింగ్ ఏఈ తెలిపారు. ఇంటి స్థలం లేని వాళ్ళకి మూడు సెంట్లు ఇల్లు స్థలాలు ఇచ్చినందుకు ప్రభుత్వం పరిశీలన చేస్తుందని ఇప్పటికే ఇల్లు స్థలాలు ఇచ్చి ఇప్పటి వరకు ఇల్లు కట్టుకొని వాళ్ళ పట్టాలు రద్దుచేసి అర్హులకు మళ్ళీ మూడు సెంట్లు స్థలం ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రెవిన్యూ అధికారులు ఆ పనిలో వున్నారన్నారు. ఎన్ని సార్లు జనరల్ బాడీలో కొన్ని సమస్యలు లేవనెత్తినా అధికారులు చర్యలు తీసుకోనప్పుడు సభకు రావడం ఎందుకని ఎంపీటీసీ యడ్ల కిషోర్ అన్నారు. ఇలాగే ఉంటే ఇంకా సమావేశం పెట్టడం వృధా అని మిగిలిన సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అధికారం ఎవరిది అయినా రాజ్యాంగం స్ఫూర్తితో అందరం వ్యవహరించాలని ఎంపీపీ సభలో అన్నారు. ఈ సభలో అన్ని శాఖల అధికారులు నాయకులు పాల్గొన్నారు.

## 'పాలవలసలో మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యం'



గుర్ల, మే 24 ప్రభాతవార్త: పాలవలస గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పనకు తన వంతు కృషి చేస్తానని మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీ ప్రతినిధి పొట్నూరు సన్యాసినాయుడు పేర్కొన్నారు. శనివారం పాలవలస గ్రామంలో రెండు లక్షలు రూపాయలు వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభోత్సవం చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి తన వంతు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామాభివృద్ధి ప్రజలందరూ సహకారంతో జరుగుతుందని ఇందుకోసం అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వల్లూరు రాము, అప్పలనాయుడు, బంగారునాయుడు, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కురుపాం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఎస్పీ



కురుపాం, మే 24 ప్రభాతవార్త: కురుపాం పోలీస్ స్టేషన్‌ను డి.ఎస్.పి ఎం.రాంబాబు అకస్మాత్తుగా తనిఖీ చేశారు. శనివారం తనిఖీ నిమిత్తం విజిట్ చేశారు. స్టేషన్ రికార్డ్స్ మరియు కేసు ఫైళ్లు చెక్ చేస్తూ పెండింగ్‌లో ఉన్న కేసు ఫైళ్లను త్వరగా క్లియర్ చేయమని ఆదేశాలిచ్చారు. సిబ్బందికి డ్యూటీ మరియు క్రమశిక్షణ గురించి తెలియజేశారు.

## టిడిపి కార్యకర్తలకు నిత్యం అండగా ఉంటాం

### -'మహానాడు'కు అధిక సంఖ్యలో తరలిరావాలి -పార్టీ సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్

నెల్లిమర్ల, మే 24 ప్రభాతవార్త: టిడిపి కార్యకర్తలకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని, కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దని పార్టీ సీనియర్ నాయకుడు విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో రవి శేఖర్



మాట్లాడారు. త్వరలో కడపలో జరుగనున్న టిడిపి మహానాడు కార్యక్రమానికి పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యకర్తలకు తాము భరోసాగా నిలుస్తామని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్‌తో పాటు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, పార్టీ నాయకులు బొంతు వెంకటరమణ, అట్టాడ శ్రీధర్, రెడ్డి వేణు, అవనాపు సత్యనారాయణ, బోనుమతి ఆదినారాయణ, బైరెడ్డి నాగేశ్వరరావు,నల్లం శ్రీనివాసరావు, పోతల రాజప్పన్న, గురాణ చక్రధర్, బైరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## చీపురుపల్లిలో చోరీ.. ఇద్దరు వృద్ధ మహిళలపై దాడి

చీపురుపల్లి, మే 24 ప్రభాతవార్త : చీపురుపల్లి పట్టణంలోని ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఇంటిలో భారీ చోరీ విధ్వంసం జరిగింది. శనివారం తెల్లవారుజామున జరిగిన ఈ సంఘటనలో ఇద్దరు వృద్ధ మహిళలు తీవ్రంగా గాయపడడంతో చీపురుపల్లి పట్టణంలో ఈ దోపిడీ సంఘటన సంచలనం సృష్టించింది. చీపురుపల్లి-రాజాం ప్రధాన రహదారికి ఆనుకొని నూతనముగా నిర్మాణం చేపడుతున్న రైల్వే బ్రిడ్జి సమీపంలో జరిగిన ఈ సంఘటన స్థానికంగా సంచలనం రేకెత్తించింది. చీపురుపల్లి పట్టణానికి చెందిన వారణాసి సురేష్ అనే వ్యక్తి ఇంటిలో వారణాసి కస్తూరి, వైశ్యరాజు



చిట్టితల్లి అనే ఇరువురు వృద్ధ మహిళలు నిద్రిస్తుండగా అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని దుండగులు ఇంటి వెనుక వైపు నుండి ఇంటిలోకి చొరబడి దోపిడీకి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇద్దరు వృద్ధ మహిళలు వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించగా మారణాయుధాలతో వారిపై విచక్షణంగా దాడి జరిపి తలకు తీవ్ర గాయాలు జరిపారు. ఈ క్రమంలో ఇద్దరు వృద్ధ మహిళలు తీవ్రంగా గాయపడి అస్వస్థతకు గురికావడంతో దుండగులు తమ పనిని పూర్తి చేసుకుని వెళ్లిపోయారు. శనివారం తెల్లవారుజామున పాలు పోయడానికి వచ్చిన పాల వ్యాపారి ఇద్దరు వృద్ధ మహిళలు గాయపడి ఇంటిలో పడి ఉన్న దృశ్యాన్ని చూసి సమీప బంధువులకు సమాచారం అందజేశారు. అనంతరం చీపురుపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వృద్ధ మహిళలను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉండడంతో తరలించినట్లు పోలీసు వర్గాలు వివరించాయి. ప్రత్యేకించి మారణ ఆయుధాలతో తల భాగంలో బలమైన గాయాలు చేయడంతో మహిళలు అపస్మారక స్థితిలోకి చేరుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం డిఎస్పి రాఘవులు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శంకర్రావు చీపురుపల్లి, గరివిడి, మెరకముడుదాం పోలీస్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీంతో పాటు జాగిలాలను కూడా రంగంలోకి దింపి దర్యాప్తును ప్రారంభించారు. ఈ దోపిడీతో పాటు మహిళలపై దాడికి పాల్పడిన దుండగుల ముఠా ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఉంటారని స్థానిక పోలీస్ అధికారులు నిర్ధారించుకొని దర్యాప్తు ప్రారంభించారు. దోపిడీ జరిగిన ఇంటికి సంబంధించి ఇంటి యజమాని వారణాసి సురేష్ తీర్థయాత్రలో ఉండగా ఇంటిలో నివాసం ఉంటున్న ఇద్దరు మహిళలపైనే దాడి జరిగి ధోబియత్నం జరిగిందని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. దోపిడీ లో ఏ మేరకు నష్టం జరిగింది ఇంటి యజమాని సురేష్ ఇంటికి చేరుకుంటే తప్ప ఏ మేరకు నష్టం జరిగిందో తెలియ రాలేదంటూ పోలీసులు వివరిస్తున్నారు. ఇదిలా ఉండగా దోపిడీ సంఘటన జరిగిన సమయంలో తీవ్రంగా గాయపడిన మహిళలు ఒకరు అస్వస్థకు చేరుకోగా మరో మహిళ దోపిడీకి ప్రయత్నం చేసినది ఇద్దరు వ్యక్తులేనని అసంపూర్ణంగా వివరించినట్లు బంధు వర్గాలు తెలియజేస్తున్నాయి. దోపిడీకి పాల్పడిన వ్యక్తులు ఇటువంటి ఆధారాలు లభించకుండా రక్తపు మడుగులను సైతం కారం పొడి సంఘటన జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో జల్లి వేశారని పోలీసులు వివరించారు. చీపురుపల్లిలో సంచలనం సృష్టించిన ఈ దోపిడీకి సంబంధించి పూర్తి వివరాలను పోలీస్ వర్గాలు వివరించడానికి సమయం పడుతుందని తెలిపారు. గతంలో చీపురుపల్లి పట్టణంలోని ప్రధాన రహదారి కానుకుని ఇటువంటి దోపిడీ జరగడం స్థానికులను భయకంపితులను చేస్తున్నప్పటికీ అదే తరహాలో ఈ దోపిడీ జరగడం స్థానికుల్లో మరింత భయాందోళనలను కలగజేస్తుంది. చీపురుపల్లిలో సంచలనం కలిగించిన ఈ సంఘటనపై పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి సారించి నిందితులను త్వరితన అదుపులోకి తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## నాటుసారా రహిత గ్రామంగా మాతమూరు: ఎక్సైజ్ సీఐ



పాచిపెంట, మే 24 ప్రభాతవార్త: పాచిపెంట మండలంలోని మాతూమురు గ్రామం నాటుసారా రహిత గ్రామంగా గ్రామ సభలో తీర్మానం చేశారు. సచివాలయ కార్యాలయంలో నవోదయం 2.0 కార్యక్రమానికి సంబంధించిన గ్రామ స్థాయి సమావేశం మాతూమురు గ్రామ సర్పంచ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సాలురు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి.నరసింహమూర్తి మాట్లాడుతూ నాటుసారా లేకపోవడం వల్ల గ్రామమంతా ఆయురారోగ్యాలు మరియు ఆర్థికంగా అభివృద్ధి చెందారని అన్నారు. గ్రామ దత్తత అధికారి బి.ఎస్.ప్రసాద్ , గ్రామ సర్పంచ్ బి.ఉషారాణి, గ్రామ పంచాయతీ సెక్రెటరీ సురేష్, విఆర్ఓ, గ్రామ యువకులు, సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయానికి ప్రణాళికలు గ్రామ స్థాయిలో సిద్ధం

పాచిపంట, మే 24 ప్రభాతవార్త: గ్రామస్థాయి ప్రకృతి వ్యవసాయ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు మండల వ్యవసాయ అధికారి కొల్లి తిరుపతిరావు అన్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో అమలు చేసి ఎంతమందిని ప్రకృతి వ్యవసాయం దిశగా మళ్లించామో గుర్తించి వారిని సత్కరించాలని సాలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ అన్నారు. మాతమూరు గ్రామంలో సిఆర్పి తిరుపతినాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళిక సమావేశంలో భాగంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సత్వర సేవలను అందించి రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా మళ్ళించాలని ముఖ్యంగా వరి, కూరగాయల పంటలపై దృష్టి సారించి పూర్తిస్థాయిలో ప్రకృతి సేద్యం చేసే దిశగా ప్రణాళికలు రూపొందించాలని రైతులకు కూడా ఈ విషయమై సిబ్బందికి సహకరించి ముందుకు రావాలని కోరారు. అనారోగ్యం పాలై ఆసుపత్రిలో ఖర్చులు పెట్టే కంటే ముందుగానే జాగ్రత్త పడాలని తెలిపారు. ప్రకృతి సేద్య ఎంటి యశోదమ్మ మాట్లాడుతూ ప్రకృతి సేద్య 9 సార్వత్రిక సూత్రాలను రైతులు పాటించడం ద్వారా పూర్తిస్థాయి ప్రకృతి ఫలితాలను పొందవచ్చని తెలిపారు. అనంతరం గ్రామ వ్యవసాయ సహాయకులు దినేష్ సాగుదారు హక్కు పత్రాలు తప్పనిసరిగా పొందాలని, అన్నదాత సుఖీభవ పంటల భీమా పంట నష్టపరిహారాలు పంట రుణాలు వంటివి పొందవచ్చని తెలిపారు. అనంతరం రైతులకు మొక్కజొన్న పంటపై వచ్చే కత్తెర పురుగు నివారణ కోసం అవగాహన కల్పించారు. ఐసిఆర్‌పి కుమార్, రైతులు పాల్గొన్నారు.

## నవధాన్య విత్తనాల సాగుపై అవగాహన



బాడంగి, మే 24 ప్రభాతవార్త: రేజేరు రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకులు వాడాడ సాయికుమార్ రైతులతో నవధాన్య విత్తనాలు సాగుపై అవగాహన కల్పించి రైతులకు ఈ పచ్చిరొట్ట నవధాన్యాలు నేలలో కలియదున్నడం వల్ల భూమి సారం పెరిగి కావాల్సిన పోషకాలు నేలకు అంది మంచి దిగుబడులు వస్తాయని తెలియజేశారు. పచ్చిరొట్ట జీలుగ, జనుము, పిల్లిపెసర, ధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజలు, అపరాలు, సుగంధద్రవ్యాలు అన్ని రకాలు విత్తనాలు కలిపి వేయడం వల్ల నేలలో సారం వృద్ధితో నేలకి మేలు చేసి మైక్రో బాక్టీరియా, సూక్ష్మజీవులు, ఆర్గానిక్ కార్బన్ వృద్ధి చెందుతాయి. తద్వారా దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. నేలలో నీటిని పట్టి ఉంచే గుణం, కలుపు, చీడపీడలు ఉధృతి తగ్గించి నేల మానవ ఆరోగ్యం ఉంటాయని తెలియజేసి రైతులతో విత్తనాలు కొలిపించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## టిడిపి నేత కోళ్ల రాంప్రసాద్ జన్మదిన వేడుకలు

లక్కవరపుకోట, మే 24 ప్రభాతవార్త: ఎస్.కోట నియోజకవర్గం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి భర్త టీడీపీ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల అప్పల బుచ్చి రాంప్రసాద్ జన్మదిన వేడుకలు



శనివారం లక్కవరపుకోట మండల కేంద్రంలోని ఎమ్మెల్యే లలితకుమారి రాంప్రసాద్‌ల స్వగృహంలో ఘనంగా జరిగాయి. పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి రాంప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కోళ్ల రాంప్రసాద్ సీనియర్ టిడిపి పార్టీ నాయకులుగా మాజీ మంత్రి కోళ్ల అప్పలనాయుడు తనయుడిగా ఎన్నో ఏళ్ల నుంచి ఇప్పటివరకు టిడిపి పార్టీలో కొనసాగుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారని లలిత కుమారికి అండగా ఉంటూ కార్యకర్తల నాయకుల బాగోగులు చూసుకుంటు వారి సంక్షేమ కోసం నిరంతరం ఆలోచించే మంచి వ్యక్తి అని, ఇటువంటి వ్యక్తి ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని అభిమానులు, నాయకులు కోరుకుంటూ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఇతర ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'ఎండియు వ్యవస్థను రద్దు పట్ల ఎమ్మెల్యేకు ధన్యవాదాలు'

లక్కవరపుకోట, మే 24 ప్రభాతవార్త: మొబైల్ డెలివరీ యూనిట్ (ఎండియు) వ్యవస్థను రద్దుచేసి రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీ పాత విధానంలో ఏపీ ప్రభుత్వం పునఃప్రారంభించినందుకు తన వంతు కృషిని చేసినందుకు ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారిని శనివారం ఆమె క్యాంపు



కార్యాలయంలో కలిసి కూటమి ప్రభుత్వానికి రేషన్ డీలర్లు సంఘం తరఫున ధన్యవాదములు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో పాత విధానానికి స్వస్తి చెప్పి కొత్త విధానం ద్వారా ఇంటింటికి సరుకులు పంపిణీ చేస్తామని చెప్పి తెచ్చిన వ్యవస్థ పూర్తిగా విఫలమైన కారణంగా కూటమి ప్రభుత్వం పాత విధానంలోనే సరుకులు పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టిందని అప్పటి చేసిన ప్రభుత్వం తప్పిదాలను సరిదిద్దుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరుకులు పంపిణీ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు.

## రెండు గ్రామాలను సారా రహిత గ్రామాలుగా ప్రకటన

నెల్లిమర్ల, మే 24 ప్రభాతవార్త: నెల్లిమర్ల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుర్ల మండలం దేవుని కనపాక, ఫకీర్ కిత్తలి గ్రామాలను సారా రహిత గ్రామాలుగా తీర్మానించినట్లు సిఐ ఎం.వెంకటరావు తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచులు పిఎస్ఎన్ రాజు, ఆర్.స్వామినాయుడుల ఆధ్వర్యంలో ప్రజల సమక్షంలో ఈ తీర్మానాలను చేసినట్లు ఆయన వివరించారు.



## రేషన్ బియ్యం వాహనాల రద్దుపై డీలర్ల హర్షం

రాజాం, మే 24 ప్రభాతవార్త: ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎండీయూ విధానాన్ని రద్దుచేసి రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పంపిణీకి ప్రభుత్వం నిర్ణయించడంపై విజయనగరం జిల్లా రాజాం మండలంలో రేషన్ డీలర్లు ఆనందం వ్యక్తం చేశారు. రాజాం సివిల్ సప్లయ్ గోదాము వద్ద సీఎం



చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చిత్రపటాలకు పాలతో క్షీరాభిషేకం చేశారు. అనంతరం రేషన్ డీలర్లు పరస్పరం స్వీట్లు తినిపించుకున్నారు. నాటి వైసీపీ ప్రభుత్వం డీలర్ల పొట్ట కొడితే కూటమి ప్రభుత్వం ఆదుకుంటున్నారు. ఇక ప్రజలు పనులు మానుకుని రేషన్ వాహనం కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని, నెలలో 15వ తేదీలోగా లబ్దిదారులు ఎప్పుడు వచ్చినా సరుకులు ఇస్తామని రేషన్ డీలర్లు తెలిపారు. వచ్చే నెల నుంచి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రేషన్ సరుకులను పక్కాగా పంపిణీ చేస్తామని వారు పేర్కొన్నారు.

## 'యోగాంధ్ర' విజయవంతంపై చర్చా కార్యక్రమం

రేగిడి, మే 24 ప్రభాతవార్త: భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఆయుష్ డిపార్ట్మెంట్ పర్యవేక్షణలో రేగిడి ఆమదాలవలస మండలంలో ఖండ్యం ఆయుష్ వైద్యాధికారి ఎం.సునీల్ కుమార్, సంకిలి ఆయుష్ వైద్యాధికారి డి.మోహనరావు ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం దృష్ట్యా స్థానిక ఎమ్మార్వో, ఎంపీడీవో,



ఎంఈఓ, ఎక్సైజ్ డిపార్ట్మెంట్ సబ్ ఇన్స్పెక్టర్, పంచాయతీ సెక్రెటరీ, మండల కేంద్రంలో యోగాంధ్ర కార్యక్రమం జయప్రదం చేయుటకు చర్చా కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ జూన్ 21 ఇంటర్నేషనల్ యోగ దినోత్సవం సందర్భంగా విశాఖ సముద్ర తీర ప్రాంతంలో 5లక్షల మంది, భారతదేశం మొత్తం 2కోట్ల జనాభాతో ఈ కార్యక్రమం జరిపించుటకు సిద్ధపడుతున్నారని మాస్టర్ ట్రైనీస్‌లకు జూమ్ మీటింగ్, ఆన్‌లైన్ ద్వారా యోగ శిక్షణ క్లాసులు ప్రారంభించబడ్డాయని అన్నారు. త్వరలోనే రేగిడి ఆమదాలవలస మండల స్థాయిలో చర్చించుకొని యోగాంధ్ర కార్యక్రమం జరిపించుటకు సమావేశం ఏర్పాట్లు జరుగుతున్నాయని, ప్రతిదినము యోగాసనాలు వేయటం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెంచడమే కాకుండా, రోగాలు రాకుండా జాగ్రత్త పడవచ్చని ఆయుష్ వైద్యాధికారులు తెలిపారు.

## విచ్చలవిడిగా వినియోగిస్తోన్న డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు!

### -నిబంధనలకు తూట్లు...వీటి వినియోగంపై అధికారులు పర్యవేక్షణ ఎక్కడ?

రాజాం, మే 24 ప్రభాతవార్త: గృహాలలో వంట కొరకు వినియోగించే ఉజ్వల యోజన వంటగ్యాస్ సబ్సిడీ సిలిండర్లు రాజాం పట్టణంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు, హోటల్స్‌లో విచ్చలవిడిగా బహిరంగంగా వినియోగిస్తున్నారు. ప్రధానంగా ఈ సిలిండర్లను గృహాలలో తప్ప మరెక్కడ ఉపయోగించకూడదన్న నిబంధనలను అతిక్రమించి వాణిజ్యపరంగా వినియోగిస్తే వీటిపై



సంబంధిత అధికారులు పర్యవేక్షణ కొరవడింది. ముఖ్యంగా హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టిఫిన్ సెంటర్లలో వాణిజ్యపరమైన కమర్షియల్ సిలిండర్లను వినియోగించే నిబంధన ఉంది. ఆ నిబంధనలను అతిక్రమించి రాజాంలో వివిధ వాణిజ్య సముదాయాల్లో పేదవాడికి అందించే సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారు. ఈ విధంగా వినియోగించడంతో వీటి వినియోగంపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇటువంటి వాణిజ్య దుకాణాలపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి పేదవాడికి సరఫరా చేసే సబ్సిడీ సిలిండర్లు పక్కదారి పట్టకుండా తగు చర్యలు తీసుకోవాలి. అలాగే ఈ విధంగా సబ్సిడీ సిలిండర్లను సరఫరా చేసే గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు చేపట్టవలసిన బాధ్యత ఎంతైనా ఉంది.

## 'సకాలంలో నివారణ టీకాలు వేస్తే పశువుల ప్రాణాలు కాపాడుకోవచ్చు'

### -పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్

కోటబొమ్మాళి, మే 24 ప్రభాతవార్త: పశువులకు సకాలంలో సీజనల్‌గా వ్యాప్తి చెందే రోగాలకు ముందుగానే వాటికి సంబందించిన నివారణ టీకాలు వేస్తే వాటి ప్రాణాలు కాపాడుకోవచ్చునని స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలో గల చౌదరికొత్తూరు, బావాజీపేట, మెండపేట, పొన్నాడపేట గ్రామాల పరిధిలోగల 287 పశువులకు శనివారం ఉచిత గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేయటం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో ఈ టీకాలు షెడ్యూల్ ప్రకారం వేయడం



జరుగుతుంది. కావున రైతులందరూ పశు వైద్య సిబ్బందికి సహకరించి, తమ యొక్క పశువులకు టీకాలు వేసుకునే బాధ్యతను తీసుకొని సరైన కాలంలో సక్రమంగా వేయించుకోవాలని వ్యాధులు రాకుండా నివారించుకుంటారని ఆయన కోరారు. ఈ వ్యాధి బారిన పడిన పశువులు ఎక్కువగా మరణిస్తుంటాయి. ఎక్కువగా ఆరు మాసాలు వయసు పైబడిన దూడలు ఈ వ్యాధి బారిన పడి 90శాతం దూడలు మృతి చెందుతాయి. ఈ వ్యాధి సోకిన పశువులు మేత ఆపడం, లేవలేకపోవడం ఎక్కువగా వెనుక కాళ్ల కండరాలలో గాలి చేరి, కణజాలము కుళ్లుతుంది. దీనివలన అధికంగా 104-105 డిగ్రీల జ్వరం వచ్చి చనిపోతుంటాయి. కావున పాడిరైతులు తమ పశువులకు ఈ ఉచిత టీకాలు వేయించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయకులు ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన తిలక్

కోటబొమ్మాళి, మే 24 ప్రభాతవార్త: మండలం యలమంచిలి సర్పంచ్ కవిటి రామరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో ఆయనకు, అదే ప్రమాదంలో మృతిచెందిన కవిటి ఆనందరావు కుటుంబ సభ్యులకు శనివారం టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ పరామర్శించారు. అలాగే తర్లిపేట పంచాయతీ చలమయ్యపేట వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన



చలమయ్యపేట గ్రామానికి చెందిన చెల్లూరు మల్లేష్, అంగ అప్పన్న వారి కుటుంబ సభ్యులను తిలక్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు కోటబొమ్మాళి మండల పార్టీ అధ్యక్షుడు హేమసుందర్ రాజు, జెడ్పీటీసీ దుబ్బ వెంకట్రావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు నూక సత్యరాజ్, నియోజకవర్గ బూత్ కమిటీల అధ్యక్షులు వినోద్, నాయకులు హనుమంతు గోవింద్, బొడ్డు వెంకటరమణ, కాళ్ళ సంజీవ్, అంగ గున్నయ, శివారెడ్డి, కెల్లి లచ్చున్న, పైడి మోహన్ తదితరులు ఉన్నారు.

## రామేశ్వరాలయంలో చోరీ

కవిటి, మే 23 ప్రభాతవార్త: కవిటి మండలం ప్రగడపుట్టుగ గ్రామంలోని శ్రీ రామేశ్వర ఆలయంలో



శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ధర్మకర్త బెందాలం రామ్ ప్రసాద్ ఫిర్యాదు మేరకు ఇచ్చాపురం సిఐ చిన్నంనాయుడు, కవిటి ఎస్ఐ రవివర్మ, క్లూస్ టీమ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ధర్మకర్త బెందాళం రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ శివుడి పంచలోహ విగ్రహం, వినాయక విగ్రహం, రెండు దీపపు కుందేలు, శఠగోపం, ఇత్తడి ప్రమిదలు 3, ఇత్తడి పల్లేలు 3 చోరీ జరిగినట్టు తెలిపారు. సిసి కెమెరాలు ఆలయంలో అమర్చినా అవి పనిచేయక పోవడంతో నిందితున్ని పట్టుకోవడంలో జాప్యానికి కారణమవుతోంది.

# శ్రీకాకుళం వార్త



## సరిహద్దు సారా నిర్మూలనకు సంయుక్త దాడులు

ఇచ్ఛాపురం, మే 24 ప్రభాతవార్త:జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి మరియు అసిస్టెంట్ కమిషనర్ రామ చంద్రరావులు పురుషోత్తపురం చెక్‌పోస్ట్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దులో సంయుక్త దాడులకు గంజాం ఎస్‌పి సువేంద్ర కుమార్ పాత్రతో భేటీ అయ్యారు. పురుషోత్తపురం ఎక్సైజ్ చెక్ పోస్ట్ ఆకస్మిక తనిఖీ చేసి పనితీరు మరియు రికార్డులు పరిశీలించారు.



రికార్డులు ఇన్‌స్పెక్షన్ చేసి సుమారు ఒక గంట పాటు వాహన తనిఖీలు నిర్వహించారు. సిబ్బందిని ఉద్దేశించి నిరంతరం వాహన తనిఖీలు చేయాలని సారా, గంజాయి, ఒడిశా మద్యంలను అడ్డుకోవాలని సూచించారు. సమర్థవంతమైన పని తీరుకు తగు సూచనలు చేశారు. వారితో సిఐలు జీ.వి.రమణ మరియు పి.డి.ప్రసాద్ ఉన్నారు. సిసి టీవీ పని తీరు కూడా పర్యవేక్షించారు. అనంతరం ఆంధ్ర ఒడిశా సరిహద్దులో నాటు సారా నియంత్రణకు మరియు సంయుక్త దాడులకు గాను గంజాం జిల్లా ఎస్‌పి ని బరంపురంలో కలిసి చర్చలు జరిపి త్వరలో సంయుక్తంగా దాడులు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసారు.

## నరసన్నపేట సిఐగా శ్రీనివాసరావు



నరసన్నపేట, మే 25 ప్రభాతవార్త: నరసన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎం.శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. మన్యం జిల్లా పార్వతీపురం నుండి బదిలీపై నరసన్నపేటకు రావటం జరిగిందని పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు నేను అన్ని విధాల కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. గతంలో పనిచేసిన సీఐ జె.శ్రీనివాసరావు విశాఖపట్నం రేంజ్‌కు బదిలీ అయ్యారు. స్థానిక ఎస్సైలు ఆయనకు స్వాగతం పలికారు.

## సారా రహిత మండలంగా వంగర..

### -మండల స్థాయి సమన్వయ కమిటీ తీర్మానం

రాజాం, మే 24 ప్రభాతవార్త:సారాయి లేని రాష్ట్రమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన 'నవోదయం 2.0' ప్రతిష్టాత్మక కార్యక్రమంలో భాగంగా రాజాం ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల వంగర మండలంలో నాటు సారాయి ప్రభావం గల గ్రామంగా 'కోదులగుమడ' గ్రామాన్ని 'బి' కేటగిరీ గ్రామంగా, సంగాం గ్రామాన్ని 'సీ' కేటగిరీగా పరిగణించడం, ఆ గ్రామంలోని పాత, అనుమానిత ముద్దాయిలను బైండోవర్ చేయటం, ఆ గ్రామంలో గోడపత్రికలు, కరపత్రాలు, హోర్డింగ్స్, అవగాహనా కార్యక్రమాల ద్వారా ప్రజలలో చైతన్యం కల్పించి మరియు నిరంతర నిఘా, ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలు ద్వారా నాటు సారాయి వలన కలిగే సామాజిక, ఆరోగ్య మరియు



ఆర్థిక పర్యవసానాలను వివరించడం ద్వారా పూర్తి స్థాయిలో నిర్మూలన లక్ష్యంగా చేసిన కృషి ఫలితంగా ఆ గ్రామాలను నాటు సారాయి రహిత గ్రామాలుగా గ్రామ సమన్వయ కమిటీ తీర్మానించడం అందరికీ విదితమే. విజయనగరం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులపై ఆ మండలంలో గల అన్ని గ్రామాలలో పూర్తి స్థాయిలో ఇంటెలిజెన్స్ సేకరించి నిరంతర పర్యవేక్షణ కారణంగా నాటు సారాయి సంబంధిత నేరములు కానరానందున అన్ని మండలంలోని అన్ని గ్రామాలు నాటు సారాయి లేని గ్రామాలుగా తీర్మానించి నందున శనివారం మండల సమన్వయ కమిటీ చైర్మన్, మండల పరిషత్ అధ్యక్షులు సురేష్ ముఖర్జీ అధ్యక్షతన, కన్వీనర్‌గా స్థానిక ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జైభీమ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులుగా తహశీల్దార్ ధర్మరాజు, ఎంపీడీఓ రఘునాదాచారి, స్థానిక పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్ షేక్‌శంకర్ హాజరై సదరు మండలాన్ని సారా రహిత మండలంగా తీర్మానించడం జరిగిందని తెలియజేశారు. మండలం సారా రహితం కావడం, ప్రజారోగ్యంపై మంచి ప్రభావం చూపడం కాకుండా, సామాజిక, ఆర్థిక పరిపుష్టికి కారణం కాగలదని కమిటీ హర్షించింది. ఈ కార్యక్రమంలో అడాప్షన్ ఆఫీసర్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.మాన్యాలు, సిబ్బంది పాల్గొన్నారు.

## పదిలో 597 మార్కులు సాధించిన వర్షిని




కోటబొమ్మాళి, మే 24 ప్రభాతవార్త: మండలం విశ్వనాధపురం పంచాయతీ, ఆనందపురం గ్రామానికి చెందిన నేతింటి సింహాచలం కుమార్తె నేతింటి వర్షిని ఏప్రిల్ 23న విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో 600 మార్కులకు గాను 594 మార్కులు రాగా హిందీ రివ్యాల్యూషన్ చేయగా మూడు మార్కులు కలిశాయి. దీంతో 597 మార్కులు సాధించి ఉత్తరాంధ్రలోనే అగ్రస్థానంలో నిలిచింది. వర్షిని శ్రీచైతన్య విద్యసంస్థలోని కమ్మాద్రి బ్రాంచ్‌లో చదువుకుంది. తల్లి గృహిణిగా, తండ్రి సింహాచలం రైతు, రైతు కుటుంబానికి చెందిన వర్షిని తన ఉత్తమ ప్రతిభ కనబరిచి 597 మార్కులు సాధించి అటు పాఠశాలకు, ఇటు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చిందని ఉపాధ్యాయులు అనందం వ్యక్తం చేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వర్షినికు ఆనందపురం గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

## ఉద్యోగం చేస్తూ ఉన్నత చదువులు

### -డాక్టర్ రెడ్డీస్ మేనేజర్ మహేష్ బాబు

ఆముదాలవలస, మే 24 , ప్రభాతవార్త: పాలిటెక్నిక్ విద్యతో ఉపాధి పొందుతూ ఉన్నత విద్యాభ్యాసం చేసుకోవచ్చని అందుకు పలు కంపెనీలు ముందుకు వస్తున్నాయని డాక్టర్ రెడ్డీస్ మేనేజర్




మహేష్‌బాబు తెలిపారు. శనివారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యతో తనకున్న అనుభవాన్ని మెకానికల్ ఈసీఈ విద్యార్థులతో పంచుకున్నారు. టీవీఎస్ ట్రైనింగ్ అండ్ సర్వీసెస్ మేనేజర్ సురేష్‌బాబు మాట్లాడుతూ ఉపాధి అవకాశాలపై పలు సూచనలు చేశారు. పాలిటెక్నిక్ కోర్సులతో మెరుగైన ఉద్యోగ అవకాశాలు దక్కించుకోవచ్చని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ.గోపి అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవాలు జరుపుకోవటం శుభపరిణామని కళాశాల అధ్యాపకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతోపాటు సిబ్బంది ఉన్నారు.

## చౌకుబారు విమర్శలు మానుకోవాలి

### -డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ

ఆమదాలవలస, మే 24 ప్రభాతవార్త: వైకాపా సమన్వయకర్త చింతాడ రవికుమార్ టిడిపిపై లేనిపోని చౌకుబారు విమర్శలు మానుకోవాలని డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన మినీ మహానాడు కార్యక్రమానికి ఉపాధి హామీ కూలీలతో మినీ మహానాడు కార్యక్రమం చేపట్టామని అనడం సమంజసం కాదని అన్నారు. రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీకి మంచి ఆదరణ ఉందని అన్నారు. గతంలో అధికారంలో లేకపోయినప్పటికీ మినీ మహానాడుకు విశేష స్పందన వచ్చిందని అన్నారు. తెలుగుదేశం అధికారం చేపట్టి పలు సంక్షేమ పథకాలు



ప్రవేశపెట్టిందని వివరించారు. గత వైకాపా హయాంలో ఏ ఒక్క పథకాన్ని, అభివృద్ధిని, సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసారని అన్నారు. అందుకే గత ఎన్నికల్లో వైకాపాను ప్రజలు నమ్మలేదని, కేవలం 11 సీట్లతో సరిపెట్టుకున్నారని తెలిపారు. ఎమ్మెల్యే రవికుమార్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తే ప్రజలు సహించరని హెచ్చరించారు. మీ ఉనికి కోసం లేనిది ఉన్నట్టు మాట్లాడితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. టిడిపి పార్టీ నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్న పార్టీ అని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూర దృష్టితో అనేక పరిశ్రమలను రప్పించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్న మంచి విజన్ ఉన్న నాయకుడని అన్నారు. బోర గోవిందరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే రవికుమార్‌పై లేనిపోని ఆరోపణ చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇటీవల ఎమ్మెల్యే రవికుమార్ అమెరికా వెళ్లి అక్కడ ఉన్న అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు, ఎమ్మెల్యే రవికుమార్ అమెరికాలో పలు కంపెనీలు, పలు భూములు కొనుగోలు చేస్తున్నారని ఆరోపణలు చేశారని, అలాంటి ఆరోపణ చేసినప్పుడు బహిరంగ చర్చకి వచ్చి నిరూపించాలని సవాల్ విసిరారు. వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఉనికిను కాపాడుకోవడానికి ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కనీసం వార్డు మెంబర్ కూడా గెలవలేని వ్యక్తి, ఎమ్మెల్యే రవికుమార్‌ను విమర్శించడం తగదన్నారు. విమర్శించే మందు స్థాయిని బట్టి మాట్లాడాలని వైకాపా ఇంచార్జ్ రవికుమార్‌కు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో అంబల్ల రాంబాబు, బీవీ రమణమూర్తి, బోనెల అప్పారావు, నాగర్ల మురళీధర్, మీసాల రామారావు, తంగి గురయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద కేసునాయుడుపేటలో విషాద ఛాయలు

### -పిడుగు పాటుకు యువకుడు మృతి

సంతబొమ్మాళి, మే 24 ప్రభాతవార్త: సంతబొమ్మాళి మండలం పెద్ద కేసునాయుడుపేటకు గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. గ్రామానికి యువకుడు మోర్చి లక్ష్మిపతి (శివాజి) (26) పోర్టు రహదారి పనులలో భాగంగా టెక్కలి సమీపంలో పనిచేస్తుండగా శనివారం అతని సమీపంలో పిడుగుపడి మృతి చెందాడు. ఈ సంఘటన జరిగిన వెంటనే సహచరులు టెక్కలి జిల్లా ఆసుపత్రికు తీసుకువెళ్లారు.



అయినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని గ్రామస్తులు తెలిపారు. చేతికి అందిన కుమారుడు ఇలా విగత జీవిగా కనిపించడంతో తండ్రి వెంకటరావు, తల్లి నారాయణమ్మ బోరున విలపించారు. దీంతో పెద్ద కేసునాయుడుపేటలో విషాద ఛాయలు అలముకున్నాయి. గత కొంతకాలంగా పోర్టు పనులు కాంట్రాక్టర్ వద్ద జేసీబీ హెల్పర్‌గా లక్ష్మిపతి(శివాజి) పనిచేస్తున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## 28న ఏవైఎస్ వార్షికోత్సవ వేడుకలు

సీతంపేట, మే 24 ప్రభాతవార్త: సీతంపేట మండలం, నౌగడ గ్రామంలో అక్షర బ్రహ్మ యువ నిర్మాణ సేవా సంఘం 11వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 28న నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు సవర ఆనందరావు, సవర వెంకట్రావు తెలిపారు. ఒడిశా రాష్ట్రంతో పాటు మన్యం జిల్లాకు చెందిన 33 గ్రామాలకు చెందినవారు ఈ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు.

## 'పల్లెలు పరిశుభ్రంగా మెరవాలి'

వీరఘట్టం, మే 24 ప్రభాతవార్త:మండలంలోని ప్రతి పల్లె పరిశుభ్రంగా మెరవాలని, ఇందుకు కార్యదర్శులు అంతా సమిష్టి కృషితో ముందుకు సాగాలని ఈఓపిఆర్డి టి.రమణమూర్తి నాయుడు అన్నారు. శనివారం స్థానిక చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రంలో కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.



గ్రామాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని, రానున్న వర్షాకాలంలో చెత్తాచెదారం పేరుకుపోకుండా ప్రత్యేక దృష్టిని కనబరచాలని, అంటు రోగాలను దరి చేరకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. అన్ని పంచాయతీల్లో చెత్త నుండి సంపద తయారుచేసే కేంద్రాలు దిగ్విజయంగా పనిచేయాలని ఆయన చెబుతూ జిల్లాకే వీరఘట్టం మండలం ఆదర్శంగా నిలవాలని అన్నారు. ఈ సమావేశంలో వీరఘట్టం మేజర్ పంచాయతీ ఈవో బి.కోటేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు తెట్టింగి సచివాలయం కార్యదర్శి ఎ.బంగారుబాబు, పంచాయితీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 'యోగాతో ఆరోగ్యవంతం'

ఆమదాలవలస, మే 24 ప్రభాతవార్త: ఆమదాలవలస మున్సిపల్ కార్యాలయంలో నేషనల్ యోగా డే వారోత్సవాల్లో భాగంగా శనివారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా చేయడం వలన ఆరోగ్యవంతంగా జీవించవచ్చునని మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్ సూచించారు. యోగాను ప్రతి ఒక్కరు దినచర్యగా మార్చుకోవాలని తెలియజేశారు. ప్రతిరోజు యోగా చేయడం వలన మానవునిలోని ఉన్న అనారోగ్య సమస్యలను ఎటువంటి ఖర్చులు లేకుండా పరిష్కరించుకోవచ్చునని తెలియజేశారు. యోగా చేయడం వలన వచ్చే ఉపయోగాలు గురించి




ప్రభుత్వం ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంటర్ కౌన్సిలింగ్

సీతంపేట, మే 24 ప్రభాతవార్త: సీతంపేట ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి నిర్వహించే కౌన్సిలింగ్ ప్రశాంతంగా నిర్వహించారు. సీతంపేట గురుకుల బాలికలు కళాశాలలో ఎంపీసీ, బైపిసి, హెచ్‌ఈసి ఒకేషనల్ గ్రూపులకు సంబంధించి 140 సీట్లు గాను 507 బాలికలు దరఖాస్తులు పెట్టుకున్నారు. వీరిలో 450 మంది కౌన్సిలింగ్ హాజరైనట్లు పిఓ యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. బాలుర గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసి ఒకేషనల్ సిజిఏ గ్రూపులకు సంబంధించి మొత్తం 170 సీట్లుకు గాను 263 మంది బాలురు ధరఖాస్తులు చేసుకోగా సుమారు 200 మంది బాలురు హాజరయ్యారు. ఈ సీట్ల భర్తీలో అధిక మార్కులు వచ్చిన విద్యార్థులకు భర్తీ చేయడం జరిగిందన్నారు. డిడి అన్నదొర, ప్రిన్సిపాల్ సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ ఉపాధ్యాయుడు విద్యార్థినిపై గర్భవతి చేసిన వైనం!

రేగిడి, మే 24 ప్రభాతవార్త: రేగిడి మండలం పరిధిలో ఉన్న ఓ ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న అతను 9వ తరగతి చదువుతున్న విద్యార్థినిపై లైంగికంగా వసపరుచుకుని గర్భవతిని చేయసాగాడు. ఇలాంటి సంఘటనలు ఆ పాఠశాలలో జరగడం ఇది మూడోసారి.

# ముడతలూ, మచ్చలూ లేకుండా..

30వ పడిలోకి అడుగు పెట్టగానే... వృద్ధాప్య ఛాయలు మొదలై పోయాయని బాధపడేవారే ఎక్కువ. ఈ సమస్య నుంచి బయటపడటానికి ఏవేవో మార్గాలను కనిపెట్టెడతారు. వాటిలో మాయిశ్చరైజర్ల వాడకం ఒకటి. అయితే, సరైన వాటిని ఎంపిక చేసుకోకపోయినా, రాసుకునే విధానం తెలియకపోయినా... సమస్య మరింత జటిలం అవుతుంది. అసలు దీన్నెల వాడాలంటే...



★ చాలామంది పొడిబారిన చర్మంపై మాయిశ్చరైజర్ రాస్తుంటారు. అలాకాకుండా చర్మం కాస్త తడిగా ఉన్నప్పుడు మాత్రమే దీన్ని రాయాలి. అప్పుడే ప్రభావవంతంగా పనిచేస్తుంది.

★ ఇప్పుడంతా ఉరుకులూ, పరుగులే... ఆ కంగారులో దీన్ని రాసుకొని, వెంటనే మేకప్ వేసుకునే వాళ్లే ఎక్కువ. దీనివల్ల చర్మకణాలు మూసుకుపోయి, వృద్ధాప్య ఛాయలు తొందరగా వచ్చేస్తాయట. అందుకే దీన్ని రాసుకున్నాక 1015 నిమిషాలైనా ఆరనివ్వాలి. అప్పుడే అనుకున్న స్థాయిలో ఫలితం ఉంటుంది.

★ చాలా మాయిశ్చరైజర్స్‌లో చర్మానికి హాని చేసే రసాయనాలు ఉంటాయి. అందుకే వీటి ఎంపికలో సహజ సిద్ధమైన వాటితో తయారైన వాటికి ప్రాధాన్యత ఇవ్వండి. ఒకవేళ వేరే ఉత్పత్తులు వాడినా... తయారీలో వాడే వస్తువులు, స్థాయిలూ మీ చర్మతత్వానికి సరిపోతాయో లేదో తెలుసుకుని... వైద్యుల సలహా మేరకు తీసుకుంటేనే మేలు.

★ చర్మ సంరక్షణలో ముఖానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి... మెడను అలానే వదిలేస్తారు. దాంతో పిగ్మెంటేషన్, ముడతలు పడి... ఎక్కువ వయసు వారిలా కనిపిస్తారు. కాబట్టి ముఖంతో పాటూ మెడకు దీన్ని రాయాలి.

★ వాడుకలో పరిమాణమూ ముఖ్యమే. ఏ చర్మతత్వానికి ఎంతమేర మాయిశ్చరైజర్ వాడొచ్చో తెలుసుకోవాలి. అలాకాకుండా, ఎక్కువ, తక్కువ రాస్తే అనుకున్న స్థాయిలో ఫలితాలు ఉండవు ఆ స్కిన్‌ను కాబట్టి మాయిశ్చరైజర్స్ అవసరం లేదనుకుంటారు చాలామంది. కానీ దీనికీ ఇవి అవసరమే. □

# లక్ష్య సాధన కోసం కష్టపడి ..



**ప్రసవిమంచిన 14 రోజులకే!**

కలెక్టరు కావాలన్నది ఆమె కల. దాన్ని నెరవేర్చుకోవడానికి చివరగా ఆరోసారి ప్రయత్నం చేసింది. సరిగ్గా పరీక్షకు 14 రోజుల ముందు మగబిడ్డను ప్రసవించింది. అయినా అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంది. 45వ ర్యాంకునూ సాధించిన మాళవిక జినాయర్ మరెందరికో స్ఫూర్తి నింపింది. యూపీఎస్సీ మెయిన్స్ పరీక్షలు జరుగుతున్నాయి. అభ్యర్థులంతా ఏకాగ్రతగా రాయడంలో 7 మంది మునిగిపోయారు. మాళవిక దృష్టి అంతా పరీక్షాహాలుకు బయటే ఉంది. చిన్న చప్పుడైనా బాబు ఏడుస్తున్నాడేమో అన్న భ్రమకు లోనయ్యేది. ప్రశ్నాపత్రం చూసిన వెంటనే తెలిసి రావడంతో మొదట్లో సంతోషమేసినా, తీరా రాయడం మొదలుపెట్టేసరికి బాబు గుర్తుకొచ్చి ఏకాగ్రత పెట్టలేక ఆందోళనకు గురైంది. అంతలోనే లక్ష్యం గుర్తొచ్చింది. ఆ తర్వాత ఆమె కలం క్షణం కూడా ఆగలేదు.

ఒత్తిడి అలసట ! 2020లో యూపీఎస్సీ రాసింది. కానీ ర్యాంకు సాధించలేకపోయింది. తిరిగి 2022లో 172వ ర్యాంకుతో ఐఆర్ఎస్ ఆఫీసర్‌గా ఉద్యోగంలో చేరింది. చిన్నప్పటి నుంచి కలెక్టరు కావాలని కల కన్నాను. అందుకే నా ఆశయాన్ని సాధించాలనే ప్రయత్నాన్ని మానుకోలేదు. అలా అయిదుసా రాసినా ఫలితం దక్కలేదు. నందగోపంతో వివాహమైంది. చివరి ప్రయత్నంగా ఆరోసారి రాయాలనుకున్నప్పుడు గర్భం దాల్చాను. అదే సమయంలో మావారు ఐపీఎస్ శిక్షణలో ఉన్నా ఓవైపు ఉద్యోగం, మరో వైపు పరీక్షకు సిద్ధమయ్యే దాన్ని. పరీక్షా తేదీకి 14 రోజులముందు ప్రసవించా. అమ్మను అయ్యాననే సంతోషం ఓవైపు, చివరి అవకాశం... ఇవన్నీ తీవ్ర అలసట, ఒత్తిడికి గురి చేశాయి. కూర్చో వడమూ కష్టంగా ఉండేది. పసిబిడ్డతో పరీక్ష ఎలా రాయగలవు అన్నారు తెలిసిన వాళ్లంతా. ఆ సమయంలో నా కుటుంబం చేయూతగా నిలిచింది.

**భయం దాటి విజయం !**

ఏడు సంవత్సరాల కష్టం, ఆప్షనల్ మార్పు... వీటన్నింటికంటే భయమే తనను ఆపిందంటారు. కర్ణపు శ్రీనివాస కీర్తిరెడ్డి. అది దాటాకే సివిల్స్‌లో 316వ ర్యాంకు సాధ్యమైంది అంటున్నారామె. సివిల్స్ రాస్తే చాలామందిపై సానుకూల ప్రభావం చూపొచ్చు. ప్రజలకు సాయం చేయొచ్చు... ప్రయత్నించు అన్న నాన్న మాటతో సివిల్ సర్వీసెస్ మీద దృష్టిపెట్టా. మాది కడప. నాన్న కర్ణపు చెలమారెడ్డి, అమ్మ శ్రీకృష్ణ ఇద్దరూ ఎల్వీసీ ఉద్యోగులే. నాన్న పదవీ విరమణ పొందారు. పాఠశాల విద్యాభ్యాసమంతా కడపలోనే సాగింది.



ఆపై బిట్స్ పిలానీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశా. గ్రాడ్యుయేషన్ పూర్తవ్వగానే సివిల్స్‌పై దృష్టి పెట్టింది. అప్పుడు ఆప్షనల్గా ఫిజిక్స్ తీసుకున్నా. కష్టపడటం వరకూ బాగానే కష్టపడ్డా. అయినా ఏదో అనుమానం. 'సివిల్స్ మనకురాదేమో' అన్న భయం. దాంతోనే తొలి మూడు ప్రయత్నాల్లో విఫలమయ్యా. తరవాత నాకు పెళ్లైంది. పొలిటికల్ సైన్స్, ఇంటర్నేషనల్ రిలేషన్ ఆప్షన్‌లా తీసు కున్నా. నిజానికి ఫిజిక్స్ బాగా చదివాననుకున్నా. తీరా మార్కులు రాలేదు. అందుకే ఆప్షనల్ మార్చు కున్నా. కాకపోతే ఎక్కువ కష్టపడాల్సి వచ్చింది. తిరిగి మొదలు పెట్టాననే చెప్పాలి. అయితే ఇష్టంగా చదివా. కొత్త ఉత్సాహం సాధించాలన్న పట్టుదలతో ప్రయాణం మొదలు పెట్టా గతసారి ఇంటర్వ్యూ వరకూ వెళ్లా. తీరా తుది జాబితాలో పేరు లేదు ఈసారి అదే ఉత్సా హంతో ప్రయత్నించా. 316వ ర్యాంకు సాధించా.



**అమ్మ కష్టం నాన్న కల...**

ఓడిపోయినప్పుడల్లా తిరిగి ప్రయత్నించాలి. అప్పుడే అనుకున్న గమ్యాన్ని చేరుకోగలం. అంబటి యామిని లక్ష్మీదేవి ఈ కోవకు చెందిన వారే. తాజా యూపీఎస్సీ ఫలితాల్లో 581వ ర్యాంకు దర్శించుకున్నారు. బాగా చదువుకోవాలి..చుట్టూ ఉన్న వాళ్లకి తోచిన సహాయం చేయాలి ఇదే ఎప్పుడూ చెప్పేవారు నాన్న మాతో. ఐఏఎస్ అవ్వాలనే లక్ష్యం ఏర్పడింది ఆయన వల్లే, నేను నాలుగో తరగతి చదువుతున్నప్పుడే ఆయన చనిపోలేదు. కానీ నాన్న మాత్రం మమ్మల్ని విడిచి వెళ్లలేదు. ఇది వాళ్ల కష్టానికి ఇప్పుడు ప్రతిఫలం దక్కింది. చిన్నప్పట్నుంచీ చదువులో చురుకే నవోదయలో పదో తరగతి చదివాక, ఇంటర్ సీఈసీ హైదరాబాద్‌లో పూర్తి చేసింది. 97 శాతంతో తెలంగాణ స్టేట్ ఫస్ట్ ర్యాంకును ఎక్కువగా ఉంది. పర్వతాలు, నదులు, నాగరికత, భూభాగాల విభజన లాంటి అంశాలన్నీ మూలాల నుంచీ తెలుసుకోవడం నాకు ఇష్టం. అందుకే డిగ్రీ జాగ్రఫీలో ఆనర్స్ చేయాలనుకున్నా. అందుకు మంచి యూనివర్సిటీల గురించి వెతకడం మొదలుపెట్టా. అప్పుడే ఢిల్లీలోని మిరాండా హౌస్ కాలేజీకి తెలిసింది. దేశంలోనే అత్యుత్తమ కాలేజీలో ఇది ఒక్కటి. మెరిట్ విద్యార్థిని కావడం వల్ల సీటు కూడా సులువుగానే దొరికింది. కానీ ఆర్థిక సమస్యలతో వెళ్లాలా? వద్దా అన్న ఆలోచనలో పడ్డాను. అమ్మే ధైర్యం చెప్పి పంపింది అనే యామిని సివిల్స్‌లోనూ దాన్నే ఆప్షనల్ సబ్జెక్టుగా ఎంపిక చేసుకుంది. డిగ్రీ పూర్తయ్యాక ఢిల్లీలో ఉండి సివిల్స్ శిక్షణ తీసుకుంటే మంచిదన్నారు అంతా. కానీ అది ఆర్థిక భారం. అందుకే ఊరు వచ్చేశా. తర్వాత కొవిడ్. దాంతో సంవత్సరం ఇంట్లోనే సమయం వృథా చేయకూడదని ఆన్‌లైన్ తరగతుల్లో చేరాను. పరిస్థితులు కుదురిన తరువాత, 2022లో హైదరాబాద్‌లో వచ్చి స్నేహితులతో కలిసి పరీక్షలకు సన్నద్ధమయ్యారు. రోజులో 7-8 గంటలు చదివేదాన్ని. పరీక్షల సమయంలో అయితే ఇంకా ఎక్కువే. మనం ఎంతసేపు చదివాం అన్నదాని కన్నా.. ఎంత క్వాలిటీగా చదివాం అనే దానిపైనే ఫలితం ఆధాపడుతుంది. ఈ సమయం లో నాకెప్పుడు ఒత్తిడి అనిపించినా.. స్నేహితులతో చిట్‌చాట్ చేసేదాన్ని. వాళ్లే నా స్ట్రెస్ బస్టర్స్ మొదటి సారి ప్రిలిమ్స్ వరకే చేరుకోగలిగా. ఈ రెండో ప్రయత్నంలో 591వ ర్యాంకు సాధించాను. దీంతో సరిపెట్టుకుని ఆగిపోను. నా లక్ష్యం ఐఏఎస్. దాని కోసం మళ్లీ ప్రయత్నిస్తా అంటోంది యామిని. □

# అక్కడ హైహీల్స్‌కు ప్రభుత్వ అనుమతి అవసరం

కొన్ని ప్రాంతాల్లో ఆమలు చేసే వింత నిబంధనలు విస్మయానికి గురి చేస్తుంటాయి. అలాంటిదే కార్మెల్ బై ది సీ' నగరంలో ఉన్న ఈ నిబంధన



అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న ఈ చిన్న నగరంలో కాళ్లకు రెండు అంగుళాల కంటే ఎత్తయిన హై హీల్స్ ధరించడం నిషేధం ఒకవేళ ధరించాలని ఎవరైనా ముచ్చటపడినా స్థానిక ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. ఈ నగరంలోని బీచ్, చారిత్రక కట్టడాలు, ప్రకృతి అందాలు పర్యాటకుల్ని బాగా ఆకట్టు కుంటాయి. ఇక్క సైప్రెస్, పైన్ చెట్లు ఎక్కువ. ఇవి భారీగా పెరగడంతో వాటి వేర్లు నగరమంతా వ్యాపించాయి. రోడ్లకు ఇరువైపులా పాదదారుల కోసం ఏర్పాటుచేసిన పేవ్‌మెంట్లు వేర్ల పెరుగుదల కారణంగా దెబ్బతింటున్నాయి. ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా ఫలితం ఉండట్లేదు. అలాంటిచోట్ల హైహీల్స్‌తో నడిస్తే కిందపడిపోయే ప్రమాదముంది. అందుకే 1963లోనే అప్పటి నగర అటార్నీ హైహీల్స్‌పై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అనుమతి తీసుకున్నవారు హైహీల్స్‌తో నడిచి పడిపోతే దానికి ప్రభుత్వం బాధ్యత వహించదు. కోర్టులో దావా వేయలేరు. □

**చెలి చిట్కా** బజ్జీలు కరకర లాడాలంటే శనగ పిండిని బియ్యపు పిండిని తీసుకోండి దానిలో తగిన మోతాదులో ఉప్పు కారం వేయండి. తర్వాత చిటికెడుసోడా ఉప్పు కొద్దిగా బేకింగ్ పౌడర్ కొద్దిగా బొంబాయి రవ్వ, వేడినీరు పోసి బాగా కలపాలి. ఆ మిశ్రమంలో బంగాళా దుంప అరటికాయ నేతి బీరకాయ కాలీ ఫ్లవర్ ముక్కలను ముంచి దోరగా వేయించండి. □

# బోలెడు లాభాలు..



పొయ్యిమీద అన్నం ఉడుకుతోంది. మూత తీయడానికి సమయానికి హోల్డర్ కానీ, బట్ట కానీ లేదు. గాజు సీసా మూత బిగుసుకు పోయింది. ప్రయత్నిస్తుంటే చేతికి జారిపోతుంది. వెల్లుల్లిపై పొట్టు తియాలి. వీటన్నింటికి వేర్వేరు పరికరాలకోసం వెతక్కండి. సలికాన్ ట్రైవెట్స్ సెట్ ఒకటి ఇంట్లో ఉంటే చాలు. ఇవి వంటింట్లో ఎన్నో రకాలుగా ఉపయోగపడాయి. వీటిపై ఉండే డిజైన్ తేనెటీగలు పెట్టే హనీకాంబ్‌లా ఉంటుంది. దీంతో వేడిపాత్రల్ని పట్టుకోవచ్చు. ఇవి వేడికి కరగవు. మూతలు తీయడానికి అనుకూలంగా ఉంటాయి. వెల్లుల్లి పొట్టుని వీటితో నలిపి తీయడం తేలిక. వేర్వేరు రంగుల్లో దొరుకుతాయి కాబట్టి డైనింగ్ టేబుల్‌పైన టీకప్పులు పెట్టుకొనే కోస్టర్లుగా కూడా పనికొస్తాయి. □

# విధేయతే గొప్ప బహుమతి

'దహనబలికి కట్టెలు తీసికొని తన కుమారుడగు ఇస్సాకుమీద పెట్టి తన చేతితో నిప్పును కత్తిని పట్టుకొనిపోయెను..అబ్రాహాము అక్కడ బలిపీఠమును కట్టి కట్టెలు చక్కగా పేర్చి తన కుమారుడగు ఇస్సాకును బంధించి ఆ పీఠముపై నున్న కట్టెలమీద ఉంచెను' (ఆది 22:6-9). ఇక్కడ అబ్రహాముతో దేవుడు తన కుమారుడైన ఇస్సాకును బలిగా అర్పించమని చెప్పాడు. వెంటనే అబ్రాహాము కట్టెలను తన కుమారుడైన ఇస్సాకుపై పెట్టి, కొండపై దేవుడు తనకు చూపించిన స్థలంలో బలి అర్పించేందుకు సిద్ధపడ్డాడు. కత్తి ఎత్తి ఇస్సాకును వధించేముందు.. దేవుడు బలిగా అర్పించవద్దు అని చెప్పి ఇస్సాకుకు బదులుగా ఒక పొట్టేలును బలిగా ఇచ్చాడు. ఇక్కడ ఇస్సాకు విధేయతను మనం గమనించాలి. తండ్రి ఏది చెప్పాడో కొడుకు అదే చేశాడు. ఏ మాటకు ఎదురు చెప్పలేదు. చివరికి తననే బలిగా అర్పిస్తున్నా కూడా తండ్రి నిర్ణయాన్ని వ్యతిరేకించలేదు. తండ్రి చిత్తానుసారంగా దేవుడికి సమర్పించుకున్నాడు. ఇలాంటి విధేయత మనం కూడా కలిగి ఉండాలి. పిల్లలు తల్లిదండ్రులకు, పెద్దలకు లోబడి జీవించాలి. అన్నింటికంటే ముఖ్యంగా దేవుడికి మరింత విధేయతగా ఎలా జీవించాలో తల్లిదండ్రులు నేర్పించాలి. 'బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము వాడు పెద్దవాడైనప్పుడు దానినుండి తొలగిపోడు' (సామె 22:6). ఇస్సాకు



నా అనుమతి లేకుండా నా ప్రాణాన్ని దేవుడికి ఎందుకు బలిగా ఇస్తున్నావు, నీకు ఆ హక్కు లేదు..వంటి మాటలు ఏమీ కూడా చెప్పలేదు. తండ్రికి విధేయత చూపేందుకు తన ప్రాణాలను కూడా బలిగా ఇచ్చేందుకు సిద్ధపడ్డాడు. నేడు చాలామంది పిల్లలు, యువత తల్లిదండ్రుల మాటలకు విలువ ఇవ్వడం లేదు. ఇక దేవుడికి చూపాల్సిన భయం విషయంలో శ్రద్ధ చూపడం లేదు. వారిని క్రమశిక్షణలో పెంచడం అనేది నేడు తల్లిదండ్రులకు ఒక సవాలుగా మారింది. ప్రత్యేకంగా గ్యాడ్జెట్లు (సెల్‌ఫోన్లు, ల్యాప్‌ట్యాప్, ట్యాబ్) వారి చేతికి వచ్చిన ఈకాలంలో పిల్లలకు, పెద్దలకు దేవుడిపై భయం సన్నగిల్లుతోంది. అందుకే మనం దేవుడి వాక్యాన్ని చదవాలి, వినాలి, ఆవిధంగా జీవించేందుకు ప్రయత్నించాలి. దేవుడు మననుంచి కోరేది ఒక్క విధేయత తప్ప మరేమీ కోరడం లేదు. కాబట్టి దేవుడు ఏది చెబితే దాన్ని చేయాలి. ఆయన ఆజ్ఞల్ని మీరకూడదు. నిత్యం దేవుడియందు భయభక్తులతో జీవిస్తూ, మనకు ఏది కావాలనో దాన్ని అడిగితే దేవుడు తప్పనిసరిగా ఇస్తాడు. మనతోపాటు మన పిల్లలు కూడా సదాకాలం దేవాదిదేవుడిని సేవిస్తూ జీవిస్తే ఎంతో మేలు, ధన్యత. మనం దేవుడికి విధేయత చూపిస్తే అదే గొప్ప బహుమతి.

-పి.వాణిపుష్ప

అంతర్వాణి

# టేస్టీ టేస్టీ టిక్కాలు

ఆదివారం ఇంట్లో అందరూ ఉండే టైమ్‌లో సాయంకాలం చిన్నారుల చిట్టి బొజ్జ నింపడానికి... రకరకాల స్నాక్స్ అందివ్వొచ్చు. మురుకులు, చెగోడీలు, అప్పాలు.. ఎప్పుడూ ఇవేనా అనే చిచ్చర పిడుగులకు టేస్టీ టేస్టీ వెరైటీ టిక్కాలను చేసి పెట్టండి ఇష్టంగా తింటాం..

## పనీర్‌తో..

కావాల్సినవి : పనీర్-200 గ్రా. పెరుగు-400 గ్రా. పసుపు-అర చెంచా, కారం-రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, అల్లంవెల్లుల్లి ముద్దు, జీలకర్ర పొడి, ధనియాల పొడి- చెంచాన్నర చొప్పున,



గరంమసాలా, చాట్ మసాలా- చెంచా చొప్పున, నిమ్మకాయ-ఒకటి (రసం తీసి పెట్టుకోవాలి), కసూరీ మేథీ- చెంచా, శనగపిండి- రెండు చెంచాలు (ఇష్టమైతే), కార్న్‌ఫ్లోర్-చెంచా, క్యాప్సికమ్ (పసుపు, ఆకుపచ్చ, ఎరుపు రంగుల్లో) కొన్ని ముక్కలు (పెద్దగా), ఉల్లిపాయ-ఒకటి (పెద్ద ముక్కలుగా), నూనె-తగినంత.

తయారీ : పెద్ద గిన్నెలో పెరుగు, కారం, పసుపు మిరియాల పొడి తగినంత ఉప్పు, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరంమసాలా, చాట్ మసాలా, అల్లంవెల్లుల్లి ముద్ద, నిమ్మరసం, కసూరీ మేథీ వేసి కలపాలి. ఆ తర్వాత పదార్థాలు కలిసిపోయేలా బాగా గిలక్కొట్టాలి. దాంతో చిక్కటి క్రీమ్‌లా తయారవుతుంది. కావాలనుకుంటే శనగ పిండి కలపొచ్చు. కార్న్‌ఫ్లోర్‌నూ జత చేయాలి. బెల్‌పెప్పర్‌లను విత్తనాలను తీసేసి పెద్ద ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. ఉల్లిపాయలను కూడా. పెద్ద పాత్రలో కూరగాయ ముక్కలతోపాటు పన్నీర్ ముక్కలనూ జత చేయాలి. బెల్‌పెప్పర్‌లను విత్తనాలను తీసేసి పెద్ద ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. ఉల్లిపాయలను కూడా. పెద్ద పాత్రలో కూరగాయ ముక్కలతోపాటు పన్నీర్ ముక్కలనూ జత చేయాలి. వీటిపై మారినేట్ చేసిన ద్రవం పోసి ముక్కలకు పట్టేలా బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఓ మూడు గంటలు నాననివ్వాలి. ఆ తర్వాత పన్నీర్, క్యాప్సికమ్స్, ఉల్లిపాయ ముక్కలను స్టిక్‌కు గుచ్చాలి. పొయ్యి మీద గ్రిల్ పాన్ పెట్టి నూనె రాసి పనీర్ గుచ్చిన పుల్లలను పెట్టాలి. రెండు నిమిషాలు మూత పెడితే చక్కగా మగ్గుతాయి. ఇప్పుడు మరో వైపు తిప్పాలి. అవసరమైతే కాస్త నూనె రాయొచ్చు. అన్ని వైపులా చక్కగా కాలే వరకు తిప్పుతూ ఉండాలి. గ్రిల్ పాన్ లేనివారు సాధారణ పాన్ పై కూడా చేసుకోవచ్చు. చివరగా చక్కగా వేగిన పనీర్ టిక్కాలను ఆమ్‌చూర్ చల్లి తింటే చాలా బాగుంటాయి.

## గోబీతో..



కావాల్సినవి : కాలీఫ్లవర్ ముక్కలు-20, ఉప్పు- తగినంత,వేడినీళ్లు-మూడు కప్పులు.

మారినేషన్ కోసం : పెరుగు-అర కప్పు, కారం, కసూరీ మేథీ-చెంచా చొప్పున, పసుపు- పావు చెంచా, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరంమసాలా- అర చెంచా చొప్పున, ఉప్పు- తగినంత, నిమ్మరసం, వేయించిన శనగపిండి-రెండు చెంచాల చొప్పున, నూనె-తగినంత, అల్లం వెల్లుల్లి ముద్ద- చెంచా.

తయారీ : పెద్ద గిన్నెలో కాలీఫ్లవర్ ముక్కలు, ఉప్పు, వేడినీళ్లు పోసి కలిపి అయిదు నిమిషాలు పక్కన పెట్టాలి. ఆ తర్వాత నీళ్లని పారబోసి పక్కన పెట్టాలి. మరో గిన్నెలో పెరుగు, కారం, పసుపు, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరంమసాలా, కసూరీ మేథీ, ఉప్పు, నిమ్మరసం, అల్లంవెల్లుల్లి ముద్ద,శనగపిండి.. ఇలా అన్నింటినీ ఒకదాని తర్వాత మరొకటి వేసి బాగా కలపాలి. ఆ తర్వాత కాలీఫ్లవర్ ముక్కలు, కాస్తంత నూనెను చేర్చిబాగా కలియబెట్టాలి. ఈ పూర్తి మిశ్రమాన్ని అరగంట ఫ్రిజ్‌లో పెట్టాలి. పొయ్యి వెలిగించి పాన్ పెట్టి రెండు చెంచాల నూనె వేసుకోవాలి. అది కాగిన తర్వాత మారినేట్ చేసి గోబీ మిశ్రమాన్ని పాన్‌లో సమంగా పరిచి మంటను మధ్యస్థంగా పెట్టి ముక్కలు పూర్తిగా ముదురు గోధుమ రంగులోకి వచ్చే వరకు ఫ్రై చేయాలి. ఇప్పుడు వీటిని పొడవైన పుల్లలకు గుచ్చాలి. మరో పొయ్యి మీద గ్రిల్ పాన్ పెట్టి ఈ పుల్లలను దానిమీద పెట్టి కాస్తంత నూనె రాస్తూ అన్ని వైపులా వేగేలా చక్కగా వేయించాలి.

## మష్రూమ్‌తో..



కావాల్సినవి : పుట్టగొడుగులు-పది, ఉల్లిపాయ-సగం (పెద్ద ముక్కలుగా), ఆకుపచ్చ, ఎరుపు క్యాప్సికమ్-పావు ముక్క (పెదనద ముక్కలుగా) చొప్పున, గడ్డపెరుగు-అర కప్పు, శనపిండి-రెండు చెంఅచలు, పసుపు, జీలకర్ర పొడి, వాము-పావు చెంచా చొప్పున, కారం - చెంచా, అల్లం వెల్లుల్లి ముద్ద, ధనియాల పొడి, గరంమసాలా, కసూరీ మేథీ-అర చెంచా చొప్పున, నిమ్మరసం -రెండు చెంచాలు, ఉప్పు-తగినంత, నూనె-అయిదు చెంచాలు, చాట్ మసాలా-చిటికెడు.

తయారీ : పుట్టగొడుగులు, కూరగాయ ముక్కలు, రోస్టింగ్ కోసం నూనె, చాట్ మసాలా తప్పించి మిగతా పదార్థాలనినననంటినీ పెదనద పాత్రలో వేసి బాగా కలపాలి. చిక్కటి మిశ్రమం వచ్చేవరకు కలుపుతూ ఉండాలి. దీంట్లో పుట్టగొడుగులు, ఉల్లిపాయ, క్యాప్సికమ్ ముక్కలు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని అరగంట లేదా రాత్రంతా ఫ్రిజ్‌లో పెట్టాలి. మారినేషన్ పూర్తయిన తర్వాత పుట్టగొడుగులు క్యాప్సికమ్, ఉల్లిపాయ ముక్కలను పుల్లలకు గుచ్చాలి. పొయ్యి మీద పాన్/గ్రిల్ పాన్ పెట్టి నూనె వేసి వీటిని వేయించాలి. టిక్కాపై నూనె వేస్తూ అన్ని వైపులా దొర్లించాలి. మంటను మధ్యస్థంగా పెట్టి అన్నివైపులా బాగా కాలేలా చూడాలి. అయితే మాడకుండా జాగ్రత్త పడాలి. చివరగా చాట్ మసాలా చల్లితే మష్రూమ్ టిక్కా తినడానికి రెడీ.

## చికెన్ చీజ్‌తో...

కావాల్సినవి : చికెన్ బ్రెస్ట్-రెండు, మొజరెల్లా చీజ్-కప్పు, చీజ్ స్లైస్‌లు-రెండు, అల్లంవెల్లుల్లి ముద్ద, పచ్చిమిర్చి, కొత్తిమీర తురుము-రెండు చెంచాలచొప్పున, నూనె-తగినంత, నిమ్మరసం-పావు కప్పు, జాజికాయ పొడి- పావు చెంచా, జీలకర్ర-అర చెంచా, జాపత్రి-ఒకటి, యాలకులు- నాలుగు, శనగపిండి, పెరుగు-పావు కప్పు చొప్పున, సన్నగా కోసిన ఉల్లిపాయ-ఒకటి, ఉప్పు సరిపడా, గరంమసాలా-పావు చెంచా, నల్లుప్పు-చిటికెడు.



తయారీ : పలుచటి, వెడల్పాటిం పెద్ద చికెన్ ముక్కలను కత్తి మొనదేలిన భాగం వైపు నుంచి కాకుండా మరోవైపు నుంచి మెల్లిగా బీట్ చేయాలి. ఈ ముక్కలను ప్లేట్‌లోకి తీసుకోవాలి. వీటికి రెండు వైపులా నిమ్మరసం, ఉప్పు, అల్లం వెల్లుల్లి ముద్ద, నూనె వేసి రాసి పక్కన పెట్టుకోవాలి. పొయ్యి మీద పాన్ పెట్టి అది వేడయ్యాక జాజికాయ, జీలకర్ర, జాపత్రి, యాలకుల వేసి వేయించి రోట్లో వేసి కాస్త ఉప్పు కలిపి పొడి చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ప్లేట్‌లోకి తీసుకుని అందులో శనగపిండి, సన్నగా కోసిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు, కొత్తిమీర తురుము, కాస్తంత ఉప్పు, నల్లుప్పు, గరంమసాలా వేసి కలపాలి. కొద్దిగా నూనె పోసి మరోసారి బాగా కలపాలి. మారినేట్ చేసి పెట్టుకుననన చికెన్ ముక్కలకు ఈ మసాలా మిశ్రమాన్ని పట్టించి నాలుగు గంటలు మరోసారి మారినేట్ చేసుకోవాలి. ఆ తర్వాత ఈ చికెన్ ముక్క మధ్యలో చీజ్ స్లైస్ పెట్టి గుండ్రంగా చుట్టి ప్లేట్‌లోకి తీసుకుని పైనుంచి ఆ తర్వాత ఈ చికెన్ ముక్క మధ్యలో చీజ్ స్లైస్ పెట్టి గుండ్రంగా చుట్టి ప్లేట్‌లోకి తీసుకుని పైనుంచి మొజరెల్లా చీజ్‌ని తురిమి వేసుకోవాలి. దీన్ని బేకింగ్ ట్రేలో పెట్టి 180 డిగ్రీల్లో దాదాపు అరగంట. బేక్ చేసుకోవాలి. అంతే రుచికరమైన చికెన్ చీజ్ టిక్కా రెడీ. అవెన్ లేనివారు మందపాటి పాన్‌ను తీసుకుని నీళ్ల పోసి దాని మీద ప్లేట్‌లో చికెన్ ముక్కలు పెట్టి మూత బిగించి వేయించుకోవాలి. ఇలా చేస్తే అరగంట తర్వాత బేస్టీ చికెన్ టిక్కా రెడీ. □

## ఆరోగ్యానికి వేపపూత

★ ఎండిన వేపపూతను తడిలేకుండా చూసి తేనెలో వేసి ఎండలో కొన్నాళ్ళుంచి గట్టిపడిన తర్వాత ప్రతిరోజూ ఉదయాన ఒక చెంచా చొప్పున తింటే కఫదోషంపోయి జీర్ణశక్తిని కలిగించడమేకాక ఆకలిని పుట్టిస్తుంది.

★ వేపపూత బెల్లం కొంచెం ఉప్పు కారం వేసి కొద్దిగా నీరు కలిపి నూరండి. పచ్చడిగా ఆహారములో తింటే కడుపులో క్రిములో పోవడమేకాక జీర్ణశక్తిని కలిగించి ఆకలిని పుట్టిస్తుంది. □

# ఎమోషనల్ మూవీ 'భైరవం'

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ మోస్ట్ అవైటెడ్ యాక్షన్ థ్రిల్లర్ భైరవం టీజర్, పాటలు, ప్రమోషనల్ కంటెంట్‌కు అద్భుత స్పందనతో, పాజిటివ్ బజ్‌తో ముందుకు దూసుకెల్తు తోంది. ఈ నేపథ్యంలో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. **ఈ సినిమాకి దర్శకుడిగా విజయ్‌ని ఎంచుకోవ డానికి కారణం?** నాకు కమర్షి యల్ హీరోగా మంచి పేరు వచ్చిం ది. తర్వాత కొన్ని స్టైలిష్ సినిమాలు చేయడం జరిగింది. అప్పుడు మాస్ కనెక్ట్ అవుతున్నారా లేదా అనే ఆలోచన ఉండేది. అందరూ రిలేట్ చేసుకునే ఒక రూరల్ స్టోరీ చేయాలని ఉండేది. అలాంటి సినిమా కోసం చూస్తున్నప్పుడు ఈ కథ దొరికింది. ఈ కథని మన సెన్సిబిలిటీస్‌కి తగ్గట్టు ప్రజెంట్ చేసే గల దర్శకుడు విజయ్ అనిపించింది. నేను కూడా కొన్ని రీమిక్స్ చేశాను. **రోహిత్, మంచు మనోజ్ క్యారెక్టర్స్ గురించి?** రోహిత్, మనోజ్ ఇద్దరు కూడా చాలా ఇంపార్టెంట్ క్యారెక్టర్స్ చేస్తున్నారు. ముందు రోహిత్‌కి కలిసి ఈ క్యారెక్టర్ గురించి ఆయనకు చెప్పిన వెంటనే అంగీకరించారు. తర్వాత మిరాయ్ పోస్టర్లో మనోజ్‌ని చూసి ఆ క్యారెక్టర్‌కి మనోజ్ అయితే బాగుంటుందని ఆయనని సంప్రదించాం. ఆయనకు కూడా కథ నచ్చింది. ఈ కథకి వారిద్దరూ పర్ఫెక్ట్‌గా మ్యాచ్ అయ్యారు. ఈ కథకి ఇద్దరు కూడా చాలా ఎక్సైట్ అయ్యారు. **అతిథి శంకర్ గురించి?** అతిథి శంకర్ వెరీ నైస్ పర్సన్. వెరీ ఎనర్జిటిక్. మా అందరితో కలిసిపోయింది. తను చాలా మంచి యాక్టర్ అవుతుంది. తను మంచి సింగర్, డాన్సర్. చాలా టాలెంటెడ్. **ట్రైలర్‌లో ఒక పూనకం షాట్ ఉంది కదా.. దాని గురించి చెప్పండి?** నాకు మెయిన్‌గా నచ్చిన పార్ట్ అది. కథలో దాన్ని చాలా అద్భుతంగా వాడడం జరిగింది. ఆ సర్ ప్రైజ్‌ని ఆడియన్స్ చాలా ఎంజాయ్ చేస్తారు. చాలా ఎమోషనల్ ఇంపాక్ట్ ఇచ్చే సినిమా ఇది. ఈ సినిమా ట్రీట్మెంట్ చాలా కొత్తగా ఉంటుంది. మీరు ఒకవేళ తమిళ్ లో వెర్షన్ చూసినా కూడా ఈ సినిమా మీకు చాలా నచ్చుతుంది.


హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్

# హైదరాబాద్‌లో 'మెగా157' రెగ్యులర్ షూటింగ్

ఎంటర్‌టైన్‌మెంట్, చరిష్మాతో ప్రేక్షకుల ను అలరించేందుకు మెగాస్టార్ చిరంజీవి సిద్ధమయ్యారు. ఆయన హీరోగా నటిస్తున్న మెగా157 బ్లాక్‌బస్టర్ మేకర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొం దుతోంది. వరుస విజయాలు అందించిన అనిల్ రావిపూడికి ఇది చిరంజీవితో తొలి చిత్రం కావడం విశేషం. చిరంజీవి అభిమానులు ఎప్పటి నుంచో ఆయనను మళ్లీ పూర్తి స్థాయి హ్యూమరస్ క్యారెక్టర్‌లో చూడాల నుకుంటున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహూ గారపాటి, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సుస్మిత కొనిదెల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రెస్టీజియస్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి శ్రీమతి అర్చన ప్రజెంట్ చేస్తున్నారు. నయనతార చిరంజీవికి జోడిగా నటిస్తున్నారు. తన అభిమాన హీరో మెగాస్టార్ చిరంజీవిని డైరెక్ట్ చేయాలన్న అనిల్ రావిపూడి నిరీక్షణకు తెరపడింది. హైదరాబాద్‌లో సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. మొదటి రోజు డైరెక్టర్ అనిల్ రావిపూడి చిరంజీవితో పాటు ఇతర నటీనటులపై ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. అనిల్ రావిపూడి లానే చిరంజీవి కూడా ఈ ప్రాజెక్ట్‌పై ఎంతో ఆసక్తిగా ఉన్నారు. తాజాగా సంక్రాంతికి





విడుదలైన సంక్రాంతికి వస్తున్నాం ఇండస్ట్రీ బ్లాక్ బస్టర్‌తో మంచి జోరు మీదున్న అనిల్ రావిపూడి, తన యూనిక్ ప్రమోషన్లతో సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నారు. టెక్నికల్ క్రూ పరిచయ వీడియో, తర్వాత నయనతార ప్రోమో వీడియో ఆడియన్స్‌ని కట్టిపడేసింది. ఈ చిత్రానికి సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు, భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. తమ్మిరాజు ఎడిటర్. రైటర్స్ ఎస్ కృష్ణ, జి ఆది నారాయణ స్క్రిప్ట్‌పై వర్క్ చేస్తున్నారు, ఎస్ కృష్ణ కూడా ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా పనిచేస్తున్నారు. ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్. ఈ సినిమా 2026 సంక్రాంతికి విడుదల కానుంది. నటీనటులు: మెగాస్టార్ చిరంజీవి, నయనతార, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: అనిల్ రావిపూడి నిర్మాతలు: సాహు గారపాటి, సుస్మిత కొణిదెల, బ్యానర్లు: షైన్ స్క్రీన్స్ గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ సమర్పణ: శ్రీమతి అర్చన సంగీతం: భీమ్స్ సిసిరోలియో డీవోపీ: సమీర్ రెడ్డి.

# థియేటర్ల బంద్‌పై తెలుగు ఫిలిం ఛాంబర్ క్లారిటీ

తెలుగు ఫిలిం ఛాంబర్ కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ, ఇటీవల వినిపిస్తున్న కొన్ని వార్తలను బేస్ చేసుకుని ఈ మీటింగ్ పెట్టడం జరి గింది. దీనికై ఉదయం 11 గంటల నుండి ఫిలిం ఛాంబర్‌లో ఒక మీటింగ్ నిర్వహిం చాము. ఈ మీటింగ్‌కు రెండు తెలుగు రాష్ట్రాల ప్రముఖ నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు హాజర య్యారు. ప్రస్తుతం థియేటర్ల పరిస్థితిపై ఉన్న కొన్ని సమస్యల గురించి చర్చలు జరగాయి. మే 1వ తారీకు నుండి థియేటర్లు మూతపడతాయని వార్త బయటకు వెళ్ళింది. కానీ అలా థియేటర్లు మూసి వేయడం అనేది జరగడం లేదు. అది పూర్తిగా ఊహ గానం మాత్రమే. ఈనెల 30వ తేదీన ఈసీ మీటింగ్ ఉండబో తుంది. ఆరోజు మూడు సెక్టార్లకు నుండి ఒక కమిటీ నిర్మించబోతు న్నాము. ఓ నిర్ణీత సమయంలోనే ఈ సమస్యకు పరిష్కారం వచ్చేలా ఆ కమిటీ పని చేయబోతుంది. దీనికి సంబంధించిన ఎటువంటి వార్తలేనా ఫిలిం ఛాంబర్ ఇంకా అనుసంధాన సంస్థల నుండి బయటకు వస్తే కేవలం ఆ వార్తలను మాత్రమే ప్రచారం చేయండి. అంతేకానీ బయటనుండి వేరే ఇతర వార్తలు ఏమైనా వస్తే వాటిని దయచేసి నమ్మకండి, ప్రచారం చేయకండి. ఎందుకంటే అటువంటి అబద్ధపు వార్తలు కేవలం చిత్ర పరిశ్రమలో అనవసరమైన ఆటంకాలు తీసుకొస్తున్నాయి. అలాగే ఈ విషయంపై అవసరమైతే ప్రభుత్వంతో కూడా మాట్లాడతాము. గతంలో కూడా కొన్ని సమస్యలకు ప్రభుత్వంతో కూర్చుని చర్చించడం జరిగింది. అదేవిధంగా ఇప్పుడు కూడా చర్చించబోతు న్నాము. చిత్ర పరిశ్రమలో ఎటువంటి కష్టాలు వచ్చిన బయట వారు ఎవరు వచ్చి ఆ కష్టాల నుండి బయటకి తీసుకున్నారు. కేవలం ఇండస్ట్రీ మాత్రమే ఆ కష్టాలను స్వయంగా బయట పడుతుంది. అలాగే ఏదో ఒక సినిమాను టార్గెట్ చేసి థియేటర్లు బంద్ చేస్తున్నారు అనే వార్తను పూర్తిగా ఖండిస్తున్నాము. ఇండస్ట్రీకి మంచి జరిగే విధంగానే ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఈ సమస్యల నుండి బయట పడి ముందుకు వెళ్తాము అన్నారు.



దిశా పటాని నయా లుక్



# 'కట్టలన్' టైటిల్ అనౌన్స్‌మెంట్

బిగ్గెస్ట్ పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ మార్కో విజయం తర్వాత క్యూబ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాత షరీఫ్ మహమ్మద్, తన తదుపరి ప్రతిష్టా త్మక ప్రాజెక్ట్‌గా కట్టలన్ ను అనౌన్స్ చేశారు. ఇది పాన్‌ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న హైయాక్షన్ థ్రిల్లర్. ప్రముఖ నటుడు ఆంటోనీ వర్గీస్ (పేపే) హీరోగా నటిస్తున్నారు. దర్శకత్వం పాల్ జార్జ్. కాంతార 2కి సంగీతం అందించిన అజనీష్ లోకనాథ్ ఇప్పుడు షరీఫ్ మహమ్మద్‌తో చేతులు కలిపారు. ఈ సినిమాకి సంగీతంతో అజనీష్ మరోసారి ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ సంచలనంగా మారింది. వర్షంలో తడిచిన పేపే, చుట్టూ పడి ఉన్న మృతదేహాలు, ఏనుగు దంతాల మధ్య



నిలబడి వుండటం కథలో ఉండబోయే వైలెన్స్ సూచిస్తోంది. మార్కో స్థాయిని మించి ఉండ బోతోందని సంకేతాలు ఇస్తోంది. జైలర్, లియో, జవాన్, కూలీ లాంటి చిత్రాలకు టైటిల్ ఫాంట్స్ డిజైన్ చేసిన ఐడెంట్ ల్యాబ్స్ ఈ సినిమాకి కూడా టైటిల్ డిజైన్ చేశారు. కంటెంట్, మార్కెటింగ్ పరంగా క్యూబ్స్ ఎంటర్‌టైన్ మెంట్స్ కొత్త ప్రమాణాలను నెలకొల్పుతుండగా, పేపే హై ఇంటెన్సిటీ పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న తరుణంలో కట్టలన్ నిజంగా ఒక గొప్ప సినీ అనుభూతి కావడంలో సందేహమే లేదు. ఈ సినిమాకి పీఆర్ మార్కెటింగ్ వంశీ శేఖర్.

# 'పరమపద సోపానం' నుంచి లిరికల్ సాంగ్

టాలీవుడ్‌కి అర్ధనారి వంటి హిట్ సినిమాతో హీరోగా తెరంగేట్రం చేసి మంచి పాపులారిటీ సంపాదించుకున్న అర్జున్ అంబటి ఆ తర్వాత బిగ్ బాస్ రియాలిటీ షోతో ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. తాజాగా తెప్పసముద్రం వెడ్డింగ్ డైరీస్ వంటి వైవిధ్యమైన సినిమాల్లో నటిస్తూ దూసుకుపోతున్నారు. అతను హీరోగా రూపొందిన లేటెస్ట్ మూవీ పరమపద సోపానం. అచ్చమైన తెలుగు టైటిల్‌తో తెరకెక్కు తున్న ఈ సినిమా ఓ ఇంటరెస్టింగ్ థ్రిల్లర్ ప్రేక్షకుల ముందుకు రానుంది. జెన్నీఫర్ ఇమ్మాన్యుయేల్ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తుంది. ఎస్.ఎస్. మీడియా సంస్థపై గిడిమిట్ల శివ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గుడిమెట్ల ఈశ్వర్ ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవరిస్తున్నారు. అలాగే ఈ సినిమాకు గతంలో పూరి జగన్నాథ్ వంటి దిగ్గజ దర్శకుడికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసిన నాగ శివ పరమపద సోపానం చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్ ప్లే మరియు దర్శకత్వం అందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా జూలై 11న గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా ప్రమోషన్లను వేగవంతం చేస్తూ ముందుగా చిన్ని చిన్ని తప్పులేవో అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. మాస్ మహారాజ్ రవితేజ ఈగల్ వంటి సినిమాతో సంగీత దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న దేవ్ జాంద్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. చిన్ని చిన్ని తప్పులేవో పాటకి ఆయన అందించిన ట్యూన్ ట్రెండీగా ఉంది. సింగర్స్ పృథ్వీ చంద్ర, అదితి బావరాజు ఆలపించిన విధానం.. రాంబాబు గోశాల అందించిన సాహిత్యం యువతని ఆకర్షించే విధంగా ఉందని చెప్పాలి. విడుదలైన కాసేపటికే ఈ పాటకి సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ లభించింది. సినిమా కూడా ఈ పాటలనే అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని చిత్ర యూనిట్ సభ్యులు విశ్వసిస్తున్నారు.



# 26న 'డకాయిట్-ఏక్ ప్రేమ్ కథ' గ్లింప్స్ రిలీజ్

అడివి శేష్ మోస్ట్ ఎవైటెడ్ పాన్‌ఇండియా యాక్షన్ డ్రామా డకాయిట్ ఎక్సయిటింగ్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని అందించ బోతోంది. మృణాల్ ఠాకూర్ ఈ చిత్రంలో కథానాయిక నటిస్తోంది. ప్రముఖ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ ఈ ప్రాజెక్ట్‌లో ఒక పవర్ ఫుల్ పాత్రని పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి ట్రెమెండస్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఒక ఎక్సయి టింగ్ అప్డేట్‌తో వచ్చారు. డకాయిట్ ఫైర్ గ్లింప్స్ మే 26న రిలీజ్ చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు. అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో అడివి శేష్ ఇంటెన్స్ లుక్‌లో దూరంగా ట్రైన్, కార్ ఫైర్ యాక్సిడెంట్‌ని చూస్తూ కనిపించడం ఫైర్ గ్లింప్స్‌పై క్యూరియాసిటీని పెంచుతోంది. షనీల్ డియో దర్శకత్వం వహించిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పిస్తోంది. డకాయిట్ కథ, స్క్రీన్‌ప్లేను శేష్, షనీల్ డియో సంయుక్తంగా రూపొందించారు. హిందీ, తెలుగు భాషలలో ఏకకాలంలో షూటింగ్ జరుగుతున్న మూవీ ఆడియన్స్‌కి గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది.



# సౌమిత్ రావు, శ్రేయాసి సేన్ జంటగా 'నిలవే'

సౌమిత్ రావు, శ్రేయాసి సేన్ జంటగా నటించిన నిలవే చిత్రానికి సౌమిత్ రావు, సాయి వెన్నం దర్శకత్వం వహించారు. తాహెర్ సినీ టెక్ సౌజన్యంతో సాయి వెన్నం, గిరిధర్ రావు పోలాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి పాత్రల్ని పరిచయం చేశారు. సంతోషం, నమ్మకం, అలక, పిలుపు అంటూ అన్ని రకాల ఎమోషన్స్‌కు సంబంధించిన నిలవే పోస్టర్‌లను రిలీజ్ చేశారు. అనంతరం చిత్రయూనిట్ మాట్లాడుతూ, హీరో సౌమిత్ రావు మాట్లాడుతూ, నిలవే ఓ మంచి మ్యూజికల్ లవ్ డ్రామాగా రాబోతోంది. అంతా కొత్త వాళ్లం కలిసి చేస్తున్నాం. కొత్త వాళ్లు కూడా మంచి చిత్రాల ను తీస్తారు. మేం ఎంతో నిజాయితీతో ఈ మూవీని చేశాం. మా కంటెంట్ బాగుందని ఆడియెన్స్ చెప్పాలి. మా సినిమా బాగుందని ఆడియెన్స్ ఫీల్ అయ్యేలా చేయాలని ప్రయత్నిస్తున్నాం. మా మూవీని ఆడియెన్స్ వద్దకు తీసుకెళ్లేందుకు మీడియా సహకరించాలి. నిజాయితీకి అర్థం ఉంటే అది మా నిలవే సినిమా. మా చిత్రం అందరినీ సర్ ప్రైజ్ చేస్తుంది అని అన్నారు. దర్శకుడు సాయి వెన్నం మాట్లాడుతూ, మా పేర్లు ఎవ్వరికీ




తెలియకపోవచ్చు. మాది చిన్న టీం కావొచ్చు. మాది చిన్న ఐడియా కావొచ్చు. కానీ మా కాన్సెప్ట్, మా సినిమా చాలా పెద్దగా ఉంటుంది. ఇదొక అందమైన ప్రేమ కథ. ఓ వ్యక్తి జీవితంలో జరిగే ప్రయాణమే నిలవే. మ్యూజిక్‌ని లవ్‌తో చూపించాలని అనుకున్నాం. మేం కథ పైన ప్రేమతో ఎంతో కష్టపడి నిలవే చిత్రాన్ని తీశాం. టీజర్ చూస్తే నిజాయతీగా ఉంటుంది. ఎక్స్‌పోజింగ్ లేదని, డైలాగుల్లో బూతులు లేవని, వైరల్ అవ్వదని చాలా మంది చెప్పారు. కానీ మా కంటెంట్ మాత్రమే చెప్పాలని టీజర్ కట్ చేశాం. నిలవే చాలా మంచి సినిమా. అందరూ మా సినిమాకు సపోర్ట్ చేయండి అని అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ కళ్యాణ్ నాయక్ మాట్లాడుతూ, నిలవే టైంకి నా చేతిలో ఒక్క సినిమా కూడా లేదు. కానీ నా మీద నమ్మకంతో సినిమాను ఇచ్చారు. ఈ మూవీకి కొత్తమ్యూజిక్‌ను ఇచ్చాం. సినిమా, కథ నుంచే ఇంత మంచి సంగీతం వచ్చిందని నేను నమ్ముతున్నాను. ఈ మూవీని నేను జీవితాంతం గుర్తు పెట్టుకుంటాను. మంచి చిత్రానికి అందరూ సపోర్ట్ చేయాలి.

# 'గుర్తింపు' ఫస్ట్ లుక్

స్వస్తిక్ విజన్స్ సమర్పణలో గంగా ఎంటర్టైన్మెంట్స్ నిర్మాణంలో కేజేఆర్ హీరోగా తెన్‌పతియాన్ దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోన్న చిత్రం గుర్తింపు. స్పోర్ట్స్ కోర్ట్ డ్రామాగా రాబోతోన్న ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. యథార్థ సంఘటనల ఆధారంగా గుర్తింపు చిత్రాన్ని తెరకెక్కిస్తు న్నారు. నిర్మాత మహేశ్వర్ రెడ్డి మూలి మాట్లాడుతూపేదరికంలో ఉన్న ఓ వ్యక్తి.. తన కలల్ని నెరవేర్చు కునేందుకు క్రీడా రంగంలో ఎదిగిన తీరు, క్రీడా రంగంలో గుర్తింపు కోసం పడిన శ్రమ, చేసిన ప్రయాణం, ఎదుర్కొన్న సవాళ్లను అందరికీ కనెక్ట్ అయ్యేలా ఎమోషనల్ డ్రామాగా గుర్తింపు సినిమాను రూపొందిస్తున్నా. ఇప్పటికి 85 శాతం షూటింగ్ పూర్తయింది. ఇంతకు ముందు మా సంస్థలో శివ కార్తికేయన్ చిత్రాన్ని వరుణ్ డాక్టర్ పేరుతో అనువదించి మంచి విజయాన్ని అందుకున్నా. ఇటీవల అశ్విన్ బాబు హీరోగా శివం భజే చిత్రం నిర్మించాను అని తెలిపారు. స్పోర్ట్స్, కోర్ట్ డ్రామాగా రానున్న ఈ గుర్తింపు చిత్రంలో కేజేఆర్, సింధూరి విశ్వనాథ్, విజి వెంకటేష్, రంగరాజ్ పాండే, మన్సూర్ అలీ ఖాన్, రమా, మోహన్ రామ్, ఆంటోనీ, అజిత్ ఘోషి, విమల్, ఇజబెల్లా, షాన్, దీపిక, జానకి, అరుల్ జ్యోతి వంటి వారు ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి



సంగీతం: జిబ్రాన్, కెమెరామెన్: ఎ.విశ్వనాథ్, యాక్షన్: పీటర్ హెయిన్, ఎడిటర్: శాన్ లోకేష్, ఆర్ట్ డైరెక్టర్: రాము తంగరాజ్, నిర్మాణం: స్వస్తిక్ విజన్స్, గంగా ఎంటర్టైన్మెంట్స్, దర్శకుడు: తెన్‌పతియాన్.



## స్లో ఓవర్ రేట్‌తో కమిన్స్, పాటిదార్‌లకు జరిమానా

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి) కెప్టెన్ రజత్ పాటిదార్ మరియు సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్‌లకు వారి జట్ల స్లో ఓవర్ రేట్ కారణంగా జరిమానా విధించబడింది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి ప్రకారం కమిన్స్ జట్టు ఈ సీజన్‌లో చేసిన మొదటి నేరం కావడంతో అతనికి రూ.12 లక్షల జరిమానా విధించగా, రెండోసారి కూడా నేరం చేసిన ఆర్‌సిబి జట్టు ప్లేయింగ్ ఎలెవన్‌లో సభ్యుడిగా పాటిదార్‌కు రూ.24 లక్షల జరిమానా విధించారు. ఇంపాక్ట్ ప్లేయర్‌తో సహా ప్లేయింగ్ 11 లోని మిగిలిన సభ్యులకు ఒక్కొక్కరికి వ్యక్తిగతంగా రూ.6 లక్షలు లేదా వారి మ్యాచ్ ఫీజులో 25 శాతం, ఏది తక్కువైతే అది జరిమానా విధించినట్లు ఐపీఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. కనీస ఓవర్‌రేట్ నేరాలకు సంబంధించిన ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం, ఈ సీజన్‌లో అతని జట్టు చేసిన మొదటి నేరం ఇది కాబట్టి, కమిన్స్‌కు రూ.12 లక్షల జరిమానా విధించబడింది" అని పేర్కొంది.



## నాపోలికి ఫుట్‌బాల్ టైటిల్

### 2-0 తేడాతో కాగ్లియా ఓటమి

**న్యూఢిల్లీ:** నాపోలి 2024-25 సిరీస్ ఎ ఫుట్‌బాల్ టైటిల్‌ను గెలుచుకుంది. చివరి మ్యాచ్‌లో ఇంటర్ మిలన్‌ను ఒక పాయింట్ తేడాతో ఓడించడం ద్వారా ఈ విజయాన్ని అందుకుంది. ఛాంపియన్స్ లీగ్ ఆశావాదులైన ఇంటర్ కోమోలో సాధించిన విజయం వృధా కావడంతో, నాపోలి 2-0 తేడాతో కాగ్లియారీని ఓడించి సీరీ ఎ టైటిల్‌ను కైవసం చేసుకుంది. శనివారం జరిగిన సిరీస్ టైటిల్ రేస్ ముగింపు మ్యాచ్‌లో నాపోలి చివరి రౌండ్ ఆటలకు చేరుకునే ముందు ఇంటర్ మిలన్ కంటే ఒక పాయింట్ ఆధిక్యంలో ఉంది. విరామానికి మూడు నిముషాల ముందు మెక్‌టోమినే మాటియో పొలిటాన్ క్రాస్ నుండి అద్భుతమైన సైకిల్ కిక్‌తో స్కోరింగ్‌ను ప్రారంభించాడు. పునహ ప్రారంభమైన ఆరు నిముషాల తర్వాత లుకాకు లాంగ్ ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. గత సీజన్‌లో పేలవమైన టైటిల్ డిఫెన్స్‌లో పార్టెనోపీ 10వ స్థానంలో నిలిచిన తర్వాత దక్షిణ జట్టు మొత్తం ఈమద నాల్గవ సిరీస్ ఎ టైటిల్‌ను ఆకట్టుకునే మలుపు తిప్పింది. ఆ సీజన్‌లో ఇంటర్ చేతిలో ఓడిపోయిన నేపుల్స్ కల్బ్ టైటిల్‌ను తిరిగి పొందేందుకు నాపోలి ఈసారి తీవ్ర యత్నం చేసింది. ఇంటర్ తరపున డిఫెండర్ స్టెఫాన్ డి్రవిజ్ 20 నిముషాల్లో గోల్ చేశాడు. బౌన్స్ హెడర్‌తో కార్నర్ కిక్‌ను దారి మళ్లించాడు.

ఆట



## భారత్ కెప్టెన్‌గా గిల్

### టెస్టు క్రికెట్‌లో నవ శకం స్టార్ట్.. ఇండియా జట్టు ఖరారు

**న్యూఢిల్లీ:** భారత టెస్టు క్రికెట్‌లో నవ శకం ప్రారంభమైంది. యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ టీమ్ ఇండియా కొత్త కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. తొలి నుంచి ప్రచారం జరినట్లుగానే గిల్ వైపే సెలక్టర్లు మొగ్గు చూపారు. జూన్‌లో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనున్న భారత జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది. ఇందులో గిల్‌కు డిప్యూటీగా రిషభ్ పంత్‌ను నియమించింది. మొత్తం 18 మంది ఆటగాళ్లతో జట్టును ప్రకటించింది. ఇక 33ఏళ్ల కరుణ్ నాయర్‌కు ఎట్టకేలకు టీమ్ ఇండియా పిలుపు అందింది. గత కొంతకాలంగా దేశవాళీలో అదరగొడుతున్న కరుణ్‌ను సెలక్టర్లు ఇంగ్లాండ్ సిరీస్‌కు ఎంపిక చేశారు. 2016లో టెస్టుల్లో ఎంట్రీ ఇచ్చిన కరుణ్ 6 మ్యాచ్‌లే ఆడాడు. ఇందులో ఓ ట్రిపుల్ సెంచరీ ఉంది. అయితే ఆ తర్వాత ఏడాదే 2017లో కరుణ్ జట్టులో చోటు కోల్పోయాడు. అప్పటి నుంచి టీమ్ ఇండియాలో రీఎంట్రీ కోసం ప్రయత్నిస్తే, ఇన్నేళ్లకు అవకాశం దక్కింది. అలాగే తొలి సారిగా నలుగురికి భారత్ జట్టులో చోటు దక్కింది. సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, అర్షదీప్ సింగ్‌లకు లక్కీ ఛాన్స్ దక్కింది. ఇంగ్లాండ్ సిరీస్ లో వీళ్లు బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. కాగా, సాయి సుదర్శన్, అర్షదీప్ ఇప్పటికే టీ20, వన్డేల్లో ఆడినప్పటికీ టెస్టుల్లో అవకాశం ఇదే ఫస్ట్ టైమ్. మరోవైపు, అభిమన్యు టీమ్ ఇండియాకు ఎంపికవ్వడం ఇదే తొలిసారి. మరోవైపు, సీనియర్ బ్యాటర్లు అజింక్యా రహానే, ఛతేశ్వర్ పుజారాకు మరోసారి నిరాశే మిగిలింది. రోహిత్, విరాట్ రిటైర్మెంట్ నేపథ్యంలో ఈ ఇద్దరికీ అవకాశం వస్తుందని భావించినా సెలక్టర్లు మొండి చేయి చూపారు. రహానే, పుజారా టీమ్‌ఇండియా తరఫున 2023లో ఆఖరి టెస్టు మ్యాచ్ ఆడారు. కాగా టీమ్‌ఇండియాలో శుభ్‌మన్ గిల్ (కెప్టెన్). రిషభ్ పంత్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్షదీప్ సింగ్, కుల్‌దీప్ యాదవ్ ఉన్నారు.

## ఐపిఎల్‌లో మెయిడిన్‌గా 20వ ఓవర్

### లాస్ట్ ఓవర్‌లో ఒక్క రన్ ఇవ్వని బౌలర్లు

**న్యూఢిల్లీ:** ఐపీఎల్‌లో బరిలోకి దిగిన బ్యాటర్ ప్రతి బంతిని బౌండరీ లైన్ దాటించాలనే ప్రయత్నిస్తాడు. అలాగే ఆట మొదలైనప్పటి నుంచి ముగిసేదాకా బ్యాటర్‌ను కట్టడి చేయడానికి బౌలర్‌పై ఒత్తిడి తీవ్రంగానే ఉంటుంది. డెత్ ఓవర్లలో అయితే చెప్పనవసరం లేదు. మరీ ముఖ్యంగా చివరి ఓవర్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తారు. ఏ బౌలర్‌కైనా చివరి ఓవర్ (20వ ఓవర్) బౌలింగ్ చేయడం అంత సులువేం కాదు. అలా ఐపీఎల్‌లో 20వ ఓవర్లో 30+ పరుగులు వచ్చిన సందర్భాలు అనేకం. అయితే అలాంటి కఠినమైన పరిస్థితుల్లో చివరి ఓవర్‌ను మెయిడిన్‌గా మలిచిన సందర్భాలు కూడా ఉన్నాయి. మెయిడిన్ ఓవర్ అంటే ఒకే ఓవర్‌లో బౌలర్ ఒక్క పరుగు కూడా ఇవ్వకపోయినట్లయితే ఆ ఓవర్‌ను మెఇయడిన్ ఓవర్ అంటారు. అవును! 18 సీజన్ల ఐపీఎల్ చరిత్రలో ఒక్కసారి, రెండుసార్లు కాదు. ఏకంగా నాలుగుసార్లు 20వ ఓవర్ మెయిడెన్ అయ్యింది. మరి ఈ అరుదైన ఘనత సాధించిన బౌలర్లలో నలుగురు ఉన్నారు. క్రికెట్ లో చివరి ఓవర్‌ను మెయిడిన్‌గా వేసిన బౌలర్లలో ఇర్ఫాన్ పఠాన్, ఉమ్రాన్ మాలిక్, జయదేవ్ ఉనద్కట్, లాసిత్ మాలింగ ఉన్నారు. ఐపీఎల్ చరిత్రలో 20వ ఓవర్ మెయిడెన్‌గా మలిచిన తొలి బౌలర్ ఇర్ఫాన్ పఠాన్. 2008లో పంజాబ్‌కు ప్రాతినిధ్యం వహించిన ఇర్ఫాన్, ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘనత సాధించాడు. అతను హైదరాబాద్ తో జరిగిన మ్యాచ్ లో 20వ ఓవర్ మెయిడిన్ వేసి 3 వికెట్లు కూడా తీసుకున్నాడు. ఇర్ఫాన్ ఐపీఎల్ కెరీర్‌లో 103 మ్యాచ్‌ల్లో 80 వికెట్లు పడగొట్టాడు. ఇక ముంబయి ఇండియన్స్ బౌలర్ లసిత్ మలింగ ఐపీఎల్‌లో అత్యుత్తమ బౌలర్లలో ఒకరిగా నిలిచాడు. 2009లో దక్కన్ ఛార్జర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మలింగ 20వ ఓవర్ మెయిడెన్ చేశాడు. ఈ ఓవర్‌లో పరుగులేమీ ఇవ్వకపోవడమే కాకుండా 2 వికెట్లు పడగొట్టి సత్తా చాటాడు. మలింగ 122 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 170 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. ఇక ఈ అరుదైన ఘనత సాధించిన లిస్ట్‌లో టీమ్‌ఇండియా పేసర్ జయదేవ్ ఉనాద్కత్ కూడా ఉన్నాడు. 2017 ఐపీఎల్‌లో రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్ టీమ్‌లో ఉన్నాడు. హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో చివరి ఓవర్‌లో మెయిడెన్‌తో సహా 3 వికెట్లు పడగొట్టాడు. ఒక మెయిడెన్‌తో హ్యాట్రిక్ వికెట్లు తీసిన బౌలర్‌గా కూడా రికార్డు సృష్టించాడు. 2022 ఐపీఎల్‌లో ఉమ్రాన్ మాలిక్ సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడాడు. పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో మూడు వికెట్లు పడగొట్టి ఒక్క పరుగు కూడా ఇవ్వలేదు.













## విండీస్ మ్యాచ్ రద్దు

### వర్షంతో సాధ్యంకాని ఐర్లాండ్ ఇన్నింగ్స్

### ఫలితం లేకుండా ముగిసిన రెండో వన్డే

**న్యూఢిల్లీ:** విజయంపై ఆశలు పెంచుకున్న వెస్టిండీస్‌ను వరుణుడు కరుణించ లేదు. దీంతో ఐర్లాండ్, వెస్టిండీస్ జట్ల మధ్య జరిగిన రెండో వన్డే ఫలితం తేలకుండానే ముగిసింది. వెస్టిండీస్ ఇన్నింగ్స్ ముగిశాక భారీ వర్షం రావడంతో ఐర్లాండ్ ఛేజింగ్ సాధ్యపడ లేదు. వెరసి మూడు వన్డేల సిరీస్‌లో ఐర్లాండ్ ప్రస్తుతం 1-0 ఆధిక్యంతో ఉంది. ఇక ఐర్లాండ్ చేతిలో తొలి వన్డేలో ఎదురైన ఓటమి నుండి తేరుకున్న విండీస్ రెండో వన్డేలో అదరగొట్టి భారీ స్కోరు చేసింది. డబ్లిన్‌లో టాస్ గెలిచిన ఐర్లాండ్ కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ ఫీల్డింగ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ దిగిన వెస్టిండీస్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 352 పరుగులు చేసింది. వన్‌డౌన్ బ్యాటర్ కేసీ కార్టీ (109 బంతుల్లో 102, 13 ఫోర్లు, 1 సిక్స్) కెరీర్‌లో రెండో సెంచరీ నమోదు చేయగా, చివర్ల మాధ్యూ ఫోర్డ్ (19 బంతుల్లో 58 పరుగులు, 2 ఫోర్లు, 8 సిక్స్‌లతో శివమెత్తాడు. కేవలం 16 బంతుల్లోనే ఫోర్డ్ అర్ధ సెంచరీ సాధించాడు. ఈ క్రమంలో వన్డేల్లో హాఫ్ సెంచరీ చేసిన ప్లేయర్‌గా ఏబీ డివిలియర్స్ (16 బంతుల్లో) పేరిట ఉన్న రికార్డును ఫోర్డ్ సమం చేశాడు. కెప్టెన్ షై హోప్ (57 బంతుల్లో 49 పరుగులు, 5 ఫోర్లు, 1 సిక్స్) పరుగు తేడాతో అర్ధ సెంచరీని చేజార్చుకోగా, జస్టిన్ గ్రీవెస్ (36 బంతుల్లో 44 పరుగులతో నాటౌట్, 4 ఫోర్లు, 1 సిక్స దూకుడుగా ఆడాడు. ఐర్లాండ్ బైలర్లలో బ్యారీ మ ఎకార్తీ, జోష్ లిటిల్ 2 వికెట్లు చొప్పున తీయగా, లియామ్ మెకార్తీకి 3 వికెట్లు దక్కాయి. ఇక ఈ రెండు జట్ల మధ్య చివరిదైన మూడో వన్డే ఈనెల 25న జరగనుంది.

## ఆర్‌బిఐ డివిడెండ్ రూ.2.70 లక్షల కోట్లు

**ముంబై, మే 24:** ఈ సారి ప్రభుత్వానికి కొత్త రికార్డు డివిడెండ్ చెల్లించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. నివేదిక ప్రకారం, ఆర్‌బిఐ 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వానికి రూ.2.69 లక్షల కోట్ల డివిడెండ్‌ను బదిలీ చేస్తుంది. అంతకుముందు సంవత్సరం (2023-24)లో ఇది రూ.2.1 లక్షల కోట్ల డివిడెండ్ చెల్లించింది. అయితే, ఈసారి డివిడెండ్ 27 శాతం పెరిగింది. ఇది ప్రభుత్వానికి ఆర్బీఐ చెల్లించే గరిష్ట డివిడెండ్ మొత్తం. 2022-23లో ప్రభుత్వానికి ఆర్‌బిఐ చెల్లించిన డివిడెండ్ కేవలం రూ.87,416 కోట్లు మాత్రమే. ప్రపంచ అనిశ్చితి, పాకిస్తాన్‌తో సరిహద్దు వివాదం వంటి సంఘటనలు భారత దేశ ఆర్థిక పురోగతికి కొంతవరకు ఆటంకం కలిగించాయి. ఈ సమయంలో ఆర్థిక వృద్ధిని పెంచడానికి ప్రభుత్వం ఈ సంవత్సరం చాలా ఖర్చు చేయడం అత్యవసరం. ఈ కారణంగా ఆర్‌బిఐనుండి వచ్చే రూ.2.70 లక్షల కోట్లు ప్రభుత్వానికి సహాయపడతాయి. మే 15న కొత్త ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్ష తన జరిగిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో రూ.2,68,590.07 కోట్ల డివిడెండ్ ప్రకటించాలని నిర్ణయం తీసుకున్నారు. డివిడెండ్ మొత్తాన్ని ఎకనామిక్ కేపిటల్ ఫ్రేమ్‌వర్క్ అనే ఫార్ములా ఆధారంగా నిర్ణయిస్తారు. ఈ ఫ్రేమ్‌వర్క్ ప్రకారం, 7.50 నుండి 4.50 వరకు ఆదాయం శాతాన్ని కంటింజెంట్ రిస్క్ బఫర్‌గా పరిగణిస్తారు. ఈరిస్క్ బఫర్‌మొత్తాన్ని నిలుపుకుని, మిగిలిన మొత్తాన్ని డివిడెండ్ల రూపంలో ప్రభుత్వానికి ఇస్తారు. ఆర్‌బిఐ ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి డివిడెండ్‌లను చెల్లిస్తుంది. బాండ్ల నుండి వచ్చేవడ్డీ, ఫారెక్స్ నిల్వలలో ఉన్న ఆస్తుల పెరుగుదల నుండి వచ్చే లాభాలు మొదలైనవి ఆర్‌బిఐకి ప్రధాన ఆదాయ వనరులు. ఆర్‌బిఐ వాణిజ్య బ్యాంకులకు నిర్దిష్ట వడ్డీ రేటుకు డబ్బు ఇస్తుంది. ఇది ఆర్‌బిఐకి ప్రధాన ఆదాయవనరు. ఆర్‌బిఐ ప్రభుత్వ బాండ్లను కొనుగోలు చేస్తుంది. ఇవి ప్రభుత్వం నుండి వడ్డీ చెల్లింపులను పొందుతాయి. ఆర్‌బిఐ తన విదేశీ మారక నిల్వలలో గణనీయమైన భాగాన్ని యుఎస్ ట్రెజరీ బాండ్ల వంటి ఆస్తులలో పెట్టుబడి పెడుతుంది.




## టారిఫ్ విధించినా.. భారత్‌లో తక్కువ రేటుకే ఆపిల్ ఫోన్లు

**వాషింగ్టన్, మే 24:** అమెరికాలో ఐఫోన్లు తయారుచేయని పక్షంలో, ఆపిల్ ఉత్పత్తులపై 25 శాతం సుంకం విధిస్తానని డొనాల్డ్ ట్రంప్ మరో సారి ఆపిల్‌ను హెచ్చరించిన విషయం తెలిసిందే. అయితే భారత్‌లో తయారుచేసే ఐఫోన్లపై అగ్రరాజ్యం సుంకం విధించినప్పటికీ దేశంలో ఐఫోన్ల తయారీ అమెరికాలో కంటే తక్కువే అవుతుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్షియేటివ్ తన నివేదికలో వెల్లడించింది. భారత్‌లో తక్కువ ఉత్పత్తి ఖర్చులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు వంటివి దీనికి దోహదం చేస్తాయని పేర్కొంది. జీటీఆర్‌ఐ నివేదిక ప్రకారం.. భారత్‌లో ఒక ఐఫోన్ అసెంబ్లింగ్ ఖర్చు సుమారు 30 డాలర్లు కాగా, అమెరికాలో 390 డాలర్లు వెచ్చించాల్సి ఉంటుంది. దీని కారణంగా భారత్‌లో కార్మికుల జీతాలు తక్కువగా ఉండటమే. దేశంలో ఒక కార్మికుడికి నెల సంపాదన సగటున 230 డాలర్లు (రూ.19,000). అదే అమెరికాలో కనీస వేతన చట్టాల కారణంగా ఈ సంపాదన 2,900 డాలర్ల (రూ.2.4 లక్షలు) వరకు ఉంటుంది. అంటే దాదాపు 13 రెట్ల వ్యత్యాసం. దీనికితోడు భారత ప్రభుత్వం అందించే పీఎల్‌ఐ పథకం కూడా యాపిల్‌కు అదనపు లాభాల్ని అందిస్తోంది. దీంతో భారత్‌లో తయారుచేసే ఐఫోన్లపై 25 శాతం సుంకం విధించినా అమెరికా మార్కెట్‌లో చౌకగా లభిస్తాయని నివేదిక తెలుపుతోంది. ఐఫోన్లను 12కు పైగా దేశాలు కలిపి తయారుచేస్తాయి. యాపిల్ తన బ్రాండ్, సాఫ్ట్‌వేర్, డిజైన్‌లతో ఒక్కో ఐఫోన్‌పై 450 డాలర్ల లాభం ఆర్జిస్తుంది. ఇక అమెరికాలో ఐఫోన్లను తయారు చేస్తే.. ఉత్పత్తి ఖర్చులు పెరుగుతాయి. దీనికి అనుగుణంగా రిటైల్ ధరలు పెంచకపోతే ఆపిల్ లాభం 450 డాలర్ల నుంచి 60 డాలర్లకు పడిపోవచ్చని పేర్కొంది. భారత్‌లో ఐఫోన్ల తయారీకి అమెరికా విధించే సుంకాల ముప్పు ఉన్నప్పటికీ ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుందని జీటీఆర్‌ఐ నివేదిక స్పష్టం చేసింది.



## ఐటిఆర్ దాఖలుకు ముందు చేయాల్సిన పనులివే..

**న్యూఢిల్లీ, మే 24:** ప్రతి సంవత్సరం ఆదాయపు పన్ను రిటర్న్ (ఐటీఆర్) దాఖలు చేసే సమయం వచ్చినప్పుడు చాలా మంది పన్ను చెల్లింపుదారులు తొందరపడి తమ రిటర్న్‌లను దాఖలు చేస్తారు. కానీ మీరు ఆదాయపు పన్ను శాఖ నుండి నోటీసు అందుకోకూడదనుకుంటే లేదా మీ పన్ను వాపసు నిలిచిపోయినట్లయితే, ఐటీఆర్ దాఖలు చేసే ముందు, ఖచ్చితంగా ఫారమ్ 26ఎఎస్ వార్షిక సమాచార ప్రకటన (ఎఐఎస్) తనిఖీ చేయండి. ఫారం 26ఎఎస్ అనేది మీ పాన్ నంబర్ నుండి ఎంత పన్ను తగ్గించబడిందో, ఎంత పన్ను జమ అవుతుందో చూపించే పన్ను క్రెడిట్ స్టేట్‌మెంట్. ఇందులో జీతం, బ్యాంకు వడ్డీ, ఆస్తి కొనుగోలు, మ్యూచువల్ ఫండ్ పెట్టుబడి వంటి సమాచారం ఉంటుంది. ఇందులో ఏదైనా టిడిఎస్ ఎంట్రీ తప్పిపోతే, మీరు పన్ను క్రెడిట్ పొందడంలో సమస్యను ఎదు ర్కోవలసి ఉంటుంది. అందువల్ల రిటర్న్ దాఖలు చేసే ముందు అన్ని ఎంట్రీలు సరిగ్గా నమోదు అయ్యాయో నిర్ధారించుకోవడం ముఖ్యం. ఎఐఎస్ అనేది ఫారం 26ఎఎస్ కంటే ఎక్కువ సమాచా రాన్ని అందించే వివరణాత్మక పత్రం. ఇది బ్యాంకు నుండి పొందిన వడ్డీ, డివిడెండ్, షేర్లు, మ్యూచువల్ ఫండ్ల కొనుగోలు, అమ్మకం, అద్దె, విదేశీ లావాదేవీలు, క్రెడిట్ కార్డ్ ఖర్చుల గురించి సమాచారాన్ని కలిగి ఉంటుంది. ఎఐఎస్ అనేది మీ మొత్తం ఆర్థిక ప్రొఫైల్ బ్లూప్రింట్, ఇది పన్ను శాఖ వద్ద అందుబాటులో ఉంటుంది. మీరు మీ ఐటీఆర్‌లో ఎటువంటి సమాచారాన్ని పూరించక పోయినా, అది ఎఐఎస్‌లో నమోదు చేయబడితే, మీకు తర్వాత ఆదాయపు పన్ను శాఖ నుండి నోటీసు రావచ్చు. అందువల్ల ఎఐఎస్‌ని తనిఖీ చేయడం చాలా ముఖ్యం. అలాగే ఏదైనా వ్యత్యాసం గమనించినట్లయితే, పోర్టల్‌లో అభిప్రాయాన్ని అందించండి. 2025-26 అసెస్‌మెంట్ సంవత్సరానికి ఐటీఆర్ దాఖలు చేయడనికి చివరి తేదీ జూలై 31, 2025 (ఆడిట్ కాని సందర్భాలలో). ఫారమ్‌లు ఇంకా పూర్తిగా అప్‌డేట్ చేసినప్పటికీ.. మీరు ఫారమ్ 26ఎఎస్, ఎఐఎస్‌ని తనిఖీ చేయడం ద్వారా మీ ఐటీఆర్ ని ఇప్పుడే ప్రారంభించవచ్చు. ఫారమ్ 26ఎఎస్, ఎఐఎస్‌ని తనిఖీ చేయడం ఒక చిన్న దశ కానీ చాలా ముఖ్యమైన దశ. ఇది మీ రిటర్న్‌ను సరిగ్గా ఉంచడమే కాకుండా, పన్ను వాపసులో జాప్యం, నోటీసు వంటి సమస్యలను కూడా నివారించవచ్చు.




## మళ్లీ ఐపిఓకు రెడీ అవుతున్న కంపెనీలు

**ముంబై, మే 24:** ఈ యేడాది ప్రారంభం నుంచి భారత స్టాక్ మార్కెట్లు ఒడుదుడుకుల మధ్య స్థిరమైన ర్యాలీని చూస్తున్నాయి. ఈ కారణంగా దలాల్ స్ట్రీట్‌లో పబ్లిక్ ఆఫర్‌లు కూడా పెద్దగా రాలేదు. చాలా కంపెనీఉ మార్కెట్ పరిస్థితులను బట్టి ఐపిఒ ప్రక్రియలో ముందుకెళ్లా లని భావిస్తున్నాయి. అయితే తాజాగా పరిస్థితులు సాను కూలంగా మారుతున్నాయి. ఈ నెల్లో అమెరికా టారిఫ్ విషయంలో పరిస్థితులు మారడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం, ఇతర పరిణామాల నేపథ్యంలో సూచీలు రాణిస్తున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో కంపెనీ ఐపిఒలు రెడీ అవుతున్నాయి. ఈ నెల మూడో వారంలో ఇప్పటికే బెల్రైజ్‌ఇండస్ట్రీస్, బోరానా వీవ్స్ బిడ్డింగ్ ప్రక్రియను ప్రారంభించాయి. చివరి వారంలో మరో నాలుగు ఐపిఒలు మార్కెట్లలో అడుగు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటిలో సోడా ట్యాబ్స్, ప్రోస్టార్మ్ ఇన్ఫో సిస్టమ్స్, లీలా హోటల్స్, ఏజిస్ వొపాక్ టెర్మినల్స్ వంటి కంపెనీలున్నాయి. ఈ యేడాదిలో ఇప్పటి వరకు ఐపిఒ మార్కెట్ ఏమంత ఉత్సాహంగా లేదు. అయితే ఐపిఒకు ముందు ప్రక్రియ విషయంలో మాత్రమే పెద్ద ఎత్తున సెబీకి దరఖాస్తులు, డిఆర్‌హెచ్‌పి పత్రాలు అందాయి. దీన్ని బట్టి కంపెనీలు పబ్లిక్ లిస్టింగ్‌లపై ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నాయని తెలుస్తుంది. ఇప్పటికే సెబి వద్ద పత్రాలు సమర్పించిన కంపెనీల్లో ప్రెస్టెజ్ హాస్పిటాలిటీ వెంచర్స్, కెనరా హెచ్‌ఎస్‌బిసి లైఫ్ ఇన్సూరెన్స్, అర్బన్ కంపెనీ ఉన్నాయి. ఇన్‌క్రెడ్, క్యూర్ ఎఐ, డ్యూరో ఫ్లెక్స్, గ్రో, షిప్ రాకెట్ వంటి కొత్త జనరేషన్ కంపెనీలు కూడా మార్కెట్లోకి వచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. మరోవైపు 2025లోనే ఐపిఒ ప్రక్రియను ప్రారంభించాలని కొన్ని బడా కంపెనీలు కూడా చూస్తున్నాయి. వాటిలో రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ రూ.40వేల కోట్ల పబ్లిక్ ఇష్యూతో వచ్చే అవకాశం ఉంది. ఇదే జరిగితే భారత చరిత్రలోనేఅతిపెద్ద ఐపిఒ కానుంది. టాటాకేపిటల్, ఫోన్‌పే, జెప్టో వంటి పెద్ద కంపెనీల షేర్లు కూడా ఐపిఒ విషయంలో వినిపిస్తున్నాయి. ఫైనాన్స్ రంగంలో హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ రూ.12,500 కోట్లు, హీరో ఫిన్‌కార్ప్ రూ.3,668 కోట్ల నిధులు సమీకరించాలని భావిస్తున్నాయి. సెబి నుంచి ఆమోదం పొందిన ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ ఇండియా కూడా రూ.15వేల కోట్ల విలువైన ఐపిఒకు సిద్ధమవుతోంది.




## వాణిజ్యం

## రికార్డుస్థాయిలో పాలసీల విక్రయం

**న్యూఢిల్లీ, మే 24:** ప్రభుత్వరంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐసి) అరుదైన ఘనతను సాధించింది. 24 గంటల్లో రికార్డు స్థాయిలో బీమా పాలసీలు విక్రయించి గిన్నిస్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. ఈ ఏడాది జనవరి 20న ఈ అరుదైన ఘనతను సాధించినట్లు ఎల్‌ఐసీ ఓ ప్రకటనలో తెలిపింది. విస్తృతమైన ఏజెన్సీ నెట్‌వర్క్ కలిగిన ఎల్‌ఐసీ పనితీరును గుర్తించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ఈ అరుదైన రికార్డును నమోదు చేసిందని ఎల్‌ఐసీ పేర్కొంది. దేశ వ్యాప్తంగా 4,52,839 మంది ఏజెంట్లు ఈ ఏడాది జనవరి 20న 5,88,107 లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలను జారీ చేసినట్లు ఎల్‌ఐసీ తెలిపింది. బీమా చరిత్రలో 24 గంటల వ్యవధిలో ఈ స్థాయిలో పాలసీలు జారీ చేయడం ఇదే తొలిసారి. తమ ఏజెంట్లు తమదైన పనితీరుతో ఒక బెంచ్‌మార్క్‌ను సృష్టించారని ఎల్‌ఐసీ పేర్కొంది. ఇది తమ ఏజెట్ల అవిశ్రాంత కృషి, అంకితభావం నిదర్శనమని కొనియాడింది. ఎల్‌ఐసీ కస్టమర్లు, వారి కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పించాలనే లక్ష్యానికి నిబద్ధతగా నిలుస్తోందని తెలిపింది. ఎల్‌ఐసీ వ్యవస్థాపక దినోత్సవంఅయిన జనవరి 20న 'మ్యాడ్ మిలియన్ డే'ను పురస్కరించకుని ఒక్కో ఏజెంట్ కనీసం ఒక్క పాలసీ అయినా పూర్తి చేయాలన్న ఎల్‌ఐసీఎండీ, సీఈఓ సిద్దార్థ మొహంతీ విజ్ఞప్తి మేరకు ఈ అరుదైన ఫీట్‌ను ఎల్‌ఐసీసొంతం చేసుకుంది. ఈ అరుదైన మైలురాయిని సాధించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తంచేశారు. కస్టమర్లు, ఉద్యోగులు, ఏజెంట్లు కలిసి ఒక చరిత్రను లిఖించారంటూ సంతోషం వ్యక్తం చేశారు.



## రెండు బ్యాంకులపై ఆర్‌బిఐ జరిమానా

**న్యూఢిల్లీ, మే 24:** బ్యాంకింగ్, ఫిన్‌టెక్ రంగాల్లో ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించడంలో విఫలమైనందుకు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ట్రాన్సాక్ట్రీ టెక్నాలజీస్ (లెండ్‌బాక్స్)పై రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా జరిమానా విధించింది. నిబంధనల ప్రకారం నడుచుకోని సంస్థలపై కఠిన చర్యలుంటాయని ఆర్‌బిఐ పేర్కొంది. బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్, 1949 నిబంధనలు, పూచీకత్తు లేని వ్యవసాయ రుణాలపై ఆర్‌బిఐ మార్గదర్శకాలను ఉల్లంఘించినందుకు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.63.6 లక్షల జరిమానా విధించింది. నిధుల బదిలీలో జాప్యం, పూచీకత్తు లేని రుణ విధానాల్లో ఉల్లంఘనలు వెలుగులోకి రావడంతో ఈ జరిమానా విధించినట్లు ఆర్‌బిఐ తెలిపింది. ముఖ్యంగా వ్యవసాయం వంటి ప్రత్యేక రక్షణ అవసరమయ్యే రంగాల్లో ఆర్థిక సంస్థలు నిర్దే శిత రుణ నిబంధనలకు ఉండేలా చూడా లని ఆర్‌బిఐ తెలిపింది. ఆర్‌బిఐ పీర్-టుపీర్ లెండింగ్ ప్లాట్‌ఫామ్ డైరెక్షన్స్-2017ను పాటించనందుకు లెండ్‌బాక్స్ బ్రాండ్ పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ట్రాన్సాక్ట్రీ టెక్నాలజీస్‌పై రూ.40 లక్షలు జరిమానా విధించింది. దేశ డిజిటల్ లెండింగ్ ఎకోసిస్టమ్‌లో గణనీయమైన వృద్ధిని చూపిన పి2పి లెండిర్ కార్యకలాపాలకు సంబంధించిన లోపాలను సెంట్రల్ బ్యాంకు గుర్తించింది. ఫిన్‌టెక్ కంపెనీలు పారదర్శకత పాటించాలని, వినియోగదారులు, రుణ దాతలను రక్షించడానికి రూపొందించిన మార్గదర్శకాలకు కట్టుబడి ఉండాలని గుర్తుచేసింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.